సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 102

గురువారం 3-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'





● స్ఫూర్తి పాఠం

23 ఏళ్లకే ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ అయ్యి 25 ఏళ్ల వయసులో జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న నేహా బైద్వాల్ ఒక స్ఫూర్తిపాఠం. అమ్మాయిల చదువును అంతగా ప్రోత్సహించని రాజస్థాన్‌లో పుట్టిన నేహా మూడేళ్ల పాటు ఫోన్‌ని తాకకుండా పట్టుపట్టి చదివి ఐ.ఏ.ఎస్. సాధించారు. గమ్యం చేరాలంటే ఫోన్‌ని పక్కన పెట్టాలంటున్న ఆమె మాటలు చర్చను లేవనెత్తుతున్నాయి.

ఇల్లే ఆమె ట్యుటోరియల్ కాలేజీ

‘మా ఇంట్లో టీవీ ఉండదు. మా నాన్నగారు టీవీని ఉండనివ్వ లేదు. దాని బదులు ఒక బ్లాక్‌బోర్డ్ ఉంది. మాది జాయింట్ ఫ్యామిలీ. ఎప్పుడూ చదువుకుంటూ పరీక్షలు రాసే పిల్లలు ఐదారు మంది ఉండేవారు. వారికి ఆ బోర్డు మీద పాఠాలు సాగుతుండేవి. నేను కూడా అలాగే చదువుకున్నాను. మా నాన్న ఆఫీసు నుంచి వచ్చాక రాత్రి భోజనం దగ్గర పిల్లలందరూ ఆ వేళ ఏం చదివారో అడిగేవారు... జవాబులు తెలుసుకునేవారు. ఎవరైనా సరిగ్గా చదవ లేదని అనిపిస్తే వారికి క్లాస్ పడేది. రాజస్తాన్ కుటుంబాల్లో/పల్లెల్లో ఆడపిల్ల చదువును ప్రోత్సహించరు. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి కావడం వల్ల ఆయన ఉద్యోగ రీత్యా మేమంతా ఎక్కువ సంవత్సరాలు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఉండటం వల్ల మా చదువుకు ఎటువంటి ఆటకం కాలేదు. చదువు ముఖ్యం అని చిన్నప్పుడే మా నాన్న నూరిపోశారు’ అంటుంది నేహా బైద్వాల్.

2023 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఆమెకు 569 ర్యాంకు వచ్చింది. మొత్తం 960 మార్కులతో (ఇంటర్వ్యూలో 151) ఆమె ఈ విజయం సాధించింది. అయితే ఇదంత సులువు కాలేదు. అందుకు నాలుగేళ్లు కష్టపడింది. మూడుసార్లు విఫలమయ్యి నాలుగోసారి విజయం సాధించింది.

5వ తరగతి ఫెయిల్

నేహా మొదటి నాలుగేళ్లు రాజస్థాన్‌లో ఉన్న తాతగారి ఇంట్లో చదువుకుంది. అది పల్లెటూరి. అక్కడ రాజస్థానీ మీడియంలోని చిన్న బడి ఉండేది. అయితే ఐదోక్లాస్ నాటికి తండ్రి ఆమెను తాను ఉద్యోగం చేస్తున్న చోటుకు తెచ్చి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో వేశాడు. అప్పటికి ఇంగ్లిష్‌లో ఏ మాత్రం ప్రవేశం లేని నేహా ఐదోక్లాస్‌లో ఫెయిల్ అయ్యింది. స్కూల్ వాళ్లు హిందీ మీడియంలోకి వేస్తామన్నారు. కాని నేహా పట్టుదలతో ఆరో క్లాస్ నుంచి ఇంగ్లిష్ మీడియంలో పుంజుకుంది.

లాయర్ కావాలనుకుని...

నేహా అడ్వకేట్ అవుదామనుకుంది. ‘బాధితులకు న్యాయం జరగాలంటే అదొక మంచి మార్గం అనుకున్నాను’ అంటుందామె. కాని అంతకంటే ఎక్కువమందికి నువ్వు మేలు చేయాలంటే ఐ.ఏ.ఎస్ కావాలి అని తండ్రి దిశా నిర్దేశం చేశాడు. రాయ్‌పూర్‌లోని మహిళా కళాశాలలో డిగ్రీ చదివిన నేహా అందుకు మార్గం ఏమిటని తండ్రిని అడిగితే కాలాన్ని గెలవడమే అని చెప్పాడు. ‘పనికిరాని వాటికి సమయాన్ని వృథా చేయడం కంటే దానిని పూర్తిగా సద్వినియోగం చేయడమే విజయానికి మార్గం అని తెలుసుకున్నాను’ అంటుంది నేహా. టీవీ లేని ఆ ఇంట్లో ఆమె ఇక ఫోన్ కూడా పక్కన పెట్టేసింది. ఇల్లే ఆమె ట్యుటోరియల్ కాలేజీ, ప్రిపరేషన్ జరిగే చోటు.

అందరూ తోడే

నేహా చదువుకుంటూ ఉంటే ఒక్కోరోజు ఒక్కొక్కరు తోడు కూచునేవారు. ఒకరోజు తండ్రి, మరోరోజు బాబాయి... ‘మేమున్నాం తోడుగా. నీ ప్రిపరేషన్ నువ్వు, మేము నీకు తోడు అనే భరోసా దీని ద్వారా అందేది’ అంటుంది నేహా. ఆమెకు ముగ్గురు తమ్ముళ్లు. వారిలో ఒక తమ్ముడు మెయిన్స్‌కు అన్ని ప్రశ్నలు సమయానికి రాయడం ఎలాగో టిప్స్ చెప్పి సాధన చేయించాడు. ‘మా ఇంట్లో రోజూ నాకు మాక్ ఇంటర్వ్యూలు ఉండేవి. రోజూ ఎవరో ఒకరు ఐ.ఏ.ఎస్. కోసం బోర్డు ఎలా అయితే ప్రశ్నలు అడుగుతుందో అలా ప్రశ్నలు ప్రిపేరయ్యి మరీ నన్ను అడిగేవారు. ఇది నాకు ఎంతో ఉపయోగపడింది’ అంటుంది నేహా.

నాలుగోసారి

‘నేను ఆశాజీవిని. ఓడిపోక ప్రయత్నించడం మన బాధ్యత’ అంటుంది నేహా. నేహాకు మొదటి అటెంప్ట్‌లో అసలేమీ రిజల్ట్ కనపడలేదు. రెండో అటెంప్ట్‌లో ప్రిలిమ్స్‌లో 2 మార్కులు తక్కువ రావడంతో అర్హత రాలేదు. మూడో అటెంప్ట్‌లో మెయిన్స్‌లో అర్హతకు 8 మార్కులు తక్కువ వచ్చాయి. మూడుసార్లు విఫలమయ్యాక నాలుగోసారి మళ్లీ పరీక్షకు కూచోవడం ఎవరికైనా కష్టమే. కాని నేహా నాలుగోసారి రాసింది. ఈసారి ఆమె శ్రమ వృథా కాలేదు. 2023 సంవత్సరంలో ఆమెకు 569వ ర్యాంకు వచ్చింది. గుజరాత్ కేడర్ అలాట్ అయ్యింది. శిక్షణ తర్వాత గుజరాత్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా పోస్టింగ్ వచ్చింది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్‌లో జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తోంది.

‘నీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, నిన్ను నీవు మోసం చేసుకోకుండా కష్టపడితే విజయం తథ్యం’ అంటోందామె.

● సాహస పథం

ఆకాశమంత అమ్మ





ఎనభై సంవత్సరాల వయసులో కొద్ది దూరం నడిచినా అలసటగా అనిపిస్తుంది. ‘సాహసం’ అనే మాట ఊహకు అందదు. అయితే డా.శ్రద్ధా చౌహాన్ మాత్రం ‘తగ్గేదే ల్యా’ అని డిసైడై పోయింది. సాహసానికి సై అంది. స్కైడైవింగ్‌తో తన 80వ పుట్టిన రోజు జరుపుకున్న శ్రద్ధ చరిత్ర సృష్టించింది.

‘స్కైడైవింగ్’ అనే మాట తల్లి నోటి నుంచి వినిపించిన క్షణమే ‘ఓకే’ అన్నాడు ఆమె కుమారుడు సౌరభ్ సింగ్ షెకావత్.

శ్రద్ధ భర్తతోపాటు, రెండవ కుమారుడు మాత్రం... ‘ఈ వయసులో చాలా కష్టం. వద్దు’ అన్నారు. వారిని ఒప్పించి రంగంలోకి దిగారు తల్లీకొడుకులు. స్కైడైవర్ అయిన షెకావత్ ‘స్కై హై ఇండియా’ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్. పర్వతారోహణలో, గుర్రపు స్వారీలో దిట్ట అయిన షెకావత్‌కు సాహసాలు కొత్త కాదు.

వర్టిగో, సర్వికల్ స్పాండిలైటిస్‌లాంటి సమస్యలతో బాధ పడుతున్నప్పటికీ 10,000 అడుగుల ఎత్తు నుంచి కుమారుడితో కలిసి జంప్ చేసింది శ్రద్ధ.

‘ఏ మదర్: ఏ మైల్‌స్టోన్’ కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయింది. వీడియో విషయానికి వస్తే...షెకావత్ మొదట తన తల్లిని పరిచయం చేస్తాడు. ‘మా అమ్మతో కలిసి ఈ సాహసంలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను’ అన్నాడు షెకావత్.

స్కైడైవింగ్ చేయాలనేది శ్రద్ధ చౌహాన్ చిన్నప్పటి కల. ఎట్టకేలకు కుమారుడి సహకారంతో తన కల నెరవేర్చుకుంది. ‘ఇది నేను గర్వించే సందర్భం’ అని సంతోషం నిండిన కళ్లతో అంటుంది డా.శ్రద్ధా చౌహాన్.

ఈ ఇన్‌స్టాగ్రామ్ వైరల్ వీడియో సాహసానికి మాత్రమే కాదు తల్లీకొడుకుల అనుబంధానికి కూడా అద్దం పడుతుంది.

● మన(సు)లో మాట

మళ్ళీ మళ్ళీ వినపడుతున్నాయి!

నేను ఇంటర్మీడియట్ దాకా చదువుకున్నాను. కుటుంబ పోషణ కోసం చిన్నప్పటినుంచే మా నాన్న గారి సెలూన్‌లో పని చేసేవాణ్ణి. పెళ్లిళ్లలో సన్నాయి వాయించడం కోసం కూడా వెళ్ళేవాణ్ణి. ఇప్పుడు నాకు 60 ఏళ్లు. నా పిల్లలు బాగా చదువుకొని సెటిల్ అయ్యారు. నేను సెలూన్ పని మానేసి పదేళ్లవుతోంది. సన్నాయి వాయించడం కూడా ఆపేశాను. కాలక్షేపం కోసం ఇంటి దగ్గర చిన్న షాపు పెట్టుకున్నాను. నాకు ఒక సంవత్సర కాలం నుండి నేను గతంలో పెళ్లిళ్లలో వాయించిన సంగీతం, పాటలు చెవిలో మళ్లీ మళ్లీ వినపడుతున్నాయి, ముందు ఇంటి దగ్గర్లో ఏదైనా పెళ్లి అవుతుంటే అక్కడ నుండి వచ్చే శబ్దాలు, పాటలు అనుకున్నాను కానీ అని పగలు, రాత్రి, రోజంతా వినపడుతూనే ఉంటాయి. ఆ శబ్దాల వల్ల నాకు విపరీతంగా తలనొప్పి వస్తుంది. మా ఇంట్లో వాళ్ళకి చెప్తే మాకే శబ్దాలూ వినపడట్లేదు. నువ్వు ఊహించుకుంటున్నావు అంటున్నారు. నాకే ఎందుకు ఇలా అవుతోంది... ఈ బాధ నుంచి నన్ను బయట పడేయండి డాక్టరు గారూ!

- గురునాథం, కరీంనగర్

మీరు జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొని మీ పిల్లల్ని మంచి స్థితికి తీసుకెళ్లినందుకు ముందుగా మీకు నా అభినందనలు. ఇక మీ సమస్య విషయానికి వస్తే మీకు ఉన్న కండిషన్‌ని ‘మ్యూజికల్ హెలూసినోసిస్’ అంటారు. మనం గతంలో విన్న పాటలు, శబ్దాలు అప్పుడుప్పుడు వినపడటం అందరికీ జరుగుతుంటుంది. ఉదాహరణకు పొద్దున మనకు నచ్చిన పాట వింటే అది కాసేపు అలాగే ‘మైండ్‌లో’ ప్లే అవడం, దాన్ని మనం ఎంజాయ్ చేయడం సర్వసాధారణం! కాసేపటికి వాటంతట అవే తగ్గిపోతాయి. కానీ మీ విషయంలో ఎప్పుడో విన్న పాటలు, సంగీతం పదే పదే వినిపించడం, అవి మిగిలిన వాళ్ళకి వినపడకపోవడం, దానివల్ల డిప్రెషన్, ఆత్మహత్య ఆలోచనలు రావడం ఇవన్నీ ఖచ్చితంగా ఒక మానసిక సమస్యను సూచిస్తున్నాయి. ‘మ్యూజికల్ హెలూసినోసిస్’ అనేది అరుదుగా కనబడే ఒక లక్షణం. దీనికి అనేక కారణాలు ఉండొచ్చు. ముందుగా మీకు వినికిడి సమస్య లాంటివి ఏమైనా ఉన్నాయా అనేది చెక్ చెయించుకోండి. అలాంటిది ఏదైనా ఉంటే హియరింగ్ మెషిన్ వాడితే మీ సమస్య చాలావరకు తగ్గిపోతుంది. మీ వయస్సు 60 సంవత్సరాలు కాబట్టి పెద్ద వయసులో వచ్చే డిమెన్షియా, మెదడులో ఇతరత్రా సమస్యలు ఏమైనా ఉన్నాయా అనేది కూడా పరిశీలించాలి. ఇవేమీ లేవని నిర్ధారణ అయితే అప్పుడు మీకు దగ్గర్లో ఉన్న సైకియాట్రిస్టుని కలిస్తే మీకు పరీక్షలు చేసి ‘యాంటీ సైకోటిక్’ మందులు, అలాగే మీ డిప్రెషన్ తగ్గడానికి మందులు, కౌన్సెలింగ్ ఇస్తారు. వాటిని కొంత కాలం వాడితే మీ సమస్య పూర్తిగా తగ్గిపోతుంది. ధైర్యంగా ఉండండి.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్
విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ
sakshifamily3@gmail.com

బులియన్ జూలై 2న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా.: వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,110
బంగారం (22 క్యారెట్లు)	91,765
వెండి	1,08,300
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,350
బంగారం (22 క్యారెట్లు)	90,650
వెండి	1,08,700
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,890
బంగారం (22 క్యారెట్లు)	90,650
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,350
బంగారం (22 క్యారెట్లు)	93,370
వెండి	1,08,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,550
బంగారం (22 క్యారెట్లు)	89,750
వెండి	1,07,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,890
బంగారం (22 క్యారెట్లు)	90,650
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

శ్రీరస్తు... శుభమస్తు

ఈ తరం కాపురం

రిలేషన్‌షిప్ ఎన్ని కొత్త పోకడలు పోయినా పెళ్లితోనే ఆ బంధానికి భద్రత అనుకునేవాళ్లే ఎక్కువ! అందుకే పెళ్లికి జాతకాలు, శాలరీ ప్యాకేజ్‌లు, ఆస్తులు, అంతస్తులు చూసుకున్నా... హక్కులు-బాధ్యతలు, ప్రణాళికలు, శక్తిసామర్థ్యాలు, పరస్పర గౌరవం, నమ్మకాలు, అండర్‌స్టాండింగ్, కంపాటబులిటీలకూ ప్రాధాన్యం ఇవ్వాలి! కాపురానికి కమ్యూనికేషన్ అత్యంత అవసరమని గ్రహించాలి అంటున్నారు ఫ్యామిలీ కౌన్సెలర్స్, మానసిక, న్యాయ నిపుణులు.. ఈ తరం కూడా! ఆ అభిప్రాయాలతోనే ఈ క్యాంపెయిన్‌ను నేటితో ముగిస్తున్నాం!



గ్యాప్ పెరిగిపోతోంది



పెళ్లికి కమ్యూనికేషన్ అండ్ టైమ్ చాలా ముఖ్యం. భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగాలు చేయడం తప్పనిసరైన ప్రస్తుత పరిస్థితుల్లో ఈతరం కాపురాల్లో అవి రెండూ మిస్ అవుతున్నాయి. పిల్లల కోసం ప్లాన్ చేసుకోవడానికి మా దగ్గరకు వచ్చే జంటల్లో మేము నోటీస్ చేస్తున్న ప్రధాన సమస్య అదే. భార్య, భర్తలిద్దరిలో ఒకరికి డే షిఫ్ట్ ఉంటే, ఇంకొకరికి నైట్ షిఫ్ట్ ఉంటోంది. వీకెండ్‌లో మాత్రమే ఇద్దరూ కలిసి ఉంటున్నారు. అదీ ఎవరి ఫోన్లలో వాళ్లు! దీనివల్ల ఇద్దరి మధ్య గ్యాప్ పెరిగిపోతోంది. అండర్‌స్టాండింగ్ కొరవడుతోంది. మనం అనే భావన లేకుండా నాది అనే ఈగోనే వాళ్ల మ్యారిటల్ లైఫ్‌ని డామినేట్ చేస్తోంది. దీనివల్ల పిల్లల సంగతి అటుంచి వాళ్లు కలిసి కాపురం చేసే పరిస్థితే కనబడట్లేదు. అందుకే పెళ్లిని నిలుపుకోవాలంటే ఈకాలం జంటలకు కావాల్సింది కమ్యూనికేషన్ అండ్ ఇద్దరూ కలిసి స్పెండ్ చేసే క్వాలిటీ టైమ్. దీని కోసం ఇద్దరూ కొన్ని సర్దుబాట్లు చేసుకోవాలి.

- డాక్టర్ ప్రశాంతి ఉప్పనూతల

ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవాన్ని మాత్రం ఒప్పకోరు



పెళ్లికి సంబంధించి మన దగ్గర రెండు విధానాలున్నాయి. ఒకటి రాజ్యాంగపరంగా జీవించడం, రెండు.. ఆచార వ్యవహారాలకనుగుణంగా ఉండటం. ఈ రెండోరకంలో పెద్దల నిర్ణయాలు, సమాజ కట్టుబాట్లను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. మొదటిరకంలో రాజ్యాంగం వ్యక్తులకు ఏ హక్కులనైతే ఇచ్చిందో అవన్నీ కూడా జీవిత భాగస్వాములకు అమలవుతాయి. రాజ్యాంగ పరంగా భార్యభర్తలు ఇద్దరూ సమానమే! కానీ ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక విలువల పరంగా ఆలుమగలిద్దరూ సమానం కాదు. అయినా అమ్మాయి చదుకోవాలి, ఉద్యోగం ఉండాలి, కట్నకానుకలు ఇవ్వాలి అనే అంచనాలూ ఉంటాయి. కానీ అమ్మాయి ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవాన్ని మాత్రం ఒప్పుకోరు. రాజ్యాంగబద్ధమైన వాటిల్లో కూడా భర్త సంపాదన మీద హక్కు కోరుకుంటున్న భార్య .. ఆయన తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యతల విషయంలో మాత్రం మిన్నకుంటోంది. ఇక్కడే కాన్‌ఫ్లిక్ట్ మొదలవుతోంది ఏ పెళ్లిలో అయినా! అందుకే ఏ విధానంలోనైనా జీవితభాగస్వాములిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. హక్కుల విషయంలో పరస్పర గౌరవంతో ఉండాలి. ఏరకమైన బాధ్యతలనైనా సమానంగా పంచుకోవాలి.

- బీఎస్ నాగరత్న, ప్రెసిడెంట్ దలీప్

పైపై బంధంగానే ఉంటుంది



పెళ్లికి కేవలం జాతకాలు, శాలరీలతోనే చూస్తున్నవాళ్లు వాళ్ల ప్రధాన క్రైటీరియా అయిన కంపాటబులిటీని మాత్రం మ్యాచ్ చేయట్లేదు. కంఫర్టబుల్ లైఫ్ అండ్ డీసెంట్ లైఫ్ ఉండాలి.. కాదనట్లేదు. కానీ వైవాహిక జీవితానికి కావల్సిన చిన్న చిన్న విషయాలను కూడా మాట్లాడుకోవట్లేదు. ప్రేమ గురించిన వెంపర్లాట కనపడుతోంది తప్ప గౌరవం గురించి కాదు. రెస్పెక్ట్ ఉంటేనే కదా ప్రేమ ఉండేది! ఇలాంటివి అంటే మ్యాచ్ కాకపోతే, పరస్పర గౌరవం, కంపాటబులిటీ లేకపోతే పెళ్లి సఫకేటింగ్ చాంబర్‌లా మారుతుంది.. ముఖ్యంగా మహిళలకు. ఒక్కమాటలో చెప్పాలంటే పెళ్లి అనేది రెండు కుటుంబాల ప్రాపర్టీని రెట్టింపు చేసేదిగా, కుల అహంకారాన్ని ప్రిజర్వ్ చేసేదిగా, క్లాస్‌ని మెయింటేన్ చేసేదిగానే ఉంది. ఒక ప్రిస్టేజ్ సింబల్. పాతికేళ్లు వచ్చాయా పెళ్లి చేసుకున్నామా .. ముప్పై ఏళ్లొచ్చాయా పిల్లల్ని కన్నామా.. సెటిల్ అయ్యామా అనే చూస్తున్నారు కానీ సంతోషంగా ఉన్నామా అని చూడట్లేదు. హారోస్కోప్‌లో పద్దెనిమిదో ముప్పై ఆరో గుణాలు (ఛత్తీస్‌గుణ్) కలుస్తున్నాయా అని చూస్తున్నారు తప్ప పెళ్లిచేసుకోయే జంట కాబోయే తల్లిదండ్రులు కూడా కదా! వాళ్లు పిల్లల్ని కనాలనుకుంటున్నారా లేదా.. పేరెంటింగ్ బాధ్యతలను ఎలా షేర్ చేసుకోవాలనుకుంటున్నారు లాంటి ముఖ్యమైన విషయాల గురించి చర్చించట్లేదు. ఇవేవీ లేని పెళ్లి పైపై బంధంగానే ఉంటుంది. దానికన్నా అన్‌మ్యారీడ్‌గా ఉండటమే బెటర్.

- హిమబిందు, సోషల్ యాక్టివిస్ట్

పేరెంట్స్‌కూ కౌన్సెలింగ్ అవసరం



పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం. ఇరు కుటుంబాల మధ్య స్నేహం, బంధం, సాన్నిహిత్యం వంటివి పెళ్లి చేసుకునే ఇద్దరు వ్యక్తుల అంగీకారంపై ఆధారపడి ఉండలే తప్ప కుటుంబాల కలయిక కోసం పెళ్లిళ్లు జరగకూడదు. పెళ్లి వ్యవస్థపై పూర్తి అవగాహన కల్పించడంలో మనం విఫలమయ్యామని చెప్పుకోవాలి. పెళ్లి బంధంలో ఉండాల్సిన పరస్పర గౌరవం లాంటి ఎన్నో విషయాలు చాలామందికి అర్థం కావడం లేదు. దాంతో పెళ్లి తర్వాత గృహహింస లాంటి ఎన్నో నేరాలకు పాల్పడుతున్నారు. విడాకుల వరకు వచ్చి కౌన్సిలింగ్ తీసుకోవలసిన పరిస్థితులను తరచుగా చూస్తున్నాం. పెళ్లికి ముందే అందరికీ సరైన రీతిలో లీగల్ – సైకలాజికల్ అవగాహన కల్పించినట్లయితే వివాహ వ్యవస్థ నిలబడడానికి కొంతవరకు హెల్ప్ అవుతుంది. మన దగ్గర సెక్స్ ఎడ్యుకేషన్ కూడా సరిగా లేదు. అందులో భాగంగా ‘అంగీకారం’ అంటే consent – వ్యక్తిగత స్వేచ్ఛ, సేఫ్టీ వంటి అంశాలను బోధించాలి. లేకపోతే వైవాహిక జీవితమంతా వైధింపుల మయమవుతుంది. పెళ్లి చేసుకునే వారికే కాదు, వారి తల్లిదండ్రులకూ పెళ్లికి ముందు కౌన్సెలింగ్ అవసరం. చాలామటుకు పెళ్లిళ్లలో తల్లిదండ్రుల జోక్యం వల్ల సులభంగా పరిష్కారమయ్యే సమస్యలు కూడా తెగేదాకా వెళ్తున్నాయి.

- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

పరిణతే ప్రామాణికం



పెళ్లిని సమాజమెప్పుడూ వయసుకి సంబంధించిన అంశంగా చూస్తోంది. త్వరగా పెళ్లి చేసుకుని త్వరగా పిల్లలు పుడితే వృద్ధాప్యంలో తోడుగా ఉంటారనే ఆధారపడే మనస్తత్వం అందులో కనిపిస్తుంది. అంతేకానీ పరిణతి, పోషించే శక్తిసామర్థ్యాలను ప్రామాణికంగా చూడట్లేదు. మారుతున్న కాలంలో పెరుగుతున్న అవసరాల దృష్ట్యా మన అభి రుచులూ వేగంగా మారుతున్నాయి. భాగస్వామి వాటన్నిటినీ తీర్చలేకపోయినా కనీసం అర్థం చేసుకొని, గౌరవించే స్థాయిలో అయినా ఉండాలి. ఇటీవల జరిగిన అస్సాం, గద్వాల్ సంఘటనలను బూచిగా చూపించి పెళ్లికి ఆడవారి మనస్తత్వమే అడ్డు అన్నట్టు చిత్రీకరిస్తున్నారు. కానీ ఆ నేరాల్లో నిందితులకు సహకరించింది మగవారే అన్న విషయాన్ని విస్మరిస్తున్నాం. పెళ్లి బంధంలోకి అడుగు పెట్టే ముందు మన మీద మనకు సంపూర్ణ అవగాహన ఉండాలి. ఎదుటివారినీ అర్థం చేసుకునే ఓర్పు కావాలి.

- కెన్నారో వీవా, ఆంత్రప్రెన్యూర్

ఈ ఎడ్యుకేషన్ తప్పనిసరి



అమ్మాయిలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నా.. డొమెస్టిక్ వ్యవహారంలో మాత్రం జెండర్ రోల్స్‌లో పెద్దగా మార్పు లేదు. ఇంటి పనులు, పేరెంటింగ్‌లో అబ్బాయిలకు భాగస్వామ్యం ఇవ్వట్లేదు. భర్తతో సమానంగా సంపాదిస్తున్నా ఇల్లు, పిల్లల బాధ్యత ఆమెదే అన్న సంప్రదాయ భావనలోనే ఉన్నాం ఇంకా. దీనివల్ల ఆడపిల్లల మీద అదనపు భారం పడుతోంది. అందుకే చాలామంది అమ్మాయిలు పెళ్లి పట్ల విముఖత చూపిస్తున్నారు. అసలు మనదగ్గర వైవాహిక జీవితానికి సంబంధించి ఎడ్యుకేషనే లేదు. పెళ్లికి కులగోత్రాలు, జీతం, ఆస్తి, అంతస్తే ముఖ్యం అనుకుంటారు. ఇంటి బాధ్యత దగ్గర్నుంచి ఆర్థిక వ్యవహారాల దాకా అమ్మాయి, అబ్బాయి అంచనాలు, ప్రణాళికలు, పరస్పర గౌరవ నమ్మకాలు, ఎమోషనల్, ఫిజికల్ కంపాటబులిటీ లాంటివాటి మీద చర్చే ఉండదు. అసలు అలాంటి వాతావరణం తల్లిదండ్రుల మధ్యే కనబడదు కాబట్టి ఆ సంభాషణలు ఇంట్లో వినపడవు. కానీ ఈ తరం అమ్మాయి, అబ్బాయిలూ మాత్రం ఆ దిశగా ఆలోచించాలి. పెళ్లికి ముందు పెళ్లి తంతు, హనీమూన్‌కి ప్లాన్ చేసుకోవడం కన్నా పెళ్లి తర్వాత గడపబోయే సహజీవనం మీద శ్రద్ధ పెట్టాలి. జీతం, ఆస్తిపాస్తుల గురించి పెద్దలు ఎలాగూ చూస్తారు కాబట్టి.. పెళ్లి మీద ఇద్దరి అవగాహన, ఇంటి పనుల నుంచి ఆర్థిక వ్యవహారాల దాకా ఇద్దరి ప్లాన్స్, సామర్థ్యాలు, కంపాటబులిటీల గురించి ఇద్దరూ కూర్చుని మాట్లాడుకోవాలి. అవసరమైతే ఫ్యామిలీ కౌన్సెలర్స్ సాయం తీసుకోవాలి. పెళ్లికి ముందే అన్నీ తెలుసుకునే వీలు లేకపోతే ముఖ్యమైన వాటి గురించైన ప్రాథమిక సమాచారం తీసుకుని పెళ్లి తర్వాత హనీమూన్ కన్నా ముందు కౌన్సెలింగ్‌కు ప్లాన్ చేసుకోవాలి. కాపురం సజావుగా సాగేందుకు ఇద్దరికీ అనుకూలమైన ఓ మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఈ ఎడ్యుకేషన్ తప్పనిసరన్నది మరవొద్దు.

- వర్ష వేములు, సైకోథెరపిస్ట్

● బ్యూటిప్స్

తాజాగా ఉండే ముఖం కోసం...

వాల్‌నట్ స్క్రబ్

రెండు వాల్‌నట్స్‌ను తీసుకుని పొడిచేసుకోవాలి. ఈ పొడిలో మూడు టీస్పూన్ల తేనె వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదిహేను నిమిషాలు ఆరాక నీటితో కడిగేయాలి. వాల్‌నట్స్‌లోని ఔషధ గుణాలు చర్మానికి పోషణ అందించడంతోపాటు, చర్మంపై ఉన్న జిడ్డుని తొలగించి ముఖాన్ని తాజాగా ఉంచుతాయి.



కాఫీ స్క్రబ్

నాలుగు టీస్పూన్ల కాఫీ పొడిలో రెండు టీస్పూన్ల బ్రౌన్ సుగర్, టీస్పూను తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు అప్లై చేసి పదిహేను నిమిషాల పాటు మర్దన చేయాలి. ఆరాక నీటితో కడిగేయాలి. కాఫీ పొడిలోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మాన్ని లోతుగా శుభ్ర పరిచి ఫ్రెష్‌గా ఉంచుతాయి.

వైట్ హెయిర్‌కి నట్స్‌షెల్స్‌తో విరుగుడు



వాల్‌నట్స్ లోపల ఉన్న పప్పుని తీసుకుని షెల్స్‌ని పడేస్తుంటారు. కానీ వాల్‌నట్స్ షెల్స్ తెల్లజుట్టుని నల్లగా మార్చడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. వాల్‌నట్స్ షెల్స్‌ను మెత్తగా పొడిచేసుకోవాలి. ఆరు టేబుల్ స్పూన్ల పొడిని లీటరు నీటిలో వేసి అరగంటపాటు మరిగించాలి. మరిగిన నీటిని చల్లారాక వడగట్టాలి. ఈ నీటిని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టి మర్దన చేయాలి. రెండు గంటల తరువాత కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఈ విధంగా చేయడం వల్ల మూడు నెలల్లో తెల్లజుట్టు నల్లగా... ఒత్తుగా మారుతుంది.


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 102

గురువారం 3-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శుభ్‌మన్ గిల్ సెంచరీ

ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో తొలి రోజు భారత్ 310/5 -12లో



ఆర్‌కామ్.. 'ఫ్రాడ్' ఖాతా!


వర్గీకరించనున్న ఎస్‌బీఐ...ఆర్‌బీఐకి ఇచ్చే రిపోర్ట్‌లో అనిల్ అంబానీ పేరు! -13లో



గాజాలో కాల్పుల విరమణ!

గాజాలో కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ప్రధాని అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు.

- వివరాలు 6లో▶



చైనా పాత్ర ఉండదు

15వ దలైలామా ఎంపిక ప్రక్రియలో చైనా పాత్ర ఏమీ ఉండదని 14వ దలైలామా టెంజిన్ గ్యాట్సో స్పష్టం చేశారు.

- వివరాలు 6లో▶



ఎల్లుండే మెగా సునామీ?

పెను ఉత్పాతానికి మరో రెండు రోజులేనా? సునామీ విరుచుకుపడబోతోందా? జపాన్, ఫిలిప్పీన్స్ మధ్య ప్రాంతాన్ని ముంచెత్తనుందా?

- వివరాలు 6లో▶



శత్రు భీకర అపాచీలొస్తున్నాయ్

ఐదేళ్లనాటి ఒప్పందంలో భాగంగా తొలి దఫా అపాచీ యుద్ధ హెలికాప్టర్లను అమెరికా అందజేయనున్నట్లు తెలిసింది.

- వివరాలు 6లో▶

ప్రభుత్వ ఆసుపత్రిలో
ఒక్క నెల పనిచేయండి

సామాజిక బాధ్యతగా పేదలకు సేవలందించండి


బుధవారం బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి

వైద్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

- నిమ్స్, ఉస్మానియా లాంటి ఆసుపత్రుల్లో వారం రోజులు పనిచేసినా చాలు
- సేవలందించేందుకు అమెరికా వైద్యులు సిద్ధం.. అందరి కోసం ఓ వేదిక
- ఏఐజీ ఆస్పత్రి సేవలు మనకందరికీ గర్వకారణం
- డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి భారతరత్న కోసం తన వంతు కృషి చేస్తానన్న సీఎం
- బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రి ప్రారంభం

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: 'రాష్ట్రంలో చదువుకున్న వైద్యులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నా. ఏడాదిలో 11 నెలలు మీకు నచ్చిన ఆసుపత్రిలో, మీకు నచ్చిన వేతనానికి పనిచేయండి. మీకు నచ్చిన జీవితాన్ని లీడ్ చేయండి. మిగతా నెలరోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయండి. సామాజిక బాధ్యతగా పేదలకు వైద్యం అందించండి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిమ్స్, ఉస్మానియా వంటి ఆసుపత్రుల్లో వారం రోజులు పనిచేసినా చాలని, ఏ ఆసుపత్రిలో పనిచేయాలనుకుంటున్నారో ముందుగా తెలియజేయాలని కోరారు. అమెరికా నుంచి వచ్చే వైద్యులూ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇటువంటి వారందరినీ ఒక వేదికపైకి తీసుకొస్తామని తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు.

రోగాల నివారణకు పరిశోధనలు జరగాలి

'ఈ రోజు ఖరీదైనది ఏదైనా ఉందంటే అది వైద్యం. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ ప్రారంభించారు. అప్పట్లో రూ.2 లక్షలు ప్రకటిస్తే, ఈ రోజు మిగతా 3వ పేజీలో ▶

టెన్త్ పాస్.. ఇంటర్ ఫెయిల్

ఎందుకిలా?

- ఇంటర్‌లో పాస్ పర్సంటేజీ ఎందుకు తగ్గుతోందో పరిశీలించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రతి పాఠశాలలో భారీ జాతీయ జెండా ఏర్పాటుకు ఆదేశం

3 లో

పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ గేటు ఎదుట రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


శిథిల బతుకులు

శిథిలాలు తొలగిస్తున్న కొద్దీ బయటపడుతున్న మృతదేహాలు

- మరో రెండు మృతదేహాలు వెలికితీత!
- చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురు మృతి?
- ఇంకా తెలియని 10 మంది ఆచూకీ
- మూడో రోజూ కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్
- తమ వారి మృతదేహాల కోసం బాధిత కుటుంబ సభ్యుల నిరీక్షణ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/పటాన్‌చెరు: పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు సంభవించిన చోట శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. బుధవారం మరో రెండు మృతదేహాలు లభించినట్లు సమాచారం. తీవ్రగాయాల పాలై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురు మరణించినట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య 45కు చేరువైనట్లు అనధికారిక అంచనా. సిగాచి పరిశ్రమ యాజమాన్యం మాత్రం 40 మంది చనిపోయారని ప్రకటించింది. ప్రమాదం జరిగి రెండు రోజులు గడుస్తున్నా పదిమంది ఆచూకీ లభించడం లేదని అధికారులు ప్రకటించారు. మరోవైపు పరిశ్రమలో రెస్క్యూ ఆపరేషన్ బుధవారం కూడా కొనసాగింది. డీఆర్‌ఎఫ్, హైడ్రా బృందాలు శిథిలాలను తొలగిస్తున్నాయి. వర్షం, సాంకేతిక కారణాలతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. దీంతో శిథిలాల మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

జిన్‌పింగ్ శకానికి తెర?



చైనాలో షీ జిన్‌పింగ్ శకం ముగిసిందా? పలువురు అధ్యక్షులకు పట్టిన గతే ఆయనకు కూడా పట్టనుందా? నెల రోజులుగా డ్రాగన్ దేశంలో చోటుచేసుకుంటున్న పలు అనూహ్య పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది.

- వివరాలు 6లో▶

ప్రతి కులానికీ గ్రేడింగ్



రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే–2024 గణాంకాల ఆధారంగా స్వతంత్ర నిపుణుల కమిటీ ప్రతి కులానికి గ్రేడింగ్ ఇచ్చింది. రాష్ట్రంలోని 242 కులాలకు గ్రేడింగ్ ఇచ్చింది.

- వివరాలు 3లో▶


శివబాలకృష్ణ ఇంట్లో ఈడీ సోదాలు



హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపై ఈడీ కేసు నమోదు చేసింది. ఆయనపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో బుధవారం సోదాలు నిర్వహించింది. ఏసీబీ గతంలో నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ దీన్ని నమోదు చేసింది.

- వివరాలు 2లో▶

పారదర్శకంగా గ్రూప్-1 నిర్వహణ



గ్రూప్–1 పరీక్షలను పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా నిర్వహించామని టీజీపీఎస్సీ హైకోర్టులో వాదనలు వినిపించింది. మూల్యాంకనం, హాల్ టికెట్ల జారీపై పిటిషనర్ల వాదనను తప్పుబట్టింది.

- వివరాలు 14లో▶

14న రేషన్ కార్డుల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్

- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- ఎరువులు అందుబాటులో ఉంచాలి: మంత్రి లక్ష్మణ్
- రూ.1,200 కోట్లతో రోడ్ల అభివృద్ధి: మంత్రి కోమటిరెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 14న కొత్త రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభిస్తారని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులపై వృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ ఈ విషయం వెల్లడించారు. 14న సాయంత్రం 6 గంటలకు తిరుమలగిరిలో నిర్వహించే బహిరంగ సభలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు కొత్త రేషన్ కార్డులకోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 13లోగా పరిశీలించి, అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశామన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉప ఎన్నికలున్న చోట కొద్దిమందికి రేషన్ కార్డులు ఇచ్చిందే తప్ప అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్.. 44 కిలోమీటర్లలో 35 కిలోమీటర్లు పూర్తయిందన్నారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి హెలికాప్టర్ ద్వారా మిగతా 3వ పేజీలో ▶

వర్షాలు కురవడంతో ఆదిలాబాద్ జిల్లాలో సాగుపనుల్లో నిమగ్నమైన రైతు


కురుస్తున్న వర్షం... రైతన్న హర్షం

రాష్ట్రవ్యాప్తంగా ఊపందుకున్న సాగు

సాక్షి, హైదరాబాద్: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయం ఊపందుకుంది. ఇప్పటికే పత్తి సాగులో రైతులు బిజీగా ఉండగా, వర్షాల రాకతో వరి సాగు పెరుగుతోంది. చాలా జిల్లాల్లో బావులు, బోర్ల కింద ఇప్పటికే నారుమళ్లు పోశారు. కొన్ని జిల్లాల్లో నాట్లు ప్రారంభం కాగా, మరికొన్ని ప్రాంతాల్లో నాట్లేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రాజెక్టులు, చెరువుల కింద ఉన్న పొలాల్లో రైతులు దుక్కులు దున్నుతూ సేద్యానికి సిద్ధమవుతున్నారు. నిజామాబాద్, కరీంనగర్, మెదక్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో ఇప్పటికే రైతులు నారుమళ్లు పోసి.. వరి నాట్లేసే కార్యక్రమాలు ప్రారంభించారు. మహబూబ్‌నగర్, వరంగల్, రంగారెడ్డి, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో వరి సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో వ్యవసాయ అధికారులు తగిన సూచనలు, సలహాలతో మిగతా 5వ పేజీలో ▶

ఈ నెలంతా వానలే!

- ఐఎండీ అంచనా
- జూన్ నెలలో 20 శాతం లోటు వర్షపాతం.. ఐదేళ్లలో ఇదే తొలిసారి

5 లో

దమ్ముంటే అసెంబ్లీ పెట్టు

- బనకచర్లతో పాటు నదీజలాలపై చర్చిద్దాం
- మైక్ కట్ చేయొద్దు.. వాయిదా వేయొద్దు.. పారిపోవద్దు
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు సవాల్
- చంద్రబాబుతో రేవంత్ చీకటి ఒప్పందం చేసుకున్నారని ఫైర్


మీడియాతో మాట్లాడుతున్న హరీశ్

సాక్షి, హైదరాబాద్: 'గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో పాటు గోదావరి, కృష్ణా నదీజలాల అంశంపై చర్చించేందుకు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే సభా నాయకుడిగా వెంటనే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలి. గురువారం ఉదయం 8 గంటలకు అసెంబ్లీ సమావేశాలు పెట్టినా చర్చించేందుకు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉన్నా. కానీ మైక్ కట్ చేయకూడదు. సభను అర్ధంతరంగా వాయిదా వేసి పారిపోకుండా చర్చకు అవకాశం ఇవ్వాలి. ఒకవేళ అసెంబ్లీలో ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే మాకూ అవకాశం ఇవ్వాలి. కృష్ణా, గోదావరి నదీజలాలు ఒక్కోదానిపై 15 రోజులు చొప్పున నెల రోజుల పాటు చర్చించేందుకు సిద్ధం..'అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో పలువురు మాజీ మంత్రులు, ముఖ్యనేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

తెలంగాణ నీటి హక్కులకు మరణ శాసనం

'బనకచర్లపై అబద్ధాలు చెబుతున్న రేవంత్ బట్టలిప్పుతాం. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా గత ఏడాది జూలై 6న బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ చీకటి మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి


ఈ మధ్య అలానే కూర్చుంటున్నారు!

సర్‌ప్రైజ్ చేస్తానంటూ..

చంపేశాడు

కళ్లకు గంతలు కట్టి.. గొంతులో కత్తితో పొడిచి తండ్రిని హతమార్చిన కుమారుడు

- బెట్టింగ్ డబ్బులపై ప్రశ్నించినందుకే దారుణం
- ఆపై ఆత్మహత్యగా చిత్రీకరణ
- పోలీసుల విచారణలో హత్య చేసినట్లు అంగీకారం..

5 లో

కన్న తండ్రినే

నరికి చంపాడు

- ఆస్తి తగాదాలతో ఘాతుకానికి ఒడిగట్టిన కుమారుడు
- సూర్యాపేట జిల్లాలో ఘటన

- వివరాలు 5లో

విద్యార్థి వీసాలపై

'కాల పరిమితి' కత్తి!

ట్రంప్ సర్కార్ కొత్త ప్రతిపాదన ● కచ్చితమైన గడువు తేదీతో భారతీయ విద్యార్థులకు కొత్త సమస్యలు




వాషింగ్టన్: విదేశీ వలసదారులపై బహిష్కరణ వేటు వేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా విదేశీ విద్యార్థులపై 'కాల పరిమితి' కత్తి దూసేందుకు సాహసించారు. విదేశీ విద్యార్థులకు కాలపరిమితితో సంబంధం లేకుండా ఇన్నాళ్లు ఎఫ్–1 స్టూడెంట్ వీసాలు జారీచేస్తుండగా ఇకపై స్పష్టమైన తుదిగడువుతో విద్యార్థి వీసాలు జారీచేయాలని అమెరికా ప్రభుత్వం యోచిస్తోంది. గడువు దాటాక అమెరికా గడ్డపై ఉంటే మళ్లీ స్టూడెంట్ వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత ప్రతిపాదనలో ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్(ఓఎంబీ) వద్ద పరిశీలనలో ఉన్నాయి. ఈ ప్రతిపాదనలకు ఆమోద ముద్ర పడితే ఇకపై విద్యార్థి అమెరికాలో చేయబోయే కోర్సు పూర్తయినా, పూర్తికాకపోయినా వీసాపై ముద్రించిన గడువుతేదీలోపు అమెరికాను వీడాల్సి ఉంటుంది. ఇన్నాళ్లు ఇలాంటి గడువు అనేదే లేదు. అమెరికాలోకి అడుగుపెట్టినప్పుడు ఎంచుకున్న విద్యా కోర్సు సంపూర్ణంగా పూర్తయ్యేదాకా ఆ స్టూడెంట్ వీసా చెల్లుబాటులోనే ఉండేది. దీనినే ' డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్'గా పిలుస్తారు. ఈ స్టేటస్‌లో ఇకపై గడువు తేదీని ముద్రించాలని ట్రంప్ సర్కార్ భావిస్తోంది. గతంలో కోర్సు ఆలస్యమైతే వీసా గడువు పొడిగింపు వంటి వెసులుబాట్లు ఉండేవి. ఇకపై అలాంటివి ఒప్పుకోబోమని ట్రంప్ సర్కార్ కరాఖండీగా చెబుతోంది. దీంతో ఎఫ్–1 వీసాలతో అమెరికా విద్యాభ్యాసం కోసం వచ్చే భారతీయ విద్యార్థులపై మరింత ఆర్థిక భారం పడనుంది. అనివార్య కారణాలతో కోర్సు ఆలస్యమైనాసరే వీసా గడువు మాత్రం పాత తేదీకే పూర్తవుతుంది. అలాంటి సందర్భాల్లో కోర్సు పూర్తికాకముందే అమెరికాను వీడాల్సి ఉంటుంది. ఈ గండం నుంచి గట్టెక్కేందుకే మరోసారి వీసా కోసం దరఖాస్తు చేసుకోవడం, ఆ దరఖాస్తు ఆమోదం కోసం వేచి ఉండటం, దరఖాస్తు, తదితరాల ఖర్చులు తడిసిమోపెడై మిగతా 2వ పేజీలో ▶

మేడారం మహాజాతర

తేదీలు ఖరారు

- 2026 జనవరి 28 నుంచి 31 వరకు
- ఈసారి మూడు వారాల ముందే తెలంగాణ కుంభమేళా



సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ మినీ కుంభమేళా, మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరల తేదీలు ఖరారయ్యాయి. ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలంలో జరగనున్న సమ్మక్క– సారలమ్మ –2026 మహాజాతర తేదీలను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు బుధవారం వెల్లడించారు. వచ్చేఏడాది జనవరి 28 నుంచి 31 వరకు మహాజాతర జరగనున్నట్లు ప్రకటించారు. జాతరకు రెండు వారాల ముందుగా జనవరి 14 (బుధవారం)న గుడిమెలిగె పండుగ, 21 (బుధవారం)న మండమెలిగె పండుగ మిగతా 5వ పేజీలో ▶

బోయింగ్‌తో ప్రమాదమే



ప్రమాదాలు, మరణాలు 'బోయింగ్'తోనే ఎక్కువ

- భారత్‌లో ఎగురుతున్న విమానాల్లో 21% బోయింగ్‌వే
- రెండేళ్లలో 374 విమానాలకు ఆర్డర్ పెట్టిన కంపెనీలు
- ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తగ్గుతున్న ఆర్డర్లు

ఇటీవలి ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనకు ప్రధాన కారణం.. రెండు ఇంజిన్లు విఫలం కావడమేనని దీనిపై దర్యాప్తు చేస్తున్న నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రమాదం భారత్‌లో జరిగిన అత్యంత ఘోర విమాన విపత్తుల్లో ఒకటి. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ రకం విమానం కూలిపోవడం ఇదే మొదటిసారి. అయితే బోయింగ్‌కు మాత్రం ప్రమాదాలు కొత్త కాదు. 2019-2024 మధ్య జరిగిన ప్రమాదాలు, మరణాలకు బోయింగ్ విమానాలే ఎక్కువ కారణమని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఇటీవలి కాలంలో ఆర్డర్లతోపాటు.. సంస్థ బ్రాండ్ ఇమేజ్ సైతం పడిపోతోంది.

ప్రపంచంలో అత్యధిక ప్రమాదాలు, మరణాలకు కారణమవుతున్న విమానంగా బోయింగ్ అప్రతిష్ట మూటగట్టుకుంది. ఏవియేషన్ సేఫ్టీ నెట్‌వర్క్ గణాంకాల ప్రకారం 2019-2024 మధ్య జరిగిన ప్రమాదాలు, మరణాలకు బోయింగ్ విమానాలే ఎక్కువగా కారణం అయ్యాయి. ప్రమాదాల్లో 26.2 శాతం, మరణాల్లో 43% వాటా బోయింగ్ విమానాలదే. ఇతర విమాన తయారీ సంస్థలతో పోలిస్తే ఇదే ఎక్కువ.

- సాక్షి, స్పెషల్ డెస్క్


మనదేశంలో అయిదోవంతు!

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) 2023 నాటి గణాంకాల ప్రకారం భారత ఆపరేటర్ల వద్ద ఉన్న వాటిలో సింహభాగం 'ఎయిర్‌బస్' విమానాలే. మనదేశంలో ఎగురుతున్న విమానాల్లో 21% మాత్రమే 'బోయింగ్'తయారు చేసినవి. స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ వంటి కొన్ని సంస్థలు మాత్రమే బోయింగ్‌పై ఎక్కువగా ఆధారపడ్డాయి. అంతర్జాతీయంగా గత సంవత్సరం ఎయిర్‌బస్ 766 విమానాలు డెలివరీ చేస్తే.. బోయింగ్ 348 విమానాలను డెలివరీ చేసింది. 2020 నుంచి ఎయిర్‌బస్ డెలివరీల సంఖ్య క్రమంగా పెరిగింది. 2023, 2024లో భారత విమానయాన సంస్థలు చేసిన ఆర్డర్లపై 2025 మార్చిలో పార్లమెంట్‌లో కేంద్ర పౌరవిమాన యాన శాఖ వివరాలు వెల్లడించింది. దాని ప్రకారం ఆ రెండేళ్లలో మొత్తం 1,359 కొత్త విమానాలకు ఆర్డర్లు పెట్టారు. ఇందులో ఎయిర్ ఇండియా ఆర్డర్లు పెట్టిన బోయింగ్‌లు 30 కాగా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 190, ఆకాశ ఎయిర్ పెట్టినవి 154. మిగతావన్నీ ఎయిర్‌బస్ విమానాలే.

భారీ నష్ట పరిహారం..

ప్రమాదాల కారణంగా బోయింగ్ భారీ 'మూల్యం'చెల్లించాల్సి వస్తోంది. 2018, 2019లలో జరిగిన రెండు 737 మ్యాక్స్ విమాన ప్రమాదాలకు సంబంధించి విచారణను నివారించడానికి అమెరికా న్యాయ శాఖతో కుదిరిన ఒప్పందంలో భాగంగా 1.1 బిలియన్‌డాలర్లు (సుమారు రూ.9,418 కోట్లకుపైగా) చెల్లించడానికి బోయింగ్ అంగీకరించింది. ఈ దుర్ఘటనల్లో మొత్తం 346 మంది మరణించారు. అహ్మదాబాద్ ప్రమాదానికి కొన్ని వారాల ముందు బోయింగ్ ఈ ఒప్పందం చేసుకుంది. 2024 జనవరిలో అలాస్కా ఎయిర్‌లైన్స్ నడుపుతున్న 737 మ్యాక్స్ 9 విమానం గగనతలంలో ఉన్నప్పుడు తలుపు ఊడిపోయింది. ఈ సంఘటనపై విచారణ జరిపి, నివేదికను గత జూన్ 24నే ఇచ్చారు. ఆ డోరుకు ఉండాల్సిన నాలుగు బోల్టులు లేకపోవడం వల్లే అది ఎగిరిపోయిందని తేల్చారు. దీనిపై బోయింగ్‌ను వివరణ కోరగా.. పేపర్ వర్క్‌లో పొరపాటు జరిగిందని చెప్పిందట. ఈ ఘటనలో బోయింగ్ భద్రతా వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విమాన ప్రమాదాలను నివారించడానికి తగిన శిక్షణ, పర్యవేక్షణను అందించడంలో బోయింగ్ విఫలమైందని పేర్కొంది. మనదేశంలో మాత్రం బోయింగ్ విమానాల్లో ఈ తరహా సంఘటన ఏదీ జరగలేదు. కానీ, ఇలాంటి పొరపాటు జరగకుండా డీజీసీఏ విమానయాన సంస్థల్లోని ఈ రకం బోయింగ్ విమానాల్లో తనిఖీలు నిర్వహించి, అన్నీ సరిగ్గానే ఉన్నాయని వెల్లడించింది. అహ్మదాబాద్‌లో కూలిపోయిన విమానం బ్లాక్ బాక్స్ నుంచి డేటాను సేకరించడానికి ఎన్‌టీఎస్‌బీ ప్రస్తుతం మన దర్యాప్తు సంస్థలతో కలిసి పనిచేస్తోంది.

విమాన తయారీ సంస్థల వారీగా.. 2023 నాటికి భారతీయ విమానయాన సంస్థలు సొంతంగా కొనుగోలు, లీజుకు తీసుకున్న విమానాలు (శాతాల్లో)



అంతర్జాతీయంగా అయిదేళ్లలో డెలివరీ అయిన విమానాల సంఖ్య

సంవత్సరం	ఎయిర్‌బస్	బోయింగ్
2020	566	157
2021	611	340
2022	661	480
2023	735	528
2024	766	348

దేశంలో 680 విమానాలు

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. 2025 మార్చి నాటికి దేశంలో అన్ని విమానయాన సంస్థల వద్ద ప్రయాణికుల రవాణాకోసం.. నిర్వహణలో ఉన్న మొత్తం విమానాల సంఖ్య 680. ఇందులో ఇండిగో వద్ద 319 విమానాలున్నాయి. ఎయిర్ ఇండియా వద్ద ప్రస్తుతం నిర్వహణలో ఉన్న 198 విమానాల్లో... 10 ఏళ్లకు పైబడి వాడుతున్నవి 70 కాగా, 15 ఏళ్లకుపైబడినవి 43.

మార్కెట్ వాటా పరంగా ప్రపంచంలో టాప్-5 విమాన తయారీ కంపెనీలు. వీటిలో ఎయిర్ బస్ యూరప్ కంపెనీ కాగా మిగిలినవి యూఎస్‌కు చెందినవి.

1. ఎయిర్ బస్
2. బోయింగ్
3. లాక్ హీడ్ మార్టిన్
4. నాత్రప్ గ్రమన్
5. జనరల్ డైనమిక్స్

శిథిల బతుకులు

▶ మొదటి పేజీ తరువాయి

తొలగింపు ప్రక్రియ గురువారం కూడా కొనసాగనుంది.

డీఎన్‌ఏ రిపోర్టుల రాక ఆలస్యం

శిథిలాల్లో బయటపడిన మృతదేహాలను పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేస్తున్నారు. మొత్తం 37 మృతదేహాలు పటాన్‌చెరు ఆస్పత్రికి చేర్చారు. ఈ మృతదేహాల గుర్తింపు కోసం డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీఎన్‌ఏలు సరిపోయాకే మృతదేహాలను అప్పగిస్తున్నారు. అయితే ఈ రిపోర్టులు రావడానికి 24 గంటల నుంచి 48 గంటలు పడుతుందని అధికారులు చెప్పారు.

చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురు మృత్యువాత

తీవ్ర గాయాలపాలై సంగారెడ్డి జిల్లాతోపాటు, హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో బుధవారం ముగ్గురు మృత్యువాత పడినట్టు తెలుస్తోంది. పేలుడు ధాటికి కార్మికులు చాలామంది 70 శాతం వరకు కాలిన గాయాలైన విషయం విదితమే. ఇందులో పలువురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురు మృతి చెందినట్టు తెలుస్తోంది.

మంత్రి దామోదర వాహనం అడ్డగింత

రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షించేందుకు వస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ వాహనాన్ని సిగాచి పరిశ్రమ వద్ద బాధిత కుటుంబాలు అడ్డుకున్నాయి. జస్టిస్ ఆచూకీ చెప్పాలని బాధిత కుటుంబ సభ్యులు మంత్రి వాహనానికి ఎదురుగా వెళ్లారు. దీంతో వాహనం దిగి వచ్చిన మంత్రి వారిని సుముదాయించి ధైర్యం చెప్పారు.

18 బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం

18 కుటుంబాలకు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.18 లక్షలు చెల్లించారు. గాయపడిన 34 మందికి రూ.50 వేల చొప్పున రూ.17 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఆచూకీ లభించని వారి కుటుంబాలకు తాత్కాలికంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించినట్టు అధికారులు తెలిపారు.

పరిశ్రమలోకి దూసుకెళ్లేందుకు బాధిత కుటుంబాల యత్నం..ఉద్రిక్తత

సిగాచి పరిశ్రమలోకి కొందరు బాధిత కుటుంబ సభ్యులు దూసుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. బుధవారం సాయంత్రం వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అడ్డుకోవడంతో పరిశ్రమ గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదం జరిగి మూడు రోజులైనా, తమ వారి మృతదేహాలను అప్పగించకపోవడం దారుణమన్నారు. అధికారుల వైఫల్యం కారణంగానే మట్టి దెబ్బల కింద ఎంతోమంది విగతజీవులుగా పడి ఉన్నారన్నారు. 'మీకు చేతకాకపోతే చెప్పండి.. ఎముకలైనా తవ్వుకొని తీసుకెళతాం'అని బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహావేశాలకు లోనయ్యారు. ప్రమాదం జరిగిన రోజే శిథిలాలను తొలగించి వెతికి చూస్తే ఇంకా చాలామంది బతికే వారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రెండు మృతదేహాలు వెలికి తీశారని, అది కూడా తమ ఒత్తిడి మేరకే జరిగిందని వారు వివరించారు. ఒక మృతదేహంపై దుస్తులు కూడా ఉన్నాయని, శవాన్ని గుర్తించే స్థితిలో ఉందని వారు చెప్పారు.ఆ రోజే శిథిలాలను తొలగించి ఉంటే ఇంకొంత మంది ప్రాణాలతో బయటపడే వారిని బండ్లగూడకు చెందిన శిల్ప పేర్కొన్నారు.



సిగాచి పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

మెషినరీ కాలం చెల్లిందని చెప్పినా...

సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన విషయంలో పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌కు చెందిన రాజనాల సాయియశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భానూరు పోలీసులు మంగళవారం కేసు (క్రైం నెం.184/2025) నమోదు చేశారు. అయితే ఈ పరిశ్రమలో మెషినరీ కాలం చెల్లిపోయిందని.. పాతబడిన ఈ మెషినరీని మార్చాలని.. తన తండ్రి రాజనాల వెంకట్‌జగన్‌మోహన్ పలుమార్లు యాజమాన్యం దృష్టికి తెచ్చారని సాయియశ్వంత్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం ఈ యంత్రాలను మార్చకపోతే పెద్ద ఎత్తున ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లుతుందని ముందుగానే యాజమాన్యానికి చెప్పారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పరిశ్రమలో 20 సంవత్సరాలుగా తన తండ్రి వెంకటజగన్‌మోహన్ (55) పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఘటనలో ఆయన మరణించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు భానూరు పోలీసులు సిగాచీ పరిశ్రమ యాజమాన్యంపై బీఎన్‌ఎస్ 105, 110, 117 సెక్షన్ల కింద జూన్ 30న కేసు నమోదు చేశారు. వెంకటజగన్‌మోహన్‌ది స్వస్థలం ఒడిశాలోని గంజామ్ జిల్లా చత్రపూర్.

బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు అధికారులు విడుదల చేసిన సమాచారం ప్రకారం

- ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో పనిచేస్తున్న వారు: 143
- ప్రమాదం నుంచి బయటపడిన వారు: 60
- గాయపడి చికిత్స పొందుతున్నవారు: 35
- మరణించిన వారిలో పేర్లు గుర్తించిన మృతదేహాలు: 18
- పేర్లు గుర్తించని మృతదేహాల సంఖ్య: 20
- ఆచూకీ లభించకుండా పోయినవారు: 10

డీఎన్‌ఏ రిపోర్టుల సమాచారం

- డీఎన్‌ఏ టెస్ట్ అయ్యాక ఆయా కుటుంబాలకు అప్పగించిన మృతదేహాల సంఖ్య: 18
- ల్యాబ్ నుంచి డీఎన్‌ఏ రిపోర్టుల రావాల్సిన మృతదేహాలు: 18
- డీఎన్‌ఏ పరీక్షల కోసం సేకరించాల్సిన శాంపిల్స్: 2
- ల్యాబ్‌లో ప్రాసెస్ చేయాల్సిన కుటుంబసభ్యుల రక్త శాంపిల్స్: 25
- ఇప్పటి వరకు జాడ తెలియని కుటుంబాల సంఖ్య: 3
- ప్రాసెస్ చేయబడిన, సరిపోలిన శాంపిల్స్ సంఖ్య: 5

ఇద్దరి పరిస్థితి విషమం

గచ్చిబౌలి: ప్రమాదంలో గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మదీనాగూడలోని ప్రణమ్ హాస్పిటల్‌లో 18 బాధితులకు చికిత్స అందిస్తున్నామని, గురువారం 10 మందిని డిశ్చార్జ్ చేస్తామని హాస్పిటల్ ఎండీ మనీష్‌గౌర్ తెలిపారు. ప్రమాదం జరిగిన రోజే ఈ హాస్పిటక్‌కు 22మందిని తీసుకొచ్చారు. వీరిలో హేమసుందర్, లగ్నాజిత్, శశిభూషణ్‌లు మృత్యువాత పడ్డారు. ఐదుగురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. జనరల్ వార్డులో 13 మందికి చికిత్స అందిస్తున్నారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన తారక్ ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు.

చనిపోయింది 38 మందే..

ఆ రోజు విధుల్లో 143 మంది ఉన్నారు: సిగాచి ఎండీ అమిత్‌రాజ్ సిన్హా

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ పటాన్‌చెరు/ రామచంద్రాపురం: తమ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 38 మంది చనిపోయారని సిగాచి మేనేజింగ్ డైరెక్టర్ అమిత్‌రాజ్ సిన్హా స్పష్టం చేశారు. బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమలో ప్రమాదం జరగడం బాధాకరం, దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోందని, నివేదిక రాగానే వివరాలు వెల్లడిస్తానని చెప్పారు. ఆస్పత్రుల్లో ఉన్న క్షతగాత్రుల వైద్య చికిత్సకు కంపెనీనే ఖర్చులు చెల్లిస్తుందని తెలిపారు. కంపెనీ స్ట్రక్చర్ పాతదేకానీ ఎక్విప్‌మెంట్స్ కొత్తవి అని ఆయన పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన రోజు మొత్తం 143 మంది కార్మికులు విధులకు హాజరయ్యారని తెలిపారు. అధికారులు చెబుతున్నట్టు 42 మంది మృతి చెందలేదని ఆయన స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న చిదంబరం

పరిశ్రమ ఫౌండర్ చైర్మన్ నిలదీత: సిగాచి పరిశ్రమ ఫౌండర్ చైర్మన్ చిదంబరంను సీపీఎం ఆధ్వర్యంలో బాధిత కార్మిక కుటుంబీకులు నిలదీశారు. బుధవారం ఆయన పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చారు. ఆయన్ను చూసిన బాధిత కుటుంబాలు ఒక్కసారిగా ఆగ్రహావేశాలకు లోనయ్యారు. దుర్ఘటన జరిగి మూడు రోజులయ్యాక ఇప్పుడు పరామర్శకు వస్తారా అని నిలదీశారు. అనంతరం చిదంబరం మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల క్రితం ఈ పరిశ్రమను లీజుకు ఇచ్చానని చెప్పారు.అయితే కార్మికులతో ఉన్న అనుబంధం మేరకు వారిని పరామర్శించేందుకు, వారి కుటుంబాలకు సానుభూతి, సంతాపం తెలిపేందుకు ఇక్కడకు వచ్చినట్టు వివరించారు.

రియాక్టర్ పేలుడు వల్ల ప్రమాదం జరగలేదు: పేలుడు ఘటనపై ఎట్టకేలకు సిగాచి పరిశ్రమ యాజమాన్యం స్పందించింది. రియాక్టర్ పేలడం వల్ల ప్రమాదం జరగలేదని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబసభ్యులకు ఒక్కొకరికి రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. మరో 33 మందికి పైగా తీవ్ర గాయాల పాలయ్యారని పేర్కొంది. ఈ మేరకు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు రాసిన లేఖను బుధవారం తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఈ ఘటన కారణంగా 3 నెలలు ఫ్యాక్టరీలో కార్యకలాపాలు మూసివేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొంది.

'సిగాచి'పై ఉన్నతస్థాయి కమిటీ

నెల రోజుల్లో కమిటీ తన నివేదిక ఇవ్వాలి

సాక్షి, హైదరాబాద్: సిగాచి పరిశ్రమలో జరిగిన ఘటనకు కారణాలను కనుక్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) సంస్థల్లో పనిచేసిన విశేష అనుభవం ఉన్న శాస్త్రవేత్తలను నియమిస్తూ కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ దుర్ఘటన జరిగిన సమయంలో పరిశ్రమలో మొత్తం 143మంది కార్మికులు, ఉద్యోగులు ఉన్నారని, 40 మంది వరకు మరణించినట్టు ఆ ఉత్తర్వుల్లో ముఖ్యకార్యదర్శి దానకిశోర్ పేర్కొన్నారు. సీఎస్ఐఆర్, ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ బి. వెంకటేశ్వరరావు చైర్మన్‌గా, సీఎస్ఐఆర్-ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ టి. ప్రతాప్ కుమార్, సీఎస్ఐఆర్-సీఎల్ఆర్ఐ హైదరాబాద్, చీఫ్ సైంటిస్ట్ సీఎస్ఐఆర్-ఐఐసీటీలో పనిచేసిన డాక్టర్ సూర్యానారాయణ, సీఐఎస్ఆర్-ఎన్‌సీఎల్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ సంతోశ్ గూగ్‌లు సభ్యులుగా ఈ ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ విస్ఫోటనం జరగడానికి దారి తీసిన పరిస్థితులేంటి? అందుకు గల కారణాలను గుర్తించడం, భవిష్యత్‌లో ఇలాంటి ఘోర దుర్ఘటనలు రసాయన, ఫార్మా కంపెనీల్లో జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయనుంది. ఈ కమిటీ సిగాచి యాజమాన్యంతోపాటు, కార్మికులు, ఉద్యోగులతో మాట్లాడడం, కన్సల్టెంట్స్, సంస్థలు, వ్యక్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులను విచారించవచ్చని, నెలరోజుల్లో తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఈ కమిటీ సహాయ సహకారాలు అందించాలన్నారు.

పాశమైలారం బాధితులకు అండగా ఉంటాం

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

పటాన్‌చెరు టౌన్: పాశమైలారం బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. బుధవారం ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో సమావేశం అయ్యారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'వైద్యసేవలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మీనాక్షి నటరాజన్, మంత్రి దామోదర

సన్న బియ్యం.. మిల్లర్‌కే అమ్మేశారు!

- రూ.కోటి విలువైన బియ్యం పక్కదారి
- ఇద్దరు అధికారుల సస్పెన్షన్... కొనసాగుతున్న విచారణ

సాక్షి, హైదరాబాద్: మిల్లుల్లో మరాడించిన బియ్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)గా గిడ్డంగుల సంస్థ పరిధిలోని గోదాంలకు వెళతాయి. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌ల ద్వారా రేషన్ డీలర్లకు చేరుతాయి. ఇది రోటీన్‌గా జరిగేది కానీ.. కొందరు అధికారులు, మిల్లర్లు దీనిని సీన్ రివర్స్ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌ల ద్వారా రేషన్ దుకాణాల నుంచి పేదలకు చేరాల్సిన సన్న బియ్యాన్ని.. రాష్ట్ర గిడ్డంగుల సంస్థకే తరలించి అక్రమాల్లో కొత్త పంథాను చూపించారు.

నాలుగు లారీలను పట్టుకుంటే...

వారం రోజుల క్రితం హైదరాబాద్‌లోని పౌర సరఫరాల సంస్థకు చెందిన రామాంతపూర్, కాప్రాలోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి రేషన్ డీలర్లకు సరఫరా చేయాల్సిన 120 టన్నుల సన్న బియ్యాన్ని నాలుగు లారీల్లో మేడ్చల్ జిల్లా తుర్కపల్లికి చెందిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఎస్‌డబ్ల్యూసీ)కు చెందిన స్టేజ్ -1 గోదాంకు తరలించే ప్రయత్నం చేశారు. పౌరసరఫరాల సంస్థ రామాంతపూర్ గోదాం ఇన్‌చార్జ్, అసిస్టెంట్ గ్రేడ్-1 అధికారి పాండు రంగారావు, కాప్రా అసిస్టెంట్ మేనేజర్ కల్పనా బాయి తుర్కపల్లికి చెందిన హనుమాన్ రైస్‌మిల్లుతో కుమ్మక్కై ఈ రేషన్ బియ్యాన్ని తుర్కపల్లి గోదాంకు తరలించారు. అయితే హనుమాన్ రైస్ సీఎంఆర్ కింద ఈ బియ్యాన్ని గోదాంకు తరలించినట్టుగా చూపే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలిసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారిని తమ అధీనంలోకి తీసుకున్నారు. దీనిపై విచారణ జరపగా, అంతకు ముందు మరో 2 లారీల్లో సుమారు 60 టన్నుల బియ్యం సీఎంఆర్ కింద రామాంతపూర్, కాప్రా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి తరలిపోయినట్టు గుర్తించారు. తుర్కపల్లి ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లో తనిఖీలు చేయగా 1,000 బస్తాల వరకు తేడా వచ్చింది. ఈ మొత్తం వ్యవహారంపై పౌరసరఫరాల సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్ విచారణ జరపగా, రూ. కోటి విలువైన సన్న బియ్యం పేదలకు కాకుండా రీసైక్లింగ్ కోసం రైస్ మిల్లుకు తరలించినట్టు తేలింది. దీంతో రామాంతపూర్, కాప్రా గోడౌన్ ఇన్‌చార్జ్‌లు పాండురంగారావు, కల్పనా బాయిని సస్పెండ్ చేశారు.

శివబాలకృష్ణ ఇంట్లో ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రణాళికా విభాగ మాజీ డైరెక్టర్, రెరా మాజీ కార్యదర్శి శివబాలకృష్ణపై డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ కేసు నమోదు చేసింది. ఆయనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో బుధవారం వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. బాలకృష్ణకు ఆదాయానికి మించిన ఆస్తులున్నాయని గత జనవరిలో ఏసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ ఈ కేసు నమోదు చేసింది. శివబాలకృష్ణ ఇంటితోపాటు, ఆయన సోదరులు, బంధువుల ఇళ్లపై ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. గతంలో ఏసీబీ నిర్వహించిన సోదాల్లో రూ.250 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులను గుర్తించారు. అక్రమంగా సంపాదించిన డబ్బును వివిధ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు ఆధారాలు సేకరించారు. కాగా, సోదాల్లో ఏసీబీ స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, సీజ్ చేసిన నగదు, బినామీ ఆస్తుల వివరాల ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ సెక్షన్ల కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెరా సెక్రటరీగా.. ఆరోపణలు

బాలకృష్ణ రెరా సెక్రటరీగా అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డట్లు ఏసీబీ దర్యాప్తులో వెలుగుచూసింది. హెచ్ఎండీఏ పరిధిలో రియల్ ఎస్టేట్ కంపెనీలకు లబ్ధి చేకూరే విధంగా లాబీయింగ్ నడిపినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ కంపెనీలకు అనుమతులు ఇప్పించడంలో బాలకృష్ణ కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది. అలాగే బినామీ పేర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భారీగా పెట్టుబడి పెట్టినట్లు ఏసీబీ విచారణలో బయటపడింది. గతేడాది జనవరిలో మణికొండ మున్సిపాలిటీ పరిధి పుప్పాలగూడలోని శివబాలకృష్ణ ఇల్లు, అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ ఆఫీస్, అతని బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు చేసింది. ఈ సందర్భంగా శివబాలకృష్ణ ఇంట్లో రూ.40 లక్షలకు పైగా నగదు, 125 ఇంపోర్టెడ్ వాచీలు, 20కి పైగా అత్యంత ఖరీదైన సెల్‌ఫోన్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లతో పాటు తాము సేకరించిన బ్యాంక్ లావాదేవీలు, పెట్టుబడులకు సంబంధించిన ఆధారాలతో ఈడీ సోదాలు నిర్వహించింది.

మా ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదు?

'ఆత్మీయ భరోసా'పై సీఎస్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై ఈ ఏడాది జనవరిలో తాము ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. భూమి లేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లించేలా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో పథకాన్ని రూపొందించింది. అయితే ఈ పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకే వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, పట్టణాలు, పురపాలికల్లోని రైతు కూలీలకు ఇవ్వడం లేదని నారాయణపేట్ జిల్లాకు చెందిన రైతు గవినోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను మున్సిపాలిటీ ల్లోని కూలీలకు వర్తింపజేయడంపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏ నిర్ణయం తీసుకున్నా చట్టప్రకారమే ఉండాలని, ఆ వివరాలను పిటిషనర్‌కు తెలియజేయాలని స్పష్టం చేసింది. అయితే కోర్టు ఆదేశించినా మున్సిపాలిటీల్లోని కూలీలకు పథకం వర్తింపజేయడం లేదంటూ శ్రీనివాస్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకాయారా ధర్మాసనం విచారణ చేపట్టింది.

..'కాల పరిమితి' కత్తి!

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థులకు ఖర్చు మరింత పెరగనుంది.

ఎక్స్ఛేంజ్ విజిటర్లకూ కష్టాలే: జే-1 వీసా సాధించి ఎక్స్ఛేంజ్ విజిటర్లుగా వచ్చే వాళ్లకూ ఇదే నిబంధనను వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. చిన్నారులకు ఇంట్లో సేవచేయడం అందుకు ప్రతిఫలంగా భోజన, వసతి, స్వల్ప భత్యం వంటి సదుపాయాలు పొందే 'ఆపెయిర్' యువతకు ఇదే గడువు విధించాలని చూస్తున్నారు. కొత్త ప్రతిపాదలు అమల్లోకి వస్తే విదేశీ విద్యార్థులతోపాటు ఎక్స్ఛేంజ్ విజిటర్ల విభాగంలోకి వచ్చే అధ్యాపకులు, విదేశీ మీడియా ప్రతినిధులు, విద్యావేత్తలు, కళాకారులు, ఉపాధ్యాయులు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, వైద్యులకు సైతం వీసా కాలపరిమితి కష్టాలు తప్పవు. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఈ ప్రతిపాదనలు చేసింది. ప్రతిపాదనలు ప్రస్తుతం ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ విభాగం పరిశీలిస్తోంది. వీటిని ఫెడరల్ రిజిస్ట్రీలో ప్రచురించాక 30 లేదా 60 రోజుల్లో ప్రజాభిప్రాయాన్ని సేకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. అత్యవసరమైతే దొడ్డిదారిన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చి కూడా ట్రంప్ ప్రభుత్వం ఈ నిబంధనను అమల్లోకి తెచ్చే ప్రమాదముందని తెలుస్తోంది.

పలు వర్గాల నుంచి తీవ్ర అభ్యంతరాలు: ఇప్పటికే వీసా దరఖాస్తుదారుల ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టా గ్రామ్, లింక్డిన్ వంటి సామాజిక మాధ్యమ ఖాతాలను అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జల్లెడ పడుతున్నారు. అమెరికా వ్యతిరేక, హమాస్ అనుకూల పోస్ట్‌లు, ట్వీట్లు, వీడియోలు ఉన్నాయో లేదోనని పరిశీలించి ఆ మేరకు దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఇన్ని అడ్డంకులను దాటుకుని సంపాదించిన వీసాను కేవలం గడువు ప్రాతిపదికన మంజూరుచేయడం తగదని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడువు విధింపు కారణంగా లక్షలాది మంది విద్యార్థులపై అదనపు ఒత్తిడి, ఆర్థికభారం తప్పదని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అకడమిక్ కోర్సుల విధానం అస్తవ్యస్తమవుతుందన్నారు. గడువుదాటి అమెరికాలో ఉంటే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఢిల్లీలోని అమెరికా ఎంబసీ మే 14వ తేదీన హెచ్చరించడం తెల్సిందే.

క్లుప్తంగా...

బీజేపీకి చంద్రబాబు మద్దతెందుకు?

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా



సాక్షి, న్యూఢిల్లీ: విభజన హామీలను నెరవేర్చని కేంద్రంలోని అధికార బీజేపీకి సీఎం చంద్రబాబు ఎందుకు మద్దతిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతుపై చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పునరాలోచించుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశాలకు హాజరైన డి.రాజా.. ఢిల్లీలో ఆ పార్టీ తెలంగాణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, రామకృష్ణలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కలిసివచ్చే రాజకీయ పక్షాలతో బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. విజయవాడలో డిసెంబర్ 24, 25 తేదీల్లో అంతర్జాతీయ సెమినార్, ఖమ్మం వేదికగా డిసెంబర్ 26న సెంటినరీ సెలబ్రేషన్స్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఫార్మాసిటీ భూముల్లో కాంగ్రెస్ గద్దలు

అక్రమంగా రైతుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్'వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి రైతులకు భూములను తిరిగి ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం రేవంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫార్మాసిటీ భూములను కొట్టేస్తున్నారని ఆరోపించారు. ఆ భూములపై కాంగ్రెస్ నేతలు గద్దల మాదిరిగా వాలి దోచుకుంటున్నారన్నారు. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్ నేతలు తమ పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని విమర్శించారు. రైతులకు దక్కాల్సిన ఇండ్ల స్థలాలను అతి తక్కువ రేట్లకు కాంగ్రెస్ నేతలు బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని మండిపడ్డారు. రైతులను కూడా వదలకుండా, దోపిడీకి గురిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరు సిగ్గుచేటని ఆయన విమర్శించారు.

కోవర్టులను కట్ చేస్తే బనకచర్ల సమస్య పరిష్కారం

ఏపీ సీఎం చంద్రబాబుపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



జడ్చర్ల: ఏపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్ సమస్య పరిష్కారం కావాలంటే తెలంగాణలో పలు ముఖ్య శాఖల్లో కాంట్రాక్టు పనులు చేపట్టే ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులను కట్ చేస్తే వారే బనకచర్ల ప్రాజెక్టు సమస్యకు పరిష్కారం చూపుతారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని మోతీఘనపూర్ గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపడానికి తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖలు రాస్తే సరిపోదన్నారు. తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టుల పనులతోపాటు విద్యుత్, రోడ్లు తదితర కాంట్రాక్ట్ పనులు చేసే పలువురు కాంట్రాక్టర్లు, పలు దందాలు చేసేవారు చంద్రబాబుకు కోవర్టులుగా ఉన్నారని, తెలంగాణలో పెద్ద కాంట్రాక్టులు వారికే దక్కుతున్నాయని అనిరుధ్ ఆరోపించారు. ఈ క్రమంలో వారికి కరెంట్, తాగునీటి కనెక్షన్‌లు కట్ చేయడంతోపాటు వారు చేపట్టే కాంట్రాక్టు పనులకు ఒక్క రూపాయి బిల్లు ఇవ్వకుండా కట్ చేస్తే వారే చంద్రబాబు దగ్గరకు వెళ్లి కాళ్లు పట్టుకుని బతిమిలాడి వారం రోజుల్లో బనకచర్ల ప్రాజెక్టును ఆపుతారన్నారు.

హరీశ్ మాట్లాడేవన్నీ అబద్ధాలే: ఎంపీ చామల




సాక్షి, హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టును నిలువరించడంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రయత్నాన్ని తక్కువ చేసి చూపేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు నానా తంటాలు పడుతున్నారని, అందుకోసం అబద్ధాలన్నీ వల్లె వేస్తున్నారని నల్లగొండ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. గోదావరి జలాలను రాయలసీమ దాకా తీసుకుపోవాలన్న ఆలోచన ఎక్కడ మొదలైందనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలంగాణ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడంతో బీఆర్‌ఎస్ నాయకుల బండారం బయటపడిందన్నారు. ఎలాగూ రాజకీయ భవిష్యత్తు లేదని కట్టుకథలు చెప్పుకుంటున్నారని చామల ఎద్దేవాచేశారు. గోదావరి జలాల మీద ఈరోజు ఉన్నటువంటి 967 టీఎంసీలు వాడుకునే విధంగా కాళేశ్వరం కడుతున్నమని చెప్పి దాన్ని కూలేశ్వరం చేసినఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో ఏ రోజు కూడా దక్షిణ తెలంగాణ ప్రజలకు రైతులకు మంచి చేయాలని ఆలోచన బీఆర్‌ఎస్ చేయలేదని విమర్శించారు.

ప్రతి కులానికీ గ్రేడింగ్..!

సమగ్ర నివేదిక

242 కులాలకు గ్రేడింగ్

పది రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(ఎస్ఈఈఈపీసీ)–2024 గణాంకాల ఆధారంగా స్వతంత్ర నిపుణుల కమిటీ ప్రతి కులానికి గ్రేడింగ్ ఇచ్చింది. ఎస్ఈఈఈపీసీ–2024ను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ సర్వే గణాంకాలను లోతుగా పరిశీలించి, వివిధ కోణాల్లో విశ్లేషణ చేసిన అనంతరం రాష్ట్రంలోని 242 కులాలకు గ్రేడింగ్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి సమగ్ర నివేదికను సైతం రూపొందించింది. పది రోజుల్లో ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు స్వతంత్ర నిపుణుల కమిటీ సిద్ధమైంది. ఈ కమిటీ బుధవారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సమావేశమైంది. కమిటీ చైర్మన్ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కంచె ఐలయ్య, కన్వీనర్ ప్రవీణ్ చక్రవర్తి, సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, డాక్టర్ సుఖ్‌దేవ్ థొరోట్, డాక్టర్ హిమాన్షు, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భుక్య, ప్రొఫెసర్ ...

... ప్రభుత్వం నిర్వహించిన ఎస్ఈఈఈపీసీ–2024 అత్యంత పారదర్శకంగా, క్రమ పద్ధతిలో, శాస్త్రీయంగా నిర్వహించిందన్నారు. సర్వే నివేదిక దాదాపు మూడు వందలకు పైగా పేజీల్లో ఉందని, ఆ నివేదికను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత కులాల వారీగా గణాంకాలను క్రోడీకరించి ప్రతికులానికి (కంపోజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్) గ్రేడింగ్ (ర్యాంకింగ్) ఇచ్చినట్లు తెలిపారు. దేశంలో ఇప్పటివరకు ఇలాంటి విశ్లేషణ ఏ రాష్ట్రంలో జరగలేదని, తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం పక్కా గణాంకాలతో నిర్వహించిందన్నారు. ఈ అధ్యయనానికి సంబంధించి తుది నివేదిక తయారైందని, వారం, పది రోజుల్లో ప్రభుత్వం సమయం ఇచ్చిన వెంటనే నివేదికను సమర్పించనున్నట్లు వివరించారు. ఈ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరతామన్నారు.

టెన్త్ పాస్.. ఇంటర్ ఫెయిల్ ఎందుకిలా?

ఇంటర్‌లో ఉత్తీర్ణత ఎందుకు తగ్గుతోందో పరిశీలించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతి పాఠశాలలో భారీ జాతీయ జెండా ఏర్పాటుకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: టెన్త్ పూర్తి చేసిన విద్యార్థి ఇంటర్‌లో ఎందుకు ఉత్తీర్ణత సాధించడం లేదో ఆలోచించాలని విద్యా శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో పరిస్థితిపై అధ్యయనం చేయాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియెట్ పూర్తి చేసేలా చూడాలన్నారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని, ఇంటర్‌లో ఆ శాతం గణనీయంగా తగ్గిపోతోందని చెప్పారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ కీలకమైందంటూ ఈ సమస్యను పరిష్కరించే దిశగా దృష్టి పెట్టాలని కోరారు. బుధవారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో 9 నుంచి 12వ తరగతి వరకూ విద్య అందుబాటులో ఉందని, ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు తెలిపారు. దీంతో ఇతర రాష్ట్రాల్లో 12వ తరగతి వరకూ ఉన్న పాఠశాలలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సీఎం సూచించారు. విద్యా కమిషన్, ఆ విభాగంలో పనిచేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలు ...

... చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాలల నిర్మాణ ప్రక్రియ ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంటర్మీడియెట్ విద్య మెరుగుకు చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇంటర్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టి పెట్టాలని సూచించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం నిర్మాణ నమూనాను సీఎం పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిలు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తయారీ పరిశ్రమ

నేడు మలబార్ యూనిట్ ప్రారంభం

సీఎం చేతుల మీదుగా ఉదయం 11 గంటలకు..

సాక్షి, హైదరాబాద్: మలబార్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్న జెమ్స్ అండ్ జ్యువెలరీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని జనరల్ పార్కులో ఈ కొత్త యూనిట్‌ను నిర్మించారు. దేశంలో బంగారు, వజ్రాభరణాల రిటైల్ చైన్లలో అతిపెద్దదైన మలబార్ గోల్డ్, డైమండ్స్ సంస్థ 3.7 ఎకరాల విస్తీర్ణంలో రూ.750 కోట్ల పెట్టుబడితో ఈ సమీకృత తయారీ యూనిట్‌ను నిర్మించింది. 2,750 మందికి ఉపాధి కల్పించే ఈ యూనిట్‌కు 2022 అక్టోబర్ 15న నాటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు శంకుస్థాపన చేశారు. ఏటా పది లక్షల టన్నుల బంగారు ఆభరణాలు, 1.5 లక్షల క్యారట్ల డైమండ్ ఆభరణాలు ఇక్కడ తయారవుతాయి. ఈ యూనిట్‌లోని అత్యాధునిక బంగారం రిఫైనరీ యూనిట్ ఏటా 180 టన్నుల శుద్ధి సామర్థ్యాన్ని కలిగి ఉంది. బంగారం, వజ్రాలు, ఇతర జెమ్ స్టోన్స్, ప్లాటినమ్, అన్‌కట్ డైమండ్స్‌కు సంబంధించిన విభిన్న ఆభరణాలు ఈ యూనిట్‌లో తయారవుతాయి. ఇటలీ, యూఎస్ఏ, జర్మనీకి చెందిన ప్రముఖ ఆభరణాల తయారీ యూనిట్ల భాగస్వామ్యంతో ఆధునిక సాంకేతికతను మలబార్ సంస్థ అందుబాటులోకి తెస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డిజైన్ స్టూడియో, పరిశోధన అభివృద్ధి కేంద్రం, ఆటోమేటెడ్ వేర్‌హౌజింగ్ ఫెసిలిటీ, ఉద్యోగులకు నివాస వసతి వంటివి ఈ నూతన యూనిట్‌లో అందుబాటులో ఉంటాయి. మలబార్ గోల్డ్, డైమండ్స్ సంస్థకు ప్రస్తుతం భారత్‌తో పాటు మరో పది దేశాల్లో సుమారు 300 వరకు షోరూమ్‌లు ఉన్నాయి. గురువారం జరిగే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ప్రారంభోత్సవంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు సంస్థ చైర్మన్ ఎంపీ అహ్మద్ పాల్గొంటారు.

..ఒక్క నెల పనిచేయండి

▶ మొదటి పేజీ తరువాయి

దానిని రూ.10 లక్షలకు పెంచాం. సీఎంఆర్ఎఫ్ కింద రూ.1,400 కోట్లు చెల్లించాం. ఇదంతా రోగం వచ్చిన తర్వాత బాగు చేయడానికి ఖర్చు చేస్తున్నాం. కానీ రోగాలను నివారించేందుకు ముందస్తుగా పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉంది. 60 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ సమయంలో హైదరాబాద్‌లో ఐడీపీఎల్ ప్రారంభించారు. డాక్టర్ రెడ్డీస్, ఎస్ఓఎల్, హెటిరో యాజమాన్యాలు ఐడీపీఎల్ మాజీ ఉద్యోగులేనని భావిస్తున్నా. ఏఐజీ ఆసుపత్రికి వైద్య సేవల కోసం 66 దేశాల నుంచి రోగులు వస్తున్నారు. ఇది మనందరికీ గర్వకారణం. గతంలో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ ఉండేది. ఇప్పుడు వైద్యం అంటే లావాదేవీలన్నట్లుగా మారింది. అయితే నగర ప్రజలకు రెండో అతిపెద్ద ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్నా. ఆయన హైదరాబాద్‌కు, తెలంగాణకు గొప్ప పేరు తీసుకొచ్చారు. నాగేశ్వర్‌రెడ్డి సేవలను గుర్తించిన కేంద్రం పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఆయనకు భారతరత్న ఒక్కటే మిగిలి ఉంది. భారతరత్నకు ఆయన అర్హులు. దీని కోసం సీఎంగా నావంతు ప్రయత్నం చేస్తా. ఆయనకు ఖచ్చితంగా భారతరత్న వస్తుందని భావిస్తున్నా..' అని సీఎం చెప్పారు.

డిసెంబర్ నాటికి అందుబాటులోకి 7 వేల పడకలు: 'గోషామహల్‌లో రూ.3 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి పనులు ప్రారంభించాం. హైదరాబాద్ నిమ్స్, వరంగల్‌లో 2 వేల పడకల చొప్పున, టిమ్స్ అల్వాల్, ఎల్‌బీనగర్, సనత్‌నగర్‌లో వెయ్యి పడకల చొప్పున కొత్తగా మొత్తం 7 వేల పడకలు ఈ ఏడాది డిసెంబర్ 9 నాటికి సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రి అనగానే ఉన్న ప్రతికూల అభిప్రాయాన్ని దూరం చేసేలా పనిచేస్తున్నా..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

జపనీస్ నేర్చుకోవాలి: 'రాష్ట్రంలో విద్యకు రూ.21,500 కోట్లు, వైద్యానికి రూ.11,500 కోట్ల వ్యయంతో అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. జీసీసీ, ఐటీ రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ గమ్యస్థానంగా నిలుస్తోంది. మధ్య, తూర్పు దేశాల నుంచి వచ్చే రోగులు ఢిల్లీ, బెంగళూరు, కొల్‌కతాలో దిగి హైదరాబాద్ చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రిని కలిసి హైదరాబాద్‌కు నేరుగా విమానాలు నడిపించాలని కోరాం. జపాన్‌లో వయసు పైబడిన వారు అధికంగా ఉన్నారు. అక్కడ వైద్య సేవలు ఎక్కువగా అవసరం ఉన్నాయి. కాబట్టి మన దగ్గర నర్సింగ్ సిబ్బంది జపాన్ భాష నేర్చుకోవాలి..' అని రేవంత్ సూచించారు.

తెలంగాణ ప్రణాళికలో నాగేశ్వర్‌రెడ్డి భాగస్వాములు కావాలి: 'భారత్ 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా ముందుకెళుతోంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను వచ్చే పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రభుత్వం డాక్యుమెంట్ తయారు చేస్తోంది. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుంది. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, ఒక్కొక్కరికి యూనిక్ నంబరుతో గుర్తింపు కార్డు అందిస్తాం. రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి కూడా భాగస్వాములు కావాలని కోరుతున్నా.

మనమే నంబర్ వన్: తలసరి ఆదాయం, రెవెన్యూ, శాంతిభద్రతల పరిరక్షణ, డ్రగ్స్ నియంత్రణలో మనమే నంబర్–1. డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఇటీవల దుబాయ్‌లో నిర్వహించిన పోటీలో హైదరాబాద్‌కు ప్రథమ బహుమతి వచ్చింది. నగర సీపీ సీవీ ఆనంద్ దాన్ని అందుకున్నారు. ఇలాంటివన్నీ మనం బ్రాండింగ్ చేసుకోవాలి. ఇటీవల ఒకవైపు యుద్ధ వాతావరణం.. మరోవైపు ప్రపంచ సుందరి పోటీలు జరుగుతున్నాయి. శాంతిభద్రతల సమస్యపై చర్చలు జరుగుతున్న సమయంలో.. హైదరాబాద్‌లో ప్రపంచ దేశాలకు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా హైలీ ప్రొటెక్టెడ్ సిటీ అనే విశ్వాసాన్ని కల్పించగలిగాం. అయితే కొన్ని దేశాలు భారత్‌ను వెనుకబడిన దేశంగానే చూస్తున్నాయి. దీన్నుంచి బయటపడాలి..' అని సీఎం అన్నారు.

140 గ్రామాలు దత్తత తీసుకున్న ఏఐజీ: ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు సమీపంలోని 140 గ్రామాలను తాము దత్తత తీసుకున్నామని తెలిపారు. ఆయా గ్రామాల్లో మెడికల్ కేర్ బాధ్యతలు తాము నిర్వర్తిస్తున్నామని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీదారులు ఏఐజీని సందర్శించి, అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఇలాంటి అధునాతన టెక్నాలజీ లేదని వ్యాఖ్యానించినట్లు తెలిపారు.

జిల్లాస్థాయిలోనే 'కోడిగుడ్ల' టెండర్ ఖరారు!

ప్రతి జిల్లాకు ఒక కాంట్రాక్టరు ఎంపిక

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టు ఎంపిక ప్రక్రియను మార్పు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2025–26లో ఏడాది పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కోసం జోనల్ స్థాయిలో ఏడుగురు కాంట్రాక్టర్లను ఎంపిక చేసే ఉద్దేశంలో భాగంగా టెండరు నిబంధనలు ఖరారు చేస్తూ గతంలో ఈ–టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం.. పలుమార్లు గడువు పెంచుతూ మూడు నెలల పాటు దరఖాస్తులు స్వీకరించింది. కానీ టెండరు నిబంధనలపై పౌల్ట్రీ రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ టెండరు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇకపై జిల్లాస్థాయిలోనే ప్రతి జిల్లాకు ఒక కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసేందుకు పాత విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా మార్గదర్శకాల రూపకల్పనకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ చర్యలు మొదలుపెట్టింది. వారంలోగా మార్గదర్శకాలు తయారు చేసి, వాటిని జిల్లా కలెక్టర్లకు పంపాలని, ఆమేరకు టెండర్లు పిలవాలని శిశు సంక్షేమ శాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులోగా టెండరు ప్రక్రియను పూర్తి చేసి, కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 4,57,643 మంది గర్భిణులు, బాలింతలు, 10,34,562 మంది ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు చిన్నారులు, 3 సంవత్సరాల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 6,67,783 మంది ఉన్నారు. వీరందరికీ నిర్దేశించిన సంఖ్యలో కోడిగుడ్లను అందిస్తారు. ఈ మేరకు లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా 2025–26లో 36,96,80,897 కోడిగుడ్లు అవసరమని చెపుతున్నారు.

నీతిమంతమైన రాజకీయాలే మోదీ ఆకాంక్ష

మాక్ పార్లమెంట్ సెషన్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): నైతిక విలువలతో కూడిన, నీతిమంతమైన రాజకీయాలను ప్రవేశ పెట్టాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బుధవారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్‌లో ఎమర్జెన్సీకి 50 సంవత్సరాలు సందర్భంగా ప్రజాస్వామ్య విలువలు–పరిరక్షణపై మాక్ పార్లమెంట్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షమంది యువతను రాజకీయాల్లోకి రావాలని ప్రధాని పిలుపునిచ్చారన్నారు. 1975లో ఇందిరాగాంధీ హయాంలో రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, పౌర హక్కులను అణచివేసి, పత్రికా స్వేచ్ఛను హరించి ఎమర్జెన్సీని విధించారని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను నేటి తరం తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చట్టం ప్రధాని మోదీ తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ, బీజేపీ సీనియర్ నేత ఎం.గౌతమ్ రావు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నాయకురాలు శిల్పారెడ్డి, రాజు నేత, తులసి, సమత, నందకిశోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్‌లో ఖర్గే సభ

కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులతో నేరుగా మాట్లాడనున్న ఏఐసీసీ చీఫ్

విజయవంతం చేయాలని పార్టీ నేతలకు డిప్యూటీ సీఎం పిలుపు



సభా ఏర్పాట్లపై మహేశ్‌గౌడ్, భట్టితో మాట్లాడుతున్న మీనాక్షి నటరాజన్

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈనెల 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో పార్టీ గ్రామస్థాయి అధ్యక్షులతో సభ నిర్వహించాలని పీసీసీ నిర్ణయించింది. ఏఐసీసీ అధ్యక్షుడు నేరుగా గ్రామ పార్టీ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగించడం ఇదే తొలిసారని చెపుతున్నారు. బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు స్టేడియంలో సభకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ గ్రామ స్థాయి పార్టీ అధ్యక్షులతో ఏర్పాటు చేస్తున్న ఈ సభను విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కృషి చేయాలన్నారు. దేశంలోనే గ్రామ శాఖ అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా సమావేశం కావడం ఇదే మొదటిసారని వివరించారు. తెలంగాణ సభ తర్వాత దేశవ్యాప్తంగా ఇదే తరహా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ భావిస్తోందని ఆయన తెలిపారు. ఈ సభను విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 4న మధ్యాహ్నం మూడు గంటలకల్లా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మండల శాఖ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ శాఖల అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షుడు మాట్లాడే కార్యక్రమానికి మొదటి అవకాశం తెలంగాణకు ఇచ్చినందుకు ఆయన అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పథకాల ఫలితాలు ప్రతి పేదవాడికి చేరాలి

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నా రద్దు చేయండి

కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పథకాల ఫలితాలు ప్రతి పేద గుడిసె వరకు చేరాలని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తీసుకొచ్చిన భూభారతి, పేదల కలలను సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సచివాలయంలో నిర్మల్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, వనపర్తి జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి అమలుకు కలెక్టర్లే మార్గదర్శకులని, దీని కోసం నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందని అన్నారు.

సామాన్యుడికోసం పనిచేయాలి..

భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు మంత్రి సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్యుడు సంతోషపడేలా యంత్రాంగం పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా దాని ప్రభావం ఇందిరమ్మ ఇండ్లపై పడకుండా ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నామని, మీరు చేయాల్సింది లబ్ధిదారుల ఎంపిక, ఇండ్ల మంజూరు, నిర్మాణ పనుల పర్యవేక్షణ అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించాలన్నారు. అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేయడానికి వెనుకాడవద్దని, ప్రతి ఇల్లు అర్హులకే అందాలని, ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 40 మెట్రిక్ టన్నుల ఇసుక లబ్ధిదారులకు సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని సూచించారు.



రాంచందర్‌రావును సత్కరిస్తున్న బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి. చిత్రంలో నర్సింహ శర్మ, సునీల్‌గౌడ్, పాలకుర్తి కిరణ్, జితేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు

రాంచందర్‌రావు నియామకం న్యాయవాదులకు గర్వకారణం

ఆయన్ను సత్కరించిన బార్ కౌన్సిల్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది, భారత బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు ఎన్.రాంచందర్‌రావును తెలంగాణ బార్ కౌన్సిల్ సత్కరించింది. ఈ ఎన్నిక న్యాయవాదులకు గర్వకారణమని వక్తలు ప్రసంగించారు. హైకోర్టు ప్రాంగణంలోని కౌన్సిల్ కార్యాలయంలో బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి అధ్యక్షతన బుధవారం కార్యక్రమం నిర్వహించారు. కొత్త పదవిలోనూ రాంచందర్‌రావు రాణించాలని వక్తలు అభిలషించారు. ఆయన జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం న్యాయవాద సమాజానికి దక్కిన గౌరవమన్నారు. కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహ శర్మ, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.సునీల్ గౌడ్, బీసీఐ సభ్యుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. జంట నగరాల నుంచి న్యాయవాదులు పెద్దఎత్తున హాజరై రాంచందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

దమ్ముంటే అసెంబ్లీ పెట్టు

▶ మొదటి పేజీ తరువాయి

ఒప్పందం కుదుర్చుకున్నారు. బాబుకు గురుదక్షిణగా తెలంగాణ నీటి హక్కులకు మరణ శాసనం రాశారు. కేసీఆర్ తెలంగాణకు వాటర్ మ్యాన్ అయితే రేవంత్‌రెడ్డి బ్యాగ్ మ్యాన్. తెలంగాణ ద్రోహుల జాబితాలో రేవంత్‌ది ఎప్పుడూ మొదటి స్థానమే. అదృష్టంతో దక్కిన సీఎం పదవిని అడ్డుపెట్టుకుని తెలంగాణకు అన్యాయం చేయొద్దు..' అని హరీశ్‌రావు హితవు పలికారు.

అది అమరావతిలో తయారైనట్టుంది

'సాగునీటి అంశాలపై రేవంత్ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అమరావతిలో తయారైనట్లుగా ఉంది. కాళేశ్వరం సహా తెలంగాణ ప్రాజెక్టులను ఆపేందుకు గతంలో చంద్రబాబు రాసిన లేఖలు, చేసిన వ్యాఖ్యలను అందులో ప్రస్తావించలేదు. ఆయనకు చంద్రబాబు బంగారంలా కనిపిస్తున్నాడు. ఆయన హృదయం ఇంకా తెలుగుదేశంలోనే ఉంది. తనది టీడీపీ స్కూల్ అని చెప్పిన రేవంత్.. తన గురువు చంద్రబాబుతో అనుబంధం మరిచిపోలేక పోతున్నారు. బనకచర్ల పేరిట గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నా తనకేమీ తెలియదన్నట్లు నటిస్తున్నారు. బనకచర్లపై బీఆర్‌ఎస్ నిలదీయడం మొదలు పెట్టిన తర్వాతే మంత్రి ఉత్తమ్ పాత తేదీలతో కేంద్రానికి లేఖలు రాశారు. 2016 అపెక్స్ కమిటీ భేటీలో బనకచర్ల ప్రస్తావన లేకున్నా మాపై చిల్లర విమర్శలు చేస్తున్నారు. బెజవాడకు వెళ్లి బజ్జీలు తిని బనకచర్లకు ఓకే చెప్పారు. అధికారం కోసం అబద్ధాలు చెప్తున్నారు..'అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

299 టీఎంసీలు కాంగ్రెస్ నిర్వాకమే..

'రేవంత్‌రెడ్డి అబద్ధాల వైరస్‌లా తయారయ్యారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా 299 టీఎంసీలకు పరిమితమైంది. 299 : 512 నిష్పత్తిలో కృష్ణా జలాల్లో హక్కులపై సంబంధించి మేము సంతకాలు చేశామని నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా. ఇకపై కృష్ణా నదిలో 299 టీఎంసీల వాటాకు బీఆర్‌ఎస్ ఒప్పుకుందని ఎవరైనా ఆరోపణలు చేస్తే నాలుక చీరేస్తాం. మహబూబ్‌నగర్ జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదని నిరూపిస్తే హెలికాప్టర్ నుంచి దూకేందుకు సీఎం సిద్ధంగా ఉండాలి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్ ఫెవికాల్ బంధంతో తెలంగాణ నీటి ప్రయోజనాలను దెబ్బతీశారు..'అని హరీశ్ ధ్వజమెత్తారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

14న రేషన్ కార్డుల పంపిణీ

▶ మొదటి పేజీ తరువాయి

ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ సర్వే చేసి పనులు పునఃప్రారంభిస్తామన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: మంత్రి లక్ష్మణ్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నిరకాలుగా అండగా ఉంటుందని మంత్రి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఎరువులు, విత్తనాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, అలాకాకుండా తమ ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. వానాకాలంలో విద్యుత్తు సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

రూ.1,200 కోట్లతో రోడ్లు: మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా రూ.1,200 కోట్లతో అన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్ల నిర్మాణం చేపడతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. అధికారులు పథకాల అమలులో అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దన్నారు.



తప్పనిసరిగా మౌనంగా ఉండగలిగే సామర్థ్యం ఉన్న మనిషే తప్పనిసరైనది మాట్లాడగలిగే సామర్థ్యం కలిగివుంటాడు.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 3 జూలై 2025

సంక్షేమానికి 'అగ్రజుల' వాతలు!

సంక్షేమానికి భారీగా కోత పెడుతూ అమెరికా, బ్రిటన్ ఏకకాలంలో తీసుకొచ్చిన బిల్లులు మంగళవారం ఆమోదం పొందాయి. అమెరికాలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బిల్లు సంక్షేమానికి కోత పెట్టడంతో పాటు సంపన్నులు చెల్లించే పన్నుల్ని కూడా తగ్గించింది. అసలే రిపబ్లికన్లకు అరకొర మెజారిటీ ఉన్న సెనేట్‌లో ఆ పార్టీకి చెందిన ముగ్గురు సభ్యులు బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. దాంతో అనుకూలురూ, వ్యతిరేకులూ సమంగా ఉన్న సభలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వేసిన ఒక్క ఓటుతో ఆ బిల్లు గట్టెక్కింది. రిపబ్లికన్‌లకు ఆధిక్యత ఉన్న ప్రతినిధుల సభలో అది సునాయాసంగా ఆమోదం పొందుతుంది. బ్రిటన్‌లో లేబర్ పార్టీ ప్రభుత్వానికి అంత 'అదృష్టం' లేదు. బిల్లుపై లేబర్ పార్టీలో తిరుగుబాటు చెలరేగటంతో ఆఖరి నిమిషంలో ప్రధాని కియర్ స్టార్మర్ దాని తీవ్రతను తగ్గించారు. ఈ కోతల ద్వారా ఖజానాకు ఏటా 600 కోట్ల పౌండ్లు మిగిల్చాలన్నది లేబర్ ప్రభుత్వం ధ్యేయమైనా, బిల్లు గట్టెక్కటానికి వీలుగా దిగిరాక తప్పలేదు. అగ్రరాజ్యాలు రెండింటిలో ఒకే రోజు సంక్షేమానికి కోత పెట్టే బిల్లులు రావటం ప్రభుత్వాల వైఖరిలో వచ్చిన మార్పునకు అద్దం పట్టాయి. తప్పుడు ప్రాథమ్యాలూ, అనవసర వ్యయాలతో ఖజానాలను ప్రభుత్వాలు దివాలా తీయిస్తూ, పర్యవసానంగా వచ్చిపడుతున్న సంక్షోభాల నుంచి గట్టెక్కటానికి పౌరుల పట్ల తమ బాధ్యతల్ని వదిలించుకో జూస్తున్నాయి. అమెరికా నుంచి ఆంధ్రప్రదేశ్ వరకూ చాలా చోట్ల ఈ ధోరణే కొనసాగుతోంది. కాకపోతే ట్రంప్ దేన్నయినా బాహాటంగా చేస్తారు.

ట్రంప్ చర్య అమెరికాను రెండు రకాలుగా దెబ్బ తీయబోతోంది. దశాబ్దాలుగా పన్నుల ద్వారా వచ్చే ఆదాయానికి ఈ బిల్లు గండికొడుతుంది. దీన్ని పూడ్చుకోవటానికి ఆయన సంక్షేమంపై పడ్డారు. ఆరోగ్య బీమాకూ, ఆహార కూపన్లకూ కోత పెట్టడం వల్ల 2034 నాటికి అట్టడుగునున్న కోటి 20 లక్షలమంది జనాభాకు ఉన్న కాస్త ఆసరా ఎగిరిపోతుంది. ఆ మేరకు పన్నులు కూడా తగ్గిస్తున్నామన్న రిపబ్లికన్‌ల వాదన అర్థరహితం. ఎందుకంటే పారిశ్రామికవేత్తల మాట అటుంచి వార్షిక ఆదాయం 2,17,000 డాలర్లున్న ఉద్యోగికి 12,500 మేర పన్ను మినహాయింపు లభిస్తుంది. కానీ వార్షిక ఆదాయం 35,000 డాలర్లున్న బడుగు ఉద్యోగికి లబ్ధి కేవలం 150 డాలర్లు. ఖజానా ఆదాయం పడిపోయాక తిరిగి అప్పులు చేయక తప్పదు గనుక 2034 కల్లా అమెరికా రుణం మరో 3.8 లక్షల కోట్ల డాలర్ల మేర పెరుగుతుంది. ప్రభుత్వంలో అనవసర వ్యయాన్ని తగ్గిస్తామనే పేరిట 'డోజ్' ద్వారా భారీయెత్తున ఉద్యోగుల్ని ఇంటికి పంపిన ట్రంప్ ప్రభుత్వం తీరా సంపన్నులపై పన్నులు తగ్గించి దేశ రుణభారాన్ని మరింత పెంచుతోంది. ఇదంతా 2017లో తాను అమలు చేసిన పన్ను కోతల కొనసాగింపేనని ట్రంప్ అంటున్నా అందులో నిజం లేదు. దాన్ని కొనసాగించకపోతే పౌరులు అదనంగా 68 శాతం పన్నులు చెల్లించాల్సి వస్తుందని ఆయన ఊదరగొట్టారు.

ఇదంతా అంతర్గత సమస్య. కానీ దీని పర్యవసానాలు అంతర్జాతీయ వాణిజ్యంపై కూడా ఉంటాయి. బహుళజాతి సంస్థలపై పన్ను విధింపు గురించి జీ–7, ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఓసీడీఈ)లు 2021లో అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒకచోట పన్ను రాయితీ పొందిన సంస్థపై వేరే దేశంలో పన్ను విధించటానికి ఈ ఒప్పందం అనుమతిస్తోంది. దాని ప్రకారం ట్రంప్ కోతలతో లాభపడే సంస్థలపై పన్నులు వేసే అధికారం వేరే దేశాలకుంటుంది. కానీ ఈ పరిస్థితిని ట్రంప్ సహిస్తారా? కెనడా వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. ఆ దేశం 2021 నాటి ఒప్పందానికి అనుగుణంగానే అమెరికన్ సంస్థలపై డిజిటల్ సర్వీస్ టాక్స్ (డీఎస్‌టీ) విధించింది. కానీ దీన్ని ఉపసంహరించుకోనట్టయితే భారీగా సుంకాలు విధిస్తానని ట్రంప్ హెచ్చరించటంతో కెనడా డీఎస్‌టీ వసూలు నిలిపివేసింది. బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ సైతం అమెరికా నుంచి ఇలాంటి ఒత్తిళ్లను ఎదుర్కొనక తప్పదు. అవి కెనడా మాదిరిగా రాజీకొస్తాయా లేదా అన్నది చూడాలి.

మొత్తానికి ట్రంప్ చర్యల వల్ల అంతర్జాతీయ వాణిజ్యంలో ఒక అనిశ్చితి ఏర్పడబోతోంది. గత ఒప్పందంతో ద్వంద్వ పన్నుల మోత నుంచి తప్పించుకున్న బహుళజాతి సంస్థలు ఇకపై చాలా దేశాల్లో పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించాల్సి వస్తుంది. ఇది అంతిమంగా అమెరికాతో చాలా దేశాలకు వైషమ్యం తెస్తుంది. ఆ సంగతలా ఉంచి సెనేట్ ఆమోదించిన కోతల బిల్లుపై ప్రతినిధుల సభలో రిపబ్లికన్ సభ్యులు ప్రభుత్వ వ్యయంపై మరింత కోత విధించాలని పట్టుబడుతున్నారు. అదే జరిగితే సాంఘిక భద్రతకు సంబంధించిన పథకాల్లో అత్యధిక భాగం రానున్న కాలంలో అదృశ్యమవుతాయి.

బ్రిటన్‌ది వేరే కథ. మానసిక వైకల్యం కారణంగా ఉద్యోగం చేయలేమంటున్న వారికిచ్చే పింఛన్ నిబంధనల్ని కఠినం చేయటం ద్వారా 480 కోట్ల పౌండ్లు ఆదా చేయొచ్చని స్టార్మర్ ఆశించారు. కానీ స్వపక్షం నుంచి వచ్చిన ఒత్తిళ్లతో ఆ నిబంధనల్ని కొత్త దరఖాస్తుదార్లకు పరిమితం చేశారు. దాంతో ప్రభుత్వం 200 కోట్ల పౌండ్లకు మించి ఆదా చేయలేకపోవచ్చని నిపుణుల అంచనా. రిటైరైన వారికిచ్చే రాయితీలూ వగైరాలపై కూడా కోతలు గణనీయంగా ఉన్నాయి. వీటి పర్యవసానంగా 2030 నాటికి లక్షన్నర మంది పౌరులు పేదరికంలోకి జారుకుంటారని అంటున్నారు. ఏడాది క్రితం అధికారంలోకొచ్చిన స్టార్మర్ కన్సర్వేటివ్ పార్టీ అడుగు జాడల్లో పయనిద్దామని ప్రయత్నించి భంగపడ్డారు. కానీ అమెరికాలో ట్రంప్ మాటే నెగ్గింది. మొత్తానికి రానున్న కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంక్షేమానికి గడ్డు రోజులే.

ఈసీ విశ్వసనీయతకు గొడ్డలిపెట్టు

అభిప్రాయం



ఆశుతోష్

భారతీయ ప్రజాస్వామ్యానికి దేశంలోని మరే ఇతర సంస్థ కన్నా కూడా ఎన్నికల కమిషనే (ఈసీ) ఎక్కువ నష్టం కలిగించింది. తెలిసో తెలియకనో వాటిల్లిన ఆ నష్టం వల్ల మొత్తం ఎన్నికల ప్రక్రియపై నీలి నీడలు కమ్ముకున్నాయి. పాలక పార్టీకి ప్రయోజనం చేకూర్చేందుకు ఎన్నికలను మసిపూసి మారేడుకాయ చేస్తున్నారని ఇపుడు ప్రజల మనసులలో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయి.

దీనిలో ఉద్దేశపూర్వకంగా జరిగింది ఎంతో నాకు తెలియదు. దానికి సంబంధించి నా వద్ద ఎలాంటి సమాచారం కూడా లేదు. కానీ, ఒక సంస్థగా దాని వ్యవహార శైలిపై మరింత స్పష్టీకరణ, మరింత నిజాయతీతో కూడిన జవాబులు అవసరం. 'సీఎస్‌డీఎస్' సర్వేలలో ఈసీ విశ్వసనీయత స్థిరంగా తగ్గుతూ రావడంలో ఆశ్చర్యపోవాల్సింది ఏముంది! తన ప్రతిష్ఠను పునరుద్ధరించుకునేందుకు ఈసీ చేసుకున్నది కూడా ఏమీ లేదు.

ఇప్పుడెందుకు సమీక్ష?

బిహార్ శాసన సభ ఎన్నికల సందర్భంగా, ఆ రాష్ట్రంలోని ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా నిశితంగా సమీక్షించాలని ఈసీ తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది.

బిహార్ ఎన్నికలను మరో రెండు నెలల లోపలే ప్రకటించనున్నారని అందరికీ తెలిసిన విషయమే. అటువంటి సమయంలో ఎన్నికల జాబితాను విస్తృతంగా సమీక్షించవలసిన అవసరం ఏమొచ్చింది? కడపటి సమీక్షను 2003లో నిర్వహించారు. అది పూర్తయ్యేందుకు దాదాపు రెండేళ్ళు పట్టింది. ఇపుడు ఈసీ ఆ పనిని రెండు నెలల్లో పూర్తి చేయాలని కోరుతోంది. ఇది వర్షాకాలం. బిహార్‌లో చాలా భాగం వరద తాకిడికి గురవడం కూడా సర్వ సాధారణం. దీంతో ఓటర్ల జాబితా సమీక్ష మరింత క్లిష్టంగా మారుతుంది. అసలు అలా ఆదేశించడమే తీవ్ర అనుమానాలను రేకెత్తిస్తోంది. దేశంలో అత్యంత వెనుకబడిన రాష్ట్రమైన బిహార్‌లో వనరులు అరకొరగా ఉన్నాయి. మౌలిక సదుపాయాలు దేశం మొత్తంమీద నాసిరకమైనవి.

ఈ నేపథ్యంలో, ఓటర్ల జాబితాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సవరించడం ఇంచుమించుగా అసాధ్యం. రాష్ట్రీయ జనతా దళ్, కాంగ్రెస్‌లతోపాటు ఇతర పార్టీలు కూడా ఈసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, పాలక పార్టీకి సాయపడేందుకే అది ఈ ప్రక్రియను చేపట్టిందని నిందించడంలో వింతేముంది?

ఈ పార్టీలు కొన్ని సమంజసమైన ప్రశ్నలనే లేవనెత్తుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఓటర్ల జాబితా సంగ్రహ సవరణ జరిగినపుడు, మళ్ళీ ఈ తతంగం దేనికి? తప్పుడు ఓటర్ల జాబితాను ఆధారం చేసుకుని కడపటి పార్లమెంట్ ఎన్నికలు జరిగాయని ఈసీ భావిస్తోందా? కొద్ది నెలల క్రితం నిర్వహించిన సంగ్రహ సవరణ లోపాలతో కూడుకుని ఉందనీ, వాటిని ఇపుడు సరిదిద్దవలసి ఉందనీ భావిస్తోందా? అని అవి ప్రశ్నలను సంధిస్తున్నాయి.

అదే నిజమైతే, దేనిని ఆధారం చేసుకుని ఆ రకమైన నిర్ధారణకు వచ్చిందో ఈసీ మొత్తం దేశానికి చెప్పవలసిన అవసరం లేదా? ఏదైనా దర్యాప్తు జరిపారా? నివేదిక దేనినైనా రూపొందించారా? ఈ అంశాలపై ఎవరూ నోరు విప్పడం లేదు.



- బిహార్ ఎన్నికలను మరో రెండు నెలల లోపలే ప్రకటించనున్నారని అందరికీ తెలిసిన విషయమే. అటువంటి సమయంలో ఎన్నికల జాబితాను విస్తృతంగా సమీక్షించవలసిన అవసరం ఏమొచ్చింది?
- ప్రజానీకంలో ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను కోల్పోతే ప్రజాస్వామ్యం పట్లనుండే నమ్మకమే వమ్ము అయినట్లు లెక్క.
- భారతదేశపు ప్రజాస్వామిక భవిష్యత్తు సంస్థాపరమైన సంస్కరణలపైనే ఆధారపడి ఉంది.

ఆధార్ పనికిరాదా?

ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా నిశితంగా సవరిస్తామంటే ఏ పార్టీ అయినా వ్యతిరేకిస్తుందని నేను అనుకోను. క్రితంసారి 2003లో సవరించినపుడు, ఆ ప్రక్రియ సాధికారమైనదిగా ఉండేందుకు తగినంత సమయాన్ని ఇచ్చారు. ఈసారి కనిపిస్తున్నట్లుగా ఆదరాబాదరాగా ఎన్నడూ జాబితాలను సవరించిన దాఖలాలు లేవు.

ఓటర్ల జాబితా (2003)కు ఎక్కని ప్రతి పౌరుడు/పౌరురాలు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని చెప్పడమే ప్రతిపక్ష నాయకుల మనసులలో తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోంది. అలాగే, 1987 తర్వాత పుట్టినవారు వారి తల్లితండ్రుల బర్త్ సర్టిఫికెట్‌ను సమకూర్చాలని చెబుతున్నారు. అది, అందులోనూ బిహార్ వంటి రాష్ట్రంలో చాలా బృహత్తరమైన కార్యం. బిహార్‌లో అక్షరాస్యత అత్యల్పం. ప్రభుత్వ యంత్రాంగం అంతంత మాత్రంగా ఉన్న చోట, చాలా తక్కువ వ్యవధిలో అటువంటి సర్టిఫికెట్లను పొందడం కుదిరే పని కాదు. పరమ దారిద్ర్యంలోనున్న సమాజంలోని బడుగు వర్గాలు ప్రభుత్వ కార్యాలయం గడప తొక్కేందుకే జంకుతాయి. అలాంటిది తమ పౌరసత్వాన్ని నిరూపించుకునేందుకు అవసరమైన పత్రాలను వారు సమకూర్చుకోగలరని ఊహించడం కూడా అసంబద్ధమే అవుతుంది.

ఈ ప్రక్రియ మరింత సందేహాస్పదంగా మారడానికి మరో కారణం కూడా ఉంది. ప్రస్తుతం భారతదేశంలో ఆధార్ కార్డు ప్రతి ఒక్కరికి అత్యంత ముఖ్యమైన గుర్తింపు కార్డుగా పరిణమించింది. ఈ ప్రక్రియకు ఆ కార్డు చెల్లదని చెబుతున్నారు. 'ఎందుకని' అనే దానికి వివరణ లేదు. నకిలీ ఆధార్ కార్డులను సృష్టించడం తేలిక కనుక, అది అధికారికమైన గుర్తింపు పత్రంగా గణనకు రాదని ఊహాగానాలు సాగుతున్నాయి. ఆ లెక్కన, ఇతర డాక్యుమెంట్లు మాత్రం నకిలీవి కావనే గ్యారంటీ ఏమైనా ఉందా? దీనిపై ఈసీ నోరు విప్పుతుందా?

తటస్థ అంపైర్ అనుకోవచ్చా?

ఈసీ అసాధారణమైన రీతిలో న్యాయబద్ధత తాలూకు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సమాన పోటీ అవకాశాలను కల్పించి, తటస్థ అంపైర్‌గా ఉండవలసిన ఈసీ భారతీయ జనతా పార్టీ ఆడించే బొమ్మగా మారిందనీ, దాని స్వతంత్రత తీవ్ర రాజీకి లోనవుతోందనీ రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.

మోదీ ప్రభుత్వం ఈ అంశాన్ని మరింత జటిలం చేసింది. ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే ప్యానల్‌లో ప్రధాని, ప్రతిపక్ష నాయకునితోపాటు భారత ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాలని సుప్రీంకోర్టు తీర్పు చెబితే, సీజేఐ స్థానాన్ని ప్రభుత్వం ఒక క్యాబినెట్ మంత్రితో భర్తీ చేసింది. స్వతంత్రంగా వ్యవహరించే ఈసీ రావడం ప్రభుత్వానికి ఇష్టం లేదేమోననే అభిప్రాయాన్ని అది కల్పించింది.

మహారాష్ట్ర, ఢిల్లీ, హరియాణా ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య విపరీతంగా పెరగడం పైన, ఎన్నికల జాబితాలను ఇష్టానుసారం తారుమారు చేసేశారని ప్రశ్నలు రేకెత్తినపుడు, ఈసీ నుంచి విశ్వసనీయమైన వివరణ రాలేదు.

కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసినట్లుగా పోలింగ్ కేంద్రాల సీసీటీవీ ఫుటేజీని ఇచ్చేందుకు కూడా ఈసీ తిరస్కరించింది. అందుకు అది సాంకేతిక కారణాన్ని సాకుగా చూపింది. వాస్తవానికి, ప్రభుత్వం నిబంధనను మార్పు చేసింది. వీడియో ఫుటేజీని 45 రోజులకు మించి అట్టేపెట్టకూడదని ఈసీ కూడా నిర్ణయించింది. అంతకు ముందు ఆ కాల పరిధి ఏడాదిగా ఉండేది.

దేశంలో 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు అత్యంత మతపరమైన ఎన్నికలు. ముస్లింలను నేరుగా లక్ష్యంగా చేసుకున్నా, ఎటువంటి చర్యా తీసుకోలేదు. ఈసీ కనుక నిఘా నేత్రంగా వ్యవహరించి ఉంటే, అనేక మంది నాయకులు వారి ఓటింగ్ హక్కును కోల్పోయి ఉండేవారు. మతపరమైన ప్రచారం చేసినందుకు ఓసారి బాలాసాహెబ్ ఠాక్రే అలాగే ఓటు హక్కును కోల్పోయారు.

ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. సంస్థలు మాత్రం శాశ్వతంగా ఉంటాయని ఈసీ గ్రహించాలి. ఆ సంస్థ విశ్వసనీయతను కోల్పోతే, దేశానికి భవిష్యత్తు అనేదే ఉండదు. మాయోపాయాలతో ఎన్నికలు నిర్వహిస్తున్నారని, ఈసీ రాజీపడుతోందని అనుమానం ప్రబలితే, మొత్తం ప్రజాస్వామిక ప్రక్రియే సందేహాస్పదంగా మారుతుంది. చట్టబద్ధమైన ఓటర్లదే విజయమనే ప్రజా నమ్మకం వమ్ము అవుతుంది. ప్రజాస్వామ్యానికి అది మరణ శాసనం అవుతుంది.

వ్యాసకర్త సత్యహిందీ డాట్‌కామ్ సహ–స్థాపకుడు, 'హిందూ రాష్ట్ర' పుస్తక రచయిత ('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

అధ్యక్షుడిగా లేకున్నా...



చైనా అధ్యక్షుడిగా షీ జిన్‌పింగ్ ఉండరని వస్తున్న పుకార్లు ఒకవేళ నిజమైనా పెద్ద తేడా ఉండదు. ఎందుకంటే, ఆయన అప్పుడు కూడా పీఎల్‌ఏ(చైనా సైన్యం), చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ రెండింటికీ అధినేతగా కొనసాగుతారు. నిరంకుశ నియంత్రణకు ఈ రెండే మూలస్తంభాలు.

– వెలీనా త్చకరోవా, వ్యూహాత్మక అంశాల నిపుణురాలు

క్వాడ్ కొనసాగేనా?



'క్వాడ్' కూటమి ముమ్ముందు వర్ధిల్లుతుందా? భాగస్వామి దేశాల (అమెరికా, ఆస్ట్రేలియా, ఇండియా, జపాన్) మధ్య స్పష్టమైన అపనమ్మకం ఉంది. పైగా, అణ్వాయుధాల కాలంలో అదో కత్తి లాంటిది. ఇక ఎప్పుడు ఏది చేస్తాడో తెలియని ట్రంప్ నాయకత్వంలో అమెరికా మరీ ఆధారపడలేనిది అయ్యింది.

– శ్రీమయ్ తాలూక్‌దార్, జర్నలిస్ట్

మరాఠీ గొడవ



ఇండియాలో భాషా వివాదం తీవ్రమవుతోంది. కేవలం మరాఠీ మాట్లాడనందుకు మహారాష్ట్రలో ఒక గుజరాతీ దుకాణదారుడిని ఎంఎన్‌ఎస్ కార్యకర్తలు కొట్టారు. ఐక్యతను కాదని, అసమర్థ ప్రభుత్వాలను ఎన్నుకుంటే ఇదే జరుగుతుంది.

– షోయబ్ మహమ్మద్, హెల్త్‌కేర్ వర్కర్

దౌత్య రాజకీయం



విజయవంతమైన దౌత్యం అంటే, మీ వైఖరి గురించి ఇతర దేశాలను ఒప్పించడం. అంతేగానీ ఇతరులు కపటంతో, ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరిస్తున్నారని చెప్పడం ద్వారా దేశంలో చప్పట్లు కొట్టించుకోవడం కేవలం రాజకీయం– ఆ మాటలు ఇంట చెప్పినా, బయట చెప్పినా! – హుసేన్ హక్కానీ, పాక్ రాయబారి

అనవసర ఖర్చు



జీవిత పాఠం: ఒకదానికి వెయ్యి రూపాయల ధర ఉండి, అది 750 రూపాయలకు అమ్మకానికి ఉన్నప్పుడు, మీరు కొనాలని నిర్ణయించుకుంటే గనక మీరు 250 ఆదా చేయడం లేదు, 750 ఖర్చు చేస్తున్నారు.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

ఇన్ బాక్స్

తెలంగాణ వేగు చుక్క

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని మలుపు తిప్పిన ఘటన దొడ్డి కొమురయ్య మరణం. కొమురయ్య కడవెండి గ్రామ యువకుడు. నిజాం రాజ్యంలో ప్రముఖుడైన విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రామ చంద్రారెడ్డి కింద ఉన్న 60 గ్రామాలలో కడవెండి ఒకటి. ఇక్కడే దేశ్‌ముఖ్ తల్లి జానమ్మ నివసిస్తూ తన అకృత్యాలను కొనసాగిస్తూ ఉండేది. ఆంధ్ర మహాసభ ప్రవేశించకముందే ఈ గ్రామం దేశముఖ్ అకృత్యాలనూ, పెత్తందారీ సంస్కృతినీ విమర్శించడం, ధిక్కరించడం మొదలు పెట్టింది. దున్నేవానికే భూమి, అక్రమ పన్నుల రద్దు వంటి కమ్యూనిస్ట్ నినాదాలతో ప్రేరేపితమయ్యింది. వెట్టి చాకిరీ, రకరకాల పన్నులు, వడ్డీ వ్యాపారుల దోపిడీ వంటి వాటికి వ్యతిరేకంగా గ్రామం సంఘటితమవుతూ ఉంది.



ఈ క్రమంలో కడవెండి గ్రామానికి 1946 జూలై 4న నిజాం రాజ్య రెవెన్యూ అధికారులు లెవీ ధాన్యపు సేకరణకు వచ్చారు. తమ దగ్గర తిన డానికే ధాన్యం లేదనీ, లెవీ ధాన్యం ఎక్కడి నుంచి తేవాలనీ ప్రశ్నించారు గ్రామస్థులు. లెవీ వసూలుకు వ్యతిరేకంగా, దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి ఆగడాలకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు ఆ రోజు ఒక ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో దొడ్డి కొమురయ్య– మల్లయ్య సోదరులు కూడా పాల్గొన్నారు. వారు ముందువరుసలో ఉండి నినాదాలు చేస్తూ ముందుకు కదులుతుండగా మిస్కిన్ అలీ నేతృత్వంలో దొర గుండాలు ఊరేగింపుపై కాల్పులు జరిపారు. తూటాలు తగలడంతో కొమురయ్య మృతిచెందాడు. అనేకమందికి గాయాలయ్యాయి. కొమురయ్య అంత్యక్రియలకు వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. అతడి మరణంతో కమ్యూనిస్టులు తామూ ఆత్మరక్షణ కోసం ఆయుధాలు పట్టాలనే నిర్ణయానికి వచ్చారు. దీంతో సాధారణ రైతాంగ పోరాటం మహత్తర సాయుధ పోరాటంగా మారింది. ఉద్యమం తాకిడికి భూస్వాములు గ్రామాలను వదిలి పట్టణాలకు వెళ్లిపోవడంతో వారి భూములను పేద రైతులు, కూలీలకు పంచారు నాటి ఉద్యమ నాయకులు.

– అస్నాల శ్రీనివాస్ । దొడ్డి కొమురయ్య ఫౌండేషన్
(రేపు దొడ్డి కొమురయ్య వర్ధంతి)

పత్రికా స్వేచ్ఛ కొందరికే ప్రత్యేకమా?

ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ అనే పదాలు గడచిన మూడు రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన పదాలు. బీఆర్ఎస్ నాయకులపై జుగుప్సాకరమైన థంబ్‌నైల్స్ పెట్టి వార్తలు ప్రసారం చేస్తున్నారని ఆ పార్టీకి చెందిన కొంతమంది కార్యకర్తలు మహా టీవీ కార్యాలయంపై దాడి చేశారు. ఈ దాడి ముమ్మాటికీ ఖండనార్హమే. ప్రజాస్వామ్యంలో దాడులకు చోటు లేదు. ఎవరు ఎవరిపై దాడి చేసినా కచ్చితంగా ఖండించాల్సిందే. ఇదే సమయంలో ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛలు కొందరు ప్రత్యేకమైన జర్నలిస్టులకు, సెలక్టివ్ మీడియా గ్రూపులకు మాత్రమే ఉంటాయా? ఇంకెవరికీ ఉండవా? ఇప్పుడు ఈ ప్రశ్నలు సామాన్య ప్రజానీకాన్ని తొలిచేస్తున్నాయి.

మహా టీవీ కార్యాలయంపై దాడి జరిగిన వెంటనే రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఛోటామోటా నాయకులు సైతం తీవ్ర స్థాయిలో స్పందించి దాడిని తీవ్రాతి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా సంస్థలపై దాడులు హేయమైన చర్యగా అభివర్ణించారు. సరిగ్గా ఇక్కడే సామాన్య ప్రజానీకం గందరగోళానికి గురవుతున్నారు. ఈ దాడి జరగడానికి మూడు వారాల ముందు 'సాక్షి' టీవీలో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ఒక జర్నలిస్టు ఆంధ్రప్రదేశ్ రాజధానిపై సదరు జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలను, చర్చా కార్యక్రమం నిర్వహించిన యాంకర్‌కూ, 'సాక్షి' యాజమాన్యానికీ ముడిపెట్టి ఏపీలో కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ విరుచుకుపడ్డాయి. గతంలో మార్గదర్శిపై ఉండవల్లి అరుణ్ కుమార్ కేసులు వేసినప్పుడు ఇది మీడియాపై దాడి అని రామోజీరావు అంటే... ఇవే రాజకీయ పార్టీలు, నాయకులు స్వరం కలపడం తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏకంగా యాంకర్‌గా వ్యవహరించిన సీనియర్ జర్నలిస్టుపై అట్రాసిటీ కేసు కూడా పెట్టి అరెస్ట్ చేసింది. అయితే ఈ సందర్భంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, టీడీపీ మహిళా కార్యకర్తలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని 'సాక్షి' పత్రిక ప్రాంతీయ కార్యాలయాలకు వెళ్లి దాడులకు పూనుకున్నారు. ఆస్తులు ధ్వంసం చేశారు. కానీ ఈ సంఘటన ప్రజాస్వామ్యం మీద, పత్రికా స్వేచ్ఛ మీద దాడిలా ఎవరికీ కనిపించకపోవడం విచిత్రం. ఏకంగా పదికి పైగా 'సాక్షి' కార్యాలయాలపై దాడులు చేసి విధ్వంసం సృష్టిస్తే ఒక్క కేసు లేదు, ఎవరినీ అరెస్ట్ చేయలేదు.

అదే తెలంగాణకు వచ్చే సరికి... బీఆర్ఎస్ నాయకుల పైనా, ముఖ్యంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైనా జుగుప్సాకరంగా పెట్టిన థంబ్‌నైల్స్‌పై ఆగ్రహానికి గురైన కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ కేసులో సదరు టీవీ యాజమాన్యానికి సుద్దులు చెప్పడానికి మాత్రం ఎవ్వరూ ముందుకు రాలేదు. పైగా టీవీ ఛానల్‌కు అండగా నిలబడుతూ బీఆర్ఎస్ కార్యకర్తల చర్యను తీవ్రంగా ఖండించారు. సాక్షిపై దాడి విషయంలో సమర్థింపు మాటలు మాట్లాడిన ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఇప్పుడు మహా టీవీపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడి అంటున్నారు. ఈ ద్వంద్వ ప్రమాణాలు అర్థంకాక సామాన్య ప్రజలు జుట్టు పీక్కుంటున్నారు.



- ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అన్ని 'సాక్షి' ప్రాంతీయ కార్యాలయాలపై టీడీపీ కార్యకర్తలు దాడులకు పూనుకున్నారు. ఆస్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటన ప్రజాస్వామ్యం మీద, పత్రికా స్వేచ్ఛ మీద దాడిలా వారికి కనిపించకపోవడం విచిత్రం.

ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో అడుగు ముందుకేసి రాజకీయ పార్టీలు సొంతగా మీడియా సంస్థలు కలిగి ఉండటం తగదని చెప్పుకొచ్చారు. రాజకీయ పార్టీలు మీడియా సంస్థలు కలిగి ఉండటం ఈ నాటిది కాదు. కాంగ్రెస్ పార్టీ సొంతగా నేషనల్ హెరాల్డ్ పత్రికను ఎన్నో దశాబ్దాలుగా నడుపుతోంది. వామపక్షాలు సైతం ప్రతి రాష్ట్రంలో ఎప్పటి నుంచో సొంత పత్రికలు నడుపుతున్నాయి. ఇక బీజేపీ ఎంపీలు ఒకరిద్దరికి మీడియా సామ్రాజ్యాలే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీడియా సంస్థను ప్రారంభించారు. ఇప్పుడు అది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సొంత మీడియా సంస్థ అయ్యింది. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎంలకు ఎప్పటి నుంచో వార్తా పత్రికలు ఉన్నాయి. విశాలాంధ్ర పేరుతో సీపీఐ, ప్రజాశక్తి పేరుతో సీపీఎం పార్టీలు దశాబ్దాలుగా పత్రికలు నడుపుతున్నాయి. అలాగే 10 టీవీ పేరుతో సీపీఎం, 99 టీవీ పేరుతో సీపీఐలు చెరో శాటిలైట్ న్యూస్ ఛానల్‌ను ప్రారంభించాయి. ఇప్పుడు ఆ ఛానళ్ళ యాజమాన్యాలు మారినప్పటికీ అందులో పనిచేస్తున్న జర్నలిస్టుల్లో చాలా మంది పార్టీల అనుబంధ సభ్యులే. 'ఈనాడు' రామోజీరావు స్వయంగా తాను కాంగ్రెస్‌కు బద్ధ వ్యతిరేకినని న్యాయస్థానాల్లో చెప్పుకున్నారు. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక దగ్గర నుంచి మంత్రి వర్గ కూర్పు, తనకు నచ్చని మంత్రులను క్యాబినేట్ నుంచి తీసివేయించే వరకూ 'ఈనాడు' ఎంత కీలకంగా వ్యవహరించిందో రాష్ట్ర ప్రజలందరికీ చర్విత చరణమే. ఇక 'ఆంధ్రజ్యోతి' రాధాకృష్ణ టీడీపీ కోసం ఏ విధంగా పనిచేస్తారనే విషయం తెలుగు ప్రజలందరికీ తెలిసిన విషయమే. రాధాకృష్ణ సహాయంతో టీడీపీలో టిక్కెట్లు ఖరారు చేయించుకున్న నాయకులెందరో లెక్కలేదు. అదే విధంగా ప్రతిరోజు రాత్రి 7 గంటలు అవ్వగానే సాంబశివరావు అనే జర్నలిస్ట్ టీవీ 5 తెరమీదకు వచ్చి ఏడెనిమిది నిమిషాల పాటు ధర్మోపన్యాసం చేస్తూ జగన్‌ను తిట్టడం, చంద్రబాబును పొగడటం నిత్యకృత్యం అన్న విషయం ప్రేక్షకులందరికీ తెలుసు. సాంబశివరావు అటు వెళ్లిన వెంటనే ఇటు మూర్తి అనే మరో జర్నలిస్టు రాత్రి 9 గంటలకు వచ్చి ఇచ్చే ప్రవచనాలు వర్ణనాతీతం. ఈ ఇద్దరి మధ్యలో రాత్రి 8 గంటలకు 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' అనే ఛానల్లో వెంకట కృష్ణ సూక్తిముక్తావళి ఉంటుంది. దీని సారంశం కూడా జగన్‌ను ఆడిపోసుకోవడం, చంద్రబాబును ఆకాశానికి ఎత్తడం! వీరందరి మధ్యలో మహా టీవీ వంశీ తనదైన శైలిలో న్యూస్ రూమ్‌లో కూర్చుని దర్బార్లు నడిపిస్తాడు. టీడీపీ సహజీవనం చేసే ఈ మీడియా సంస్థలు అన్నీ ఇప్పుడు ముసుగులు వేసుకుని ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ అంటూ పెద్ద పెద్ద కబుర్లు చెబుతుంటే నమ్మే పరిస్థితుల్లో తెలుగు సమాజం లేదన్న విషయం అందరూ గుర్తించాలి.

– రుద్రుడు । తెలుగు పాఠకుడు

గురూపదేశం

ఉపదేశౌషధం దత్తే సమయే గురు వైద్యకః
భవరోగాద్విమోక్షః స్యాత్సర్వ బంధవిమోచకః

సద్గురువనే వైద్యుడు ఉపదేశమనే ఔషధాన్ని ఇస్తాడు. ఆ మందు వలన సంసారమనెడి గొప్ప రోగము నుండి విముక్తి కలుగుతుంది. ఆ విముక్తి సర్వవిధ ప్రతిబంధకములను తొలగిస్తుంది అని ఈ శ్లోకానికి అర్థం. సంసార బంధాల నుంచి విముక్తి కలగాలంటే జ్ఞాన మార్గ మొక్కటే శరణ్యం. ఇది సద్గురువు నాశ్రయిస్తే లభ్యమవుతుంది. అయితే ఎవరికి, ఎప్పుడు, ఏ మేర ఉపదేశం చేయాలో గురువుకు తెలుసు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఓ యోగికి ఒక నగల వ్యాపారి శిష్యుడుగా ఉన్నాడు. ఒకనాడు నగల వ్యాపారి దుకాణానికి ఆ యోగి వెళ్లాడు. సరిగ్గా అదే సమయంలో ఒక దొంగ వచ్చి తాను దొంగిలించిన ఉంగరం ఒకదాన్ని వ్యాపారికి ఇచ్చి ఖరీదు కట్టి ధనం ఇవ్వమని అడిగాడు. అది దొంగసొత్తని వ్యాపారి గ్రహించాడు. 'ఇది దొంగ సొమ్ముకాదని నమ్మకమేమిటయ్యా?' అని వ్యాపారి కాస్త దబాయించి అడిగాడు. దొంగ తెల్లమొగం వేశాడు. ఇదంతా చూస్తున్న ఆ యోగి వెంటనే 'ఈ ఉంగరం అతనిదేనయ్యా! డబ్బిచ్చి పంపు' అని అన్నాడు. యోగి మాట శిరసావహించిన వ్యాపారి దొంగకు డబ్బిచ్చి పంపాడు. ఆ దొంగ, దుకాణం బయట పక్కగా నిలబడ్డాడు. యోగి వ్యాపారి వంక జూచి 'ఏం నాయనా! నన్నపార్థం చేసుకుంటున్నావా! ఆ వచ్చిన వాడు నీవనుకున్నట్లు దొంగయే. నాకు తెలుసు. అయినా అతణ్ణి చూస్తే జాలివేసింది. అందుకని అది దొంగసొత్తని తెలిసి కూడా అతనికి అనుకూలంగా చెప్పాను. పాపం! ఆ దొంగను దైవం రక్షించుగాక' అని చెపుతూ వ్యాపారి మనసును కుదుటపరిచాడు. ఆ మాటలకు వ్యాపారిలో విశాల భావం ఎక్కువయింది.

వీరిద్దరి మాటలు వింటూ బయట నిల్చున్న దొంగ, హఠాత్తుగా యోగి పాదాల మీద పడి, క్షమించి అనుగ్రహించమని వేడుకున్నాడు. యోగి మాటలు అతనికి ఉపదేశ వాక్యాలు అయినాయి. దొంగలో గొప్ప పరివర్తన వచ్చింది. అతడు యోగికి శిష్యుడైనాడు. చూచారా సద్గురువు అనుగ్రహం ఎంత గొప్పదో! జయ గురుదత్త!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం; **తిథి:** శు.అష్టమి ప.2.39 వరకు, తదుపరి నవమి; **నక్షత్రం:** హస్త ప.3.07 వరకు, తదుపరి చిత్త; **వర్జ్యం:** రా.11.55 నుండి 1.41 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.48 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు; **అమృత ఘడియలు:** ఉ.8.36 నుండి 10.22 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు; **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు; **సూర్యోదయం:** 5.33; **సూర్యాస్తమయం:** 6.35.

ఈ నెలంతా వానలే!

జూలై నెల వర్షపాతం అంచనాలను విడుదల చేసిన ఐఎండీ
జూన్ నెలలో 20 శాతం లోటు వర్షపాతం.. ఐదేళ్లలో ఇదే తొలిసారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానలు జోరందుకున్నాయి. గత నెలలో వర్షాభావ పరిస్థితులు చోటు చేసుకోగా, ఈ నెలలో మాత్రం పరిస్థితులు ఆశాజనకంగా ఉండనున్నాయి. నైరుతి రుతుపవనాల కదలికలు చురుకుగా ఉండటంతో ప్రస్తుతం వానలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. జూలై నెలలో వర్షాలు సాధారణం కంటే అధికంగా కురిసే అవకాశమున్నట్టు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఈ మేరకు జూలై నెల వర్షాల అంచనాలను బుధవారం విడుదల చేసింది. ఈ నెలలో 22.74 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే... సాధారణం కంటే కనీసం 6 శాతం అధిక వర్షాలు నమోదవుతాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నెలలో రెండోతేదీ నాటికి సాధారణ వర్షపాతంలో 10 శాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వివరించింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో న్యూట్రల్ ఎల్‌నినో–దక్షిణ ఓసిలేషన్ పరిస్థితులు కొనసాగుతున్నాయి. సీజన్ ముగిసే వరకు ఇలాంటి పరిస్థితులే ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాల్లో వర్షపాతం తక్కువగా నమోదు కావొచ్చని, కానీ తెలంగాణలో మాత్రం సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని వివరించింది.

జూన్ నెలలో వర్షాభావ పరిస్థితులు

రాష్ట్రంలో నైరుతి సీజన్ ప్రారంభ నెలలో వర్షాలు అధికంగా కురుస్తాయి. గత ఐదేళ్లుగా వర్షపాత నమోదును పరిశీలిస్తే సాధారణం కంటే కనీసం 20 శాతం అధిక వర్షాలు నమోదవుతున్నాయి. కానీ ఈ ఏడాది జూన్ నెలలో తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ నెలలో 13.03 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాలి. కానీ నెల ముగిసే వరకు 10.42 సెంటీమీటర్ల వర్షపాతమే నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 20 శాతం తక్కువ వర్షాలు కురిశాయి. గతేడాది గణాంకాలను పరిశీలిస్తే 15.90 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గత ఐదేళ్లలో తొలిసారిగా జూన్ నెలలో లోటు వర్షపాతం నమోదైనట్టు రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

మూడు రోజులు..ఎల్లో అలర్ట్

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. గురువారం వివిధ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, శుక్ర, శనివారాల్లో చాలాచోట్ల మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

ఇచ్చోడలో 6.2 సెంటీమీటర్ల వర్షం

బుధవారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో 6.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. గద్వాల జిల్లా అయిజలో 6.13 సెం.మీ., బజార్‌హత్నూర్‌లో 5.25 సెం.మీ., సరికొండలో 4.1 సెం.మీ., వెంకటాపూర్‌లో 4.05 సెం.మీ. వర్షం కురిసింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 1.96 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 14.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 13.8 సెంటీమీటర్ల వర్షం కురిసినట్టు రాష్ట్ర ప్రణాళిక విభాగం తెలిపింది.

సీఎంతో కోదండరాం భేటీ



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కోదండరాం, జనసమితి నేతలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తెలంగాణ జనసమితి పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో పార్టీ నేతలు భేటీ అయ్యారు. సీఎం నివాసంలో బుధవారం జరిగిన ఈ భేటీ సందర్భంగా.. ప్రజా సమస్యలు, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై నేతలు చర్చించారు. ఉద్యమకారులు, నిరుద్యోగులు, రైతుల సమస్యలను జనసమితి నేతలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జనసమితి సూచనలను స్వీకరించడానికి సిద్ధంగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమావేశంలో తెలంగాణ జనసమితి నేతలు అర్జున్, బద్రుద్దీన్, శ్రీనివాస్, శంకర్ రావు, రమేష్ ముదిరాజ్, ఆశప్ప, సలీం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సిట్‌కు వాంగ్మూలం ఇచ్చిన ఆరా మస్తాన్

బంజారాహిల్స్ (హైదరాబాద్): సిట్ విచారణలో భాగంగా ప్రముఖ ఎన్నికల స్ట్రాటజిస్ట్ ఆరా మస్తాన్ బుధవారం జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో వాంగ్మూలం ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ సందర్భంగా ఆయన సంచలన విషయాలు అధికారులకు తెలిపినట్లు సమాచారం. ఆరా మస్తాన్ 2023, నవంబర్‌లో అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో మాట్లాడిన విషయం తెలిసిందే. రేవంత్‌రెడ్డితో తాను మాట్లాడిన కాల్స్‌ను ప్రభాకర్‌రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించినట్లు అధికారులకు తెలిపారు. గతంలో ఆయన పలువురు రాజకీయ నేతలతో మాట్లాడిన కాల్స్ కూడా ట్యాప్ అయినట్లు అధికారుల ముందు వెల్లడించారు. 2020 నుంచి తన ఫోన్‌పై ప్రభాకర్‌రావు టీమ్ నిఘా పెట్టినట్లు అధికారులకు తెలిపినట్లు సమాచారం. మస్తాన్‌ను 2 గంటలు ప్రశ్నించి వాంగ్మూలం రికార్డు చేసిన సిట్ విచారణలో ఆడియోలు, ట్యాప్ అయిన డేటాను చూపించినట్లు తెలిసింది.

రాష్ట్రానికి సరిపడినంత యూరియా: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి సరిపడినంత యూరియాను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని ఎంపీ డీకే అరుణ తెలిపారు. అవసరమైతే అదనంగా ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రబీ సీజన్‌కు 12 లక్షల టన్నుల యూరియాను పంపిణీ చేసిందని బుధవారం ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. వాస్తవానికి ఈ సీజన్‌లో రైతాంగానికి సరిపోగా.. దాదాపు 1.5 లక్షల టన్నుల యూరియా మిగులుతుందని వెల్లడించారు. డీఏపీ కోటా కింద 1.50 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, కేంద్రం 1.72 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందన్నారు.

బీసీ బిల్లుల ఆమోదానికి సహకరించండి

బీజేపీ కొత్త అధ్యక్షునికి ఎమ్మెల్సీ కవిత లేఖ



సాక్షి, హైదరాబాద్: విద్య, ఉద్యోగ రంగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లుల ఆమోదానికి సహకరించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు విజ్ఞప్తి చేశారు. బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన రామచందర్‌రావుకు ఈ మేరకు కవిత బుధవారం లేఖ రాశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు నిర్వహించామన్నారు. ఈ బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి పంపి చాలా కాలం కావస్తోందని, ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని రామచందర్‌రావుకు విజ్ఞప్తి చేశారు.

కురుస్తున్న వర్షం... రైతన్న హర్షం

▶ మొదటి పేజీ తరువాయి

పంటల సాగును పర్యవేక్షిస్తున్నారు.

నిజామాబాద్‌లో లక్షన్నర ఎకరాల్లో ఇప్పటికే సాగు

నిజామాబాద్‌లో ఇప్పటికే లక్షన్నర ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. కామారెడ్డిలో 27 వేల ఎకరాల్లో వరి సాగు కాగా, జనగాంలో 15వేల ఎకరాల్లో సాగైంది. ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ వారాంతానికి బోర్లు, బావులతోపాటు చెరువులు, కుంటల కింద కూడా నార్లు పోస్తారని వ్యవసాయ శాఖ అధికారి ఒకరు తెలిపారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, మిడ్ మానేర్, దిగువ మానేరుతో పాటు దేవాదుల, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల కింద నీటి లభ్యతను బట్టి వరి సాగు చేస్తారని తెలిపారు.

పత్తి, మొక్కజొన్నకు జీవం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల మెట్టభూముల్లో సాగైన పత్తి, మొక్కజొన్న పంటలకు జీవం పోసినట్టయ్యింది. నెలరోజుల క్రితం నుంచే పత్తి సాగు మొదలు కాగా, జూన్ మొదటి వారం నుంచే వరుణుడు మొహం చాటేయడంతో రైతులు ఆందోళన చెందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా ప్రాంతాల్లో పత్తి మొలకెత్తలేదు. కొన్నిచోట్ల మొలకలు వచ్చినా, నీరు లేక ఎండిపోయాయి. కరీంనగర్, మెదక్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో కూడా వర్షాలు లేక పత్తి రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 43.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, అందులో పత్తి 31 లక్షల ఎకరాల్లో సాగయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే పత్తి అధికంగా సాగయ్యే ఆదిలాబాద్‌లో వాతావరణం కొంత అనుకూలంగా ఉండటంతో రైతులకు ఊరటనిచ్చింది. ఇదే జిల్లాలో సోయాబీన్, కంది కూడా ఎక్కువగానే సాగు చేశారు. ఈ వర్షాలతో ఆదిలాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో పత్తి, మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



కూరగాయల సాగుకు ఊతం

రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల కూరగాయల సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో ఈసారి కూరగాయల సాగు ఎక్కువగా ఉంటుందని ఉద్యానవనశాఖ అంచనా వేస్తుంది.

వానాకాలం సీజన్‌లో పంటల సాగు ఇలా (ఎకరాల్లో)

పంట	విస్తీర్ణం
పత్తి	30,69,342
వరి	2,13,746
మొక్కజొన్న	2,47,934
ప్రధాన తృణధాన్యాలు	2,71,068
కందులు	2,70,342
సోయాబీన్	2,63,524

ఏసీబీ విచారణకు నేడు అర్వింద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ గురువారం మరోసారి ఏసీబీ విచారణకు హాజరుకానున్నారు. ఫార్ములా ఈ–కారు రేసులో మరోసారి ఆయనను విచారించాలని నిర్ణయించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆయనకు బుధవారం నోటీసులు జారీ చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. జనవరి 8వ తేదీన తొలిసారి ఆయనను ఫార్ములా ఈ కారు రేసులో అవకతవకలపై విచారించిన విషయం విదితమే. స్వీడెన్‌లో చదువుతున్న తన కుమార్తె స్నాతకోత్సవానికి గత నెల 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు విదేశీ పర్యటనకు వెళ్లిన అర్వింద్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌కు వచ్చారు. దీంతో ఆయనకు విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేశారు. రెండో దఫా విచారణలో భాగంగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను ఈనెల 16న విచారించిన సంగతి విదితమే. దానికి కొనసాగింపుగానే అర్వింద్ కుమార్‌ను పిలిచినట్లు సమాచారం. అలాగే హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డిని కూడా ఈ వారంలోనే మరోసారి విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

మేడారం మహాజాతర తేదీలు ఖరారు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించనున్నట్లు వివరించారు. మహాజాతర ముగిసిన అనంతరం ఫిబ్రవరి 4 (బుధవారం) తిరుగువారం పండుగ జరుగుతుందని పేర్కొన్నారు. ఒకట్రెండు సార్లు మినహా ప్రతిసారీ ఫిబ్రవరి మాసంలో మేడారం జాతర జరుగుతోంది. ఈసారి మూడు వారాల ముందుగా జరుగుతున్నట్లు పూజారులు తెలిపారు. కాగా, మహాజాతర తేదీల లేఖను దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క, దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర్, మేడారం ఈవో వీరస్వామిలకు అందజేసినట్లు పూజారులు తెలిపారు.

2026 మేడారం జాతర ఇలా....

- **28.01.2026– బుధవారం:** సాయంత్రం 6 గంటలకు సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజులు గద్దెలపైకి వస్తారు.
- **29.01.2026– గురువారం:** సాయంత్రం 6 గంటలకు సమ్మక్క అమ్మవారు వనంనుంచి గద్దెమీదికి చేరుకుంటారు.
- **30.01.2026– శుక్రవారం:** గురువారం రాత్రి.. శుక్రవారం ఉదయం నుంచి భక్తులు గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క–సారలమ్మలతోపాటు గోవిందరాజు, పగిడిద్దరాజులకు మొక్కులు సమర్పించుకుంటారు.
- **31.01.2026–శనివారం:** సాయంత్రం 6 గంటలకు తిరిగి సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

సర్‌ప్రైజ్ చేస్తానంటూ.. చంపేశాడు

- కళ్లకు గంతలు కట్టి.. గొంతులో కత్తితో పొడిచి తండ్రిని హతమార్చిన కుమారుడు
- బెట్టింగ్ డబ్బులపై ప్రశ్నించినందుకే దారుణం
- ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసుల విచారణలో హత్య చేసినట్లు ఒప్పుకున్న కొడుకు



హన్మంత్

గచ్చిబౌలి: తండ్రిని సర్‌ప్రైజ్ చేస్తానని చెప్పిన ఓ కుమారుడు.. కళ్లకు గంతలు కట్టి.. ఆపై కత్తితో పొడిచి హతమార్చిన వైనం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టిన డబ్బుల గురించి తండ్రి అడగడంతో ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ హృదయ విదారక ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా ఘన్‌పూర్ మండలం కోతులకుంటకు చెందిన కెతావత్ హన్మంత్ (37) బతుకుదెరువు కోసం గోపన్‌పల్లి ఎన్‌టీఆర్ నగర్‌కు వలస వచ్చి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య జములమ్మ, కొడుకులు రవీందర్ (19), సంతోష్‌లు ఉన్నారు. హన్మంత్ ఇటీవల తన భూమిని కుదువబెట్టి రూ.6 లక్షల అప్పు తీసుకొని ఇంట్లో పెట్టాడు. ఇంటర్ పూర్తి చేసిన పెద్ద కొడుకు కెతావత్ రవీందర్ యాప్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. ఎవరికీ తెలియకుండా ఇంట్లో నుంచి రెండున్నర లక్షలు తీసుకెళ్లి బెట్టింగ్‌లో పోగొట్టాడు. తండ్రి పదేపదే డబ్బుల గురించి అడగగా.. అవసరానికి స్నేహితునికి ఇచ్చానని త్వరలోనే తిరిగిస్తాడని నమ్మబలికాడు. దీంతో రోజూ ఇంట్లో డబ్బు గురించి గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో రవీందర్ తన స్నేహితుడు డబ్బులు ఇచ్చేందుకు వస్తున్నాడని మంగళవారం తండ్రిని ఎన్‌టీఆర్ నగర్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. నీకు మంచి సర్‌ప్రైజ్ ఇస్తానని నమ్మించి తండ్రి కళ్లకు గంతలు కట్టాడు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉంచిన కత్తితో గొంతులో బలంగా పొడిచాడు. దాదాపు 100 మీటర్ల వరకు పరిగెత్తి కింద పడిపోయి హన్మంత్ అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. అనంతరం రవీందర్ బాబాయ్ రమేశ్‌కు ఫోన్ చేసి నాన్న కత్తితో పొడుచుకొని చనిపోయాడని చెప్పాడు. ఆత్మహత్యగా కుటుంబ సభ్యులను, బంధువులను నమ్మించి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం కోతులకుంటకు తరలించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘనపూర్ పీఎస్‌కు సమాచారం ఇచ్చారు. అంత్యక్రియలు నిర్వహిస్తే అందరిపై కేసు నమోదవుతుందని హెచ్చరించి, మంగళవారం రాత్రి హన్మంత్ మృతదేహాన్ని తిరిగి గచ్చిబౌలి పీఎస్‌కు తీసుకొచ్చారు. మృతదేహంతో పాటు వచ్చిన రవీందర్‌ను విచారించగా తానే హత్య చేశానని ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కన్న తండ్రినే నరికి చంపాడు

- ఆస్తి తగాదాలతో ఘాతుకానికి ఒడిగట్టిన కుమారుడు
- సూర్యాపేట జిల్లాలో ఘటన

మోతె: ఆస్తి తగాదాలతో కన్న తండ్రిని గొడ్డలితో దారుణంగా నరికాడు ఓ కుమారుడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని మామిళ్లగూడెం–విభళాపురం గ్రామాల మధ్య బుధవారం జరిగింది. విభళాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నాగయ్యగూడేనికి చెందిన నిమ్మరబోయిన వెంకన్న (50)కు 4.29 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు గంగయ్య, చిన్న కుమారుడు ఉప్పలయ్యకు చెరో 1.20 ఎకరాల భూమిని పంచి ఇచ్చాడు. మిగిలిన 1.29 ఎకరాల భూమిని కుమార్తె పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. కుమార్తెకు భూమి రిజిస్ట్రేషన్ చేయడంతో వెంకన్నపై గంగయ్య కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో తండ్రిని ఎలాగైనా అంతమొందించాలని అనుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం వెంకన్న ద్విచక్ర వాహనంపై మామిళ్లగూడెం గ్రామం నుంచి నాగయ్యగూడేనికి వెళ్తుండగా.. దారికాచిన గంగయ్య గొడ్డలితో నరికాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న వెంకన్నను రోడ్డు వెంట వెళ్లే వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వెంకన్నను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా, హత్య అనంతరం గంగయ్య మోతె పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. అతడిని మునగాల సీఐ కార్యాలయంలో అప్పగించినట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

విదేశీ దిగుమతి యూరియాలో సగానికి సగం కోత!

- మూడు నెలల్లో రావాల్సిన మొత్తం 5 ఎల్‌ఎంటీ యూరియాలో జూన్ వరకు 1.90 ఎల్‌ఎంటీ లోటు
- దేశీయ యూరియా ఇవ్వాలని కోరుతున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఓవైపు నాట్లు..మరోవైపు పత్తి, మక్కల సాగుతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ జూలై నెలలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుంది. అయితే నిండుకుంటున్న నిల్వలను చూసి వ్యవసాయ శాఖ ఆందోళన వ్యక్తం చేస్తుంది. రాష్ట్రానికి ఈ వానాకాలం సీజన్‌లో కేటాయించిన 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో సగానికిపైగా విదేశాల నుంచి దిగుమతి అయిన యూరియానే కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ కేటాయిస్తుండడం ఇబ్బందిగా మారింది. రాష్ట్రానికి కేటాయించిన యూరియాలో జూన్ వరకు 5 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉండగా, ఇందులో విదేశీ దిగుమతి యూరియా 2.60 ఎల్‌ఎంటీ. ఇందులో 1.36 లక్షల మెట్రిక్ టన్నులు కోత విధించగా, మరో 60 వేల మెట్రిక్ టన్నుల మేర దేశీయ తయారీ యూరియాలో కోత విధించింది. ఈ నేపథ్యంలో జూలై నెలలోనైనా యూరియా కేటాయింపులు సక్రమంగా జరపాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. జూలై నెల కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 1.60 మెట్రిక్ టన్నుల యూరియాలో 60 శాతం మేర 0.97 లక్షల మెట్రిక్ టన్నులు విదేశీ దిగుమతి యూరియానే ప్రభుత్వం కేటాయించింది. దిగుమతి చేసుకునే యూరియాను నౌకాశ్రయాల ద్వారా వెంటనే సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ (రామగుండం ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లిమిటెడ్) కర్మాగారం నుంచి రాష్ట్ర కోటా కింద కేవలం 30,800 మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం పంపిస్తోంది. వ్యవసాయ శాఖ ఈ కోటాను అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు మార్గంలో జిల్లాలకు పంపించుకునేందుకు వినియోగించుకుంటోంది.

కేంద్ర మంత్రి నడ్డాకు తుమ్మల లేఖ

రాష్ట్ర కోటా కింద కేటాయించిన యూరియాలో కోతలను అరికట్టి, జూలై నెలలో పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయాలని కేంద్రమంత్రి జేపీ నడ్డాను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రికి లేఖ రాశారు. రాష్ట్రానికి విదేశీ దిగుమతి యూరియా కాకుండా దేశీయ ఉత్పత్తి ఎరువునే పంపించాలని కోరారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా కేటాయింపును 60,000 మెట్రిక్ టన్నులకు పెంచాలని, ఏప్రిల్–జూన్ మధ్యలో వచ్చిన లోటును పూడ్చడానికి అదనపు సరఫరా ప్రణాళిక మంజూరు చేయాలని తుమ్మల డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం యూరియా కేటాయింపుల్లో తెలంగాణ పట్ల వివక్షతో వ్యవహరిస్తుందని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి ఆరోపించారు.

విదేశీ దిగుమతి యూరియాలో కోత ఇలా (ఎల్‌ఎంటీల్లో)

నెల	మొత్తం కేటాయింపు	విదేశీ యూరియా కేటాయింపు	వచ్చిన విదేశీ యూరియా	మొత్తం లోటు
ఏప్రిల్	1.70	0.41	0.13	0.48
మే	1.60	1.11	0.42	0.72
జూన్	1.70	1.08	0.81	0.74
మొత్తం	5.00	2.60	1.36	1.94

నోట్: జూలై కేటాయింపులను ఇంకా కేంద్ర ప్రభుత్వం విడుదల చేయలేదు.

శత్రు భీకర అపాచీలొస్తున్నాయ్

ఈ నెలలోనే భారత్‌కు రానున్న అపాచీ యుద్ధ హెలికాప్టర్లు • ఐదేళ్ల నిరీక్షణ తర్వాత అమెరికా నుంచి ఎగిరొస్తున్న లోహవిహంగాలు !



ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ తన వైమానిక సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటున్న తరుణంలో భారత వాయుసేనకు అమెరికా నుంచి తీపి కబురు అందింది. ఐదేళ్ల క్రితంనాటి ఒప్పందంలో భాగంగా తొలి దఫా అపాచీ యుద్ధ హెలికాప్టర్లను అందజేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అమెరికా నుంచి తెప్పిస్తున్న ఈ అధునాతన హెలికాప్టర్లు వచ్చాక వీటిని వాయుసేన దళాలకు అందించనున్నారు. పాకిస్తాన్ సరిహద్దు వెంట కీలక మిషన్‌లలో ఇవి పాలుపంచుకోనున్నాయి. దాదాపు రూ.5,140 కోట్ల ఒప్పందంలో భాగంగా భారత్‌కు అమెరికా ఆరు అపాచీ ఏహెచ్‌-64ఇ రకం యుద్ధ హెలికాప్టర్లను అందచేయాల్సి ఉంటుంది. 15 నెలల క్రితమే తొలి బ్యాచ్ హెలికాప్టర్లను డెలివరీ చేయాల్సిఉన్నా ఇంతవరకు అది ఆచరణలో సాధ్యంకాలేదు. ఎట్టకేలకు ఈనెలలోనే మూడింటిని అప్పజెప్పనున్నారు. వీటిని వెంటనే పాక్ సరిహద్దులో మోహరించనున్నట్లు తెలుస్తోంది. రవాణాకు సంబంధించిన 2024 మార్చిలోనే కొన్ని హెలికాప్టర్లను అందుకున్నా యుద్ధ హెలికాప్టర్ల అందజేత మాత్రం ఇన్ని నెలలుగా ఆలస్యమైంది. ఇండియన్ ఆర్మీ ఏవియేషన్ కోర్‌కు తొలుత గత మే-జూన్‌లో ఇస్తామని అమెరికా ప్రకటించింది. తర్వాత ఈ గడువును పొడిగించింది. తర్వాత డిసెంబర్‌కల్లా ఇస్తామని తెలిపింది. ఆ గడువు కూడా ముగిసింది. ఇక 2025 జూన్‌లో ఇస్తామని ఇటీవల ప్రకటించింది. సరఫరా గొలుసులో అవాంతరాల కారణంగా భారత్‌కు అప్పగింత ఆలస్యమైందని అమెరికా వివరణ ఇచ్చింది. రెండో దఫా మూడు హెలికాప్టర్లను మరుసటి ఏడాదిలో అందజేయనున్నట్లు అమెరికా పేర్కొంది. పశ్చిమ సరిహద్దు వెంట భారత సైనికదళాల ప్రత్యేక ఆపరేషన్లలో నూతన తరం అపాచీ హెలికాప్టర్లు కీలక బాధ్యతలు నెరవేర్చనున్నాయి. వేగం, దాడి, లక్ష్య ఛేదనలో తిరుగులేని సామర్థ్యాలు నూతన హెలికాప్టర్ల సొంతం. కొత్త హెలికాప్టర్ల చేరికతో భారత అమ్ములపొది మరింత శక్తివంతంకానుంది. 2015నాటి ఒప్పందం ప్రకారం ఇప్పటికే 22 అపాచీ హెలికాప్టర్లను భారత వాయుసేన అందుకుంది. వీటికి తోడుగా అత్యంత శక్తివంతమైన, ఎటాక్ హెలికాప్టర్లు అత్యావశ్యకం కావడంతో ఇలా నూతన తరం ఏహెచ్‌-64ఇ కోసం భారత్ అమెరికాకు ఆర్డర్ ఇచ్చింది.

మెరుపుదాడిలో దిట్ట

- 2012లో తయారుచేసిన ఏహెచ్‌-64డీ బ్లాక్‌-3ని మరింత ఆధునీకరించి ఏహెచ్‌-64ఈ గార్డియన్‌గా రూపాంతరీకరించారు.
- గంటకు 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదు. గరిష్టంగా ఏకధాటిగా 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు.
- గరిష్టంగా 16 హెల్‌ఫైర్ రకం చిన్న క్షిపణులు, 2.75 అంగుళాల వ్యాసముండే 76 రాకెట్లు, వందల బుల్లెట్ల వర్షం కురిపించే 30 ఎంఎం బుల్లెట్ చైన్ ఇందులో అమర్చారు.
- గరిష్టంగా 10,543 కేజీల బరువులను మోసుకెళ్లగలదు. నిమిషానికి 2,800 అడుగుల ఎత్తుకు ఎగరగలదు.
- గరిష్టంగా 20,000 అడుగుల ఎత్తు వరకు ఎగరగలదు
- నూతన తరం హెలికాప్టర్‌లో జాయింట్ టాక్టిక్ ఇన్ఫర్మేషన్ డి్స్ట్రిబ్యూషన్ సిస్టమ్ ఉంటుంది. అంటే ఒకేసారి నిరాటంకంగా భిన్నరకాల సైనిక వ్యవస్థలతో ఇది అనుసంధానమవుతుంది. అంటే క్షిపణిని ప్రయోగించి మిస్సైల్ లాంచర్, భూస్థిర రాడార్లు, కమాండర్ కంట్రోల్ సెంటర్లు, తోటి హెలికాప్టర్లు, యుద్ధ విమానాలతో ఇది అనుసంధానమై ఉంటుంది.
- కమ్యూనికేషన్, నావిగేషన్, సెన్సార్, దాడికి సంబంధించి అధునాతన టెక్నాలజీతో దీనిని రూపొందించారు.
- తాను సేకరించిన డేటాను, శత్రుజాడను రెప్పపాటు కాలంలో సైనిక స్థావరాలు, వ్యవస్థలకు చేరవేసి అప్రమత్తంచేస్తుంది. తనపై దాడికి తెగబడే శత్రు హెలికాప్టర్లు, భూ స్థిర స్థావరాలపై బుల్లెట్ల వర్షం కురిపించగలదు.
- ఇన్‌ఫ్రారెడ్ లేజర్ సాంకేతికతతో వర్షం వంటి అననుకూల పరిస్థితుల్లోనూ లక్ష్యాన్ని వేగంగా, సులభంగా గుర్తించి దాడి చేయగలదు
- టీ700- జనరల్ ఎలక్ట్రిక్701డీ రకం శక్తివంతమైన ఇంజిన్లు ఇందులో ఉంటాయి. అధునాతన రెక్కల కారణంగా ఇది చాలా వేగంగా నిట్టనిలువుగా గాల్లోకి ఎగరగలదు.
- అన్ని రకాల డ్రోన్ల నుంచి సీ, డీ, ఎల్, కేయూ బ్యాండ్‌ల ద్వారా వీడియో డేటాను తెప్పించుకుని విశ్లేషించి కమాండ్ సెంటర్‌కు చేరవేయగలదు
- వీటిలో ఇంధన ట్యాంక్ కూడా పెద్దది. దీంతో ఎక్కువ సేపు శత్రువుతో పోరాడేందుకు ఇది ఎంతో అనువైంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

గాజాలో కాల్పుల విరమణ!

- ఇజ్రాయెల్ ఒప్పుకుంది: ట్రంప్
- తాము సిద్ధమేనన్న హమాస్
- లేదంటే పరిస్థితి విషమిస్తుంది
- అమెరికా అధ్యక్షుని హెచ్చరికలు



వాషింగ్టన్: గాజాలో 60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ''గాజా విషయమై ఇజ్రాయేలీలతో మా ప్రతినిధులు ఈ రోజు సుదీర్ఘంగా సమావేశమయ్యారు. 60 రోజుల కాల్పుల విరమణకు విధించిన షరతులను ఇజ్రాయెల్ అంగీకరించింది. ఈ రెండు నెలల కాలంలో యుద్ధానికి పూర్తిగా తెర దించే దిశగా ఇరు వర్గాలతో కలిసి పని చేస్తాం'' అని సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. శాంతి స్థాపనకు ఎంతగానో కృషి చేసిన ఖతార్, ఈజిప్ట్ కాల్పుల విరమణకు సంబంధించిన తుది ప్రతిపాదనను వెల్లడిస్తారని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో శాంతి కోసం ప్రతిపాదిత కాల్పుల విరమణ ఒప్పందాన్ని అంగీకరించాలని హమాస్‌ను ట్రంప్ కోరారు. ''ఒప్పందానికి హమాస్ అంగీకరిస్తుందని ఆశిస్తున్నా. ఎందుకంటే యుద్ధం ఇలాగే కొనసాగితే ఎవరికీ మంచిది కాదు. గాజాలో పరిస్థితి మరింత దిగజారుతుంది'' అని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌-హమాస్ వివాదానికి తెర దించాలని అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. గాజాలో కాల్పుల విరమణతో పాటు ఇరాన్ తదితర అంశాలపై సీనియర్ అధికారులతో చర్చించేందుకు ఇజ్రాయెల్ వ్యూహాత్మక వ్యవహారాల మంత్రి రాన్ డెర్మెర్ మంగళవారం వాషింగ్టన్ చేరుకున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్‌లతో భేటీ కానున్నారు.

నిరాయుధీకరణకు హమాస్ నో

కాల్పుల విరమణ తమకూ అంగీకారమేనని హమాస్ పేర్కొంది. తన వద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీలను విడుదల చేసే ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నట్లు గతంలోనే చెప్పామని గుర్తు చేసింది. అయితే నిరాయుధీకరణకు మాత్రం ఒప్పుకునేది లేదని హమాస్ ప్రతినిధి తాహెర్ అల్ నును కుండబద్దలు కొట్టారు. కానీ హమాస్‌ను నిరాయుధీకరించి, నిర్మూలిస్తేనో, గాజా నుంచి పూర్తిగా తరిమేస్తేనో మాత్రమే ఘర్షణ అంతమవుతుందని ఇజ్రాయెల్ వాదిస్తుండటం తెలిసిందే. యుద్ధానంతరం గాజాలో హమాస్‌కు ఉనికే ఉండబోదని నెతన్యాహు బుధవారం తాజాగా ప్రకటించారు. చర్చల నిమిత్తం హమాస్ బృందం ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులతో కైరోలో భేటీ అయింది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయడం, 1,200 మందిని చంపి 251 మందిని బందీలుగా తీసుకోవడం తెలిసిందే. అందుకు ప్రతీకారం ఏడాదిన్నరకు పైగా గాజాపై ఇజ్రాయెల్ తీవ్రస్థాయి దాడులతో విరుచుకుపడుతోంది. వాటిలో ఇప్పటికే 56,000 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు.

ఐదేళ్లు నేనే ముఖ్యమంత్రిని

- కర్ణాటక సీఎం సిద్దరామయ్య వ్యాఖ్య
- సీఎంకు సహకరించడం తప్ప తనకు మరో మార్గం లేదన్న డీకే
- సీఎం మార్పు వదంతలకు తెర



శివకుమార్, సిద్దరామయ్య

సాక్షి, బెంగళూరు: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో తనకు ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, పూర్తిగా ఐదేళ్ల పాటు తానే సీఎంగా ఉంటానని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ అతి త్వరలో బాధ్యతలు చేపట్టబోతున్నారని పుకార్లు షికార్లు చేస్తున్న వేళ డీకే శ్రేణుల ఆశలపై నీళ్లు చల్లుతూ ముఖ్యమంత్రి మాట్లాడారు. చరిత్రాత్మక నందిగిరిధామలో గురువారం రాష్ట్ర మంత్రివర్గ భేటీ జరిగింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం సిద్దరామయ్య అనంతరం మీడియాతో మాట్లాడారు. ''నా ప్రభుత్వం గట్టి బండరాయిలా దృఢంగా ఉంది. మేమంతా కలసికట్టుగా పనిచేస్తున్నాం. మా మధ్య ఎలాంటి మనస్పర్థలు, భిన్నాభిప్రాయాలు లేవు. అధికార మార్పిడి గురించి ప్రతిపక్ష బీజేపీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. పూర్తి ఐదేళ్లకాలం నేనే ముఖ్యమంత్రిగా కొనసాగుతా. ఈ విషయంలో మీకెందుకు అనుమానాలొస్తున్నాయి?'' అని సిద్దరామయ్య మీడియాను ఎదురు ప్రశ్నించారు. ''రాష్ట్రంలో నాయకత్వ మార్పు జరుగుతుందని, ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ, జేడీఎస్ ప్రజలను గందరగోళానికి గురి చేస్తూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయి. అబద్ధాలు చెప్పడమే వారు పనిగా పెట్టుకున్నారు. మా పార్టీ హైకమాండ్ కూడా నాయకత్వ మార్పుపై అస్సలు ఆలోచించలేదు. అలాంటి చర్చే జరగలేదు'' అని సీఎం అన్నారు.

పార్టీలో అసంతృప్తి లేదన్న డీకే

2023 మేలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలు వడ్డాక సీఎం పదవి కోసం శతథా ప్రయత్నించి విఫలమైన డీకే శివకుమార్ తాజాగా సీఎంతో రాజీ కి వచ్చినట్లు బుధవారం డీకే చేసిన వ్యాఖ్యలతో స్పష్టమవుతోంది. బెంగళూరులో మీడియాతో డీకే మాట్లాడారు. '' ఈ విషయంలో నాకు మరో దారి కనిపించలేదు. సీఎంకు వెన్నంటి ఉండి ఆయనకు మద్దతు పలకడం తప్ప నాకు మరో మార్గం లేదు. ఈ విషయంలో నాకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. పార్టీ అధిష్టానం ఏం చెబుతుందో, అధిష్టానం ఏం కోరుకుంటుందో అది మాత్రమే ఆచరణలో సాధ్యమవుతుంది'' అని డీకే అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరికి ఎలాంటి అంసతృప్తి లేదని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ''సీఎంసిద్ద రామయ్యకు వ్యతిరేకంగా ఎవరూ గళాన్ని వినిపించకూడదు. సీఎం పదవికి నా పేరును సిఫార్సు చేయాలని ఎవరికీ చెప్పలేదు. ఈ విషయంపై ఇక చర్చ అనవసరం'' అని డీకే అన్నారు.

మనోళ్ల అక్రమ వలసలు తగ్గాయి

అమెరికాకు 5 నెలల్లో 10,300 మంది

వాషింగ్టన్: ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో 10,300 మందికి పైగా భారతీయులు అక్రమంగా అమెరికాలోకి ప్రవేశిస్తూ పట్టుబడ్డారు. వైట్‌హౌస్ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు పేర్కొంది. అయితే 2024తో పోలిస్తే భారతీయుల అక్రమ వలసలు 70 శాతం తగ్గినట్టు వెల్లడించింది. గతేడాది జనవరి- మే మధ్య 34,535 మంది భారతీ యులు అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించే ప్రయత్నంలో పట్టుబడ్డారు. అంటే సగటున రోజుకు 230 మంది! 2025లో ఇది రోజుకు 69కి తగ్గింది. ట్రంప్ రెండోసారి గద్దెనెక్కాక ఇమిగ్రేషన్ నిబంధనల అమలును కఠినతరం చేయడమే ఇందుకు కారణమని ప్రభుత్వం తెలిపింది. అమెరికాలోకి ప్రవేశించడానికి ప్రయత్నించి పట్టుబడ్డ 10,382 మంది భారతీయుల్లో గుజరాత్‌కు చెందినవారే ఎక్కువగా ఉన్నారు. ట్రంప్ తిరిగి అధికారంలోకి వస్తారని ఊహించే స్మగ్లింగ్ సిండికేట్ 2024 చివరి నుంచి తమ కార్యకలాపాలను తగ్గించిందని నివేదిక పేర్కొంది. ఈ ఏడాది ఇప్పటి దాకా ఏకంగా 6 లక్షలకు పైగా అక్రమ వలసదారులను అమెరికా సరిహద్దుల వద్ద అరెస్టు చేసింది. 2024లో ఇదే కాలంలో 12,33,959 మంది పట్టుబడ్డారు. పట్టుబడ్డ 10,382 మంది భారతీయుల్లో 30 మంది ఒంటరి మైనర్లున్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో 500 మందికి పైగా భారతీయ మైనర్లను అమెరికా అరెస్టు చేసింది. అనేక దేశాల నుంచి ఏటా వేలాది మంది తమ పిల్లలను అమెరికా-మెక్సికో, అమెరికా-కెనడా సరిహద్దులో వదిలి వెళ్తారు. వారికి అమెరికన్ పౌరసత్వం లభిస్తుందనే ఆశతో ఇలా చేస్తుంటారు. ఈ పిల్లలంతా 12-17 ఏళ్లు, అంతకంటే చిన్న వయసు వారని నివేదికలు చెబుతున్నాయి.

పత్రాల్లేని వారు 2.2 లక్షలు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) 2024 ఏప్రిల్ నివేదిక ప్రకారం అమెరికాలో 2.2 లక్షల మంది భారతీయులు ఎలాంటి అనుమతి పత్రాలూ లేకుండా అనధికారికంగా నివసిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివకరూ 332 మంది భారతీయులను అమెరికా బహిష్కరించింది. అయినా ప్రమాదకరమైన డంకీ మార్గాల ద్వారా అమెరికాలోకి ప్రవేశించడానికి భారతీయులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కొన్నిసార్లు ప్రమాదకరమైన సముద్ర మార్గాల్లోనూ వెళ్తున్నారు. గత మే 9న కాలిఫోర్నియా తీరంలోని డెల్మార్ సమీపంలో జరిగిన పడవ ప్రమాదంలో 14 ఏళ్ల భారతీయ బాలుడు, అతని 10 ఏళ్ల అతని సోదరి మరణించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

హసీనాకు ఆర్నెల్ల జైలు



ఢాకా: కోర్టు ధిక్కార కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యు నల్ (ఐసీటీ) ఆర్నెల్ల జైలు శిక్ష విధించింది. అవామీ లీగ్ విద్యార్థి విభాగం బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్ (బీసీఎల్)తో సంబంధాలున్న షకీల్ అకాండ్ బుల్బుల్‌కు రెండు నెలల జైలు శిక్ష పడింది. గత అక్టోబర్‌లో బుల్బుల్‌తో హసీనా మాట్లాడిన ఫోన్ కాల్ ఆధారంగా ఆమెపై ధిక్కార కేసు మోపారు. ''నాపై 227 కేసులు నమోద య్యాయి. నేను 227 మందిని చంపడానికి లైసెన్స్ పొందాను' అని అందులో హసీనా చెప్పారన్నది అభియోగం. ఈ వ్యాఖ్యలు న్యాయ ప్రక్రియను, యుద్ధ నేరాల విచారణల్లో పాల్గొన్న వారిని బెదిరించడమేనని ప్రాసిక్యూషన్ పేర్కొంది. తిరుగు బాటు తో హసీనా పదవి పోగొట్టుకున్నాక ఒక కేసులో ఆమెను దోషిగా నిర్ధారించటం ఇదే తొలిసారి.

ఘనాలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం



ఘనా అధ్యక్షునితో మోదీ

అక్రా: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం పశ్చిమ ఆఫ్రికా దేశం ఘనాకు చేరుకున్నారు. ఘనా అధ్యక్షుడు జాన్ ద్రామానీ మహామా ఆహ్వానం మేరకు ఆయన ఇక్కడ పర్యటిస్తున్నారు. కొటోకా ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టులో మోదీకి ఘన స్వాగతం లభించింది. సైనికులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఘనా ప్రభుత్వాధి నేతలతో మోదీ సమావేశమవుతారు. భారత్‌-ఘనా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చిస్తారు. ప్రధాని మోదీ ఘనాలో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి. అలాగే గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఘనాలో అడుగుపెట్టడం కూడా ఇదే తొలిసారి. ఇండియా నుంచి బయలుదేరే ముందు మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. గ్లోబల్ సౌత్‌లో భారత్‌కు ఘనా అత్యంత విలువైన భాగస్వామి అని పేర్కొన్నారు. ఘనా పర్యటన అనంతరం ఆయన ఈ నెల 3, 4వ తేదీల్లో ట్రినిడాడ్ అండ్ టొబాగోలో, 4, 5వ తేదీల్లో అర్జెంటీనాలో పర్యటిస్తారు. తర్వాత బ్రెజిల్‌లో 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరవుతారు. చివరగా నమీబియాలో పర్యటించి, స్వదేశానికి చేరుకుంటారు.

జిన్‌పింగ్ శకానికి తెర?

రెండు వారాలు పత్తా లేని వైనం

- తిరిగొచ్చినప్పటి నుంచీ అధికారాలకు కత్తెర!
- అధికారిక మీడియాలో అడుగంటిన ప్రాధాన్యం
- బ్రిక్స్ భేటీకీ జిన్‌పింగ్ బదులుగా ప్రధాని లీ
- అధికార మార్పిడి సంకేతాలంటూ విశ్లేషణలు
- గత అధ్యక్షుడు జింటావోకూ ఇలాంటి గతే
- ఆయన ఆధ్వర్యంలోనే జిన్‌పింగ్‌కు ఉద్వాసన!



చైనాలో షీ జిన్‌పింగ్ శకం ముగిసిందా? పలువురు అధ్యక్షులకు పట్టిన గతే ఆయనకు కూడా పట్టనుందా? నెల రోజులుగా డ్రాగన్ దేశంలో జరుగుతూ వస్తున్న పలు అనూహ్య పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. మే 21 నుంచి జూన్ 5 దాకా జిన్‌పింగ్ రెండు వారాల పాటు ఆచూకీ లేకుండాపోయారు. అధికారిక కార్యక్రమాలు వేటిలోనూ పాల్గొనలేదు. కనీసం బహిరంగ వేదికలపై కూడా కన్పించలేదు. ఆయన చైనా పగ్గాలు చేపట్టిన గత 12 ఏళ్లలో ఇలా జరగడం ఇదే తొలిసారి. దానికి తోడు అధ్యక్షుని గురించిన వార్తలను ప్రతి రోజూ ఫ్రంట్ పేజీల్లో విధిగా ప్రముఖంగా ప్రచురించే చైనా అధికార మీడియాలోఆ రెండు వారాల పాటు ఎక్కడా కనీసం ఆయన ప్రస్తావన కూడా రాలేదు! అధ్యక్షుని గైర్హాజరీపై ప్రపంచమంతా జోరుగా చర్చ జరిగినా చైనా ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. అధికారిక మీడియాలోనూ ఖండన వంటివి రాలేదు. చివరికి జూన్ 5 తర్వాత జిన్‌పింగ్ తిరిగి దర్శనమిచ్చినా ఆయనలో ముందున్న కళాకాంతులేవీ కన్పించలేదు. బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకోతో జరిగిన భేటీలో బాగా అనాసక్తంగా దర్శనమిచ్చారు. ''జిన్‌పింగ్ బాగా నీరసించి, అనారోగ్యంగా కన్పించారు'' అని భేటీ తర్వాత బెలారస్ అధ్యక్షుని తరఫున వెలువడ్డ అధికారిక మీడియా ప్రకటన పేర్కొంది. దీనికి తోడు జిన్‌పింగ్‌కు భారీ స్థాయిలో ఉండే వ్యక్తిగత భద్రత కూడా కొద్దిరోజులుగా బాగా తగ్గిపోయింది. ఆయన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన మ్యూజియానికి అధికారిక హోదాను తొలగించారు. అంతేకాదు, ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జిన్‌పింగ్ ఫోన్‌లో సంభాషించారు. దాన్ని గురించిన చైనా అధికార టీవీ సంస్థ ప్రసారం చేసిన వార్తా కథనంలో జిన్‌పింగ్‌ను ఎలాంటి హోదా లేకుండా సంబోధించడం విశేషం! అతి శక్తిమంతమైన డ్రాగన్ దేశాన్ని ఇనుప పిడికిలితో శాసిస్తూ వస్తున్న జిన్‌పింగ్‌కు పాలనకు నూకలు చెల్లాయనేందుకు ఇవన్నీ స్పష్టమైన సంకేతాలేనంటూ జోరుగా విశ్లేషణలు వినిపిస్తున్నాయి. పాలక కమ్యూనిస్టు పార్టీలో నెల కొన్న తీవ్ర అంతర్గత విభేదాలు అంతిమంగా జిన్‌పింగ్‌ను తప్పించే దిశగా సాగుతున్నాయంటూ ప్రవాస చైనా మేధావులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. జిన్‌పింగ్‌కు ముందున్న అధ్యక్షుడు హూ జింటావో కూడా అధికారాంతానికి ముందు అచ్చం ఇలాగే కొంతకాలం పాటు అనూహ్యంగా కనబడకుండా పోవడం విశేషం. ఆ తర్వాత జిన్‌పింగ్ పగ్గాలు చేపట్టారు. అనతికాలంలోనే పార్టీలోని తన విరోధులు, వ్యతిరేకుల ఆట కట్టించి అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఇప్పుడు జిన్‌పింగ్‌కు కూడా అదే గతే పడుతోందంటూ ఆయన వ్యతిరేకులు సంబరపడిపోతున్నారు. నిజానికి జిన్‌పింగ్‌పై తిరుగుబాటుకు పథక రచన చేసింది, నిశ్శబ్దంగా తెర వెనక పావులు కదిపింది 82 ఏళ్ల జింటావోనే అని కూడా చెబుతున్నారు. ఇవేమీ నిజం కాదని, అధ్యక్షుడు తీవ్ర అనారోగ్యం పాలై చికిత్స పొందుతున్నారని మరో వాదన కూడా వినిపిస్తోంది. మొత్తానికి ఈ ఉదంతం ప్రస్తుతం అంతర్జాతీయంగా పెను కలకలం రేపుతోంది. బ్రెజిల్‌లోని రియో డిజనిరోలో శనివారం నుంచి జరగనున్న 17వ బ్రిక్స్ సదస్సుకు కూడా జిన్‌పింగ్ హాజరు కావడం లేదు. దీన్ని చైనా అధికారికంగా ధ్రువీకరించింది. మూడు రోజుల సదస్సుకు ఆయన బదులుగా ప్రధాని లీ కియాంగ్ భేటీలో పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. దీనికి కారణం ఏమిటన్న ప్రశ్నలకు ఆమె సమాధానం దాటవేశారు. బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ డుమ్మా కొడుతుండటం గత 12 ఏళ్లలో ఇదే తొలిసారి! ఈ పరిణామం ఆయన భవితవ్యంపై అనుమానాలను మరింతగా పెంచుతోంది.

వారసుడు వాంగ్!



చైనా చైనా కమ్యూనిస్టు పార్టీ సారథిగా ఇటీవలే నియమితుడైన వాంగ్ యాంగ్ త్వరలో జిన్‌పింగ్ స్థానంలో అధ్యక్షునిగా పగ్గాలు చేపడతారని వార్తలొస్తున్నాయి. టెక్నోక్రాట్ అయిన వాంగ్‌కు మృదు స్వభావిగా, మార్కెట్ శక్తుల అనుకూలునిగా పేరుంది. అందుకే సంస్కరణవాది అయిన నాయకునిగా కమ్యూనిస్టు పార్టీ ఆయనను దేశ నాయకత్వ బాధ్యతలకు సిద్ధం చేస్తోందని అంతర్గత వర్గాలు చెబుతున్నాయి.

జాంగ్ హవా!

అధ్యక్షుడు జిన్‌పింగ్ అధికార కమ్యూనిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శి మాత్రమే గాక సర్వశక్తిమంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ)కి చైర్మన్ కూడా. అయితే ప్రస్తుతం చైనాలో అధికార వ్యవహారాలన్నీ సీఎంసీ వైస్ చైర్మన్ జనరల్ జాంగ్ యూక్సియా కనుసన్నల్లో నడుస్తున్నాయని చెబుతున్నారు. జిన్‌పింగ్ చైనా చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో వరుసగా మూడోసారి అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు సహకరించిన వారిలో జాంగ్ ముఖ్యుడు కావడం విశేషం! శక్తిమంతమైన 24 మందితో కూడిన కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరోలో ఆయన సభ్యుడు. అంతేగాక పార్టీలోని సీనియర్ సభ్యుల్లో అత్యధికులు ప్రస్తుతం జాంగ్‌కు దన్నుగా నిలిచినట్టు వార్తలొస్తున్నాయి. మాజీ అధ్యక్షుడు జింటావో అనుయాయులైన వారంతా జిన్‌పింగ్‌ను తొలినుంచీ లోలోపల వ్యతిరేకిస్తూ వస్తున్న వారేనని సమాచారం. నిజానికి సైనిక, ఆర్థిక తదితర కీలక వ్యవహారాల్లో కొన్నాళ్లుగా జిన్‌పింగ్ మాట సాగడం లేదని చెబుతున్నారు. అంతేగాక ఆయన అనుయాయులైన డజన్ల కొద్దీ సైనిక జనరళ్లు కొద్ది రోజులుగా అనూహ్యంగా మాయమవుతున్నారు. మరికొందరికి ఉన్నట్టుండి ఉద్వాసన పలికారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎల్లుండే మెగా సునామీ?

జపాన్, ఫిలిప్పీన్స్‌లో విలయం!

- 'జపాన్ బాబా వాంగా' జోస్యం
- ప్రపంచమంతటా పెను ఉత్కంఠ



తత్సుకీ

పెను ఉత్పాతానికి మరో రెండు రోజులేనా? శనివారం (జూలై 5న) మెగా సునామీ విరుచుకు పడబోతోందా? జపాన్, ఫిలిప్పీన్స్ మధ్య ప్రాంతాన్ని ముంచెత్తనుందా? 'జపాన్ బాబా వాంగా' పేరుతో ప్రసిద్ధురాలైన ర్యో తత్సుకీ జోస్యం నిజమైతే అక్షరాలా అదే జరగనుంది! 'ద ఫ్యూచర్ ఐ సా (నేను దర్శించిన భవిష్యత్తు)' పేరుతో రాసిన పుస్తకంలో ఆమె ఈ మేరకు ఎప్పుడో హెచ్చరించారు. దాంతో శనివారం నిజంగానే సునామీ వస్తుందా అంటూ ప్రపంచవ్యాప్తంగా చాలామంది ఊపిరి బిగబట్టి మరీ ఎదురు చూస్తున్నారు. ఈ జోస్యానికి సంబంధించిన వార్తలు, చర్చోపచర్చలతో రెండు రోజులుగా ఇంటర్నెట్ అక్షరాలా హోరెత్తిపోతోంది. 'జూలై5డిజాస్టర్' ఇప్పుడు ఆన్‌లైన్‌లో యమా ట్రెండింగ్‌లో ఉంది. ఈ భయాందోళనల నడుమ టోక్యో, సమీప ప్రాంతాల్లో విమాన తదితర ప్రయాణాలను జనం భారీగా రద్దు చేసుకుంటున్నారు.

తత్సుకీ ఏం చెప్పారు?

కరోనా ఉత్పాతాన్ని కూడా తుత్సుకీ ముందే ఊహించి చెప్పడం విశేషం! అప్పటినుంచీ ఆమె పేరు ప్రపంచమంతటా మార్మోగడం మొదలైంది. ఇక జూలై 5న వస్తుందని పేర్కొన్న సునామీ గురించి తన పుస్తకంలో 20 ఏళ్ల ముందే పేర్కొన్నారామె. ''జపాన్, ఫిలిప్పీన్స్ నడుమ సముద్రగర్భం ఒక్కసారిగా బద్దలవుతుంది. ఆకాశహర్మ్యాలను తలదన్నేంత ఎత్తున అలలు ఎగిసిపడతాయి. లక్షలాది మందికి ప్రాణగండం'' అంటూ వర్ణించారు. దాంతో ఇది కూడా నిజమవుతుందా అంటూ ఎక్కడ చూసినా అంతులేని ఉత్కంఠ రాజ్యమేలుతోంది.

ఎవరీ తత్సుకీ?

తత్సుకీ జపాన్‌కు చెందిన మాంగా ఆర్టిస్టు. 'ద ఫ్యూచర్ ఐ సా (నేను దర్శించిన భవిష్యత్తు)' ఆమె స్వయంగా చేత్తో రాసిన పుస్తకం. బ్రిటన్ యువరాణి డయానా మృతి, 2011లో జపాన్‌ను వణికించిన భూకంపం, సునామీ తదితరాలను అందులో ఆమె ముందుగానే పేర్కొన్నారు. అవన్నీ అక్షరాలా నిజమయ్యాయి కూడా. దాంతో గత శతాబ్దికి చెందిన బల్గేరియా మిస్టిక్, హీలర్ బాబా వంగా పేరిట ఆమెను ఇప్పుడంతా 'జపనీస్ బాబా వంగా' అంటూ కీర్తిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రూ.2,000 కోట్లు దోచేసే కుట్ర

- ఏజేఎల్ ఆస్తులు కొట్టేయడానికి సోనియా, రాహుల్ ప్రయత్నించారు
- హెరాల్డ్ కేసులో ఈడీ వాదనలు

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ వ్యవహారంలో రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులు దోచుకొనే కుట్ర జరిగిందని ఢిల్లీ ప్రత్యేక కోర్టుకు ఈడీ తెలియజేసింది. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన ఆస్తులను కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ చట్టవిరుద్ధంగా సొంతం చేసుకొనేందుకు ప్రయ త్నించారని వెల్లడించింది. నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో బుధవారం ప్రత్యేక కోర్టులో విచారణ ప్రారంభమైంది. యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సోనియా, రాహుల్‌కు 76 శాతం వాటాలున్నట్టు ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు పేర్కొన్నారు. ''ఆ సంస్థ ద్వారా ఏజేఎల్‌కు కేవలం రూ.90 కోట్ల రుణమిచ్చి దాన్ని తీర్చడం లేదన్న సాకుతో ఏజేఎల్‌కు చెందిన రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులను కొట్టేయడానికి కుట్ర చేశారు. యంగ్ ఇండియా స్థాపనే దురుద్దేశపూరితం'' అన్నారు. తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది.

కొత్త దలైలామా ఎంపికలో...

చైనా పాత్ర ఉండదు

నా వారసుడిని గాడెన్ ఫాడ్‌రంగ్ ట్రస్టు ఎంపిక చేస్తుంది: దలైలామా

ధర్మశాల: టిబెట్ బౌద్ధ ఆధ్యాత్మిక గురువు దలైలామా పరంపరకు 600 ఏళ్ల చరిత్ర ఉంది. తన వారసుడి ఎంపికపై ఊహాగానాలకు 14వ దలైలామా టెంజిన్ గ్యాట్సో తెరదించారు. 15వ దలైలామా ఎంపిక ఖాయయని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ మేరకు ఆయన కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల, వీడియో విడుదల చేసింది. అందులో దలైలామా టిబెటన్ భాషలో ప్రసంగించారు. 15వ దలైలామా ఎంపిక అధికారం దలైలామా అధికారిక కార్యాలయం గాడెన్ ఫాడ్‌రంగ్ ట్రస్టుకు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ''ఇందులో చైనా జోక్యం చేసుకోవద్దు. నూతన దలైలామా ఎంపిక ప్రక్రియలో చైనా పాత్ర ఏమీ ఉండదు'' అని స్పష్టంచేశారు. తన తదనంతరం కూడా బౌద్ధ ఆధ్యాత్మిక గురు పరంపర కొనసాగుతుందన్నారు. తన వారసుడిని ఎలా గుర్తిస్తారన్నది 2011 నాటి ప్రకటనలో ప్రస్తావించానని గుర్తుచేశారు. ''కొత్త దలైలామా ఎంపిక కోసం వేర్వేరు టిబెట్ బౌద్ధ సంప్రదాయాల అధిపతులు, విశ్వసనీయ ధర్మపరిరక్షకులను సంప్రదించాల్సి ఉంటుంది. వారంతా దలైలామా పరంపరతో విడదీయరాని బంధమున్నవారే. శతాబ్దాల సంప్రదాయం ప్రకారమే నూతన దలైలామాను అన్వేషించి ఎంపిక చేయాలి. ఇందులో గాడెన్ ఫాడ్‌రంగ్ ట్రస్టు సభ్యులు తప్ప మరొకరు జోక్యం చేసుకోవడానికి వీల్లేదు'' అన్నారు.

చైనాకు పరోక్ష హెచ్చరిక

దలైలామా 90వ జన్మదిన వేడుకలకు ఈ నెల 6న జరగబోతున్నాయి. వృద్ధాప్యం కారణంగా ఎంతోకాలాయన దలైలామాగా కొనసాగే అవకాశం లేనందున వారసుడి ఎంపికపై దృష్టి పెట్టారు. టిబెట్‌పై చైనా పెత్తనం చెల్లదని ఈ సందర్భంగా ఆయన పరోక్షంగా హెచ్చరించారు. టిబెట్‌ను 1950ల్లో చైనా ఆక్రమించడం తెలిసిందే. చైనా వేధింపులు తట్టుకోలేక దలైలామా 1959లో టిబెట్ నుంచి భారత్‌కు శరణార్థిగా వచ్చారు. వేలాది మంది అనుచరులతో కలిసి హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆయనపై చైనా వేర్పాటువాది, తిరుగుబాటు దారుడు అనే ముద్రవేసింది.



సాక్షి హైదరాబాద్

గురువారం । 3 । జులై । 2025



మహా 'జలమండలి'గా విస్తరణ

జలమండలి ఇక మహా జలమండలిగా మారనుంది. తాగునీటి, సీవరేజీ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు సిద్ధమవుతోంది.

-10లో



జంతు ప్రేమికులూ.. జర జాగ్రత్త!

వర్షాల వేళ కుక్కలకు రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. నిర్లక్ష్యం చేస్తే కుక్కలతో పాటు మనుషులకూ ఈ వ్యాధి వ్యాపిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

26.0/22.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడే అవకాశముంది. గరిష్ఠంగా 26, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.





పెద్దమ్మ గుడికి శాకంబరి శోభ

జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ దేవాలయంలో బుధవారం పెద్దమ్మ శాకంబరి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పెద్దమ్మ తల్లిని పూలమాలలకు బదులు రకరకాల కూరగాయల హారాలతో అలంకరించారు. ఉదయం ఆలయ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు శాకంబరి ఉత్సవ పూజలు నిర్వహించారు. గర్భగుడితో పాటు ప్రాంగణాన్ని క్వింటాళ్ల కొద్దీ వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

- బంజారాహిల్స్



పోతురాజుల విన్యాసాలు

కన్నులపండువగా ఎల్లమ్మ రథోత్సవం

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాల్లో చివరి ఘట్టమైన రథోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధాదేవ్ వర్మ, కలెక్టర్ దాసరి హరిచందన అమ్మవారి రథానికి దిష్టి తీసి ఊరేగింపును ప్రారంభించారు. బల్కంపేట పురవీధుల్లో ఎల్లమ్మను ఊరేగించారు. భక్తజనం పోటెత్తారు. కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి మహేంద ర్‌గౌడ్, చైర్మన్ సాయిబాబా గౌడ్, హైమావతి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ, పాలక మండలి సభ్యులు గోదాస్ ఉమారాణి, ఉమానాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- అమీర్‌పేట



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ సతీమణి



బల్కంపేట పురవీధుల్లో ఎల్లమ్మ రథోత్సవం

నిరంతరం అప్రమత్తంగా ఉండండి

ఎంఈటీలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దిశానిర్దేశం

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో పని చేసే మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ (ఎంఈటీ) 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. మంగళవారం నుంచి రంగంలోకి దిగిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ కాంట్రాక్టర్లతో పాటు హైడ్రా మార్షల్స్, డీఆర్ఎఫ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ... వర్షాల నేపథ్యంలో తలెత్తే సమస్యలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. ఎక్కడ, ఎలాంటి సమస్య తలెత్తుతుందో, దానికి పరిష్కారం ఏమిటో కూడా తెలిసి ఉండాలన్నారు. వరద నీరు రహదారులను, నివాసాలను ముంచెత్తకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రజల విశ్వాసం చూరగొనేలా పని తీరు మెరుగుపర్చుకోవాలని చెప్పారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ తదితర శాఖలతో అధికారులు సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే లక్ష్యం కావాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాథ్

చర్యలన్నీ 'వ్యర్థ'మేనా?

పారిశుద్ధ్యం.. అధ్వానం

- నగరంలో మారని పరిస్థితి
- అధికారులు క్షేత్రస్థాయిలో లేకపోవడమే కారణం?



'గత 24 రోజులుగా జీహెచ్ఎంసీ కార్మికులు చెత్త తొలగించడం లేదు. దుర్వాసనతో నడవ లేక పోతున్నాం' చింతల్‌మెట్‌కు చెందిన పౌరుడొకరు సోషల్‌మీడియా ఎక్స్ ద్వారా జీహెచ్ఎంసీకి చేసిన ఫిర్యాదు ఇది.

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితులకు ఇదో మచ్చుతునక. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రధాన కార్యాలయ స్థాయి అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, జోన్లు, సర్కిళ్ల స్థాయిలో పట్టింపు లేకపోవడమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి చెత్త సమస్యల పరిష్కారానికి ఎన్నో చర్యలు చేపడుతున్నారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామంటూ మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. సీసీ కెమెరాలు మిమ్మల్ని గుర్తిస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఫేస్ రికగ్నిషన్ హాజరు అమలు చేస్తున్నారు. వారి పనితీరును ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. అయినా ఫలితం కనిపించడం లేదు.

జోన్లు, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం..

చెత్త రోడ్లపై వేయకుండా దుకాణాల్లో చెత్త డబ్బాల ఏర్పాట్లు చేశారు. పెనాల్టీలూ విధిస్తున్నారు. అయినప్పటికీ రోడ్లపై చెత్త పేరుకుపోతూనే ఉంది. పెనాల్టీల పేరిట ఎంతో కొంత సొమ్ము జీహెచ్ఎంసీ ఖజానాకు చేరుతున్నప్పటికీ, సమస్యలు మాత్రం తగ్గడం లేదు. అందుకు ప్రధాన కారణం, జోన్లు , సర్కిళ్ల స్థాయిల్లోని సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన కార్యాలయంలోని కమిషనర్, సంబంధిత విభాగం అడిషనల్ కమిషనర్ వంటివారు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నా కొన్ని జోన్లలోని జోనల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడం లేదు. 'యథారాజా తథా ప్రజా' అన్నట్లు వారి కిందిస్థాయి అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బందిలో సైతం నిర్లక్ష్యం కనిపిస్తోంది.

ప్రజారోగ్యంపై ప్రభావం..

గతంలో సర్కిల్ స్థాయిలో ప్రతిరోజూ ఒక ఉన్నతాధికారి పారిశుద్ధ్య తనిఖీలకు నైట్‌డ్యూటీలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కనీసం పగటపూటయినా ఫీల్డ్‌లో ఉంటున్నారా అంటే అదీ లేదు. సహజంగానే అధికారులు తనిఖీ చేస్తారంటే కిందిస్థాయి సిబ్బంది సైతం జాగ్రత్తగా పనిచేస్తారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చెత్త తరలించే వాహనాలు పెంచుతున్నప్పటికీ, పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. ఔట్‌సోర్సింగ్‌పై పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు పనులు చేస్తున్నప్పటికీ, భారీ వేతనాలు పొందుతున్న శానిటరీ జవాన్లు.. తమకు ఫేస్ రికగ్నిషన్ హాజరు కూడా వద్దని ఒత్తిడి తెస్తున్నారంటే వారి పనితీరు అంచనా వేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో, వర్షం ముసురుతో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తతో దుర్గంధం తదితరాలతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే పరిస్థితులు నెలకొన్నాయి.

ఊసేలేని వానాకాల చర్యలు

వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రతతో పాటు తీసుకోవాల్సిన ఇతరత్రా చర్యలతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా 'సఫాయి అప్నావో.. బీమారీ బగావో' పిలుపునిచ్చింది. జూలై ఒకటి నుంచి నెలాఖరు వరకు ఈ కార్యక్రమం ద్వారా పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు, అందుకు ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ విభాగాల కన్వర్జెన్స్ సమావేశాలు వంటివి నిర్వహించాలని పేర్కొంది. ప్రజారోగ్యం దృష్ట్యా అన్ని పట్టణ స్థానిక సంస్థలు దిగువ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది.

- పట్టణ ప్రాంతాలు పరిశుభ్రంగా కనిపించేందుకు ప్రత్యేక క్లీన్లీనెస్ డ్రైవ్‌లు. ఇందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూడటం , గార్బేజ్ వల్నరబుల్ ప్రాంతాల తొలగింపు, నీటినిల్వల తొలగింపు, డ్రెయిన్ల డీసిల్టింగ్, మార్కెట్ ప్రాంతాలు, ఫుడ్ వెండింగ్‌జోన్‌లు పరిశుభ్రంగా ఉండేందుకు చర్యలు.
- గార్బేజ్ వల్నరబుల్ ప్రాంతాల తొలగింపు
- వ్యర్థాల సేకరణ, రవాణా
- పబ్లిక్ టాయ్‌లెట్లు, కమ్యూనిటీ టాయ్‌లెట్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయడం
- పిల్లలుండే ప్రాంతాల్లో పరిశుభ్రత, స్వచ్ఛతలపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం ఇలా పలు సూచనలు చేసినా, నగరంలో ఇవి అమలవుతున్న దాఖలాల్లేవు.

సెట్టింగ్‌తో సెటిల్‌మెంట్!

సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం

- పీఎస్‌లే కేంద్రంగా పంచాయితీలు
- ఫలితాలివ్వని ఎస్‌ఓపీలు, మానిటరింగ్ కమిటీలు
- హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో మరోసారి తెరపైకి

'పోలీసుస్టేషన్లు సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా మారాయి. వీటిని సివిల్ పంచాయితీలకు కేంద్రాలుగా మార్చారు. సివిల్ వివాదాల్లో తలదూర్చొద్దని చెప్పినా బెదిరింపులకు దిగుతూ ఏదో ఒక క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నారు'

రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని నాగోలు పోలీసుస్టేషన్‌లో నమోదైన ఓ కేసు విచారణ సందర్భంగా మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తడకమల్ల వినోద్ కుమార్ చేసిన వ్యాఖ్యలివి.



సాక్షి, సిటీబ్యూరో: సివిల్ వివాదం.. ఇదంటే పోలీసులకు వీనుల విందు, బహు పసందు కూడా. క్రిమినల్ కేసులో ఏముంటుంది... పరిశోధన, తిరగడం, చాకిరీ... అదే సివిల్ కేసుల్లో అయితే... డబ్బే డబ్బు. నగరంతో పాటు చుట్టుపక్కల భూముల ధరలకు రెక్కలు రావడంతో అదే స్థాయిలో అక్రమాలు పెరిగిపోయాయి. ఇలాంటి వివాదాలన్నీ చివరకు పోలీసుల వద్దకే చేరుతున్నాయి. దీంతో కొందరు పోలీసులు తమ సివిల్ సెటిల్‌మెంట్లకు పోలీసుస్టేషన్లనే అడ్డాలుగా చేసుకుంటున్నారు. దీనికి సంబంధించి గతంలో న్యాయస్థానాలు, ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు బుట్టదాఖలయ్యాయి.

ఆ విషయాల్లో తెలివిగా వ్యవహరిస్తూ...

ఇప్పుడు అనేక పోలీసుస్టేషన్లలో భూ వివాదాలను పరిష్కరించడం మామూలు విషయంగా మారిపోయింది. ఒక విధంగా చెప్పాలంటే సివిల్ వివాదాలు లేకపోతే స్టేషన్‌తో పాటు అధికారుల ఖర్చులు కూడా వెళ్లని పరిస్థితి నెలకొంది. తమ జేబులు నింపేవి కూడా అవే కావడంతో కింది స్థాయి పోలీసులు వాటి కోసం వెంపర్లాడుతున్నారు. అయితే బయట పడితే ఇబ్బందులు తలెత్తుతాయనే కారణంతో సాధ్యమైనంత వరకు కేసు రిజిస్టర్ చేయకుండానే వ్యవహారం చక్కబెడుతుంటారు. అప్పటికీ సెటిల్ కాకపోతే తాము ఇబ్బందుల్లో పడకుండా ఉండేందుకు ఇరు వైపుల నుంచి ఫిర్యాదు తీసుకుని ఆ తర్వాత కథ నడిపిస్తున్నారు. కేసు నమోదయితేనే సివిల్ కేసుల్లో తలదూర్చుతున్నారని తెలుస్తోంది. అసలు కేసే నమోదు చేయకపోతే? పోలీసులకు ఇబ్బందే ఉండదు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం కేసు నమోదు తప్పనిసరిగా మారుతుంది. అలాంటప్పుడు తమకు అనుకూలమైన లాయర్ల వద్దకు క్లైంట్స్‌ను పంపే పోలీసులు కోర్టు రిఫర్ ద్వారా రమ్మని చెప్పి కేసులు నమోదు చేస్తుంటారు.

వాటి విభజన చాలా కష్టం...

'ఇచ్చట సివిల్ కేసులు నమోదు చేసుకోం... వివాదాలు పరిష్కరింపబడవు' దాదాపు ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ ఈ బోర్డులు మనకు కనిపిస్తుంటాయి. అయితే సివిల్ కేసులు నమోదు చేసుకోవడం మానేసిన ఖాకీలు... వచ్చిన కేసునల్లా సెటిల్‌మెంట్ చేయడం మాత్రం మర్చిపోవట్లేదు. దీనికి కారణం భూ వివాదాల్లో సివిల్, క్రిమినల్ విభజించడం చాలా కష్టం. ఈ రెండింటి మధ్యా ఓ చిన్న గీత మాత్రమే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఓ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తే... అది సివిల్ వివాదం అవుతుంది. దీనిపై న్యాయస్థానంలోనే తేల్చుకోవాలి. అదే వ్యక్తి స్థలాన్ని ఆక్రమించే క్రమంలో కూల్చివేతలు, బెదిరింపులకు, దాడులకు దిగితే అది క్రిమినల్ కేసుగా మారుతుంది. అంటే... పోలీసుల చేతికి వచ్చినట్లే. ఈ పరిణామాల నేపథ్యంలో స్పష్టమైన మార్గదర్శకాలు, కఠిన చర్యలు లేకుండా పోలీసులను, సివిల్ కేసులను వేరు చేయడం సాధ్యంకాదని వినిపిస్తోంది.

అవన్నీ అటకెక్కిపోయాయి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2009లో ఇచ్చిన ఆదేశాల మేరకు పోలీసుల సివిల్ వ్యవహారాల పర్యవేక్షణకు మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ 2010 నవంబర్ 6న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా ఆరోపణ, ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో 15 రోజుల్లో విచారణ పూర్తి చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అప్పట్లో రాచకొండ లేకపోవడంతో హైదరాబాద్ కమిషనరేట్ పోలీసు కమిషనర్ అధ్యక్షుడిగా, ఐజీ స్థాయి అధికారులైన అదనపు కమిషనర్ (సమన్వయం), అదనపు కమిషనర్ (నేరాలు) సభ్యులుగా, సైబరాబాద్ కమిషరేట్ విషయానికి వస్తే అధ్యక్షుడిగా పోలీసు కమిషనరే ఉన్నప్పటికీ సభ్యులుగా పరిపాలన విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు, క్రైమ్ డీసీపీ వీటిని ఏర్పాటు చేశారు. ఆపై ఉన్నతాధికారులు అనేక సందర్భాల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లకు (ఎస్‌ఓపీ) రూపమిచ్చి వెబ్‌సైట్లలో పొందుపరిచారు. కాలక్రమంలో ఇవన్నీ అటకెక్కిపోవడంతో ఠాణాల్లో సెటిల్‌మెంట్లు కొనసాగుతున్నాయి.

చిరు జల్లులతో జిల్ జిల్



అబిడ్స్‌లో వర్షంలోనే చిన్నారుల స్కూల్ బాట

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా చిరుజల్లులు ఆగుతూ సాగుతూ కురిశాయి. రాత్రి కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సగటున సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సైదాబాద్ ఆస్మాన్‌గఢ్‌లో 2.5 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. నగరం మొత్తం గరిష్ఠ ఉష్ణోగ్రత 28.4 నమోదు కాగా, కనిష్ఠంగా 21.1 డిగ్రీలకు పడిపోయింది. మరో రెండు రోజులపాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.



బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ మార్గంలో..

ప్రియురాలితో గొడవపడి న్యాయవాది ఆత్మహత్య


సాయినాథ్ (ఫైల్)

ఉప్పల్: ప్రేమించిన యువతితో గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన ఓ యువ లాయర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ టీచర్స్ కాలనీకి చెందిన కల్లూరి సాయినాథ్ (30) ఉప్పల్ సూర్యానగర్ కాలనీలో ఉంటూ రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నాడు. అతను ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే సదరు యువతిని కాదని మరొకరికి పెళ్లి చేసుకునేందుకు అంగీకరించడంతో అతడి ప్రియురాలు సాయినాథ్ ఇంటికి వచ్చి గొడవ పడింది. దీంతో మనస్తాపానికి లోనైన సాయినాథ్ సూర్యానగర్‌లోని స్నేహితుల ఇంటికి వెళ్లాడు. స్నేహితులు డ్యూటీకి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న సాయినాథ్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన అతడి స్నేహితులు తలుపులు తెరిచి చూడగా సాయినాథ్ అప్పటికే మృతి చెందాడు. వారి సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గడ్డి మందు తాగి మరో యువకుడు..

గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలం, రామావరం ప్రాంతానికి చెందిన ప్రేమ్ కుమార్(25) డ్రైవర్‌గా పని చేసేవాడు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో నేపథ్యంలో మంగళవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా హెరాయిన్ పట్టివేత



మణికొండ: రాజస్థాన్ నుంచి హెరాయిన్ అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి భారీగా హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మణికొండ మున్సిపాలిటీ, వైఎస్సార్ కాలనీలో ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన వైష్ణోయ్ చోగారాం బుధవారం నార్సింగిలో తమ రాష్ట్రానికి చెందిన వ్యక్తి నుంచి 650 గ్రాముల హెరాయిన్ కొనుగోలు చేశాడు. దానిని ఇంటికి తీసుకెళుతుండగా సమాచారం అందడంతో దాడి చేసిన ఎస్‌ఓటీ పోలీసులు సరుకు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నార్సింగి పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన హెరాయిన్ విలువ రూ.1.5 కోట్లు ఉంటుందనిపోలీసులు తెలిపారు.

దొరకని ఆచూకీ ఆగని కన్నీళ్లు

● అయినవారి కోసం బంధువుల పడిగాపులు ● మూడు రోజులుగా నరకయాతన ● 'సిగాచి' పేలుడు మిగిల్చిన పెనువిషాదం

అయినవారి కోసం ఆర్తనాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సిగాచి పరిశ్రమ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు పడిగాపులు కాస్తున్నారు. చివరి చూపు దక్కక.. అంతిమ సంస్కారాలు సాగక దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు. కనిపించిన వారినంతా.. 'అయ్యా మా వాళ్లు ఏరీ? అంటూ దీనంగా వేడుకుంటున్నారు. ఈ పేలుడు ఘటన మిగిల్చిన విషాదం మూడు రోజులుగా కొనసాగుతుండటంతో బాధిత కుటుంబసభ్యులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఉపాధి కోసం వందల కిలోమీటర్ల దూరం నుంచి పొట్ట చేతపట్టుకుని వస్తే.. ఉపాధి దేవుడెరుగు.. ఉసురు పోయిందని బాధితులు కన్నీరు మున్నీరవుతుండటం అందరినీ కలిచివేస్తోంది.

- సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

కుటుంబసభ్యులు మరణిస్తే వేదన అంతా ఇంతా కాదు.. మరణించాడని తెలిసి చివరి చూపు కోసం.. అంతిమ సంస్కారాలైనా చేసుకుందామంటే మృతదేహం లభించకపోతే.. ఆ శోకం రెట్టింపవుతుంది. సరిగ్గా ఇలాంటి ఆవేదనే సిగాచీ పరిశ్రమ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలు అనుభవిస్తున్నాయి. తమ వారి జాడ చెప్పాలని, లేదంటే మృతదేహాన్ని అయినా అప్పగించాలని వారి కుటుంబసభ్యులు పడుతున్న యాతన అందరినీ కలిచివేస్తోంది. ఘటన జరిగిన సిగాచీ పరిశ్రమ వద్దకు తరలివ


దీపక్ కోసం పరిశ్రమ వద్దకు వచ్చిన స్నేహితులు.. సునాముద్దీన్ తదితరులు

స్తున్న బాధిత కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు.. తమ వారి ఆచూకీ కోసం అక్కడ ఉన్న అధికారులను వేడుకుంటున్నారు. హెల్ప్‌డెస్క్‌కు వెళ్లి ఆరా తీస్తున్నారు. మృత దేహాలను ఉంచిన పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద అధికారులను సంప్రదిస్తున్నారు. గంటలు కాదు.. రోజులు గడుస్తున్నా తమ వారు కనిపించకపోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు.

క్యాంపులో బిక్కుబిక్కుమంటూ...

బాధిత కుటుంబాల కోసం అధికారులు పాశమైలారం ఐలా కార్యాలయం వద్ద ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో బాధితులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తమ వారి ఆచూకీ కోసం అక్కడి హెల్ప్‌డెస్క్‌లో రక్త నమూనాలను ఇచ్చి తమ వారి మృతదేహాల కోసం వేచి చూస్తున్నారు. అధికారుల నుంచి ఎప్పుడు పిలుపు వస్తుందోనని ఆవేదనతో వేచి చూస్తున్నారు. ఆచూకీ తెలియగానే సమాచారం ఇస్తామని అధికారులు దాటవేస్తుండటంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

స్నేహితుడి ఆచూకీ కోసం..

పొట్టచేతపట్టుకుని ఉపాధి కోసం ఒడిశా నుంచి పటాన్‌చెరుకు వచ్చారు 28 సంవత్సరాల దీపక్. తన స్నేహితులతో కలిసి ఇస్నాపూర్‌లోని ఓ గదిని అద్దెకుంటున్నాడు. ముగ్గురు మూడు కంపెనీల్లో పనిచేసుకుంటున్నారు. మూడు నెలల క్రితమే దీపక్ ఈ సిగాచీ పరిశ్రమలో చేరారు. సోమవారం ఉదయమే పనికి వెళ్లిన దీపక్ ఆచూకీ లేకుండా పోయింది. దీంతో ఒక్కడే ఇక్కడ ఉండటంతో ఆయనకు సంబంధించిన కుటుంబసభ్యులు ఎవరూ ఇక్కడ లేరు. దీపక్‌తో పాటు అద్దె గదిలో ఉంటున్న తన స్నేహితులు సునాముద్దీన్, బవుజీలు ఇతర స్నేహితులు ఇప్పుడు దీపక్ ఆచూకీ కోసం పరిశ్రమ వద్దకు వచ్చి అధికారుల వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి అడిగితే అధికారుల నుంచి స్పందన లేదని సునాముద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐలా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సహాయక శిబిరం వద్ద కూడా ఆరా తీశారు. ఎక్కడా తన స్నేహితుడి జాడ కనిపించకపోవంతో వీరంతా తీవ్ర ఆవేదనతో కాలం వెల్లబోసుకుంటున్నారు.

20 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీ

రాజేంద్రనగర్: అత్తగారింట్లో కుమారుడి పుట్టిన రోజు జరుపుకుని వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి 20 తులాల బంగారు ఆభరణాలు, లక్ష నగదును ఎత్తుకెళ్లిన సంఘటన రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన నవీన్ ప్రైవేటు ఉద్యోగి. తన కుమారుడి పుట్టిన రోజు నేపథ్యంలో మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి లింగంపల్లిలోని తన అత్తగారింటికి వెళ్లాడు. అక్కడే పుట్టిన రోజు వేడుకలు జరుపుకుని రాత్రి హైదర్‌గూడలోని ఇంటికి వచ్చేందుకు సిద్ధమవ్వగా వర్షం పడటంతో ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా అల్మారాలో దాచిన 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు కనిపించలేదు. దీంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

గంజాయి పట్టివేత

ఇద్దరు యువకులు అరెస్ట్

కేపీహెచ్‌బీకాలనీ: మహారాష్ట్ర నుంచి ఇద్దరు యువకులు గంజాయి తీసుకువచ్చినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూసాపేటకు చెందిన జీవన్, బోరబండకు చెందిన చిన్న స్వామి స్నేహితులు. గంజాయికి అలవాటు పడిన వారు ధూల్‌పేటలో గంజాయి కొనుగోలు చేసి సేవించేవారు. గత నెల మహారాష్ట్రలోని పర్లి ప్రాంతానికి వెళ్లిన వారు పర్లీ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి నుంచి 450 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. బుధవారం రైలులో హైదరాబాద్ చేరుకున్న వారు బోరబండకు వెళ్లేందుకు హైదర్‌నగర్ బస్‌స్టాప్ వద్ద వేచి ఉండగా సమాచారం అంకున్న ఎస్‌ఐ శ్రీలత సిబ్బందితో వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులో 450 గ్రాముల డ్రై గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పర్లికి చెందిన రియాజ్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

లోపభూయిష్టంగా స్పోర్ట్స్ పాలసీ

శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్పోర్ట్స్ పాలసీ లోపభూయిష్టంగా ఉందని శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి ప్రతిష్టాత్మక పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు అవసరమైన హై పెర్ఫామెన్స్ అకాడమీల స్థాపనపై స్పోర్ట్స్ పాలసీలో కనీస ప్రస్తావన లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంపు, ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన వారికి నేరుగా ఉద్యోగాలిచ్చే విధానంపై పాలసీలో స్పష్టత ఇవ్వలేదన్నారు. శాట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కోచ్‌ల క్రమబద్ధీకరణ, కొత్త కోచ్‌ల నియామకం గురించి కూడా స్పోర్ట్స్ పాలసీలో ఎలాంటి ప్రకటన చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ అనే అంశం ఐరావతంలా మారిందని, విశ్వవిద్యాలయం ఏర్పాటుపై ఒక బ్లూ ప్రింట్ తయారు చేయకుండా ప్రకటనలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. స్పోర్ట్స్ స్కూళ్ల ఆధునీకరణపై దృష్టి పెట్టాలని, నగరంలో హైపెర్ఫామెన్స్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇంటెన్సివ్ కోచింగ్ ఇచ్చేలా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. మూడంచెల కోచింగ్ విధానంతోనే రాష్ట్రం స్పోర్ట్స్ హబ్‌గా మారుతుందని అన్నారు.

జోనల్ సైబర్ సెల్స్ సక్సెస్

- మే 29 నుంచి పని ప్రారంభం
- 429 కేసుల దర్యాప్తు
- బాధితులకు రూ.79.67 లక్షలు రీఫండ్
- డీసీపీల కృషిని అభినందించిన కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ బాధితులకు మరింత ఊరటనిచ్చేలా హైదరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటైన జోనల్ సైబర్ సెల్స్ (జెడ్‌సీసీ) ఫలితాలు ఇస్తున్నాయి. ఒక్కో జోన్‌లో ఒకటి చొప్పున మొత్తం ఏడు ఏర్పాటు కాగా... వీటిని కొత్వాల్ సీవీ ఆనంద్ ఈ ఏడాది మే 29న వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.లక్ష లోపు మొత్తంతో ముడిపడి ఉన్న, కొన్ని సోషల్ మీడియా సంబంధిత కేసుల దర్యాప్తు ఈ జెడ్‌సీసీ పర్యవేక్షణలో జరుగుతోంది. వీటి పనితీరుకు సంబంధించి ప్రత్యేకంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ సైతం రూపొందించారు. మంగళవారం వరకు ఈ జెడ్‌సీసీల పని తీరును కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ప్రకటించారు. జోనల్ డీసీపీల నేతృత్వంలో పని చేసే వీటిలో విధులు నిర్వర్తించే వారికి నెల రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ జెడ్‌సీసీలు రూ.25 వేల కంటే తక్కువ మొత్తంతో ముడిపడి ఉన్న నేరాల్లో నగదు ఫ్రీజ్ అయి ఉంటే రిఫండ్ చేస్తున్నాయి. రూ.25 వేల నుంచి రూ.లక్ష మధ్య మొత్తంతో ముడిపడిన వాటిపై స్థానిక ఠాణాలో కేసు నమోదు చేయించి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నాయి. ఇలా ఇప్పటి వరకు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా వీటికి 9947 పిటిషన్లు అందగా.. వీటిలో 6698 ఫిర్యాదులను కొలిక్కి తెచ్చాయి. 429 కేసుల్లో ఫ్రీజ్ చేసిన మొత్తం నుంచి రూ.79,67,982 బాధితులకు రిఫండ్ చేయించాయి. 468 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి ఏడు కేసుల్ని దర్యాప్తు చేసి కొలిక్కి తీసుకువచ్చిన జెడ్‌సీసీలు వివిధ రాష్ట్రాల నుంచి నిందితుల్ని అరెస్టు చేసి తీసుకువచ్చాయి. రూ.లక్ష కంటే ఎక్కువ మొత్తంతో ముడిపడి ఉన్న వాటిని సైబర్ క్రైమ్ ఠాణాకు పంపిస్తున్నాయి. ఈ జెడ్‌సీసీలు స్థానిక పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే సైబర్ నేరాలను దర్యాప్తు చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిందితులను పట్టుకోవడంలోనూ సహకరిస్తున్నాయి. సోషల్‌మీడియా వేధింపులు కేసుల్లో నిందితులు అపరిచితులైతే సైబర్ ఠాణాలో కేసు నమోదు అవుతున్నాయి. పరిచయస్తులే నిందితులైతే స్థానిక ఠాణాలో కేసు నమోదు చేయిస్తున్న జెడ్‌సీసీలు నిందితులను పట్టుకుని అప్పగిస్తున్నాయి. ఒక్కో జెడ్‌సీసీని ఆ జోన్‌లో ఉన్న డీఐల్లో ఎవరో ఒకరు పర్యవేక్షిస్తున్నారు. ఆయన నేతృత్వంలో పని చేయడానికి ఓ ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను కేటాయించారు. జోనల్ డీసీపీ కార్యాలయా కేంద్రంగా ఈ జెడ్‌సీసీలు పని చేస్తున్నాయి. వీలున్నంత వరకు సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో జెడ్‌సీసీల ఏర్పాటు నిర్ణయం తీసుకున్నారు. ఆయా జోన్లలో సైబర్ నేరాల బారినపడకుండా అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాయి. ఈ జెడ్‌సీసీలు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషిస్తున్న డీసీపీలను సీపీ అభినందించారు.

పరిశోధనలకు నిధులు ఇస్తాం

ఓయూ జాతీయ సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు

ఉస్మానియా యూనివర్సిటీ: సాంస్కృతికాంశాల నేపథ్యంలో పరిశోధనలు చేపట్టేందుకు రూ. కోటి మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆధ్వర్యంలో మల్టీ డిసిప్లీనరి డైలాగ్ అండ్ డిస్‌కోర్స్ ఇన్ ఆర్ట్స్ అండ్ అసోషల్ సైన్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అనేక భావ పరమైన బేధాలు ఉన్నాయని వాటిని సంస్థాగతంగా మార్చినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. తరగతి గదిని సృజనాత్మకంగా మలుచుకున్నప్పుడే భవిష్యత్తు బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.కాశీం, ప్రొ.రేవతి, యూజీసీ డీన్ ప్రొ.లావణ్య, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.కొండ నాగేశ్వర్, ప్రొ.బాలు నాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం సావనీరును ఆవిష్కరించారు.

అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు



సుభాష్‌నగర్: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ భరత్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఐడీపీఎల్‌కు చెందిన వ్యక్తి బుధవారం తెల్లవారుజామున ఇన్నోవా కారులో మేడ్చల్ నుంచి ఐడీపీఎల్‌కు వస్తున్నాడు. సూరారం ప్రధాన రోడ్డు కట్టమైసమ్మ ఆలయం ఎదురుగా మూలమలుపు వద్దకు రాగానే కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు క్రేన్ సహాయంతో చెరువులో నుంచి కారును తొలగించారు.

విగ్రహాల దొంగల ముఠా అరెస్ట్

రూ. 5.36 లక్షల విలువైన విగ్రహాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు..


పోలీసుల అదుపులో నిందితులు

నాగోలు: దేవాలయాల్లో దేవుడి విగ్రహాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాతో పాటు చోరీ చేసిన విగ్రహాలను కొనుగోలు చేసిన వ్యక్తిని ఇబ్రహీంపట్నం పోలీసులు, ఎల్‌బీనగర్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 5.36 లక్షల విలువైన విగ్రహాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు..కర్నూలుకు చెందిన కరచా శివానంద పాత నేరస్తుడు. కొన్నాళ్ల క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చిన అతను వనస్థలిపురం ఎస్‌జీవో కాలనీలో ఉంటున్నాడు. ఎల్‌బీనగర్ లేబర్ అడ్డాలో తిరుగుతూ చిన్న చిన్న పనులు చేసుకునే వాడు. ఈ క్రమంలో అతడికి ప్రకాశం జిల్లా, బల్లికురువ మండలం, వల్లపల్లి గ్రామానికి చెందిన షేక్ హామ్ షరీఫ్‌తో పరిచయం ఏర్పడింది. డబ్బులు అవసరం కావడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో శివానంద దేవాలయాల్లో విగ్రహాల చోరీకి పథకం రూపొందించాడు. చోరీ అనంతరం తప్పించుకునేందుకు వాహనం అవసరమని భావించిన వారు ఆటో అద్దెకు తీసుకుని ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని గ్రామాల్లో దేవాలయాలపై రెక్కీ నిర్వహించారు. ఆ తర్వాత పథకం ప్రకారం ఫిబ్రవరి 27న యాచారం మండలం, గండ్లగూడ మల్లికార్జున స్వామి ఆలయంలో నాలుగు గుడి గంటలను ఎత్తుకెళ్లారు. జూన్ 15 ఉప్పరగూడ గ్రామంలోని మల్లన్న స్వామి ఆలయంలో అమ్మవారి పుస్తెలతాడు, 2 దీపం స్టాండ్‌లను చోరీ చేశారు. గత నెల 24న ఉప్పల్‌లోని మెట్రో వద్ద పార్క్ చేసిన బైక్‌ను చోరీ చేసిన వారు దానిపై తిరుగుతూ ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసరాల్లోని జన సంచారం లేని దేవాలయాలను పరిశీలించారు. గత నెల 29 సద్దుపల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలోని శ్రీరాముడు, సీత, లక్ష్మణ పంచలోహ విగ్రహాలను చోరీ చేశారు. దుండుమైలారం అయ్యప్ప స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలను, అయ్యప్ప వెండి విగ్రహం, ఇతర పూజా వస్తువులను చోరీ చేశారు. చోరీ చేసిన వస్తువులను ఉప్పల్, భరత్‌నగర్‌లో ఉన్న స్క్రాప్ వ్యాపారి అక్కపల్లి క్రాంతికుమార్‌కు రూ. 18,500 వేలకు విక్రయించారు. ఈ గత నెల 30న పోల్కంపల్లి గ్రామంలోని శివ గంగ దేవాలయంలోని పెద్ద రాజు, పెద్దమ్మ విగ్రహాలను చోరీ చేశారు. బుధవారం బైక్‌పై వెళుతున్న వారిని మంగల్‌పల్లి చౌరస్తా వద్ద ఎల్‌బీనగర్ సీసీఎస్ పోలీసులు, ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో క్రాంతికుమార్ నుంచి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న విగ్రహాల విలువ రూ. 5, 36 లక్షలు ఉంటుందని సీపీ తెలిపారు. శివానంద్‌పై గతంలో పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విగ్రహాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని సీపీ పేర్కొన్నారు. దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నం సిఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ చందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య


రోషన్ మృతదేహం


రోషన్ (ఫైల్)

మణికొండ: బతుకు దెరువు నిమిత్తం పశ్చిమ బెంగాల్ నుంచి నగరానికి వచ్చిన ఓ వ్యక్తిని అతడి మిత్రుడే దారుణంగా హత్య చేసిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. నార్సింగి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రోషన్ హెలా(43), రంజిత్ పండిత్ స్నేహితులు. వారం రోజుల క్రితం వారు బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు. పుప్పాలగూడలోని అపర్ణ నిర్మాణ సంస్థకు చెందిన జెనాన్ సైట్‌లో మురళీధర్ అనే వ్యక్తి వద్ద పెయింటింగ్ పనిలో చేరిన వారు అక్కడే లేబర్ క్యాంప్‌లో ఉంటున్నారు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటా పెరగడంతో గొడవపడ్డారు. దీంతో ఆగ్రహానికి లోనైన రంజిత్, రోషన్ గొంతులో ఇనుప రాడ్డును దించి, కత్తితో కోసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. బుధవారం ఉదయం సంస్థ హెచ్‌ఆర్ పవన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీం, జాగిలాలతో ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ సేవలు


సెట్విన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి తదితరులు

యాకుత్‌పురా: ప్రభుత్వ రంగ సెట్విన్ శిక్షణ సంస్థ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన పురానిహవేలీలోని సెట్విన్ శిక్షణ సంస్థ ప్రధాన కార్యాలయం, మోతీగల్లీ శిక్షణ కేంద్రాలను సెట్విన్ చైర్మన్ ఎస్. గిరిధర్ రెడ్డి, ఎండీ కె. వేణుగోపాల్ రావులతో సందర్శించారు. సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్నన్న కోర్సులు, శిక్షణ విధానాన్ని ఎండీ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ... మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నూతన ఉపాధి, ఉద్యోగావకాశాలకు సంబంధించిన కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సెట్విన్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి గుర్తించిన ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆయన సంస్థ పనితీరు, అభివృద్ధిపై చైర్మన్, ఎండీ, అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు సురేష్ బాబు, రాధాకృష్ణ, నవీన్ కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూలిన నాలా ప్రహరీ



అంబేడ్కర్‌నగర్‌లో కూలిన నాలా ప్రహరీ

బంజారాహిల్స్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బంజారాహిల్స్ రోడ్డు నంబర్–13లోని అంబేడ్కర్‌నగర్ బస్తీ నాలా ప్రహరీ కూలిపోయింది. ఆగకుండా కురుస్తున్న వర్షాలకు నాలా పొంగిపొర్లుతుండటంతో బుధవారం ఉదయం ప్రహరీ కూలిపోయిందని స్థానికులు తెలిపారు. వెంటనే జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు కూలిన ప్రహరీని మరమ్మతులు చేపట్టాలని బస్తీవాసులు కోరుతున్నారు. లేకపోతే వరదంతా ఇళ్లలోకి చొచ్చుకువస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహా వారాహి దేవికి వైభవంగా పూజలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

ఫిలింనగర్: ఫిలింనగర్ శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన సంచలిత దైవసన్నిధానంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా బుధవారం మహా వారాహి (శ్రీ ఇంద్రాణి దేవి)కి మూల మంత్ర హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా మహా పూర్ణాహుతి, ఆదివారాహి మహాపూజ, ఉద్యాపన పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ పూజాదికాల్లో సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న స్వామి

రహమత్‌నగర్: కార్మికులు హక్కులు సాధించుకునేందుకు ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ స్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎస్పీఆర్‌హిల్స్‌లో బుధవారం సమ్మెకు సంబంధించి కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతి కార్మికుడు ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు దేవదాస్, బాలయ్య, పెద్ద కూరయ్య, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం ప్రశాంతంగా జరిగిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆలయంలో ఆయన క్యూలైన్‌లో నిలుచున్న భక్తులతో మాట్లాడారు. అధికారుల సహకారంతో ఉత్సవాలు విజయవంతం అయ్యాయన్నారు. మాజీ కార్పొరేటర్ శేషకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈఓ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పోలీసులు కొట్టడం వల్లే నా కుమారుడు నడుస్తలేడు

మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేసిన ఓ తండ్రి

బంజారాహిల్స్: పోలీసులు తీవ్రంగా కొట్టడం వల్ల తన కుమారుడు నడవలేని స్థితికి చేరుకున్నాడని ఓ తండ్రి మానవ హక్కుల కమిషన్‌తో పాటు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. గత ఏడాది డిసెంబర్ నెలలో షేక్ అబ్దుల్ రహమాన్ అనే వ్యక్తి బాత్‌రూంలో స్నానం చేస్తుండగా ఓ మైనర్ (17) వీడియో తీశాడనే ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా పోలీసులు మైనర్ అయిన తన కుమారుడిని తీవ్రంగా కొట్టడం వల్ల నాలుగు నెలలుగా నడవలేని పరిస్థితికి చేరుకున్నారని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాలుడి తండ్రి దగ్గుబాటి రాంబాబు ఇటీవల మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం తన కుమారుడు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు రాంబాబు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ వ్యవహారంపై జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మైనర్‌కు నోటీసు ఇచ్చి పంపించినట్లు తెలిపారు. తాము ఎవరినీ కొట్టలేదని..రాంబాబు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

హైడ్రా టీమ్.. సిద్ధం

రంగంలోకి హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో సేవలు షురూ..
- ఒక్కో డివిజన్‌కు ఒక ఎమర్జెన్సీ టీమ్
- మూడు షిఫ్టుల్లో పనిచేయనున్న సిబ్బంది



సోమాజీగూడ ప్రజాభవన్ వద్ద వాటర్ లాగింగ్ పాయింట్‌లో హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల సేవలు

బంజారాహిల్స్: వర్షాకాలంలో వరద నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు మ్యాన్‌హోల్, కాల్వల్లోకి వరద నీరు చేరేలా జాగ్రత్తలు తీసుకోవడానికి హైడ్రా పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఈ మేరకు ఒక్కో డివిజన్‌కు ఒక మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ను నియమించింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, హిమాయత్‌నగర్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లకు ఒక్కో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ను నియమించింది. మంగళవారం రాత్రి నుంచే ఈ బృందాలు రంగంలోకి దిగి వరదనీరు నిలిచే ప్రాంతాల్లో సేవలు అందించాయి. మోకాలు లోతు వరదనీరు నిలిచిన ప్రాంతాల్లో తగిన యంత్ర పరికరాలతో రంగంలోకి దిగిన టీమ్‌లు వాటర్ లాగింగ్ పాయింట్లను క్లియర్ చేశాయి.

- ఒక్కో టీమ్‌లో నలుగురు సిబ్బందిని నియమించారు.
- మూడు షిఫ్టుల్లో ఈ టీమ్‌లు పనిచేస్తాయి.
- ఒక్కో డివిజన్‌కు 12 మంది సిబ్బంది సేవల్లో పాల్గొంటారు.
- భారీగా వరదనీరు నిలిచే చోట మోటార్ల సాయంతో నీటిని తోడేందుకు పెద్ద పంపుసెట్లు కూడా ఈ బృందాలకు అందజేశారు.
- వర్షపునీరు నిలిచే చోట స్టాటిక్ టీమ్‌లు రెండు షిఫ్టుల్లో పనిచేసేలా కొంతమంది సిబ్బందిని నియమించారు.
- వీరికి తోడు ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీహిల్స్ సర్కిల్–18, యూసుఫ్‌గూడ సర్కిల్–19లో ఉన్న ఏడు హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలు వర్షాకాలం వరదనీటి పనుల్లో నిమగ్నమయ్యాయి.
- ఒక్కో టీమ్‌లో 18 మంది ఉంటారు. ఇలా డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూడా 100 మందికి పైగా సేవలు అందిస్తున్నారు.
- వీరు ఒక్కో షిఫ్టులో ఆరుగురు చొప్పున పనిచేస్తారు.
- వీరికి తోడు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఎమర్జెన్సీ బైక్ బృందాలు నాలుగు ఉన్నాయి.
- ఒక్కో బైక్‌పై ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు.
- ఒక్కో సర్కిల్‌లో పనులను పర్యవేక్షించేందుకు హైడ్రాకు చెందిన మార్షల్స్‌ను ఈ రెండు నియోజకవర్గాల్లో ముగ్గురిని నియమించారు.
- ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగంతో కలిసి పనిచేసేందుకు రెండు షిఫ్టుల్లో మరిన్ని బృందాలు ఏర్పాటు చేశారు.
- చెట్ల కొమ్మలు, చెత్తను ఎత్తేందుకు వీలుగా ఒక్కో షిఫ్టులో ముగ్గురు చొప్పున ఉండేలా సిబ్బందిని నియమించారు. ఎప్పటికప్పుడు నాలాలు, కల్వర్టులను పరిశీలించి వరదనీటి ప్రవాహం సాఫీగా సాగేలా జాగ్రత్త పడేందుకు ఈ టీమ్‌లు పనిచేయనున్నాయి.
- వరద నీరు నిలిచిన వెంటనే తోడేందుకు మోటార్ పంపులు, చెట్లు పడిపోతే తొలగించడానికి కటింగ్ మిషన్లు, చెత్తను తొలగించడానికి అవసరమైన పరికరాలను డీఆర్‌ఎఫ్ బృందాలకు అప్పగించారు.

నూతన కార్యవర్గానికి అభినందనలు



ప్రభుత్వ సలహాదారు కేశవరావుతో మున్నూరు కాపు సంఘం నాయకులు

పంజగుట్ట: ఇటీవల జరిగిన మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం ఎన్నికల్లో విజయం సాధించిన పూటం పురుషోత్తంరావు పటేల్, కార్యవర్గం బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కేశవరావు మాట్లాడుతూ.. మున్నూరు కాపు ఎన్నికల ద్వారా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులను ఎన్నుకోవడం శుభపరిణామం అన్నారు. నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. సంఘం అధ్యక్షుడు పూటం పురుషోత్తం రావు పటేల్, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, కోశాధికారి కంచి సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు బుక్క వేణుగోపాల్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వాసదేవుల వెంకట నర్సయ్య, నేత వెంకటేశ్వర్లు, పందిరి వేణు పటేల్, సత్యనారాయణ, చొప్పరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

9న ఫుడ్ లైసెన్స్ మేళా

బంజారాహిల్స్: రెస్టారెంట్లు, ఫుడ్ బిజినెస్ నిర్వహించే వారికి ఈ నెల 9వ తేదీన ప్రత్యేకంగా ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు డాక్టర్ శ్రీవెంక, కే.సౌమ్యారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఉన్న ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్ సర్కిల్ పరిధిలో ఉన్న వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఏడాదికి రూ.12 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు టర్నోవర్ చేసే వ్యాపారుల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఫుడ్ లైసెన్స్‌లు పొందాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్: 73311 89774, 79933 54252.

5 నుంచి సిల్క్ ఎగ్జిబిషన్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

శ్రీనగర్‌కాలనీ: సిల్క్, కాటన్, లెనిన్ వస్త్రాల్లో వంద శాతం నాణ్యతకు వేదికగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిలుస్తుందని మంత్రి సీతక్క అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయినిగమాగమంలో ఈ నెల 5 నుంచి ఏర్పాటు చేస్తున్న సిల్క్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. బోనాలు, వరలక్ష్మీవ్రతాలకు ప్రత్యేక వస్త్రాలను ఏర్పాటు చేశామని నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తెలిపారు. దేశంలో ప్రముఖ రాష్ట్రాలకు చెందిన చెందేరి, కోల్‌కత్రోటా, ఉప్పాడ, జమ్దాని, కాంత, బెనారస్, గద్వాల్, గుజరాత్, టసర్, పోచంపల్లి, ఇక్కత్, కశ్మీరితో పాటు పలు ఫ్యాన్సీ డిజైనరీ, వన్‌గ్రామ్‌గోల్డ్ ఆభరణాలు వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 13 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 10వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



విద్యుత్ భద్రత వారోత్సవాల ముగింపు వేడుకల్లో సీఈ సాయిబాబా, విద్యుత్ అధికారులు

శ్రీనగర్‌కాలనీ: విద్యుత్ సిబ్బంది ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరిస్తూ, విద్యుత్ మరమ్మతులు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సీఈ సాయిబాబా అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ రాయల్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో బంజారాహిల్స్ సబ్‌డివిజన్ విద్యుత్ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని, జాగ్రత్తలను తప్పని సరిగా పాటించాలని, ముఖ్యంగా వర్షాకాలంలో మరింతగా సేవలు అందించడానికి కృషి చేయాలని కోరారు. విద్యుత్ సరఫరాలో భద్రత చాలా ముఖ్యమన్నారు. ఎస్‌ఈ కరుణాకర్, బంజారాహిల్స్ డీఈ ఆపరేషనల్స్ హనుమంత రెడ్డి, ఏడీఈ చరణ్‌సింగ్, ఏడీఈ కిషోర్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ కమిటీ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్

హిమాయత్‌నగర్: జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న ఎల్బీ స్టేడియంలో గ్రామ కమిటీ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ కోరారు. సమ్మేళనంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: అవంతీనగర్, జనప్రియ, పాటిగడ్డ 11కేవీ ఫీడర్లు మోతీనగర్, జనప్రియ, ఎస్.పార్క్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బబ్బుగూడ, మోతీనగర్, కబీర్‌నగర్, అవంతీనగర్, హనుమాన్ టెంపుల్, జనప్రియ, పాటిగడ్డ, నూర్‌బాగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్ సింగ్ బుధవారం తెలిపారు. లక్ష్మీ కాంప్లెక్స్, ఇంద్రప్రస్థ, హుడా, పలాగ్ పాలెస్, చిరాన్‌పోర్ట్ 11కేవీ ఫీడర్లు, ఆల్విన్, ఎయిర్‌పోర్ట్, ఎస్.పార్క్, ప్రకాశ్‌నగర్ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ, ఇంద్రప్రస్థ బిల్డింగ్స్, హుడా లైన్, చిరాన్‌పోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీస్, పాటిగడ్డ రోడ్డు, నవాబ్‌గల్లీ, పాగా పాలెస్, రసూల్‌పుర చౌరస్తా, చిరాన్‌పోర్ట్, హుడాలైన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

జెడ్పీ ఆఫీస్, ఇందిరాపార్క్, ఎగ్జిబిషన్ సబ్ స్టేషన్ల పరిధిలో..

లక్డీకాపూల్: జెడ్పీ ఆఫీస్, ఇందిరాపార్క్, ఎగ్జిబిషన్ సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని సైఫాబాద్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హిమాయత్‌నగర్ ఫీడర్ పరిధిలోని దోమలగూడ ఏరియా, హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం.5, 6, 7 ఏరియాలతో పాటు వాసు మెడికల్ షాపు ప్రాంతం, గెలాక్సీ హోటల్, లెజెండ్ అపార్టుమెంట్‌లైన్, ఇండియన్ బ్యాంకు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాను నిలిపివేస్తారు. మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సెవెన్ టెంపుల్ ఫీడర్ పరిధిలోని ఖైరతాబాద్, విశ్వేశ్వరయ్య భవన్, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, బిగ్‌బాస్ హోటల్ లైన్, హిందీ ప్రచారసభ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఏపీపీఎస్సీ ఫీడర్ పరిధిలోని పటేల్ నగర్, అజంత గేట్, మాలకుంట, ఎగ్జిబిషన్, ఏపీహెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని తెలిపారు.

బసవతారకనగర్ నాలా పూడికతీత పనులు చేపట్టండి



కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బసవతారకనగర్ వాసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ బసవతారకనగర్‌లో ఉన్న నాలా పూడికతీత పనులు చేపట్టడంతో పాటు నాలా ఎత్తు పెంచాలని, నూతన సీసీ రోడ్లు వేయాలంటూ స్థానికులు కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం పలువురు బస్తీ నేతలు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్పందిస్తూ ఈ నాలా విషయమై ఇటీవల జీహెచ్‌ఎంసీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడటం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని మేయర్, జీహెచ్‌ఎంసీ అధికారులను కోరడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా బస్తీవాసుల ముందు జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రెండు రోజుల్లో బసవతారకనగర్‌కు వస్తామని, సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారు.

అమెరికాకు తొత్తుగా నరేంద్రమోదీ

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర



హిమాయత్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్: అమెరికా చేతిలో ప్రధాని నరేంద్రమోదీ తొత్తుగా మారాడని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి వలి ఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర ఆరోపించారు. 140 కోట్ల ప్రజల ప్రయోజనాలను ట్రంప్‌కు తాకట్టు పెట్టిన మోదీ విధానాలు నశించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గ చర్యలు ఆపాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఛలో అమెరికా రాయబార కార్యాలయ(అమెరికన్ కాన్సులేట్) ముట్టడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి ర్యాలీగా తరలిన నేతలను, ర్యాలీని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర నేతలు బిజ్జ శ్రీనివాసులు, బాలకృష్ణ, సల్మాన్ బేగ్, ఎండీ.కుతుబ్, మాజీద్ అలీ ఖాన్, శేఖర్, కళ్యాణ్, నాగరాజు, మోసిన్ ఖాన్, మధుకర్, మధు, సునీల్ పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి

మేయర్ విజయలక్ష్మి



డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారి వ్యవస్థను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: వరుసగా కురుస్తున్న వర్షాలతో విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని ఎంటమాలజీ అధికారులు దోమల వ్యాప్తి జరగకుండా చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా లేక్‌లో డ్రోన్ల ద్వారా చెరువుల్లో మందులు చల్లే వ్యవస్థను బుధవారం ప్రారంభించారు. అనంతరం లేక్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజ్‌బంజారా లేక్‌లో పెద్ద ఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోవడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి డెక్కను తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించి నిధులు మంజూరు చేయించినట్లు ఆమె తెలిపారు. రూ.26 లక్షలతో చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెలికి తీయడంతో పాటు డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసీ సమ్మయ్య, ఎంటమాలజీ ఎస్‌ఈ గంగప్ప, ఈఈ విజయ్‌కుమార్, ఎంటమాలజీ ఏఈ రజిత పాల్గొన్నారు.

బంజారా లేక్‌లో గుర్రపు డెక్క తొలగింపు షురూ..



ప్రత్యేక వాహనాలతో తాజ్ బంజారా లేక్‌లో గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌బంజారా లేక్‌లో గుర్రపు డెక్క పేరుకుపోయి దోమల వ్యాప్తి పెరిగి విష జ్వరాలు వ్యాపిస్తున్న వైనంపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. లేక్‌లో ప్రత్యేక వాహనాల ద్వారా చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించే ప్రక్రియను బుధవారం మొదలు పెట్టారు. 20 రోజుల్లో చెరువులోని డెక్కను పూర్తిగా తొలగించి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామని సీనియర్ ఎంటమాలజిస్ట్ వై.గంగప్ప తెలిపారు. గుర్రపు డెక్కను తొలగించేందుకు ప్రత్యేకంగా జేసీబీతో పాటు హిటాచిని వాడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మరో వైపు దోమలవ్యాప్తి పెరగకుండా ఉండేందుకు చెరువులో రెండు రోజులకు ఒకసారి డ్రోన్ ద్వారా దోమల మందును పిచికారి చేస్తామని వెల్లడించారు.

ఎమ్మెల్యే కాలనీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఎమ్మెల్యే కాలనీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని శ్రీవేంకటేశ్వర హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో సొసైటీ లేఅవుట్ ఓపెన్ స్పేస్‌ను ఆక్రమించి నిర్మించిన ప్రహరీ గోడలను బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు, హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. ఓ వ్యక్తి సుమారు 400 గజాల ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా ప్రహరీగోడ నిర్మించాడు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. ఈ స్థలం విలువ రూ.12 కోట్లు ఉంటుంది. ఇంటి నెంబర్ 8-2-293/82/ఎల్/182/ఏ లో ఉన్న ఈ ఖరీదైన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, ఇది పూర్తిగా అక్రమమని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఈ స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మించి కాపాడుకోవాలని ఇంజనీర్లకు సూచించారు.

వచ్చేనెల 10న అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ, ఎంబీఏ(హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్ ఆగస్టు 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జూలై 15 అని పేర్కొన్నారు. ఆగస్టు 10న ఆదివారం మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 వరకు రాష్ట్రంలో ఉన్న నిర్దిష్ట పరీక్షా కేంద్రాల్లో మాత్రమే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఐ–సెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సుల్లో అడ్మిషన్స్ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్ లేదా వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

చెట్ల కొమ్మలను తొలగించాల్సిందే..

వెంగళరావునగర్: కాలనీల్లో విద్యుత్ వైర్లకు ఆటంకం కలిగించే చెట్ల కొమ్మలను నరికేసిన వెంటనే వాటిని తొలగించాలని, ఆ బాధ్యత కాంట్రాక్టర్ తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఏఈ కరుణాకర్ బాబు అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులు తమ కాంట్రాక్ట్ సిబ్బంది ద్వారా విద్యుత్ వైర్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికారు. అయితే నరికిన కొమ్మలను రోడ్లపై వేసి వెళ్లడం వల్ల కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దాంతో ఈ విషయాన్ని కాలనీ అసోసియేషన్ నేతలు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం సమావేశం నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు మాట్లాడుతూ చెట్ల కొమ్మలను నరికివేసిన తర్వాత వాటిని తొలగించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆకులు, కొమ్మలు రోడ్లపై విస్తరిస్తూ వాహనదారులు, పాదచారులకు ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. స్పందించిన ఎస్‌ఈ కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కరుణాకర బాబు, డీఈ హనుమంతారెడ్డి, ఏడీఈ బాలకృష్ణ, ఏఈ తిరుపతి రావు, కాలనీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, మాజీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



కాలనీ నేతలతో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు

నగరంలో నేడు

- ❖ శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- ❖ మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ❖ మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

రేపు అల్లూరి జయంతి వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: అల్లూరి 128వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నామని క్షత్రియ సేవా సమితి(ఏపీ, టీజీ) అధ్యక్షుడు బీహెచ్ సత్యనారాయణరాజు తెలిపారు. హైటెక్ సిటీ శిల్పకళావేదికలో భారత సాంస్కృతిక శాఖ, క్షత్రియ సేవా సమితి, దక్షిణాది రాష్ట్రాల క్షత్రియ సేవా సంఘాల సమాఖ్య, భారత క్షత్రియ సమాఖ్య సంయుక్తాధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాలకు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, గజేంద్ర సింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బీహెచ్ శ్రీనివాసరాజు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

రేపు డీవైఎఫ్ఐ 'చలో సెక్రటేరియట్'



మాట్లాడుతున్న కోట రమేష్, ఆనగంటి వెంకటేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ కేలండర్ విడుదల చేసి నోటిఫికేషన్ ఇవ్వాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జూలై 4న ఉద్యోగ సాధనకై చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విస్మరించి యువతను మోసగించిందని ఆరోపించారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లతో కలిపి 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని, ఇంకా లక్షా 45 వేల ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఎం.డి. జావేద్, కృష్ణనాయక్, రాజు, భగత్, రాజేష్, నరేందర్, ప్రవీణ్, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతికూల వాతావరణంతో విమానాల మళ్లింపు

శంషాబాద్: భారీ వర్షం కారణంగా ప్రతికూల వాతావరణం ఏర్పడటంతో మంగళవారం అర్ధరాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన పలు విమానాలను దారి మళ్లించారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు రావల్సిన విమానాన్ని విజయవాడకు, కోల్‌కత్తా నుంచి హైదరాబాద్ రావాల్సిన విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. లక్నో, జైపూర్, ముంబై నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టు రావాల్సిన విమానాలను బెంగళూరు విమానాశ్రయానికి మళ్లించారు. మస్కట్ నుంచి హైదరాబాద్ రావాల్సిన సలాం ఎయిర్‌లైన్స్ విమానాన్ని రద్దు చేశారు. దారి మళ్లించిన హైదరాబాద్ విమానాలన్నీ బుధవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకున్నట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డికి సన్మానం




డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి ఐఎంఏ నార్త్ బ్రాంచ్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: భారతదేశంలో మూడు పద్మ అవార్డులను అందుకున్న తొలి వైద్యుడిగా డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి గొప్ప వైద్యవేత్త అని పలువురు వక్తలు అభివర్ణించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నార్త్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 5వ ఐఎంఏ తెలంగాణ స్టేట్ కాన్ 2025 కార్యక్రమంలో భాగంగా ప్రపంచ గ్యాస్ట్రో ఎంటరాలజీ గురు, ఏఐజీ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. గౌరవ అతిథి ఎయిమ్స్ న్యూఢిల్లీ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ రణదీప్ గులేరియా వాయు కాలుష్యం, వన్ హెల్త్ అనే అంశంపై ప్రసంగించారు. వాతావరణ కాలుష్యం మనుషులు, జంతువులు, మొక్కలు, ఆహార వ్యవస్థలపై కలిగించే ప్రభావాన్ని వివరించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తన వైద్య ప్రయాణంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సి.సురేంద్రనాథ్ డాక్టర్ జి.ఆర్.గణేష్ రావు డాక్టర్ బి.సాయి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహా జలమండలిగా విస్తరణ!

- ప్రస్తుత పరిధి 1,450 చదరపు కిలోమీటర్లు
- 2050 చదరపు కిలోమీటర్లకు విస్తరణ
- తాగునీరు, డ్రైనేజీ నెట్‌వర్క్ కోసం ప్రణాళిక



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని మణిహారంగా ఉన్న జలమండలి ఇక మహా జలమండలిగా మారనుంది. తాగునీటి, సీవరేజీ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాలకు నెట్‌వర్క్ ఉండగా, వెలుపల కూడా విస్తరించే చర్యలకు ఉపక్రమించింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో నాలుగు దిక్కులా విస్తరిస్తున్న నగర భవిష్యత్తు, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టి పెట్టుకొని సీవరేజీ, వాటర్ ప్రాజెక్టు సమగ్ర నివేదిక రూపకల్పనకు ఆదేశించారు.

2050 చదరపు కిలోమీటర్లు

జలమండలి నెట్‌వర్క్ 1,450 చదరపు కిలోమీటర్ల వరకు ఉండగా.. 2,050 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించేందుకు జలమండలి కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇప్పటికే కోర్ సిటీలో 169.3 చ.కి.మీటర్లు, చుట్టుపక్కల 518.9 చ.కి.మీటర్లు, ఓఆర్ఆర్ పరిధిలో 762 చ.కి.మీటర్లు విస్తరించి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరో 600 చ.కి.మీటర్ల నెట్‌వర్క్ కోసం కసరత్తు చేస్తోంది. మహా విస్తరణ మాస్టర్ ప్లాన్ కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపొందించి మూడు నెలల్లోగా ప్రభుత్వానికి సమర్పించాలని భావిస్తోంది. వాటర్, సీవరేజ్ పైప్‌లైన్లతోపాటు ఎస్టీపీల నిర్మాణాలు చేపట్టి శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగం కోసం కూడా దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేయాలని యోచిస్తోంది.

జలమండలి పరిధిలోకి...

శంషాబాద్, నార్సింగి, తుక్కుగూడ, పెద్దఅంబర్‌పేట, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు ఓఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్నాయి. దీంతో వాటిని కూడా జలమండలి పరిధిలోకి తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది.

ఓఆర్ఆర్ పరిధిలో..

ఇప్పటికే ఔటర్ రింగ్‌రోడ్ పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల తాగునీటి సరఫరా కోసం ఓఆర్ఆర్ తాగునీటి ప్రాజెక్టు-1, 2 దశలను పూర్తి చేసి సేవలందిస్తోంది. ఓఆర్ఆర్-1 కింద జీహెచ్ఎంసీ పరిధి అవతల ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 190 గ్రామాలకు తాగునీటి సరఫరా చేసేందుకు సుమారు రూ.124 కోట్ల అంచనా వ్యయంతో 70 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల 164 రిజర్వాయర్లు నిర్మించడంతోపాటు దాదాపు రూ.527 కోట్ల వ్యయంతో 1,601 కిలో మీటర్ల మేర పైపులైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసింది. ఓఆర్ఆర్ ప్రాజెక్టు-2 కింద సుమారు 189 కోట్ల అంచనా వ్యయంతో 140 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన 71 సర్వీసు రిజర్వాయర్ల నిర్మాణం, సుమారు రూ.778 కోట్ల అంచనా వ్యయంతో 2,758 కిలోమీటర్ల మేర కొత్త పైపులైను నెట్‌వర్క్ పూర్తి చేసి సేవలు అందిస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

– కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



టాయిలెట్ క్లీనింగ్ మిషన్లు అందజేస్తున్న కిషన్‌రెడ్డి, డీఈఓ రోహిణి..

రహమత్‌నగర్: ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే అనుభవం, అర్హత గల ఉపాధ్యాయులు ఉంటారని, వారు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం టాయిలెట్ క్లీనింగ్ మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు ఉన్నమాట వాస్తవమని, వాటిని ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. హైస్కూల్ స్థాయిలోనే విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలల్లో తన నిధులతో అభివృద్ధి పనులు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి, డిప్యూటీ ఈఓ శ్యామూల్ రాజ్, డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్, హెచ్ఎం కాంతయ్య, సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, నగర నాయకులు గంగరాజు, ప్రేమ్, కొలన్ సత్యనారాయణ, షర్మిల, తంగెళ్లపెల్లి లక్ష్మణ్, హనుమంతురావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుక్‌ఫెయిర్ మాజీ కార్యదర్శి విభా భారతి మృతి

నగరంలో హిందీ సాహిత్యం వ్యాప్తికి మిలింద్ పబ్లికేషన్ ఏర్పాటు

లక్డీకాపూల్: హైదరాబాద్ బుక్ ఫెయిర్ మాజీ కార్యదర్శి విభా భారతి (74) అనారోగ్యంతో కాచిగూడలోని తన స్వగృహంలో మంగళవారం మృతి చెందారు. 1952 ఆగస్టు 2న జన్మించిన విభాభారతి హైదరాబాద్‌లో హిందీ సాహిత్య పుస్తకాలకు కేంద్రంగా మిలింద్ ప్రకాశన్‌ను తన భర్త శృతికాంత్‌తో కలిసి 40 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల హిందీ సాహిత్యాన్ని తెలుగు ప్రజలకు అందుబాటులో ఉంచారు.



అనేక తెలుగు పుస్తకాలను హిందీలో ముద్రించారు. విభాభారతి మృతి పట్ల హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు యాకూబ్, ఉపాధ్యక్షులు కె.బాల్‌రెడ్డి, శోభన్ బాబు, పూర్వ అధ్యక్షుడు, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, మాజీ కార్యదర్శి కోయ చంద్రమోహన్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కాచిగూడలోని వారి నివాసంలో ఆమె మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

గృహ రుణాలకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

బ్యాంకర్లకు అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి సూచన

సాక్షి,సిటీ బ్యూరో: బ్యాంకులు విద్యా, గృహ రుణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని హైదరాబాద్ అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం బ్యాంకుల ప్రగతిపై సమీక్షించారు. మొత్తం రుణ లక్ష్యంలో 121.47 శాతం పురోగతి సాధించినట్లు వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రంగంలో 110.82 శాతం పురోగతి సాధించారని తెలిపారు. వీధి వ్యాపారులకు విరివిగా ముద్ర రుణాలతోపాటు స్టాండ్ అప్ ఇండియా కింద నిర్దేశించిన రుణాలు మంజూరు చేసి లక్ష్యాలను సాధించాలని సూచించారు. రాజీవ్ యువవికాస పథకంలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా వార్షిక ప్రణాళిక పుస్తకాన్ని బ్యాంకర్లతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కోటాజీ, జిల్లా మైనార్టీ అధికారి ఇలియాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, పరిశ్రమల శాఖ జీఎం పవన్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జీఎంలు సుబ్రమణ్యం, లక్ష్మినారాయణ శర్మ, నాబార్డ్ డీడీఎం పి.హర్ష రఘురామ్, ఆర్‌బీఐ ఏజీఎం ఎస్. రాములు, జిల్లాలోని బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.


9న కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలి



ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

కవాడిగూడ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత 11 ఏళ్లుగా అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని పలు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ హైదరాబాద్ పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద కార్మిక సంఘాల నేతలు మహాధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టీయూసీ నాయకులు ఆర్డీ చంద్రశేఖర్, ఏఐటీయూసీ నేత ఎస్.బాలరాజు, హెచ్ఎంఎస్ నాయకుడు రెబ్బ రామారావు, బీఆర్‌టీయూ నాయకుడు జి.రాంబాబు యాదవ్, బోస్, జె.వెంకటేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్లాన్ ప్రాజెక్టు (ఎన్ఎంపీ)ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

అశ్రునయనాల మధ్య పట్టాభిరామ్ అంత్యక్రియలు



రాయదుర్గం: ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వవికాస నిపుణుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ అంత్యక్రియలు అశ్రు నయనాల మధ్య బుధవారం రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో నిర్వహించారు. అమెరికా నుంచి ఆయన కొడుకు వెంకటసాయి ప్రశాంత్, కోడలు నీలిమ, మనవడు అభిరామ్, మనవరాలు సరయు వచ్చిన తర్వాత ఉదయం 10 గంటలకు ఆయన పార్థివదేహాన్ని బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి నుంచి ఖైరతాబాద్, ఆనంద్‌నగర్ కాలనీలోని నివాసానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో పార్థివదేహాన్ని మహాప్రస్థానానికి తీసుకెళ్లారు. సీనియస్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, శాంత బయోటెక్ ఎండీ వరప్రసాద్ రెడ్డి, ఎమ్మె స్కో చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నేత కేవీపీ రాంచంద్రారావు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, స్నేహితులు, ఇంద్రజాలికులు పట్టాభి రామ్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

డిప్యూటీ సీఎంతో కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ భేటీ



డిప్యూటీ సీఎం భట్టితో భేటీ అయిన కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్

సనత్‌నగర్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కజకిస్తాన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎం అధికారిక నివాసంలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కజకిస్తాన్, తెలంగాణ మధ్య వ్యాపార సహకారం, పెట్టుబడుల అవకాశాలు, ఇతర అనేక అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్–కజకిస్తాన్ మధ్య నేరుగా విమాన సర్వీసులపై కూడా చర్చలు జరిగాయి. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్యం, ఆరోగ్య సేవలు, విద్య, రవాణా కనెక్టివిటీ విస్తరణపై ప్రధానంగా చర్చించారు. ఇటీవల కజకిస్తాన్‌లో ఔషధ తయారీ కేంద్రాన్ని స్థాపించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ లేబరేటరీస్, కజక్ ఇన్వెస్ట్ మధ్య జరిగిన ఒప్పందం గురించి నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ వివరించారు. ఇది భారత–కజకిస్తాన్ మధ్య ఓ కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు.

హైదరాబాద్–అల్మాటీ (కజకిస్తాన్) నడుమ నేరుగా విమాన సేవలు ప్రారంభించాలన్న ప్రతిపాదనపై చర్చ జరిగింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్‌లైన్ మార్కెటింగ్ అండ్ డెవలప్‌మెంట్ హెడ్ ఆనందాచార్యతో జరిగిన సమావేశ వివరాలు చర్చకు వచ్చాయి. త్వరలో ఈ విమాన సర్వీసు ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఇది పర్యాటకం, వాణిజ్యం, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించనుందన్నారు. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సీఎండీ డాక్టర్ శ్రీనివాసరావుతో కజకిస్తాన్‌లో ఒక వైద్య విద్యా సంస్థ, ప్రపంచ స్థాయి హాస్పిటల్ ఏర్పాటు చేయాలన్న అంశంపై చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. కజకిస్తాన్ కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు హామీనిచ్చారు.

టెక్ ఫార్వర్డ్ సిరీస్‌కు మంచి స్పందన

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్



టెక్ ఫార్వర్డ్ సిరీస్‌లో శోభు యార్లగడ్డకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టెక్ ఫార్వర్డ్ సిరీస్‌కు మంచి స్పందన లభించడం సంతోషంగా ఉందని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ అన్నారు. పరిశ్రమ, అకాడెమియా మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ–హైదరాబాద్ క్యాంపస్‌లో 12వ ఎడిషన్ టెక్ ఫార్వర్డ్ సిరీస్‌లో 'టెక్నాలజీ అండ్ సినిమా'అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా)తో కలిసి నిర్వహించారు. హైదారాబాద్ ఐటీ ఎకో సిస్టమ్‌తో అనుసంధానంగా ఒక ఫ్లాగ్‌షిప్ ఈవెంట్‌గా ఈ సెమినార్ సిరీస్‌ను మరింత విస్తరించాలన్నదే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామని పేర్కొన్నారు. మిహిరా విజువల్ ల్యాబ్స్ సహ వ్యవస్థాపకుడు శోభు యార్లగడ్డ మాట్లాడుతూ వినూత్న రీతిలో టెక్నాలజీని దృశ్యమానం చేస్తే ప్రపంచ స్థాయి చిత్రంగా మారే అవకాశం ఉందన్నారు. సమావేశంలో హైసియా మేనేజింగ్ కమిటీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, హైసియా అధ్యక్షుడు ప్రశాంత్, ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ రమేష్ లోకనాథన్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక సామర్థ్యాలపై ఏఐ ప్రభావం



మాట్లాడుతున్న సైంటిఫిక్ మైండ్స్ డైరెక్టర్, నీట్ కోచింగ్ నిపుణుడు సయీద్ సాదత్

సైంటిఫిక్ మైండ్స్ డైరెక్టర్ సయీద్ సాదత్

సాక్షి,సిటీ బ్యూరో: విద్యార్థుల మానసిక సామర్థ్యాలపై ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తీవ్ర ప్రభావం చూపుతోందని సైంటిఫిక్ మైండ్స్ డైరెక్టర్, నీట్ కోచింగ్ నిపుణుడు సయీద్ సాదత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐకు అలవాటుపడుతున్న విద్యార్థులు ఆలోచించటం, విశ్లేషించటం, గ్రహించటానికి అవసరమైన సామర్థ్యాలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరీక్షల్లో విజయం సాధించాలంటే ఏఐ సమాధానాలు, మోడల్ పేపర్ల పై ఆధారపడకుండా పాఠ్య పుస్తకాలను పూర్తిస్థాయిలో చదవడం ద్వారా ఎలాంటి కఠిన ప్రశ్నపత్రాన్నైనా ఎదుర్కొవచ్చన్నారు. మెడిసన్ ప్రవేశ పరీక్షలో ఫిజిక్స్ ప్రశ్నాపత్రం అత్యంత కఠినమైనదిగా అభివర్ణించారు. ఇప్పటివరకు ఫిజిక్స్ పేపర్ క్లిష్టమైనదిగా కనిపిస్తున్నా భవిష్యత్తులో ఇతర పేపర్లు కూడా అంతే క్లిష్టంగా రావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత సబ్జెక్టులపై నిపుణుల పుస్తకాలను ఆసక్తి, ఆలోచనతో చదివితే ఏదైనా సాధ్యమేనని అన్నారు. నీట్ మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాలంటే 7వ తరగతి నుంచే శిక్షణ ప్రారంభించాలన్నారు. పాఠశాల స్థాయిలోనే గణితం, ఫిజిక్స్‌పై బాగా అవగాహన పెంచుకోవాలని సూచించారు.

బడి పిల్లల భద్రతపై దృష్టి

వాహనాలపై స్పెషల్ డ్రైవ్.. 154 కేసులు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: బడి పిల్లల భద్రతకు కీలక ప్రాధాన్యం ఇవ్వాలంటూ నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ఇచ్చిన ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మధ్య మండల ఏసీపీ ఎస్.మోహన్‌కుమార్ నేతృత్వంలో పాఠశాలలకు విద్యార్థులకు తరలించే వాహనాల తనిఖీలు చేపట్టారు. బుధవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 154 కేసులు నమోదు చేసినట్లు మోహన్‌కుమార్ ప్రకటించారు. సెంట్రల్ జోన్ ట్రాఫిక్ పరిధిలోని సైఫాబాద్, అబిడ్స్, చిక్కడపల్లి, గాంధీనగర్‌లో ఉన్న వివిధ ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకున్న రెండు, డ్రైవర్ పక్కన విద్యార్థులను కూర్చోబెట్టుకున్న (ఫైలెటింగ్) ఆరు, యూనిఫాం లేకుండా డ్రైవింగ్ చేస్తున్న తొమ్మిది, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న 137 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకువస్తున్న వ్యాన్‌డ్రైవర్ రాజు మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసిన అధికారులు వాహనాన్ని తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. అతడిని కోర్టులో హాజరుపరుచనున్నారు. చిన్నారుల భద్రతకు భంగం కలిగేలా వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశామని, కొన్ని వాహనాలను తాత్కాలికంగా సీజ్ చేశామని ఏసీపీ మోహన్‌కుమార్ ప్రకటించారు. వాహనంలో అనుమతించిన సంఖ్య కంటే ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించవద్దని, ఈ విషయంలో తల్లిదండ్రులు సైతం శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు

– క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

లాలాపేట: క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని, అందుకుగాను కార్పొరేషన్ ద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. ఈ మేరకు బుధవారం తార్నాక నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) 13వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ సంజయ్ ఆనంద్, ప్రధాన కార్యదర్శి బిషప్ బక్క ఏలియా అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో దీపక్ జాన్, రాజా హేబెల్, సీఆర్ఆర్ఐ ప్రెసిడెంట్ రిటైర్డు ఐపీఎస్ బాబురావు, ఎన్‌సీసీ జాతీయ అధ్యక్షుడు శ్యామ్ పాల్ తదితరులు పాల్గొన్నారు. దీపక్ జాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాలని క్రైస్తవ సంఘాల నాయకులను కోరారు. కొన్ని సంవత్సరాలుగా క్రైస్తవుల రక్షణ కోసం ఎన్‌సీసీ చేస్తున్న కృషిని అభినందించారు. ఎన్‌సీసీ జాతీయ అధ్యక్షుడు రెవరెండ్ డా.శ్యామ్ పాల్ మాట్లాడుతూ గత 12 ఏళ్ల నుంచి దేశ వ్యాప్తంగా క్రైస్తవులకు అండగా ఉంటూ వారు చేస్తున్న సేవలను వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే మైనార్టీలకు రక్షణ ఉంటుందన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. అనంతరం ఎన్‌సీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్క ఏలియాకు ఎన్‌సీసీ రత్న అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ మహిళా అధ్యక్షురాలు ప్రసన్న బోల్డ్, రక్షిత, ప్రియ, ప్రీతి, బ్లూలా, కల్చరల్ వింగ్ గొంగళ్ల సునీల్, రెవరెండ్ సుదర్శన్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎన్‌సిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఉప్పల్ కాంగ్రెస్ నేతలు



సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం మేడ్చల్–మల్కాజ్‌గిరి నియోజకవర్గం ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, నగరంలో జరిగే మల్లికార్జున ఖర్గే సభకు జనసమీకరణ తదితర అంశాలపై మంత్రితో చర్చించినట్లు వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీన మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖర్గే సభలో భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, నాయకులు గడ్డం రవి, యువజన కాంగ్రెస్ మాజీ జాతీయ కోఆర్డినేటర్ వినోద్ ముదిరాజ్, నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



ఘనంగా లక్ష పుష్పార్చన


దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో శ్రీ సిద్ధేశ్వరి పీఠ ఉత్తర పీఠాధిపతి దత్తేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో వారాహి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం లక్ష పుష్పార్చనను వైభవంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు సువర్ణ లత, విజయలక్ష్మి, వర్ధని, ఆకెళ్ల అనురాధ, హేమ, అరుణ, రాధ, సరిత తదితరులు పాల్గొన్నారు

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 3, జూలై, 2025



వర్షాలు ముసురుకుంటున్న సమయంలో కుక్కలకు ర్యాబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా కుక్కలతో పాటు మనుషులకూ ఈ వ్యాధి వ్యాప్తిచెందొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో పేద, మధ్యతరగతి, ఉన్నత శ్రేణి అనే తేడా లేకుండా ఎవరి స్థాయికి తగ్గట్లు వారు వివిధ జాతుల కుక్కలను, ఇతర జంతువులను పెంచుకుంటున్నారు. వాటిని అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. ఆ పెట్స్ కూడా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా కలిసిపోతున్నాయి. ఉద్యోగం, వ్యాపారం, వ్యక్తిగత జీవితంలో ఎంత బిజీగా ఉన్నా మూగజీవాలకు కొంత సమయం కేటాయిస్తూ వాటి ఆలనా పాలనా చూసుకుంటున్నారు. ఒత్తిడిని జయించదానికి కొంత సమయం వాటితో ఆడుకోవడం అలవాటుగా మారుతోంది. ఈ సమయంలో ర్యాబిస్ వంటి ప్రాణాంతక వ్యాధి సోకితే పెట్స్‌తో సహా మనుషులకూ ముప్పు పొంచి ఉంది.

- సాక్షి, సిటీబ్యూరో



జంతు ప్రేమికులూ.. జర జాగ్రత్త..!

ముసురు వేళ ర్యాబిస్ సోకే ప్రమాదం..

- వీధి కుక్కలకు దూరంగా ఉంటే మంచిది
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం కావచ్చు



ఈ సీజన్‌లో గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. వైరస్ వ్యాప్తికి కూడా అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మరీ ముఖ్యంగా ఇంటో పెంచుకునే పెట్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. కళ్లు ఎర్రబడటం, జ్వరం రావడం, గొంతు కండరాలు బిగుసుకుపోయి నీళ్లు తాగడానికి ఇబ్బంది పడటం, నాలుగైదు రోజుల పాటు సొంగ కార్చడం, నురగలు కక్కడం వంటి లక్షణాలు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇవన్నీ ర్యాబిస్ వైరస్‌కు సంబంధించిన లక్షణాలుగా పరిగణించాలి. ప్రాథమికంగా గుర్తించి వ్యాక్సిన్ ఇప్పించినట్లైతే పెట్స్‌ను రక్షించుకోవచ్చు.

వీధి కుక్కలతో జర జాగ్రత్త..

వీధి కుక్కలు చిన్ననాటి నుంచి పుట్టి పెరిగిన, సంచరించే ప్రాంతానికి సరిహద్దులు (టెరిటరీ) నిర్ణయించుకుంటాయి. వాటి పరిధిలోకి వేరే కుక్కలను రానీయవు. ఇవి వాటి పరిధి దాటి వెళితే ఆందోళనకు గురవుతాయి. దీంతో కొత్త వ్యక్తులను చూసినప్పుడు భయంతో దాడి చేయడానికి ప్రయత్నిస్తాయి. అటువంటి వాటని ఐ కాంటాక్ట్ (కళ్లలోకి కళ్లుపెట్టి చూడటం) చేయకపోవడం మంచిదని సూచిస్తున్నారు. పిల్లలు సహజంగానే కుక్కలు కనిపించినపుడు వాటి తోక, చెవులు పట్టుకుని లాగుతుంటారు. ఒక రకమైన ఇరిటేషన్‌లో ఉన్న కుక్కలను ఇలా చేస్తే అవి వెంటనే కరిచే అవకాశం ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలో కుక్కల నియంత్రణ వీధుల్లో వాటిని పట్టుకుని కు.ని చికిత్సలు చేస్తున్నారు. అనంతరం ఎక్కడ నుంచి తెచ్చినవి అక్కడ విడిచిపెట్టకుండా ఏదో ఒక చోటు వదిలేస్తున్నారు. ఇది కూడా కుక్క కాట్లు పెరగడానికి కారణంగా కనిపిస్తోంది.

మెదడును ప్రభావితం చేస్తుంది..




పెట్స్‌కు ర్యాబిస్ సోకినప్పుడు వైరస్ అనేది మెదడుపై ప్రభావం చూపిస్తుంది. ఆ సమయంలో కుక్క ఏం చేస్తుందనేది దానికి తెలియకుండానే నియంత్రణ కోల్పోతుంది. కోపం, దూకుడుగా, పచ్చిపిచ్చిగా వ్యవహరిస్తుంది. మనుషులకు వచ్చినట్లే కుక్కలకు సైతం విషజ్వరాలు వస్తాయి. లక్షణాలు గుర్తించినపుడు వైద్యులను సంప్రదించడం మేలు. రేబిస్ వ్యాధి అనేది కుక్కల నుంచి మనుషులకు సోకే ప్రమాదం ఉంది. అందుకు ముందుగానే జాగ్రత్త పడాలి. సొంగ కార్చే సమయంలో దాన్ని మనం చేతితో ముట్టుకోకుండా జాగ్రత్తపడాలి. కుక్క పిల్లలు ఆరు వారాల నుంచి 8 వారాల వయసులో పారో వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. అన్నిటికీ ముందస్తుగా టీకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రివెంటివ్ వ్యాక్సిన్ తీసుకోవడం మేలు.

– డా.డీ.అశోక్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, వెటర్నరీ యూనివర్సిటీ, రాజేంద్రనగర్.

నివారణ చర్యలు..

పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. తద్వారా ర్యాబిస్ వ్యాప్తిని అరికట్టవచ్చు..దీంతో పాటు పెంపుడు జంతువులను నియంత్రణలో ఉంచాలి. ముఖ్యంగా కుక్కలు, పిల్లులు, కుందేళ్ల వంటి ఇళ్లలో పెంచుకునే వాటికి టీకాలు వేయించాలి. ఏదైనా జబ్బు లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలి. పెంపుడు జంతువులు లేదా బయటి జంతువుల వల్ల ఏదైనా ప్రమాదం సంభవించినా.. అవి కాటు వేసినా.. గాయాన్ని సబ్బు నీటితో కనీసం 15 నిమిషాల పాటు శుభ్రం చేయాలి. ర్యాబిస్ సోకిన జంతువు నుంచి చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. వైద్యుని సలహా మేరకు తగిన చికిత్స తీసుకోవాలి. ర్యాబిస్ వైరస్ సోకే ప్రమాదం ఉన్న వ్యక్తులు, లేదా తరచూ జంతువులతో నివాసం ఉండాల్సిన పరిస్థితులు ఉన్న వ్యక్తులు ముందస్తుగా ర్యాబిస్ టీకా తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో గబ్బిలాల నివాసం లేకుండా చూసుకోవాలి. ర్యాబిస్ సోకిన తర్వాత, లక్షణాలు కనిపించిన తర్వాత చికిత్స తీసుకోవడం చాలా కష్టం.. కాబట్టి నివారణా చర్యలు పాటించడం ఉత్తమం.. ఆరోగ్యకరం.

ప్రపంచ ఆరోగ్య రాజధాని మన లక్ష్యం



అపోలో చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి ఆకాంక్ష

డాక్టర్స్ డే ముగింపు సందర్భంగా సందేశం

సాక్షి, సిటీబ్యూరో: 'డయాబెటిస్', 'క్యాన్సర్', 'హార్ట్ డిసీజ్' వంటి వాటికి మన దేశం క్యాపిటల్.. ఈ నెగెటివ్ గుర్తింపు పోవాలని, మన లక్ష్యం 'హెల్త్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్' కావాలని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి ఆకాంక్షించారు. అపోలో ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా జాతీయ స్థాయిలో, నగర వైద్య రంగం పురోగమిస్తున్న తీరుతెన్నులకు అద్దం పట్టేలా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నా జీవితం ఆరోగ్యరంగానికే అంకితం..

గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న క్లినిక్స్ నుంచి నగరాల్లోని ఆధునిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల వరకూ వైద్యులు తమ మేధస్సు, నైపుణ్యం, మానవత్వంతో దేశీయంగా మాత్రమే కాకుండా గ్లోబల్ స్థాయిలో కూడా గొప్ప ప్రభావం చూపుతున్నారు. ఆరోగ్యరంగానికి నా జీవితం అంకితమయ్యింది. ఈ రంగంలో నా ప్రయాణంలో నేను ఎన్నో అసాధారణ మార్పుల్ని చూశా. ఏఐ ఆధారిత రోబోటిక్ శస్త్రచికిత్సలు, వ్యక్తిగత అనుకూలమైన క్యాన్సర్ చికిత్సలు, రిమోట్ మానిటరింగ్, డిజిటల్ డయాగ్నోస్టిక్స్.. వంటివెన్నో వైద్య రంగంలో భాగంగా మారుతున్నాయి. అయితే మానవీయతతో కూడిన వైద్యుడే అసలైన మార్గదర్శి అనేది నిస్సందేహం.

నివారణపై దృష్టి పెరిగింది..

చికిత్స అనే దశ నుంచి నివారణ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. వైద్య పరిజ్ఞానంతో పాటు డిజిటల్ టూల్స్, ఆరోగ్య మానిటరింగ్ పద్ధతులు, హెల్త్ రిస్క్ ప్రొఫైలింగ్ వంటి కార్యక్రమాల ద్వారా నగరవాసుల ఆరోగ్యాన్ని ముందుగానే తెలుసుకుని సంరక్షించగలిగే దిశగా వృద్ధి చెందాం. అపోలో గ్రూప్ ద్వారా ఇప్పటి వరకూ 150కి పైగా దేశాల నుంచి వచ్చిన 200 మిలియన్ల మందికి పైగా జీవితాలను ప్రభావితం చేయగలిగాం, ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అమెరికాలో, భారత మూలాలున్న వైద్యులు 26% వరకూ ఉండడం గమనార్హం.

సాంకేతికతతో సమర్థవంతంగా..

అత్యాధునిక సాంకేతికత ఆధారంగా ఆరోగ్యసేవల విస్తరణ కూడా గణనీయంగా పెరిగింది. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యాలతో జిల్లా ఆస్పత్రులు మెరుగవుతుండగా, టెలీమెడిసిన్ ద్వారా చివరి మైలు వరకూ సేవలు అందిస్తున్నాం. డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్స్, మొబైల్ యాప్‌లు, రిమోట్ కన్సల్టేషన్లతో ప్రజలకు ఎన్నడూ లేనంత చేరువగా ఉండగలుగుతున్నాం. ఈ నేపథ్యంలో దీనిని మరింత మెరుగుపరిచేందుకు వైద్యులను నైపుణ్యం దిశగా నడిపించాలి. దీని కోసం నిరంతర అవగాహన, డిజిటల్ టూల్స్ వాడకంపై శిక్షణ, సముచిత వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉంది. సాంకేతికత, నిర్మాణాలకు పెట్టుబడులు పెట్టడమే కాదు, వైద్యుల మానసిక ప్రశాంతత, నైతిక విలువలు, నిరంతర అధ్యయనాన్ని ప్రోత్సహించడం కూడా అవసరం. అందరికీ ఆరోగ్యం పంచేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్న ప్రతి వైద్యుడికీ ధన్యవాదాలు. మనం వైద్యుల్ని కేవలం మాటలతో కాదు, మద్దతుతో గెలవాలి.





ఉమెన్ ఇన్నోవేటర్స్..

- ఆవిష్కర్తల కోసం డైనమిక్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ప్రోగ్రాం
- వినూత్న రీతిలో ఆవిష్కరణల కోసం ప్రోత్సాహం
- డీఇడబ్ల్యూఐలో భాగం కానున్న పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు, సామాజికవేత్తలు



సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమలు, పారిశ్రామిక రంగంలో మహిళకు వ్యవస్థాపకులుగా, ఆవిష్కర్తలుగా సాధికారత కల్పిస్తూ వారందరినీ అనుసంధానం చేసే వినూత్న వేదికగా డైనమిక్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అండ్ ఉమెన్ ఇన్నోవేటర్స్ (డీఇడబ్ల్యూఐ) ప్రారంభమైంది. అంకుర సంస్థల ఔత్సాహిక మహిళల సమిష్టి ఉన్నతికి సహకారం, ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా నగరంలో డీఇడబ్ల్యూఐ ఆవిష్కృతమైంది. నగరంలోని హైటెక్స్ నోవోటెల్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ డాక్టర్ నీలిమా వేములతో పాటు చైర్‌పర్సన్ డాక్టర్ కళ్యాణి గుడుగుంట్ల, వైస్ చైర్‌పర్సన్ – సహ వ్యవస్థాపకురాలు సత్యవతి ప్రసన్న మడిపడిగే, సహ వ్యవస్థాపకురాలు – బ్రాండ్ కస్టోడియన్ పల్లవి నాగళ్లతో పాటు ముఖ్య సలహాదారు రాజు మడిపడిగే డీఇడబ్ల్యూఐను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా మహిళా దార్శనికులు, స్ఫూర్తిదాయక వ్యక్తులు, మహిళా ఆవిష్కర్తలను ఒక చోటికి చేర్చారు.

మహిళా శక్తికి లాంచ్‌ప్యాడ్.

ఈ సందర్భంగా డైనమిక్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అండ్ ఉమెన్ ఇన్నోవేటర్స్ వ్యవస్థాపకురాలు డా.నీలిమా వేముల మాట్లాడుతూ.. డీఇడబ్ల్యూఐ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు, ఇదొక ఒక ఉద్యమం. ప్రధానంగా ఇండస్ట్రీ, ఇన్నోవేషన్‌లో బాధ్యతను కోరుకునే, ఒకరికొకరు ప్రోత్సాహం అందించుకునే ఔత్సాహిక మహిళలను ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు మహిళా శక్తిని, విజయాన్ని పునర్ నిర్వచించడానికి సిద్ధంగా ఉన్న మహిళలను అనుసంధానం చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. డీఇడబ్ల్యూఐ అనేది మహిళల వ్యవస్థాపకతను పెంపొందించేందుకు కమ్యూనిటీ సహకారంతో పాటు మూలధనంపై దృష్టి సారించి, ఆశావహులైన–స్థిరపడిన మహిళా వ్యవస్థాపకులకు ఒక లాంచ్‌ప్యాడ్‌గా సేవలందించనుందని, ఇలాంటి వారి అభివృద్ధికి అవకాశాలు కల్పించే సమాంతర వ్యవస్థగా రూపొందించనున్నామని పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో మహిళా నేతృత్వంలోని వెంచర్‌లను స్కేలింగ్ చేయాలనే సంస్థ లక్ష్యానికి భవిష్యత్తు పెట్టుబడిదారులు, నిధుల సేకరణదారులుగా విశిష్ట జ్యువెలరీ డైరెక్టర్ సింధుజా పలబట్ల, సురక్ష ఫార్మా డైరెక్టర్ పద్మజా మానేపల్లిని డీఇడబ్ల్యూఐ కుబేరులుగా ఎంపిక చేశారు. ఈ ప్రారంభోత్సవంలో ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి అలేఖ్య పుంజాల, ప్రముఖ ఫిట్‌నెస్ నిపుణురాలు దినాజ్ వెర్వత్‌వాలా, సినీ నటుడు అలీ జీవిత భాగస్వామి జుబేదా అలీ, వైద్య నిపుణురాలు, మహిళా ఆరోగ్య న్యాయవాది డాక్టర్ సునీత రెడ్డి (వైఎస్), వకుళ సిల్క్స్ వ్యవస్థాపకురాలు మాధురి దువ్వాడ, టీజీ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఎస్‌సీడీఎల్ ఆధ్వర్యంలో

కెరీర్ గ్రోత్‌పై..

5న ఉచిత సెమినార్..

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని ప్రముఖ దూరవిద్యా సంస్థలలో ఒకటైన సింబయోసిస్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఎస్‌సీడీఎల్) తమ సిల్వర్ జూబ్లీ వేడుకలను నగరంలో నిర్వహించనుంది. దీనిలో భాగంగా ఈ నెల 5న నగరంలోని గచ్చిబౌలిలో ఉన్న మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌లో ప్రత్యేక కెరీర్ గ్రోత్ సెమినార్ ఏర్పాటు చేస్తోంది. ఈ విషయాన్ని ఎస్‌సీడీఎల్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వృత్తి నిపుణులు, గ్రాడ్యుయేట్లు, కెరీర్ నిపుణులు, పూర్వ విద్యార్థులు, కార్పొరేట్ ప్రముఖులు, హెచ్ఆర్ నిపుణులు పాల్గొంటారని, తమ కెరీర్‌లో మరింత ఎదగాలనుకునే వారికి కెరీర్ కౌన్సెలింగ్ సెషన్స్ ఉంటాయన్నారు. ఈ సెమినార్ ప్రవేశం ఉచితమే కానీ ముందస్తు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని వివరించారు.



అశోకలో రూబిక్స్ క్యూబ్ పోటీలు..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని అశోక వన్ మాల్‌లో బుధవారం రూబిక్స్ క్యూబ్ పోటీలు నిర్వహించారు. వరల్డ్ క్యూబ్ అసోసియేటిక్ నిర్వహించిన పోటీల్లో పలువురు యువకులు నాలుగు లెవెల్లో క్యూబ్ సాలివ్వంగ్‌లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్యూబ్ పోటీల ద్వారా యువతలో మానసిక చురుకుదనం పెరుగుతుందన్నారు. ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చిన యువతకు ప్రశంసా పత్రాలు, ట్రోఫీలను అందజేశారు.

డీగ్లామర్‌తో తెలుగువారికి

చేరువయ్యా..

- రంగుల ప్రపంచంలో రాణించడం సులభం కాదు
- ప్రముఖ సీరియల్ నటి కార్తీకదీపం ఫేం ప్రేమి విశ్వనాథ్
- ఏషియన్ పెయింట్స్ ఆవిష్కరణ.. కార్యక్రమంలో సందడి



సాక్షి, సిటీబ్యూరో: రంగులకు ప్రాధాన్యత ఇచ్చే ఈ ప్రపంచంలో రాణించడం అంత సులభం కాదు. ఇలాంటి వేదికపైన డీగ్లామర్ రోల్‌తో రాణించి తెలుగు ప్రేక్షకులకు చేరువవ్వడం చాలా సంతోషంగా ఉందని కార్తీకదీపం సీరియల్ ఫేం ప్రేమి విశ్వనాథ్ (వంటలక్క) తెలిపారు. నగరంలోని తాజ్ డెక్కన్ వేదికగా ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ఎమల్షన్ గృహశోభ పేరుతో ఒక విభిన్నమైన కలర్ షేడ్ గైడ్‌ను ప్రారంభించింది. ఈ గైడ్ ప్రజల ఆదరణ పొందిన తెలుగు సీరియల్స్‌లో కనిపించే ఇంటి రంగుల ఆధారంగా రూపొందించారు. దీనికి ఆదరణ పొందిన సీరియల్స్ కార్తీకదీపం–2లో దీప, గుండె నిండ గుడి గంటలులో మీనా, ఇంటింటి రామాయణంలో అవని వంటి ప్రముఖ పాత్రల ఆధారంగా రూపొందించిన ఈ గైడ్ నేటి ట్రెండింగ్ కలర్ ప్యాలెట్లను సులభంగా ఆస్వాదించేలా అందిస్తోంది. రంగులతో మనుషుల భావోద్వేగాలు ముడిపడి ఉంటాయని, ఈ రంగుల సమ్మేళనం ఆలోచనలను ప్రభావితం చేస్తాయని ప్రేమి విశ్వనాథ్ అన్నారు. ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈఓ అమిత్ సింగ్లే మాట్లాడుతూ.. రంగు అనేది కేవలం అలంకరణ అంశంగా మాత్రమే కాదని అనుభూతులు, సాంస్కృతికంగా కూడా భావిస్తామని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఈ గైడ్ సన్నిహితంగా సేవలందిస్తుందని అన్నారు.



భారత ఫుట్‌బాల్ కోచ్ పదవికి మార్క్వెజ్ రాజీనామా

ఢిల్లీ: భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ బాధ్యతల నుంచి మనోలో మార్క్వెజ్ తప్పుకున్నాడు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్)తో పరస్పర అవగాహనతో కోచ్ పదవికి రాజీనామా చేశాడు. కాంట్రాక్ట్‌లో మరో ఏడాది గడువు మిగిలి ఉన్నా... తన శిక్షణలో భారత జట్టు మెరుగైన ఫలితాలు సాధించలేకపోవడంతో 56 ఏళ్ల మార్క్వెజ్ కోచ్ పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. 'మార్క్వెజ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఏఐఎఫ్‌ఎఫ్ దీనికి అంగీకారం తెలిపింది. త్వరలో కొత్త కోచ్ పదవి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తాం' అని బోర్డు కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. గతేడాది జూన్‌లో రెండేళ్ల కాంట్రాక్టు కింద మార్క్వెజ్ జాతీయ కోచ్‌గా ఎంపిక చేశారు. అతడి శిక్షణలో 8 మ్యాచ్‌లాడిన భారత జట్టు అందులో ఒక్క దాంట్లో మాత్రమే విజయం సాధించింది. ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయింగ్‌లో మనకంటే తక్కువ ర్యాంక్ ఉన్న హాంకాంగ్ చేతిలో సైతం పరాజయం పాలైంది. ప్రస్తుతం అతడు ఐఎస్‌ఎల్‌లో గోవా క్లబ్‌కు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

ఎదురులేని భారత్

- రెండో టి20లో ఘనవిజయం
- 24 పరుగుల తేడాతో ఇంగ్లండ్ మహిళల ఓటమి


అమన్‌జ్యోత్

బ్రిస్టల్: ఇంగ్లండ్ పర్యటనలో భారత మహిళల క్రికెట్ జట్టు జోరు సాగుతోంది. ఆతిథ్య జట్టుపై సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తున్న టీమిండియా... వరుసగా రెండో టి20లో ఘన విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన రెండో టి20లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 24 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో సిరీస్‌లో 2–0తో ముందంజ వేసింది. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అమన్‌జ్యోత్ కౌర్ (40 బంతుల్లో 63 నాటౌట్; 9 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్(41 బంతుల్లో 63; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 157 పరుగులకు పరిమితమైంది. బ్యూమాంట్ (35 బంతుల్లో 54; 8 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ చేయగా... సోఫీ ఎకెల్‌స్టోన్ (23 బంతుల్లో 35; 4 ఫోర్లు, 1 సిక్స్), అమీ జోన్స్ (32; 4 ఫోర్లు) పోరాడారు. భారత బౌలర్లలో ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ శ్రీ చరణి 2 వికెట్లు పడగొట్టగా... దీప్తి శర్మ, అమన్‌జ్యోత్ కౌర్ చెరో వికెట్ తీశారు. ఇరు జట్ల మధ్య శుక్రవారం ఓవల్ మైదానంలో మూడో టి20 జరుగుతుంది. 'ప్లేయర్లంతా సమష్టిగా రాణించడంతో చక్కటి విజయం సాధ్యమైంది. వరల్డ్‌కప్ ప్రారంభానికి ఇంకా చాలా సమయం ఉంది. ప్రస్తుతానికి ఈ సిరీస్ గురించే ఆలోచిస్తున్నాం. స్పిన్ మా ప్రధాన బలం. దాన్ని మరింత ప్రోత్సహిస్తాం' అని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పేర్కొంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

గిల్ శతక మోత

భారత్ తొలి ఇన్నింగ్స్ 310/5 | మెరిసిన జైస్వాల్ | ఇంగ్లండ్‌తో రెండో టెస్టు | రాణించిన జడేజా

యువ సారథి శుబ్‌మన్ గిల్ మరో సెంచరీతో కదం తొక్కడంతో ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో భారత జట్టు భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో అలరిస్తే... రవీంద్ర జడేజా కీలక ఇన్నింగ్స్‌తో తన విలువ చాటుకున్నాడు. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై రెండో రోజు గిల్, జడేజా జంట ఎంతసేపు నిలుస్తుందనే దానిపైనే భారత స్కోరు ఆధారపడి ఉంది.


గిల్

బర్మింగ్‌హామ్: పరాజయంతో ఇంగ్లండ్ పర్యటనను ప్రారంభించిన భారత క్రికెట్ జట్టు... రెండో టెస్టును మెరుగ్గా మొదలు పెట్టింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం మొదలైన రెండో టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (216 బంతుల్లో 114 బ్యాటింగ్; 12 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. ఈ సిరీస్‌తోనే సారథ్య బాధ్యతలు చేపట్టిన గిల్... కెప్టెన్సీ ప్రభావం తన బ్యాటింగ్‌పై ఏమాత్రం లేదని మరోసారి నిరూపించాడు. తొలి టెస్టులో సెంచరీ చేసిన గిల్... రెండో టెస్టులోనూ దాన్ని పునరావృతం చేశాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (107 బంతుల్లో 87; 13 ఫోర్లు) సెంచరీ చేసే అవకాశం చేజార్చుకున్నాడు. రవీంద్ర జడేజా (67 బంతుల్లో 41 బ్యాటింగ్; 5 ఫోర్లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. కరుణ్ నాయర్ (50 బంతుల్లో 31; 5 ఫోర్లు), రిషభ్ పంత్ (42 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగైన ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్ 2 వికెట్లు పడగొట్టగా... కార్స్, స్టోక్స్, బషీర్ తలా ఒక వికెట్ తీశారు. చేతిలో 5 వికెట్లు ఉన్న భారత జట్టు రెండో రోజు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందనేది కీలకం.

జైస్వాల్ దూకుడు

గత మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఇంగ్లండ్ జట్టు... ఈ సారి కూడా టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ చేయాలని నిర్ణయించుకుంది. లీడ్స్‌తో పోల్చుకుంటే ఈ పిచ్ బ్యాటింగ్‌కు మరింత అనుకూలంగా ఉంటుందనే అంచనాల మధ్య తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. కేఎల్ రాహుల్ (26 బంతుల్లో 2) తొమ్మిదో ఓవర్‌లో అవుటయ్యాడు. తొలి స్పెల్‌ను కట్టుదిట్టంగా వేసిన వోక్స్‌కు ఈ వికెట్ దక్కింది. ఈ దశలో కరుణ్ నాయర్‌తో కలిసి జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఆరంభంలో కొన్ని ఉత్కంఠ క్షణాలను ఎదుర్కొన్న ఈ జంట... ఆ తర్వాత స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసింది. గత మ్యాచ్‌లో ఆరో స్థానంలో బరిలోకి దిగిన నాయర్... ఈసారి వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. క్రీజులో ఉన్నంతసేపు సాధికారికంగా ఆడిన అతడు కొన్ని చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. మరో ఎండ్‌లో జైస్వాల్ అలవోకగా పరుగులు రాబట్టాడు. వన్డే తరహాలో ఆడుతూ పాడుతూ... 59 బంతుల్లో 10 ఫోర్ల సహాయంతో హాఫ్‌సెంచరీ పూర్తిచేసుకున్నాడు. లంచ్ విరామానికి కాస్త ముందు కార్స్ బౌలింగ్‌లో నాయర్ అవుటయ్యాడు. దీంతో 80 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

గిల్ సంయమనం...

రెండో సెషన్‌లో గిల్, జైస్వాల్ జోరు చూస్తే భారత్‌కు తిరుగులేనట్లు అనిపించింది. మంచి బంతులను గౌరవించిన ఈ జంట... గతి తప్పిన బంతులపై విరుచుకుపడి పరుగులు రాబట్టింది. ఈ క్రమంలో జైస్వాల్ మరో సెంచరీ చేయడం ఖాయం అనుకుంటే... ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ అతడిని ఔట్ చేసి జట్టుకు బ్రేక్ త్రూ అందించాడు. చివరి సెషన్‌లో పంత్ ఎక్కువసేపు నిలవలేకపోగా... ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి (1) ఇలా వచ్చి అలా వెళ్లాడు. శార్దుల్ స్థానంలో జట్టులోకి వచ్చిన నితీశ్ ఆరు బంతులాడి వోక్స్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. వెంటవెంటనే రెండు వికెట్లు పడటంతో ఇంగ్లండ్ శిబిరంలో ఉత్సాహం పెరగగా... గిల్ సంయమనంతో ముందుకు సాగాడు. మరో ఎండ్ లో జడేజా అతడికి చక్కటి సహకారం అందించాడు.


జైస్వాల్

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) జేమీ స్మిత్ (బి) స్టోక్స్ 87; రాహుల్ (బి) వోక్స్ 2; కరుణ్ నాయర్ (సి) బ్రూక్ (బి) కార్స్ 31; గిల్ (బ్యాటింగ్) 114 ; పంత్(సి) క్రాలీ (బి) బషీర్ 25; నితీశ్ రెడ్డి (బి) వోక్స్ 1; జడేజా (బ్యాటింగ్)41; ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం (85 ఓవర్లలో 5 వికెట్లకు) 310. వికెట్ల పతనం: 1–15, 2–95, 3–161, 4–208, 5–211. బౌలింగ్: వోక్స్ 21–6–59–2; కార్స్ 16–2–49–1; టంగ్ 13–0–66–0; స్టోక్స్ 15–0–58–1; బషీర్ 19–0–65–1; రూట్ 1–0–8–0.

'ఇదేం సెలక్షన్'

బుమ్రాకు విశ్రాంతి ● కుల్దీప్‌కు దక్కని చోటు



ప్రపంచంలో బెస్ట్ బౌలర్ మీ జట్టులో ఉన్నాడు... అప్పుడప్పుడు ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నా రెండు టెస్టుల మధ్య ఏడు రోజుల విరామం వచ్చింది. గత మ్యాచ్‌లో ఒక వేళ ఏమైనా ఇబ్బంది కలిగినా...ఫిట్‌నెస్ ట్రైనర్, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్, ఫిజియోథెరపిస్ట్ అందుబాటులో ఉన్నప్పుడు కోలుకునేందుకు ఏడు రోజుల సమయం కూడా సరిపోతుంది. ఇప్పటికే తొలి టెస్టులో ఓడి జట్టు వెనుకంజలో ఉంది. ప్రత్యర్థిపై పైచేయి సాధించి సింగిల్ హ్యాండ్‌తో గెలిపించగల సత్తా అతనికి ఉంది. అయినా సరే... భారత జట్టు జస్‌ప్రీత్ బుమ్రాను ఈ మ్యాచ్‌లో ఆడించలేదు. పైగా తర్వాతి టెస్టులో పిచ్ అనుకూలంగా ఉంటుంది కాబట్టి అక్కడ ఆడతాడని కెప్టెన్ గిల్ వ్యాఖ్యానించడం క్షమించరానిది! అతని స్థానంలో ఆకాశ్‌దీప్‌కు అవకాశం లభించింది. మరో వైపు మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు మళ్లీ అన్యాయం జరిగింది. రెండో స్పిన్నర్‌గా అతనికి ఈ మ్యాచ్‌లోనూ అవకాశం లభించలేదు. అటాకింగ్ బౌలర్ అయిన కుల్దీప్ గత టెస్టులో లేకపోవడం లోటుగా కనిపించింది. ఈ సారి ఇంగ్లండ్‌పై చెలరేగే అవకాశం ఉందని భావించగా ఈ సారి స్థానమే దక్కలేదు. పైగా గత మ్యాచ్‌లో లోయర్ ఆర్డర్ విఫలమైంది కాబట్టి బ్యాటింగ్ చేయగల బౌలర్ కావాలంటూ సుదర్శన్ స్థానంలో సుందర్‌ను తీసుకున్నారు. ఒక రెగ్యులర్ బౌలర్‌ను అతని బ్యాటింగ్ సామర్థ్యాన్ని బట్టి ఎంపిక చేయడం ఏమిటో అర్థం కాలేదు! శార్దుల్ ఠాకూర్‌కు బదులుగా అదే తరహా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్, ఆంధ్రకు చెందిన నితీశ్ కుమార్ రెడ్డికి చాన్స్ ఇచ్చినా అతనూ విఫలమయ్యాడు. 'బుమ్రాను తప్పించడం నమ్మశక్యంగా లేదు. అతని పని భారం తగ్గించాలని చూస్తే ఇప్పటికే తగినంత విశ్రాంతి లభించింది. ఎంతో కీలకమైన మ్యాచ్‌కు అతను లేకపోవడం ఆశ్చర్యకరం. ఆటగాడు తన ఇష్టప్రకారం మ్యాచ్‌ను ఎంచుకునే అవకాశం ఇవ్వరాదు. ఇక్కడ టెస్టు గెలిచి 1-1తో సిరీస్‌ను సమం చేస్తే ఆ తర్వాత విశ్రాంతి ఇచ్చుకోవచ్చు' అని రవిశాస్త్రి దీనిపై తీవ్రంగా వ్యాఖ్యానించాడు. ఇలా బ్యాటింగ్ బలమే కావాలంటే సిరీస్ చివరకు వచ్చే సరికి బుమ్రా, మరో పది మంది బ్యాటర్లే బరిలోకి దిగుతారేమో!

సాక్షి సినిమా

వినోదం నేపథ్యంలో...


● సంగీత్ శోభన్, నయన్ సారిక, నాగ్ అశ్విన్

సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా కొత్త సినిమా ఆరంభమైంది. మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. 'కమిటీ కుర్రోళ్ళు' వంటి హిట్ చిత్రం తర్వాత పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల నిర్మిస్తున్న ద్వితీయ సినిమా ఇది. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్స్ వశిష్ట కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. తొలి సన్నివేశానికి దర్శకుడు కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. "ఫ్యాంటసీ, కామెడీ జోనర్ తెరకెక్కనున్న చిత్రమిది. రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 15 నుంచి హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో జరగనుంది" అని చిత్రబృందం పేర్కొంది. 'వెన్నెల' కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శీను, సుఖ్వీందర్ సింగ్, అరుణ భిక్షు, రమణ భార్గవ్, వాసు ఇంటూరి, రోహిణి, రోహన్ ఇతర పాత్రలు పోషించనున్న ఈ సినిమాకి సంగీతం: అనుదీప్ దేవ్, కెమేరా: రాజు ఎడురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేష్.

మధ్యతరగతివారికి కనెక్ట్ అయ్యేలా...


● వీవీ వినాయక్, గౌతమ్ కృష్ణ

"'సోలో బాయ్' నిర్మాత సతీష్ దర్శకునిగా ఇండస్ట్రీకి వచ్చి 'బట్టల రామస్వామి బయోపిక్' సినిమా ద్వారా నిర్మాతగా మారారు. ఈ చిత్రంలో హీరోగా నటించిన గౌతమ్ కృష్ణకు మంచి భవిష్యత్తు ఉండాలి. ఈ సినిమా మంచి విజయం సాధించి సతీష్ ప్రయాణానికి తోడ్పడాలి" అని డైరెక్టర్ వీవీ వినాయక్ పేర్కొన్నారు. 'బిగ్ బాస్' సీజన్ 7 ఫేమ్ గౌతమ్ కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్లుగా నటించిన సినిమా 'సోలో బాయ్'. వినాద్రి, బేబీ నేహా శ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మించారు. రేపు విడుదల కానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా వీవీ వినాయక్ హాజరు కాగా, నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్, నటుడు–సంగీత దర్శకుడు రఘు కుంచె అతిథులుగా హాజరై, 'సోలో బాయ్' విజయం సాధించాలని ఆకాంక్షించారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ– "ప్రతి మధ్యతరగతి కుటుంబానికి మా సినిమా కనెక్ట్ అవుతుంది. ఈ చిత్రం ద్వారా సతీష్‌గారు గొప్ప స్థాయికి వెళ్లి, పరిశ్రమకు మరింతమంది కొత్తవాళ్లను పరిచయం చేయాలనుకుంటున్నాను" అన్నారు. సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ– "మా 'సోలో బాయ్' ప్రేక్షకులందరిదీ.. మంచి విజయం అందించాలి" అని చెప్పారు. "మధ్యతరగతి కుటుంబంలో ఉండే ఎన్నో విషయాలు మా సినిమాలో ఉంటాయి" అన్నారు గౌతమ్ కృష్ణ. ఈ వేడుకలో రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి, పాటల రచయిత పూర్ణాచారి, కొరియోగ్రాఫర్ 'ఆట' సందీప్, నటి అనితా చౌదరి మాట్లాడారు.

అది నా ఫార్ములా కాదు

- నిర్మాత 'దిల్' రాజు



"ఓ నిర్మాతకు ఓ హీరోతో సినిమా కమిట్‌మెంట్ కావాలంటే అబ్‌నార్మల్ అడ్వాన్స్‌లు ఇచ్చి, వాళ్లను హోల్డ్ చేసుకుని సినిమా ప్లాన్ చేయాలి. అది నా ఫార్ములా కాదు. హీరోలకు, దర్శకులకు అడ్వాన్స్‌ల రూపంలో డబ్బులిచ్చి, వారిని కట్టడి చేయడం అనే దానికి నేను వ్యతిరేకం. ఓ దర్శకుడితో నాకు వేవ్ లెంగ్త్ సింక్ అయితే సినిమా చేస్తాను" అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన చిత్రం 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమీ గౌడ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో 'దిల్' రాజు పంచుకున్న విశేషాలు.

■ కథగా చూస్తే 'తమ్ముడు' సింపుల్ స్టోరీ. అక్కా తమ్ముడి మధ్య ఓ సమస్య రావడం, వారు ఆ సమస్యను సాల్వ్ చేసుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేశారు? అనేది మూవీలో చూస్తారు. స్క్రీన్‌ప్లే పరంగా కొత్తగా చూపిస్తూ, యాక్షన్ సీక్వెన్స్‌లతో ఆసక్తికరంగా తీశాడు వేణు శ్రీరామ్. ఇది యాక్షన్ ప్యాక్డ్ సినిమా. మొదటి ఇరవై నిమిషాల తర్వాత ఈ సినిమాలోని మిగిలిన కథంతా ఒక్క రోజులో జరుగుతుంది.

■ మా బ్యానర్‌లోని గత సినిమాలు అమెజాన్‌లో స్ట్రీమింగ్ అయ్యాయి. కానీ ఒకరితోనే ముందుకు వెళ్లలేం కదా. సో... 'తమ్ముడు' సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. ఇక థియేటర్‌లో సినిమా ప్రదర్శనకు ముందు ఆ సినిమా ఏ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుందో తెలిసేలా ఉండటం కరెక్ట్ కాదు. ఈ విషయం గురించి ఓటీటీ సంస్థలతో మాట్లాడినప్పుడు సపోర్ట్ చేస్తామన్నారు. ■ ఎఫ్‌డీసీ నుంచి గద్దర్ అవార్డ్స్ వేడుక చేశాం. అలాగే మన హైదరాబాద్‌లో ఆగిపోయిన చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఈ ఏడాది ఎఫ్‌డీసీ ద్వారా నిర్వహించాలని అనుకుంటున్నాం. ఆన్‌లైన్ టికెటింగ్, రన్‌ట్రాక్ (సినిమా వసూళ్లను ట్రాక్ చేసే విధానం) లను తెలంగాణాలో తీసుకువచ్చే ప్రక్రియ కొనసాగుతోంది.

■ మా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ సంస్థల్లో ఈ ఏడాది నాలుగు సినిమాలు (రౌడీ జనార్ధన, ఎల్లమ్మ, దేత్తడి, మరో సినిమా స్క్రిప్ట్ స్టేజ్‌లో ఉంది) రెడీ అవుతున్నాయి. ఇంకా అనిల్ రావిపూడితో ఓ సినిమా, 'మార్కో' హనీఫ్‌తో ఓ సినిమా, ఓ ఇద్దరు కొత్త డైరెక్టర్స్ సినిమాలు ఉన్నాయి. ఇంకా ఓ అడ్వెంచరస్ సినిమా కూడా ఉంది. ప్రశాంత్ నీల్‌తో సినిమా ఉంటుంది. హోల్డ్‌లో ఉన్న 'సెల్ఫిష్' సినిమాపై ఈ వారంలో ఓ క్లారిటీ వస్తుంది. కొత్తవారిని ప్రోత్సహించే విధంగా 'దిల్' రాజు డ్రీమ్స్‌లో కొన్ని ప్రాజెక్ట్స్ గురించి చర్చలు జరుగుతున్నాయి. 'దిల్' రాజు డ్రీమ్స్‌లో నిర్మాతలు కూడా దరఖాస్తు చేసు కుంటున్నారు. కథ బాగుంటే మేమే బడ్జెట్ కేటాయించి వాళ్లతో సినిమా చేస్తాం. వాళ్లు సినిమా చేసుకుని మా దగ్గరకు వస్తే మా గైడెన్స్‌తో ఆ సినిమాను రిలీజ్ చేస్తాం. ఇక పైరసీని అరికట్టేందుకు ఇండస్ట్రీ నుంచి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. కేంద్రప్రభుత్వం కూడా సపోర్ట్ చేస్తోంది. ఇటీవల విడుదలైన 'కుబేర, కన్నప్ప' చిత్రాల పైరసీ ప్రభావం కాస్త తగ్గింది ■ 'గేమ్ చేంజర్' చిత్రా నికి నిర్మాత మీరేనా? జీ స్టూడియోస్ సంస్థనా? జీ స్టూడియోస్ తమ సినిమా అంటున్నారట? అనే ప్రశ్నకు– "ఒకవేళ వాళ్లే అయితే లాస్ కట్టమనాలి" అని 'దిల్' రాజు బదులిచ్చారు.

అవమానపరచాలనుకోలేదు: నిర్మాత శిరీష్

"మా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌తో చిరంజీవి, రామ్‌చరణ్ గారికి ఎంతో అనుబంధం ఉంది. నేను అభిమానించే హీరోల్లో రామ్‌చరణ్‌గారు ఒకరు. ఆయన్ని అవమానపరచడం, కించపరచడం చేయను. అది జరిగిందని ఫ్యాన్స్ అనుకుంటున్నారు కాబట్టి వాళ్లకు, చరణ్‌గారికి క్షమాపణలు చెబుతున్నాను. మా బ్యానర్‌లో చరణ్‌గారితోనే మరో సినిమా చేయబోతున్నాం" అంటూ శిరీష్ ఓ వీడియో బైట్ రిలీజ్ చేశారు. ఓ ఇంటర్వ్యూలో 'గేమ్ చేంజర్' ఫ్లాప్ తర్వాత ఆ చిత్రదర్శకుడు శంకర్, హీరో రామ్‌చరణ్ కనీసం ఫోన్ కూడా చేయలేదన్నట్లుగా శిరీష్ పేర్కొన్నారు. ఆ తర్వాత నెలకొన్న వివాదంపై తన స్పందనను ఇలా వీడియో బైట్ ద్వారా తెలియజేశారు.

కథ విన్నారా?


● ప్రభాస్

హీరో ప్రభాస్, 'అమరన్' ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి కాంబినేషన్‌లో ఓ సినిమాకు సన్నాహాలు మొదలయ్యాయనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రభాస్‌ను కలిసి రాజ్‌కుమార్ ఓ కథ వినిపించారని, అది నచ్చి ప్రభాస్ సినిమా చేయడానికి ఆసక్తి కనబర్చారని భోగట్టా. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించనుందట. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. ఇటు రాజ్‌కుమార్ కూడా ధనుష్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది. ఈ ఇద్దరూ తమ కమిట్‌మెంట్స్ పూర్తి చేశాకే ఈ హీరో–దర్శకుడి కాంబినేషన్ గురించి ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

నవ్వుల షో టైం


● నవీన్ చంద్ర

"'షో టైం' సీరియస్ ఇన్వెస్టిగేషన్ చిత్రం కాదు. ఈ చిత్రంలో ప్రేక్షకులను ఆకర్షించే అంశాలు ఎన్నో ఉన్నాయి. సరైన కథతో మంచి సినిమాలను ప్రేక్షకులకు అందించాలన్నదే నా తపన" అని నవీన్ చంద్ర అన్నారు. నవీన్ చంద్ర, కామాక్షీ భాస్కర్ల హీరో హీరోయిన్లుగా మదన్ దక్షిణామూర్తి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'షో టైం'. అనిల్ సుంకర సమర్పణలో కిశోర్ గరికిపాటి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నవీన్ చంద్ర మాట్లాడుతూ– "ఒక కుటుంబంలో తక్కువ పాత్రల మధ్య సాగే ఈ కథలో ఎన్నో మలుపులు ఉన్నాయి. లాయర్‌గా నరేశ్, పోలీసాఫీసర్‌గా రాజా రవీంద్రగార్ల మధ్య వచ్చే సన్నివేశాలు నవ్వు తెప్పిస్తాయి. ఆ మ్యాజిక్‌ను థియేటర్స్‌లో చూడండి" అన్నారు. "ఈ చిత్రానికి 'షో టైం' టైటిల్ కరెక్ట్ అని సినిమా చూసిన ప్రేక్షకులే చెబుతారు. ఈ చిత్రం కొత్తగా, ఆసక్తికరంగా ఉంటుంది" అన్నారు దర్శకుడు మదన్. ఈ కార్యక్రమంలో రాజా రవీంద్ర మాట్లాడారు.

టాలీవుడ్ ఎంట్రీ


● హర్షాలీ మల్హోత్రా

'సింహా, లెజెండ్, అఖండ' వంటి హ్యాట్రిక్ విజయాల తర్వాత హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ సినిమాలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. కాగా సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'భజరంగీ భాయిజాన్' చిత్రంలో బాలనటిగా కనిపించిన హర్షాలీ మల్హోత్రా 'అఖండ 2: తాండవం' ద్వారా తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంలో ఆమె జనని పాత్ర పోషిస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. 'అఖండ 2: తాండవం' టీజర్‌కు నేషనల్‌వైడ్‌గా అద్భుతమైన స్పందన వచ్చింది. బాలకృష్ణ మునుపెన్నడూ చూడని లుక్‌లో కనిపిస్తారు. ఆది పినిశెట్టి పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నారు. సెప్టెంబర్ 25న మా సినిమాను భారీ స్థాయిలో విడుదల చేస్తాం" అని చిత్రయూనిట్ తెలిపింది.

కౌలాస్ కోటలో...


● 'దిల్' రమేశ్

'దిల్' రమేశ్, లల్లి మధు మిత, చంటి, వెంకీ, చిట్టిబాబు ముఖ్య తారలుగా రూపొందుతోన్న చిత్రం 'కౌలాస్ కోట'. పీఎస్పీ శర్మ దర్శకత్వంలో అద్వైత్ క్రియేషన్స్ బ్యానర్‌పై మన ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ 24 క్రాఫ్ట్స్ సమర్పణలో మాదాల నాగూర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం పోస్టర్ లాంచ్ వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించారు. మాదాల నాగూర్ మాట్లాడుతూ– "వైవిధ్యమైన కథతో రూపొందుతోన్న మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్మకంగా చెబుతున్నాను" అన్నారు. "స్టోరీ, స్క్రీన్‌ప్లే విషయంలో చాలా కష్టపడ్డాం. ఎర్రా సంజీవరాజ్ చక్కని కథ, మాటలు అందించారు. నవరసాలతో పాటు వినూత్నమైన కథతో రూపొందే ఈ చిత్రం విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం" అన్నారు పీఎస్పీ శర్మ.

దీక్ష అవసరం


● అలేఖ్య, ఆక్సా ఖాన్

కిరణ్, అలేఖ్య రెడ్డి జోడీగా, ఆక్సా ఖాన్, తులసి, అనూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దీక్ష'. ఆర్‌కే ఫిలిమ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో స్నిగ్ధ క్రియేషన్స్‌పై పి. అశోక్ కుమార్‌తో కలిసి నిర్మించారు. ఈ సినిమాని ఈ నెలాఖరులో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– "ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'దీక్ష'. డబ్బింగ్, మిక్సింగ్, రీ రికార్డింగ్ పనులు పూర్తయ్యాయి. ప్రతి మనిషికి దీక్ష అవసరం. ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చు అనే మంచి పాయింట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. దర్శకుడిగా నాకు ఇది 8వ సినిమా. నిర్మాతగా 50 చిత్రాలకు చేరువవుతున్నాను. ఈ వారంలో ట్రైలర్ రిలీజ్ చేసి, ఈ నెలాఖరున సినిమాని రిలీజ్ చేస్తాం. ఈ చిత్రం తర్వాత 'మహిళా కబడ్డీ' అనే చిత్రాన్ని రూపొందించబోతున్నాం" అన్నారు. కిరణ్, ఆక్సా ఖాన్ మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	288	83,409
నిఫ్టీ ▽	88	25,453

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	20,363	△	159
డోజోన్స్	44,464	▽	31
ఎఫ్‌టీఎస్ఈ 100	8,775	▽	10
డాక్స్	23,790	△	117
షాంఘై	3,455	▽	3
నికాయ్	39,762	▽	224

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.20	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.40	119.30
€	యూరో	ఎస్‌బీఐ	96.66	102.41
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.93	60.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.79	58.69
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.87	69.59
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.89	23.89
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.35	24.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.84



లిస్టింగ్... సూపర్‌హిట్

అదరగొట్టిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్, సంభవ్ స్టీల్ అరంగేట్రం



ముంబై: హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, సంభవ్ స్టీల్ ట్యూబ్స్ లిస్టింగులు సూపర్‌హిట్టయ్యాయి. మార్కెట్ అనిశ్చితుల్లోనూ అదిరిపోయే అరంగేట్రం చేసి ఇన్వెస్టర్లకు తొలిరోజే లాభాలు పంచాయి. హెచ్‌డీబీ ఫైనాన్స్ షేరు ఇష్యూ ధర(రూ.740)తో పోలిస్తే బీఎస్‌ఈలో 13% ప్రీమియంతో రూ.835 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 15% ఎగసి రూ.850 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 14% లాభంతో రూ.841 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.69,758 కోట్లుగా నమోదైంది.

- సంభవ్ స్టీల్ ట్యూబ్స్ లిస్టింగూ సక్సెస్ అయ్యింది. ఇష్యూ ధర(రూ.82)తో పోలిస్తే బీఎస్‌ఈలో 34% ప్రీమియంతో రూ.110 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 35% పెరిగి రూ.111 వద్ద గరిష్టాన్ని తాకింది. గరిష్టాల వద్ద స్వల్ప లాభాలు చోటు చేసుకున్నప్పటికీ.., చివరికి 19% లాభంతో రూ.98 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,875 కోట్లుగా నమోదైంది.

జీవిత బీమా అవగాహన కోసం.. రూ.450 కోట్లు



మూడేళ్ల పాటు ప్రచార కార్యక్రమాలు

ముంబై: బీమాపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే దిశగా జీవిత బీమా కంపెనీలు చేతులు కలిపాయి. రూ.450 కోట్లతో మూడేళ్ల పాటు పలు మాధ్యమాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాయి. సబ్‌సే పెహలే లైఫ్ ఇన్సూరెన్స్ పేరుతో ప్రచారాన్ని ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ ప్రారంభించింది. అన్ని జీవిత బీమా కంపెనీలు తమ ప్రీమియం ఆదాయానికి అనుగుణంగా ఈ ప్రచారం కోసం నిధులు అందించనున్నాయి. 'ఏటా రూ.150–160 కోట్ల వరకు ఖర్చు చేస్తాం. మూడేళ్ల పాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు సరిపడా ఖర్చును సమకూర్చేందుకు ఇప్పటికే హామీ లభించింది' అని ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ చైర్మన్ కమలేష్ రావు తెలిపారు. గత కొన్ని సంవత్సరాల్లో బీమా వ్యాప్తి తగ్గిన నేపథ్యంలో కంపెనీలు ఈ నిర్ణయానికి రావడం గమనార్హం. 2022–23లో జీవిత బీమా విస్తరణ జీడీపీలో 4% కాగా, 2023–24లో 3.7%కి, గత ఆర్థిక సంవత్సరంలో 3.2%కి తగ్గుతూ వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా బీమా విస్తరణలో భారత్ 10వ స్థానంలో ఉంది.

బ్లూచిప్ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్‌కు 288 పాయింట్ల నష్టం • 88 పాయింట్లు పతనమైన నిఫ్టీ



ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో బుధవారం స్టాక్ సూచీలు నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 288 పాయింట్లు నష్టపోయి 83,409 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 88 పాయింట్లు పతనమై 25,453 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ఆరంభంలో కాసేపు లాభాల్లో కదలాడాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై విధించిన టారిఫ్‌ల తుది గడువు సమీపిస్తుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు. దీంతో సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 546 పాయింట్లు పతనమై 83,151 వద్ద, నిఫ్టీ 164 పాయింట్లు క్షీణించి 25,378 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (1.30%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (0.66%), ఎల్‌అండ్‌టీ (2%) నష్టపోయి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. సెన్సెక్స్ కోల్పోయిన మొత్తం పాయింట్లలో 106 ఈ షేర్ల వాటాయే కావడం గమనార్హం.
- రియాక్టర్ పేలుడు, అగ్ని ప్రమాదం నేపథ్యంలో సిగాచి ఇండస్ట్రీస్ మూడోరోజూ పడింది. 7% నష్టపోయి రూ.43 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మైక్రోసాఫ్ట్‌లో మరిన్ని కొలువుల కోత	ఆఫీస్ స్పేస్ లీజింగ్.. జీసీసీలు టాప్‌గేర్

ఇండియన్ బ్యాంక్ రుణ రేటు తగ్గింపు

కనీస బ్యాలెన్స్ చార్జీల ఎత్తివేత



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఇండియన్ బ్యాంక్ ఏడాది కాల మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్ఆర్) 5 బేసిస్ పాయింట్లు (0.05 శాతం) తగ్గించి 9 శాతానికి సవరించినట్టు ప్రకటించింది. 3వ తేదీ నుంచి ఈ రేటు అమల్లోకి వస్తుందని తెలిపింది. దీనివల్ల రుణగ్రహీతలకు ఉపశమనం లభిస్తుందని పేర్కొంది. ఆటో, వ్యక్తిగత, గృహ రుణాల రేట్లకు ఏడాది కాల ఎంసీఎల్ఆర్ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. మరోవైపు అన్ని సేవింగ్స్ ఖాతాలకు సంబంధించి కనీస బ్యాలెన్స్ నిర్వహణ చార్జీలను ఎత్తివేస్తున్నట్టు ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. జూలై 7 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెలిపింది. దీనివల్ల మరింత మందికి బ్యాంకింగ్ సేవలు చౌకగా అందుబాటులోకి వస్తాయని పేర్కొంది.

ఆర్‌కామ్.. 'ఫ్రాడ్' ఖాతా!

వర్గీకరించనున్న ఎస్‌బీఐ

- ఆర్‌బీఐకి ఇచ్చే రిపోర్ట్‌లో అనిల్ అంబానీ పేరు కూడా చేర్చాలని నిర్ణయం



న్యూఢిల్లీ: దివాలా చట్టం కింద చర్యలు ఎదుర్కొంటున్న టెలికం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను 'ఫ్రాడ్' అకౌంట్‌గా ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వర్గీకరించనుంది. అలాగే రిజర్వ్ బ్యాంకుకి ఇచ్చే నివేదికలో సంస్థ మాజీ డైరెక్టర్ అనిల్ అంబానీ పేరును కూడా చేర్చాలని నిర్ణయించింది. జూన్ 23వ తేదీతో ఎస్‌బీఐ నుంచి ఈ మేరకు లేఖ అందినట్లు స్టాక్ ఎక్స్చేంజీలకు ఆర్‌కామ్ తెలిపింది. దీని ప్రకారం ఆర్‌కామ్, దాని అనుబంధ సంస్థలు వివిధ బ్యాంకుల నుంచి రూ. 31,580 కోట్ల రుణం తీసుకున్నాయి. ఆర్‌కామ్‌కి పంపిన లేఖ ప్రకారం.. రుణంగా తీసుకున్న నిధులను సంక్లిష్టమైన విధంగా వివిధ గ్రూప్ సంస్థలు మళ్లించినట్లు గుర్తించామని ఎస్‌బీఐ పేర్కొంది. దీనిపై జారీ చేసిన షోకాజ్ నోటీసుకి కంపెనీ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆర్‌కామ్ ఖాతాను 'ఫ్రాడ్'గా వర్గీకరించాలని ఫ్రాడ్ ఐడెంటిఫికేషన్ కమిటీ నిర్ణయించినట్లు వివరించింది.

లేఖలోని మరిన్ని వివరాలు..

- తీసుకున్న రుణాల్లో రూ. 13,667.73 కోట్ల (సుమారు 44 శాతం) మొత్తాన్ని రుణాల చెల్లింపులు, ఇతరత్రా అవసరాల కోసం కంపెనీలు వాడుకున్నాయి. మరో రూ. 12,692.31 కోట్ల (41 శాతం) మొత్తాన్ని సంబంధిత (కనెక్టెడ్) పార్టీలకు చెల్లించేందుకు ఉపయోగించుకున్నాయి.
- దేనా బ్యాంకు నుంచి పొందిన రూ. 250 కోట్ల రుణాన్ని, గ్రూప్ కంపెనీ రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఫ్రాకి ఇంటర్–కార్పొరేట్ డిపాజిట్‌గా మళ్లించి, ఆ తర్వాత విదేశీ వాణిజ్య రుణం చెల్లింపునకు ఉపయోగించుకున్నట్లుగా కనిపిస్తోంది. అలాగే, మూలధన వ్యయాల అవసరాల కోసం ఐఐఎఫ్‌సీఎల్ రూ. 248 కోట్ల రుణం ఇవ్వగా, ఆర్‌కామ్ రూ. 63 కోట్లను రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్, రూ. 77 కోట్లను ఆర్ఐఈఎల్‌కి చెల్లించింది. అది కూడా నేరుగా కాకుండా ఆర్‌సీఐఎల్ ద్వారా మళ్లించింది. దీని గురించి స్పష్టమైన వివరణ లేదు. దీన్ని బట్టి చూస్తే దేనా బ్యాంక్, ఐఐఎఫ్‌సీఎల్ ఇచ్చిన రుణాల దుర్వినియోగం జరిగినట్లుగా కనిపిస్తోంది.
- ఆర్‌కామ్ గ్రూప్ తీసుకున్న రుణాలను ఆర్ఐటీఎల్, ఆర్‌టీఎల్, ఆర్‌సీఐఎల్, నెటిజెన్, రిలయన్స్ వెబ్‌స్టోర్ల ద్వారా దారి మళ్లించారు. రూ. 100 కోట్ల వరకు నిధులను గ్రూప్ సంస్థల మధ్య తిప్పుకునేందుకు ఇచ్చిన ఇంట్రాడే పరిమితి వెసులుబాటును ఆర్‌డబ్ల్యూఎస్ఎల్, ఆర్‌టీఎల్, ఆర్‌సీఐఎల్ రోజులో అనేక సార్లు ఉపయోగించుకున్నాయి. ఈ లావాదేవీలన్నీ సిసలైనవిగానో లేదా రోజువారీ వ్యాపార కార్యకలాపాల్లో భాగంగానో జరిపినవిగా కనిపించడం లేదు.

'ఫ్రాడ్'గా మారిస్తే..

ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం బ్యాంకులు ఏదైనా ఖాతాను 'ఫ్రాడ్'గా వర్గీకరించినప్పటి నుంచి 21 రోజుల్లోగా ఆ విషయాన్ని ఆర్‌బీఐకి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అలాగే సీబీఐ/పోలీసులకు కూడా ఫిర్యాదు చేయాలి. మోసం చేసిన రుణగ్రహీతపై (ప్రమోటర్ డైరెక్టర్, ఇతరత్రా హోల్‌టైమ్ డైరెక్టర్లు సహా) కఠినచర్యలు ఉంటాయి. డిఫాల్ట్ అయిన రుణగ్రహీతలు, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించిన అయిదేళ్ల వరకు మరే ఇతర బ్యాంకులు, డెవలప్‌మెంట్ ఫైనాన్స్ సంస్థలు, ప్రభుత్వ రంగ ఎన్‌బీఎఫ్‌సీల నుంచి రుణాలు తీసుకోవడానికి ఉండదు.

ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధం..: ఆర్‌కామ్

ఎస్‌బీఐ నిర్ణయంపై ఆర్‌కామ్ స్పందించింది. తమ రుణ ఖాతాలను మోసపూరితమైనవిగా వర్గీకరించడమనేది ఆర్‌బీఐ మార్గదర్శకాలు, కోర్టు ఆదేశాలకు కూడా విరుద్ధమని స్పష్టం చేసింది. జూలై 2న బ్యాంకుకు ఆర్‌కామ్ లాయర్లు ఈ మేరకు లేఖ రాశారు. ఆరోపణలపై వ్యక్తిగతంగా వివరణనిచ్చేందుకు అనిల్ అంబానీకి కనీసం అవకాశం ఇవ్వకుండా, ఏకపక్షంగా ఎస్‌బీఐ నిర్ణయం తీసుకోవడం షాక్‌కు గురిచేసిందని, సహజ న్యాయ సూత్రాలకు ఇది విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఆర్‌కామ్‌లోని ఇతర నాన్–ఎగ్జిక్యూటివ్, స్వతంత్ర డైరెక్టర్లకు ఇచ్చిన షోకాజ్ నోటీసును విత్‌డ్రా చేసుకున్న ఎస్‌బీఐ, అంబానీ కూడా నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టరే అయినప్పటికీ ఆయన్ను మాత్రం వేరుగా చేసి చూడటం సరికాదని లాయర్లు వివరించారు. షోకాజ్ నోటీసుకు వివరణ ఇచ్చిన దాదాపు ఏడాది వరకు బ్యాంకు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తమ వివరణ సంతృప్తికరంగానే ఉందని భావించినట్లు తెలిపారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఆర్‌సీఐ, హైదరాబాద్‌లో 11 సైంటిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూమెటీరియల్స్(ఏఆర్‌సీఐ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
- » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్ ఈ–03, సైంటిస్ట్ సి–01, సైంటిస్ట్ బి–07.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** సైంటిస్ట్ ఈ పోస్టుకు 45 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు సైంటిస్ట్–ఈ కు 2,38,895, సైంటిస్ట్–సికు రూ.1,36,405, సైంటిస్ట్–బికు రూ.1,14,945.
- » **దరఖాస్తులకు చివరితేది:** 28.07.2025.
- » **వెబ్‌సైట్:** https://www.arci.res.in

అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో యూజీ, పీజీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ.. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సుల వివరాలు:** యూజీ(బీఏ/బీకాం/బీఎస్సీ(సీబీసీఎస్), పీజీ (ఎంఏ /ఎంకాం/ఎంఎస్సీ/ఎంబీఏ/ఎంఎల్ఐఎస్‌సీ/బీఎల్ఐఎస్‌సీ/డిప్లొమా).
- » **మీడియం:** ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ.
- » **అర్హత:** ఇంటర్మీడియట్, డిగ్రీ లేదా దానికి సమానమైన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.08.2025
- » **వెబ్‌సైట్:** https://online.braou.ac.in

సీఐడబ్ల్యూఏ, భువనేశ్వర్‌లో 52 పోస్టులు

ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఉమెన్ ఇన్ అగ్రికల్చర్ (సీఐడబ్ల్యూఏ).. ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఆన్ ఉమెన్ ఇన్ అగ్రికల్చర్(ఏఐసీఆర్‌పీ ఆన్ డబ్ల్యూఐఏ) కింద దేశవ్యాప్తంగా ఉన్న 13 సెంటర్లలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 52.
- » **పోస్టుల వివరాలు:** యంగ్ ప్రొఫెషనల్ 1–26, ఫీల్డ్ అసిస్టెంట్–26.
- » **అర్హత:** యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు బీఎస్సీ (అగ్రికల్చర్, హార్టికల్చర్, యానిమల్ హస్బెండరీ, ఫిషరీ, హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్), ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఏదైనా విభాగంలో డిగ్రీ/డిప్లొమా లేదా రెండేళ్ల ఒకేషనల్ అగ్రికల్చర్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం తదితర నైపుణ్యాలు ఉండాలి.
- » **వయసు:** 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** యంగ్ ప్రొఫెషనల్–1 పోస్టుకు రూ.30,000, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు రూ.16,500.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 04.07.2025.
- » **వెబ్‌సైట్:** https://icar-ciwa.org.in

నైపర్, మొహాలీలో 15 ఫ్యాకల్టీ పోస్టులు

మొహాలీ(పంజాబ్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్).. ఒప్పంద ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
- » **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–8, అసోసియేట్ ప్రొఫెసర్–5, అసిస్టెంట్ ప్రొఫెసర్–2.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:**50ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** ప్రొఫెసర్‌కు రూ.1,59,000 నుంచి రూ.2,20,200. అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,39,600 నుంచి రూ.2,11,300, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500 నుంచి రూ.1,67,400.
- » **ఎంపిక విధానం:**డెమో,ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.07.2025
- » **వెబ్‌సైట్:** https://niper.gov.in

ఇంజనీరింగ్.. క్రేజీ బ్రాంచ్‌లు ఇవే!

దేశంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో అనేక బ్రాంచ్‌లు ఉన్నాయి. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్‌తో పాటు మరెన్నో కోర్ బ్రాంచ్‌లు, కొత్త బ్రాంచ్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడేలా.. ముఖ్యమైన ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

- » టాపర్స్ తొలి ఛాయిస్‌గా సీఎస్‌ఈ
- » ఆ తర్వాత స్థానంలో ఈసీఈ, ఈఈఈ
- » బ్రాంచ్ ఎంపికలో ఆసక్తి ముఖ్యమంటున్న నిపుణులు



కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్

- ✦ జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్ టాప్ ర్యాంకర్ల తొలి ప్రాథమ్యం.. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్. గత మూడు, నాలుగేళ్లుగా అడ్వాన్స్‌డ్‌లో ఫస్ట్ ర్యాంక్ పొందిన అభ్యర్థులు సీఎస్‌ఈ బ్రాంచ్‌లోనే చేరారు. అంతేకాకుండా జనరల్ కేటగిరీలో 1500లోపు ర్యాంకుతోనే అన్ని ఐఐటీల్లో సీఎస్‌ఈ సీట్లు నిండిపోవడమే ఈ బ్రాంచ్ పట్ల విద్యార్థులు చూపుతున్న ఆసక్తికి నిదర్శనం.
- ✦ ఐఐటీలే కాకుండా ఎన్ఐటీలు, రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే ఈఏపీసెట్ ర్యాంకర్లది సైతం ఇదే ఆలోచన. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, టాప్–10, 20 ఇన్‌స్టిట్యూట్‌లలో జనరల్ కేటగిరీలో అయిదు వేలలోపు ర్యాంకుతోనే సీఎస్‌ఈ బ్రాంచ్‌లో సీట్లు భర్తీ అవుతున్నాయి.
- ✦ ప్రస్తుత జాబ్ మార్కెట్ ట్రెండ్‌ను చూస్తే సీఎస్‌ఈ ఉత్తీర్ణులకు ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తాయనే అభిప్రాయం నెలకొంది. అందుకే నేటి ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)యుగంలో సీఎస్ ఈ బ్రాంచ్‌లో చేరి సంబంధిత నైపుణ్యాలు సొంతం చేసుకుంటే..ఆకర్షణీయ వేతనాలతో ఆఫర్లు అందుకోవచ్చని విద్యార్థులు భావిస్తున్నారు.

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్

- ✦ విద్యార్థులు ఇంజనీరింగ్ బ్రాంచ్ ఎంపిక పరంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(ఈసీఈ) బ్రాంచ్ రెండో స్థానంలో నిలుస్తోంది. ఐఐటీల్లో గత రెండేళ్లుగా జనరల్ కేటగిరీలో మూడున్నర వేల లోపు ర్యాంకుతో ఈ బ్రాంచ్‌లో సీట్లు భర్తీ అవుతున్నాయి. ఇదే తీరు ఇతర జాతీయ, రాష్ట్ర స్థాయి ఇన్‌స్టిట్యూట్‌ల్లోనూ ప్రతిబింబిస్తోంది. జాబ్ మార్కెట్ పరిస్థితులు, ఉన్నత విద్య అవకాశాలే ఇందుకు కారణంగా చెబుతున్నారు.
- ✦ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), రోబోటిక్స్, స్మార్ట్ టెక్నాలజీస్, శాటిలైట్స్ వంటి వాటితోపాటు 5జీ టెక్నాలజీతో టెలికం రంగం విస్తరిస్తోంది. దీంతో ఈ రంగంలో ఉద్యోగాలు లభించడం ఖాయంగా కనిపిస్తోంది.
- ✦ ఈసీఈ నిపుణులు సర్క్యూట్స్, మైక్రోప్రాసెసర్స్, శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ తదితర టెక్నాలజీపై పనిచేస్తారు.
- ✦ ఈసీఈ ఉత్తీర్ణులకు టెలికమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ) బ్రాంచ్.. విద్యార్థుల ప్రాథమ్యత పరంగా రెండు, మూడు స్థానాల్లో నిలుస్తోంది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సర్క్యూట్ పరికరాలు ముఖ్యంగా ఎలక్ట్రానిక్ పరికరాల డిజైన్–డవలప్‌మెంట్, కమ్యూనికేషన్, మెషిన్ కంట్రోల్ తదితరాలకు సంబంధించిన టెక్నాలజీపై ఈఈఈ బ్రాంచ్ దృష్టిసారిస్తుంది.

- ✦ ఈ కోర్సులో భాగంగా విద్యార్థులకు సెమికండక్టర్స్, అనలాగ్ ఎలక్ట్రానిక్స్, పవర్‌సిస్టమ్స్, ట్రాన్స్‌మిషన్ లైన్స్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ (ఏసీ అండ్ డీసీ) మెషిన్స్, కంట్రోల్ సిస్టమ్స్ గురించి బోధిస్తారు.
- ✦ ఈ కోర్సు ఉత్తీర్ణులకు ప్రైవేట్ రంగంతోపాటు, ప్రభుత్వ రంగంలోనూ ఉద్యోగాలు లభిస్తాయి. బీహెచ్‌ఈఎల్, టాటా ఎలక్ట్రిక్ కంపెనీస్ వంటి సంస్థల్లో క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్, సిస్టమ్ డిజైన్ ఇంజనీర్, ఫీల్డ్ ఇంజనీర్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు.

మెకానికల్ ఇంజనీరింగ్

- ✦ దశాబ్దాలుగా ఎవర్‌గ్రీన్(వన్నెతగ్గని) విభాగంగా మెకానికల్ ఇంజనీరింగ్‌కు పేరుంది. అందుకే టాప్ 5 బెస్ట్ బ్రాంచ్ జాబితాలో మెకానికల్ నిలుస్తోంది. ఐఐటీల్లో జనరల్ కేటగిరీలో నాలుగు వేల లోపు ర్యాంకుతో ఈ బ్రాంచ్‌లో సీట్లు భర్తీ అవుతున్నాయి.
- ✦ ఇది చాలా విస్తృతమైన బ్రాంచ్. మెకానికల్ అనగానే టక్కున గుర్తుకొచ్చే ఆటోమొబైల్ రంగంలో.. ఆటో రిక్షా నుంచి బోయింగ్ విమానాల ఉత్పత్తి వరకూ.. ప్రతి విభాగంలోనూ మెకానికల్ ఇంజనీరింగ్ నైపుణ్యాలు కలిగిన వ్యక్తుల అవసరం ఏర్పడుతోంది. అందుకే ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ నుంచి ఏరోస్పేస్ వరకూ.. అనేక రంగాల్లో మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణుల సేవలు తప్పనిసరిగా మారాయి.
- ✦ మెకానికల్ ఇంజనీరింగ్‌లో మెకానికల్ సిస్టమ్స్ ప్రధానంగా యంత్రాలు, వాటి డిజైన్, ఆపరేషన్స్, ఉత్పత్తి ప్రక్రియలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.
- ✦ ఈ కోర్సు ఉత్తీర్ణులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.హెచ్‌పీసీఎల్, ఇండియన్ ఆయిల్, ఎల్ అండ్ టీ, టాటా మోటార్స్, రిలయన్స్ తదితర కంపెనీల్లో డిజైన్ ఇంజనీర్, మెకానికల్ ఇంజనీర్, ప్రాజెక్ట్ ఇంజనీర్, మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజనీర్, మెయింటనెన్స్ ఇంజనీరింగ్‌గా కొలువులు సొంతం చేసుకోవచ్చు.
- ✦ రోబోటిక్స్, డ్రోన్స్(అన్‌మ్యాన్డ్ వెహికిల్స్)వంటి వాటికి పెరుగుతున్న ప్రాధాన్యం కారణంగా మెకానికల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

సివిల్ ఇంజనీరింగ్

- ✦ భవనాలు, వంతెనలు వంటి మౌలిక వసతుల రూపకల్పనలో, నిర్మాణంలో, నిర్వహణలో కీలక పాత్ర పోషించే విభాగం.. సివిల్ ఇంజనీరింగ్. ఈ కోర్సులో భాగంగా నిర్మాణ రంగంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరచడం, ఆధునీకరించడంపై అవగాహన కల్పిస్తారు. దీంతోపాటు ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, జియోటెక్నికల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ తదితర అంశాలను బోధిస్తారు.
- ✦ సివిల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులకు నిర్మాణ రంగంలో, బహుళజాతి కంపెనీల్లో, రక్షణ రంగంలో ఉద్యోగాలు లభిస్తాయి.
- ✦ సివిల్ ఇంజనీర్, స్ట్రక్చరల్ ఇంజనీర్, జియో టెక్నికల్ ఇంజనీర్, సైట్ ఇంజనీర్, కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌ను అందుకోవచ్చు.
- ✦ సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులకు భవిష్యత్‌లో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, అర్బన్ ప్లానింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్‌లో విస్తృత అవకాశాలు లభిస్తాయని అంచనా.

ఏఐ అండ్ ఎంఎల్

ఇటీవల కాలంలో ఆటోమేషన్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారం–దేశంలోని పలు ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు అందుబాటులోకి తెస్తున్న కొత్త బ్రాంచ్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్. ఈ బ్రాంచ్ అకడమిక్స్ ద్వారా ఇండస్ట్రీ 4.0గా స్కిల్స్‌గా పేర్కొంటున్న ఏఐ, ఎంఎల్‌తోపాటు రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, 5–జి టెక్నాలజీస్‌పై అవగాహన కల్పిస్తారు.

ఇతర బ్రాంచ్‌లు కూడా

వీటితోపాటు జాబ్ మార్కెట్ పరిస్థితులు, ప్లేస్‌మెంట్స్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులు ఇతర బ్రాంచ్‌లకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు.కెమికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్/మెరైన్ ఇంజనీరింగ్,టెక్స్‌టైల్ టెక్నాలజీ వంటివి ముందంజలో నిలుస్తున్నాయి.

ఆసక్తికే ప్రాధాన్యం

బ్రాంచ్ ఎంపికలో విద్యార్థులు తమ ఆసక్తికి ప్రాధాన్యమివ్వడం మేలు. ఎందుకంటే.. ఆసక్తి లేని బ్రాంచ్‌లో చేరితే అందులో అకడమిక్‌గా రాణించలేక భవిష్యత్తులో నిరుత్సాహానికి గురయ్యే ఆస్కారముంది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో ఆసక్తి లేని బ్రాంచ్‌ను ఎంచుకున్నా.. దానిపై ఇష్టం పెంచుకొని రాణించేందుకు కృషి చేయాలి. ఏ బ్రాంచ్ విద్యార్థులైనా.. క్లాస్ రూమ్ లెర్నింగ్‌కే పరిమితం కాకుండా.. లేటెస్ట్ నైపుణ్యాలు సొంతం చేసుకునేలా స్వీయ ప్రణాళికలు రూపొందించుకోవాలి. అప్పుడే బీటెక్ పూర్తయ్యే నాటికి జాబ్ మార్కెట్ నైపుణ్యాలను అందుకోవడంలో ముందుంటారు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

బాబు సర్కారు కుట్రలకు చెంపదెబ్బ!

- వైఎస్ జగన్ తదితరులపై నేరారోపణలకు ప్రాథమిక ఆధారాలు లేవు.. అందుకే మేం జోక్యం చేసుకుంటున్నాం
- సింగయ్య మృతి కేసులో ప్రభుత్వం, తప్పుడు వాదనను ఎండగడుతూ హైకోర్టు కీలక తీర్పు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ కార్యకర్త సింగయ్య మృతి ఘటనను రాజకీయ చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటి ఉత్తర్వులను హైకోర్టు ఇచ్చింది. సింగయ్యను ఉద్దేశపూర్వకంగానే కారు కింద పడేసి తొక్కించారంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న వాదనను హైకోర్టు ఎండగట్టింది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులపై బీఎన్‌ఎస్‌లోని కఠిన సెక్షన్ 105 కింద కేసు పెట్టడాన్ని తప్పుపట్టింది. జీవితఖైదు పడే ఈ సెక్షన్ కింద జగన్ తదితరులపై ఉద్దేశపూర్వకంగా కూటమి ప్రభుత్వం పెట్టిన కేసును ఆక్షేపించింది. సెక్షన్ 105 కింద కేసు పెట్టేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని తేల్చి చెప్పింది. సాధారణంగా ఏ కేసులో కూడా ఎఫ్‌ఐఆర్ దశలో తాము జోక్యం చేసుకోమని, అయితే ఈ కేసులో జోక్యం చేసుకోవాల్సినంత అరుదైన కేసని, అందుకే జోక్యం చేసుకుంటున్నామని తెలిపింది. జగన్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజనీ, జగన్ పీఎస్ నాగేశ్వరరెడ్డిలపై పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్- ఓ వ్యక్తి మరణానికి కారణమైనప్పటికీ హత్య కానిది) కింద కేసు నమోదు చేయడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. జగన్ తదితరులు కేవలం కారులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు మాత్రమేనని స్పష్టం చేసింది. సెక్షన్ 105 కింద కేసు పెట్టాలంటే ఓ వ్యక్తిని చంపాలన్న ఉద్దేశం, తమ చర్యల వల్ల ఆ వ్యక్తి చనిపోతారని స్పష్టంగా తెలిసి ఉండటం తప్పనిసరి అని, అప్పుడు మాత్రమే ఆ సెక్షన్ కింద కేసు నమోదు చేయడం సాధ్యమవుతుందని తెలిపింది. అయితే ఫిర్యాదును, అందులో ఇతర అంశాలను పరిశీలిస్తే, జగన్ తదితరులకు సింగయ్యను చంపాలన్న ఉద్దేశం గానీ, తమ చర్యల వల్ల ఆయన చనిపోతారని తెలిసి ఉండటం గానీ జరగలేదంది. సాధారణంగా తాము ఏ కేసులో కూడా ఎఫ్‌ఐఆర్ దశలో జోక్యం చేసుకోమని, అయితే ఎఫ్‌ఐఆర్‌లోని నేరారోపణలకు ప్రాథమిక ఆధారాలు లేవన్న నిర్ణయానికి వస్తే మాత్రం జోక్యం చేసుకోకుండా ఉండలేమంది. జోక్యం చేసుకుండా ఉండే విషయంలో ఎలాంటి నిషేధం లేదంది. అలా జోక్యం చేసుకోవాల్సినటువంటి అరుదైన కేసుల్లో ఈ కేసు కూడా ఒకటని, అందువల్ల ఈ కేసులో జోక్యం చేసుకుంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపింది. జగన్ తదితరులపై నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలిపేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వుల కాపీ బుధవారం అందుబాటులోకి వచ్చింది.

దుర్గారావు చెప్పింది ఇది..: 'ఈ కేసులో నిమ్మకాయల దుర్గారావు అనే వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈ కోర్టు పరిశీలించింది. ఆయన చెప్పిన దాని ప్రకారం ఘటన జరిగిన రోజు ఉదయం 10.30-11 గంటలకు మాజీ ముఖ్యమంత్రి కాన్వాయి తాడేపల్లి వైపు నుంచి జాతీయ రహదారి వైపు వచ్చింది. కారు డ్రైవర్‌కు సమీపంలో మాజీ ముఖ్యమంత్రి నిలబడి ఉన్నారు. అక్కడికి వచ్చిన పార్టీ కార్యకర్తలందరూ కూడా ఆయన వైపు పరిగెత్తుకెళ్లారు. దీంతో మాజీ ముఖ్యమంత్రి కారు నుంచి బయటకు వచ్చి అక్కడికి వచ్చిన ప్రజలందరికీ అభివాదం చేశారు. ఈ సమయంలోనే కారు సర్వీసు రోడ్డులోకి ఎడమవైపు తిరిగింది. ఓ వ్యక్తి డ్రైవరు వైపు ఉన్న కారు చక్రం కింద పడ్డారు. వెంటనే కాన్వాయిలో ఉన్న నలుగురు వ్యక్తులు ఆ వ్యక్తిని పక్కకు తీసి చెట్ల కిందకు తీసుకెళ్లారు. ఆ తరువాత కాన్వాయి సర్వీసు రోడ్డులోకి వచ్చింది. అటు తరువాత తాను గాయపడిన వ్యక్తిని చూసేందుకు వెళ్లాను. కొద్దిసేపటి తరువాత అంబులెన్స్‌లో ఆ వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాయపడిన వ్యక్తి ఎవరో నాకు తెలియదు. ఆ తరువాత నాకు తెలిసింది ఏమిటంటే గాయపడిన వ్యక్తి మరణించాడని.' అని దుర్గారావు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలీసులు దుర్గారావు ఇచ్చిన ఈ వాంగ్మూలాన్ని ఆధారంగా చేసుకుని మొదట పెట్టిన బీఎన్‌ఎస్ సెక్షన్ 106(నిర్లక్ష్యంతో మరణానికి కారణమయ్యారంటూ) ను సెక్షన్ 105 కింద మార్చారని ఆయన తెలిపారు.

అలా చనిపోతారని జగన్ తదితరులకు తెలుసని పోలీసులు చెబుతున్నారు...

దర్యాప్తులో భాగంగా పోలీసులు మాజీ ముఖ్యమంత్రి వెంట ఉన్న భద్రతా సిబ్బందిని విచారించారని న్యాయమూర్తి తెలిపారు. వారి వాంగ్మూలాలను నమోదు చేశారని, అనంతరం 25.06.2025న పోలీసులు మేజిస్ట్రేట్ ముందు ఓ మెమో దాఖలు చేశారన్నారు. టర్నింగ్ తీసుకునే సమయంలో కారును వేగంగా నడపడం వల్ల ప్రజలు కారు కింద పడి మరణిస్తారని కారు డ్రైవర్‌తో పాటు ఆ కారులో ఉన్న జగన్ తదితరులకు స్పష్టంగా తెలుసునని పోలీసులు ఆ మెమోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. జగన్ తదితరులు కారును వేగంగా నడపాలని డ్రైవర్‌కు చెప్పారని, అందులో భాగంగానే డ్రైవర్ భారీ జనాలు ఉన్న చోట కారును వేగంగా నడిపారని పోలీసులు ఆ మెమెలో చెప్పారని తెలిపారు. అయితే సెక్షన్ 105 వర్తించాలంటే ఓ వ్యక్తిని చంపాలన్న ఉద్దేశం గానీ, తమ చర్యల వల్ల చనిపోతాడని తెలిసి ఉండటం తప్పనిసరని, అయితే ఈ కేసులో జగన్ తదితరులకు చంపాలన్న ఉద్దేశం గానీ, తమ చర్యల వల్ల ఓ వ్యక్తి చనిపోతారని తెలిసి ఉండటం గానీ జరగలేదన్నారు. అందువల్ల వారిని సెక్షన్ 105 పరిధిలోకి తీసుకురాలేరని తేల్చి చెప్పారు.

రెండేళ్ల తర్వాత కేసా?

వల్లభనేని వంశీపై కేసు విషయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్య

- సివిల్ కేసును పోలీసులు క్రిమినల్ కేసుగా మారుస్తారా?
- వంశీ బెయిల్ రద్దు పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం ధర్మాసనం

ఈ వ్యవహారం మొత్తం సివిల్ వివాదం. సివిల్ కేసును క్రిమినల్ కేసుగా మలుస్తారా? ఘటన జరిగిన రెండేళ్ల తర్వాత కేసు నమోదు చేస్తారా? ఇదేమి తీరు? సరైన పద్ధతి కాదు.

-ఏపీ ప్రభుత్వాన్ని నిలదీస్తూ సుప్రీం విస్మయం

సాక్షి, అమరావతి: ఓ సివిల్ వివాదంలో ఫిర్యాదుదారు వెనుకుండి వల్లభనేని వంశీ బెయిల్ రద్దు కోసం పిటిషన్ దాఖలు చేయించిన రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గట్టి చీవాట్లు పెట్టింది. వంశీ బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్.కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గన్నవరం మైనింగ్ కేసులో వంశీకి హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ దశలో బెయిల్ రద్దు సాధ్యం కాదని తేల్చి చెప్పింది. ఇప్పటికే వంశీని అనేక కేసుల్లో అరెస్ట్ చేశారని ప్రభుత్వానికి గుర్తు చేసింది. గన్నవరం మైనింగ్ వ్యవహారంలో మైనింగ్ వాల్యుయేషన్ నివేదికను తమ ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 17వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సుందరేష్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

2022-23లో ఘటన.. 2025లో కేసా?

వల్లభనేని వంశీ, తదితరులు తమ ఆస్తి వివాదంలో జోక్యం చేసుకుంటున్నారంటూ సుంకర సీతా మహాలక్ష్మి 2025లో గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు వంశీపై కేసు నమోదు చేశారు. అయితే, ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ మే 9న తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ సీతామహాలక్ష్మి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం విచారణ జరిపింది. వాదనలు విన్న ధర్మాసనం వంశీకి బెయిల్ ఇస్తూ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. 2022-23లో ఘటన జరిగితే 2025లో కేసు నమోదు చేయడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం మొత్తం సివిల్ వివాదమని, దీనిని క్రిమినల్ కేసుగా ఎలా మారుస్తారంటూ పోలీసుల తీరును ఎండగట్టింది. వంశీ బెయిల్‌ను రద్దు చేయాలన్న సీతామహాలక్ష్మి అభ్యర్థనను తోసిపుచ్చుతూ ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది.

క్లుప్తంగా...

విద్యుత్ శాఖలో 443 పోస్టులకు మంగళం

- ప్రభుత్వం ఉత్తర్వులు.. ఉపయోగంలో లేవని వివరణ

సాక్షి, హైదరాబాద్: ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఉద్యోగ నియామక ప్రక్రియలో మార్పులు చేశారు. దాదాపు 443 పోస్టులకు ప్రభుత్వం మంగళం పలికింది. వీటి అవసరం లేదని, కొన్నేళ్లుగా ఉపయోగంలో లేని పోస్టులు అని స్పష్టం చేసింది. కొన్ని పోస్టుల్లో ఏళ్ల తరబడి నియామకం చేపట్టకపోవడంతో ఖాళీ అయిన వాటిని రద్దు జాబితాలోకి చేర్చింది. ఇందులో కొన్ని పోస్టులను మాత్రం మార్పు చేసి నియామకాలు చేపట్టేందుకు ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. మార్పుల తర్వాత 339 కొత్త నియామకాలు చేపట్టేందుకు ఎన్పీడీసీఎల్ అధికారులకు అనుమతిచ్చారు. వివిధ కేటగిరీలకు చెందిన ఉపయోగంలో లేవని చెబుతూ 217 పోస్టులను శాశ్వతంగా రద్దు చేసింది. 217 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోనూ మార్పులు చేసి తగ్గించింది. బ్రాంచీల్లో హెల్పర్లు, గన్‌మెన్, బీపీవో, కార్పెంటర్, స్టోర్ కీపర్, గ్రౌండ్ పంప్ ఆపరేటర్, జేఎండీ, క్లీనర్, లష్కర్ వంటి పోస్టుల అవసరం లేదని జీవోలో స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగం, నిర్వహణ పద్ధతులు పెరిగిన నేపథ్యంలో కొన్ని పోస్టుల్లో నియామకాలు చేపడుతున్నట్టు ప్రభుత్వం వివరించింది. ఈ కేటగిరీలో చీఫ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, ఆఫీస్ సబార్డినేట్, పర్సనల్ ఆఫీసర్ వంటి కొన్ని పోస్టులున్నాయి.

గ్రామ పోలీసు వ్యవస్థ అమలు: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. గ్రామ పోలీసు అధికారి విధానాన్ని అమలు చేయాలని డీజీపీ జితేందర్ ఆదేశించారు. ఏఎస్పీలతో బుధవారం తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలీసు స్టేషన్లలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. దీంతో బాధితులకు సరైన న్యాయం లభిస్తుందని, నేరాల దర్యాప్తులో తగిన పురోగతి సాధిస్తామన్నారు. అనుమానిత, అసహజ మరణాల కేసులపై పారదర్శకంగా విచారణ జరిగేలా పర్యవేక్షించాలన్నారు. డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, వీటిని సరఫరా చేసే ప్రధాన నిందితుల భరతం పట్టాలని ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కళాశాలల్లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీజీ మహేశ్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లాల్ దర్వాజా బోనాలు

సాక్షి, న్యూఢిల్లీ: మూడు రోజులుగా ఢిల్లీలో వైభవంగా జరుగుతున్న లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలు బుధవారం ముగిశాయి. వేడుకల్లో ముఖ్య అతిథిగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. బంగారు బోనం సమర్పించి పూజలు చేశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బంగారు బోనాలు, పట్టువస్త్రాల సమర్పణ, పోతరాజు స్వాగతం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఒగ్గు డొల్ల విన్యాసాలు, బోనాలు, కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్, ఆలయ కమిటీ కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, సతీష్ ముదిరాజ్, బి.అమర్ యాదవ్‌లు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ఏదో జరిగింది

నా భర్త మరణంపై అనుమానాలు ఉన్నాయి

- చంద్రబాబు మనుషులొచ్చి తప్పుడు సాక్ష్యం చెప్పమన్నారు
- అందుకు నా మనస్సాక్షి ఒప్పుకోలేదు
- సింగయ్య భార్య లూర్దుమేరీ సంచలన ప్రకటన
- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన చీలి సింగయ్య భార్య, కుటుంబ సభ్యులు



వైఎస్ జగన్‌ను కలిసిన చీలి సింగయ్య భార్య లూర్దుమేరి, కుమారులు, కుటుంబ సభ్యులు

సాక్షి, అమరావతి: 'జగనన్న మా ప్రాంతానికి వస్తున్నారని తెలియగానే ఆయనను చూడటానికి మేమంతా వెళ్లాం. పెద్దసంఖ్యలో అభిమానులు తరలి రావడంతో మేం కాస్త దూరంలోనే ఉండిపోయాం. కాసేపటి తర్వాత నా భర్తకు యాక్సిడెంట్ జరిగిందని ఎవరో ఫోన్‌చేస్తే తెలిసింది. ప్రమాదం జరిగిన తర్వాత కూడా ఆయన బాగానే ఉన్నారు. నా భర్త స్వయంగా తన పేరు, ఊరుతో పాటు, మా కుటుంబ సభ్యులందరి వివరాలు చెప్పారు. ఆ తర్వాత ఆయ నను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలుసుకుని మేం కూడా ఆస్పత్రికి వెళ్లాం. అక్కడ ఆయన చనిపోయారు. అంతవరకు బాగా ఉన్న మా ఆయనను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లిన తర్వాత ఎలా చనిపోయారు? అందుకే ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో అంబులెన్స్‌లో ఏమైనా చేశారా అని అనుమానం కలుగుతోంది' అని చీలి సింగయ్య భార్య లూర్దుమేరీ ప్రకటించడం సంచలనం రేపింది. దీనిపై నిజాలు తేల్చాలని ఆమె డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఇటీవల పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా జరిగిన ప్రమాదంలో చీలి సింగయ్య ప్రాణాలు కోల్పోయారు. సింగయ్య కుటుంబానికి అండగా నిలుస్తూ ఇప్పటికే వైఎస్సార్‌సీపీ రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. కాగా.. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం సింగయ్య భార్య లూర్దుమేరీ, కుమారులు, కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు.

చంద్రబాబు మనుషులొచ్చి తప్పుడు సాక్ష్యంచెప్పమన్నారు

అనంతరం సింగయ్య భార్య లూర్దు మేరీ మీడియాతో మాట్లాడుతూ 'మా ఆయన చనిపోయిన తర్వాత మా ఇంటికి పోలీసులు వచ్చి యాక్సిడెంట్ వీడియోలు చూపించారు. ఆ తర్వాత దాదాపు 50 మంది చంద్రబాబు మనుషులు మా ఇంటికి వచ్చి.. 'మేం కూడా మీ కులస్తులం.. ఎస్సీలమే' అని చెప్పారు. తప్పుడు సాక్ష్యం చెప్పాల్సిందిగా రకరకాలుగా ఒత్తిడి చేశారు. కానీ.. నా మనస్సాక్షి అందుకు ఒప్పుకోలేదు. ఇదంతా చూసిన తర్వాత మా ఆయన మరణంపై మాకు మరిన్ని అనుమానాలు వస్తున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత మా ఆయనను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధమైతే పోలీసులు అంబులెన్స్ వచ్చేవరకు బలవంతంగా ఆపారు. ఆటో లేదా మరే వాహనంలో సింగయ్యను ఆస్పత్రికి తీసుకుపోవద్దని, కచ్చితంగా అంబులెన్స్‌లోనే తీసుకెళ్లా లని పోలీసులు బలవంతం చేశారు. అందుకే ఆ అంబులెన్స్‌లోనే ఏదో జరిగిందని మాకు బలమైన అనుమానాలు వస్తున్నాయి' అని స్పష్టం చేశారు. ఇప్పుడు తమకు జగన్ ఎంతో భరోసా ఇచ్చారని.. కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారని లూర్దుమేరీ వివరించారు.



నెర్రె పుర్రెలా..

ఒక్కోసారి ప్రకృతి ఇలాంటి చిత్రాలనూ గీస్తుంది. ఐస్‌లాండ్‌లో ఓ అగ్నిపర్వతం పేలి.. నెర్రెలు ఇలా పుర్రె ఆకారంలో కనిపించాయి. స్పెయిన్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ డానియల్ ఈ చిత్రాన్ని డ్రోన్ ద్వారా తీశారు. ఇంటర్నేషనల్ ఏరియల్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్-2025లో ఈ ఫొటో రెండో బహుమతిని గెలుచుకుంది.



అనాథ పిల్లలతో కలెక్టర్ భోజనం

కరీంనగర్: కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఏడుగురు పిల్లలతో కలిసి కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి భోజనం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి, వారికి ఆర్థిక ప్రయోజనాలు అందించారు. అనంతరం ఓ హోటల్‌లో పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

రెండేళ్లు.. రెండు లక్షల మంది ఏఐ నిపుణులు

- యువతకు శిక్షణ ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- 'తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ ప్రారంభోత్సవం'లో మంత్రి శ్రీధర్‌బాబు



'తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ ప్రారంభోత్సవం'లో మంత్రి శ్రీధర్‌బాబు, కంపెనీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: రెండేళ్లలో రెండు లక్షల మంది తెలంగాణ యువతను ఏఐ రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. త్వరలోనే ఏఐ యూనివర్సిటీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. బుధవారం టీ-హబ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలో తొలి ఏఐ అనుసంధానిత 'తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ (టీజీడెక్స్)'ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. 'ప్రస్తుతం ఏఐ అంటే కేవలం ఎమర్జింగ్ టెక్నాలజీ మాత్రమే కాదు మానవ జీవితాలను ప్రభావితం చేసే శక్తి. తెలంగాణను గ్లోబల్ క్యాపిటల్ ఆఫ్ ఏఐగా తీర్చి దిద్దేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే తెలంగాణ ఏఐ స్ట్రాటజీ, రోడ్ మ్యాప్‌ను రూపొందించుకుని వడివడిగా అడుగులు వేస్తోంది. ఏఐను ప్రజలందరూ సమర్థవంతంగా వినియోగించుకుని అనేక సమస్యలకు పరిష్కారం చూపేలా టీజీడెక్స్ పేరిట డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను జైకా సహకారంతో అందుబాటులోకి తీసుకొచ్చాం. దీని రూపకల్పనలో బెంగళూరు ఐఐఎస్సీ సహకారం అందించింది. ఇది దేశంలో ఏర్పాటైన మొదటి ఏఐ డేటా ఎక్స్ఛేంజ్. ఇది ప్రభుత్వ శాఖలు, స్టార్టప్స్, విద్యాసంస్థలు, పరిశోధకులు, యువతను అంతా ఒకే వేదికపై తీసుకొచ్చి ఎన్నో సమస్యలకు పరిష్కారాలను చూపుతుంది'అని శ్రీధర్‌బాబు వివరించారు. టీజీడెక్స్ ద్వారా రైతులకు మేలు చేసే అగ్రిటెక్ స్టార్టప్స్‌కు డేటా లభిస్తుందన్నారు. త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. కార్యక్రమంలో ఐటీ శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, ఐటీ సలహాదారు సాయికృష్ణ, టీ-హబ్ సీఈవో కవికృత్, టీ-వర్క్ సీఈవో జోగిందర్, జైకా ప్రతినిధులు టాకుచీ తాకూరో, యుషి నగానో తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పన కోసం ఈఎల్ఐ

ఆర్‌పీఎఫ్‌సీ బి.చంద్రశేఖర్



సాక్షి, హైదరాబాద్: ఉపాధి కల్పనను ప్రోత్సహించడంతో పాటు సామాజిక భద్రతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఈఎల్ఐ) పథకాన్ని అమల్లోకి తెచ్చిందని రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ (ఆర్‌పీ ఎఫ్‌సీ) బి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం బేగంపేటలోని ఈపీఎఫ్ఓ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 2027, జూలై 31 మధ్య కాలంలో ఉద్యోగాల కల్పనకు వర్తింప జేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంతో రానున్న రెండేళ్లలో 3.5 కోట్ల మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తారని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోందన్నారు. దీని ప్రకారం తొలిసారి ఉద్యోగంలో చేరిన వారికి ఒక నెల వేతన మొత్తం రూ.15 వేల వరకు రెండు వాయిదాల్లో కేంద్రం చెల్లిస్తుందని చెప్పారు.



సందడి లేని సర్కారు బడి

కొందుర్గు: ఇది రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం రామన్నగూడ తండాలోని ప్రాథమిక పాఠశాల. రెండేళ్లుగా విద్యార్థుల్లేక మూతబడింది. ఈ విద్యాసంవత్సరం మూతబడిన ప్రతి పాఠశాలను తెరిపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఈ పాఠశాలను కూడా తెరిచారు. టేకులపల్లి పాఠశాలలో పని చేస్తున్న వినూత్న అనే ఉపాధ్యాయినిని డిప్యుటేషన్‌పై ఇక్కడికి పంపించారు. పదిహేను రోజులైనా ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. దీంతో ఉపాధ్యాయిని రోజూ వచ్చి ఇలా ఖాళీగా కూర్చుని వెళ్తున్నారు. కాగా, ఈ పాఠశాల పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి కూడా పిల్లలు ఎవరూ రావడం లేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్ కూడా ఇక్కడికే వచ్చి కూర్చుంటున్నారు.

పారదర్శకంగా గ్రూప్-1 నిర్వహణ

- అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్ష
- హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు
- తదుపరి విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షలను పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) హైకోర్టులో వాదనలు వినిపించింది. మూల్యాంకనం, హాల్ టికెట్ల జారీపై పిటిషనర్ల వాదనను తప్పుబట్టింది. వందల పోస్టులకు లక్షల సంఖ్యలో అభ్యర్థులు పరీక్ష రాసినప్పుడు ఇలాంటి ఆరోపణలు సహజమేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ అయ్యర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసింది. 2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు బుధవారం విచారణ కొనసాగించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదిస్తూ.. ఈ గ్రూప్-1లో ఎంపికవుతున్న వారు సమాజానికి కీలకమైన సేవలందిస్తారని, వీరంతా భవిష్యత్ తెలంగాణకు వెన్నెముక లాంటి వారని అన్నారు. వీరి ఎంపిక పారదర్శకంగా జరగకపోతే ప్రమాదకమని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాజ్యాంగ సంస్థల అంశాల్లో సెక్షన్ 226 ప్రకారం రెండు సందర్భాల్లో మాత్రమే హైకోర్టు జోక్యం చేసుకోగలదని చెప్పారు. మోసపూరితంగా నిర్వహించినా, నిబంధనలను ఉల్లంఘించినా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోవచ్చని వెల్లడించారు.

బండిల్ ఆధారంగా అభ్యర్థిని తెలుసుకోలేరు.

'ఒక్కో పేపర్ ముగ్గురితో దిద్దించాం. ఇద్దరు ఇచ్చిన అత్యధిక మార్కుల సరాసరిని పరిగణనలోకి తీసుకుని ఫలితాలు వెల్లడించాం. అందరు అభ్యర్థులకు ఇదే విధానాన్ని అనుసరించాం. పదే పదే మూల్యాంకనం అనడం కాదు.. అంతా కలిపి ఒక ప్రక్రియ. బండిల్ ఆధారంగా సెంటర్, అభ్యర్థిని తెలుసుకునే అవకాశమే లేదు. బార్ కోడ్ ఆధారంగానే జవాబు పత్రాలు దిద్దడానికి ఇవ్వడం జరుగుతుంది. ఆ బార్ కోడ్, అభ్యర్థి ఎవరో మూల్యాంకనం చేసే వారికి తెలిసే అవకాశమే లేదు. ఒకట్రెండుసార్లు చిన్న చిన్న తప్పులు జరగడం సాధారణం. అయినంత మాత్రాన రాజ్యాంగబద్ధమైన సంస్థను పదే పదే తప్పుబట్టడం సరికాదు. ప్రక్రియనంతా ప్రధాన మూల్యాంకన దారు పర్యవేస్తుంటారు. నంబర్లు ఒక ఆర్డర్‌లో ఉండటం కోసమే మెయిన్స్‌కు విడిగా హాల్‌టికెట్లు ఇచ్చాం. గతంలో పోలీస్ బోర్డు, జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలకు కూడా ఇలాగే పరీక్షలు నిర్వహించారు. హాల్‌టికెట్లను అక్టోబర్‌లో జారీ చేశాం. దీనిని చాలెంజ్ చేస్తూ ఎవరూ కోర్టుకు రాలేదు. హాల్ టికెట్ అందలేదన్న అభ్యర్థులూ లేరు. అక్టోబర్‌లో జారీ చేసిన హాల్‌టికెట్లను మార్చి వరకు ఆగి, ఫలితాలు వెల్లడించాక ఎంపిక కాలేదని తెలుసుకుని చాలెంజ్ చేయడం సమంజసం కాదు'అని టీజీపీఎస్సీ న్యాయవాది వాదించారు. అనంతరం న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.



బోధన సిబ్బందిని నియమించండి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బోధన సిబ్బంది లేరని, మెటీరియల్ కూడా అందడం లేదంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలోని తెలంగాణ ట్రైబల్ కాలేజీ విద్యార్థినులు బుధవారం రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధన సిబ్బంది లేకపోతే.. నెల రోజుల్లో జరగనున్న పరీక్షలు ఎలా రాస్తామని ప్రశ్నించారు. ఇప్పటి వరకు మెటీరియల్ కూడా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న సిబ్బందికి వేతనాలు అందక కాలేజీ నుంచి వెళ్లిపోతున్నారన్నారు. కాగా, తహసీల్దార్ జయంత్, ఎస్‌ఐ ఉపేంద్రాచారి వచ్చి విద్యార్థినులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. దీనిపై కాలేజీ ప్రిన్సిపాల్ జయను వివరణ కోరగా.. మెటీరియల్, సిబ్బంది సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని విద్యార్థినులకు తెలిపామని.. ఇంతలోనే నిరసనకు దిగారన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



మబ్బుల ముసుగులో సింహగిరి

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి మబ్బుల ముసుగులో సరికొత్త అందాలను సంతరించుకుంది. అల్పపీడనం కారణంగా విశాఖలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ సందర్భంగా సింహాచలం కొండపైన, అడవివరం గ్రామంపై మేఘాలు కమ్ముకున్నాయి. పచ్చదనం కప్పుకున్న కొండలను మేఘాలు తాకుతున్న దృశ్యం అందరికీ కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని చూసిన పర్యాటకులు ఆనందంతో పరవశించిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





అమ్మో... ట్రాఫిక్

సాయంత్రం అయ్యిందంటే చాలు విజయవాడ బెంజిసర్కిల్ వద్ద భారీ ట్రాఫిక్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారిగా స్కూళ్లు, కాలేజీలు వదలడంతో ట్రాఫిక్ పెరిగిపోతుంది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బెంజిసర్కిల్ వైపు వెళ్లే రోడ్డు మార్గం మధ్యలో ప్రైవేట్ కళాశాలల బస్సులు ఉండటం, ఆ ప్రాంతంలో కళాశాలలు ఎక్కువగా ఉండటంతో అందరు ఒక్కసారిగా బయటకు వస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ ఎక్కువై ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయవాడలో బుధవారం ప్రజా రవాణా విభాగం(పీటీడీ) వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న 18 సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. పెండింగ్‌లో ఉన్న 3,500 పదోన్నతులను వెంటనే కల్పించాలని.. కేడర్ స్ట్రెంత్ పేరుతో ఇతర డిపోలకు బదిలీ చేసిన 2,500 మందిని వారి సొంత డిపోల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కంటి, గుండె సమస్యలను కూడా మెడికల్ ఇన్వాలిడేషన్ స్కీమ్ పరిధిలోకి తెచ్చి ఉద్యోగ విరమణకు అవకాశం కల్పించాలని కోరారు. వారి వారసులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఒప్పంద ఉపాధ్యాయుల గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న 760 మంది ఒప్పంద ఉపాధ్యాయుల్ని ప్రభుత్వం రెన్యువల్ చేసింది. మరో 11 నెలల పాటు విధులు నిర్వర్తించేలా అనుమతిచ్చింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

3 ఏళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు

మెప్మా ఆర్పీల పోరాట విజయం

సాక్షి, అమరావతి: మూడేళ్ల కాల పరిమితి ఉత్తర్వులను రద్దు చేయడం పట్ల మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మి, కె.ధనలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆర్పీల యూనియన్ పోరాట ఫలితం అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెడ మీద కత్తిలా వేలాడుతున్న 3 ఏళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను అడ్డం పెట్టుకొని అనేక మంది ఆర్పీలను రాజకీయంగా వేధింపులకు గురి చేశారని, చాలా మందిని తొలగించారని గుర్తు చేశారు.

'వలంటీర్ వొకేషనల్ ట్రైనర్' ఉద్యోగాలు అవాస్తవం

సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విద్యాంజలి 2.0 వలంటీర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో 2024–26కు 'వలంటీర్ వొకేషనల్ ట్రైనర్'గా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్టు జరుగుతున్న ప్రచారం అవాస్తమని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాల కోసం పాఠశాల విద్యాశాఖ, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పేరుతో మోసపూరిత నియామక పత్రాలను అందించారని, నిరుద్యోగులు ఎలాంటి ప్రలోభాలకు ఆకర్షితులు కావొద్దని ఎస్పీడీ హెచ్చరించారు. పాఠశాల విద్యాశాఖకు, సమగ్ర శిక్షకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. నిరుద్యోగుల ఆశలను అలుసుగా తీసుకుంటూ గతంలో కూడా కొందరు వొకేషనల్ ట్రైనర్, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనర్ వంటి ఉద్యోగాల పేరిట మోసపూరిత ప్రకటనలతో ప్రచారాలు చేశారని పేర్కొన్నారు.

విషజ్వరంతో బాలిక మృతి

చంద్రగిరి: విష జ్వరంతో బాలిక మృతి చెందింది. తిరుపతి జిల్లా చంద్రగిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన జాస్మిన్ (16) తల్లిదండ్రులు మృతి చెందడంతో పెద్దమ్మ సంరక్షణలో ఉంటోంది.వారం క్రితం బాలికకు టైఫాయిడ్ సోకింది. మంగళవారం తిరుపతి రుయాలో చికిత్స చేసి బాలికను ఇంటికి తీసుకొచ్చారు. బుధవారం మధ్యాహ్నం బాలికకు మూర్ఛ రావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన అధికారులు అప్పటికే బాలిక మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఆషాఢం.. వైవిధ్యం



ఆషాఢ మాస పండుగకు ఏర్పాటు చేసిన పందిరి వద్ద పూజలు చేస్తున్న బొడిపుట్టు గిరిజనులు

ఆదివాసీ గిరిజన గూడేలు భిన్నమైన సంస్కృతులు, విభిన్నమైన సంప్రదాయాలు, ఆచారాలకు నిలయాలు. ఏటా ఈ గ్రామాల్లో నిర్వహించే ఆషాఢ మాస పండగకు ఎంతో ప్రత్యేకత ఉంది. పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని.. ఎటువంటి అరిష్టం దరిదాపులకు రాకుండా ఉండాలని వేడుకుంటూ గ్రామ పొలిమేరల్లో శంకుదేవుడికి పూజలు చేస్తూ పూర్వీకుల ఆచార వ్యవహారాలను కొనసాగిస్తున్నారు.

అల్లూరి జిల్లాలోని గిరిజన గూడాల్లో పండగ సందడి

- వ్యవసాయం కలిసిరావాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని పూజలు
- పూరీ జగన్నాథుని రథయాత్ర తరువాత నిర్వహణ
- గ్రామ పొలిమేరల్లో ఆధ్యాత్మిక వాతావరణం
- పూర్వీకుల నుంచి ఆనవాయితీ
- సంస్కృతీ సంప్రదాయాలను ప్రాధాన్యమిస్తున్న ఆదివాసీ గిరిజనులు

ముంచంగిపుట్టు: అల్లూరి జిల్లాలోని గిరిజన గ్రామాల్లో ఆదివాసీలు సంస్కృతీ సంప్రదాయాలకు ఎంతో విలువనిస్తారు. తూచ తప్పకుండా పాటిస్తారు. పూర్వీకులు చూపించిన దిశ నిర్దేశాన్ని నేటికీ ఆచరిస్తున్నారు. ఇదే కోవకు చెందినది ఆషాఢమాస పండగ. పూరీ జగన్నాథుని రథయాత్ర ముగిసిన తరువాత గ్రామపెద్దలు పండగ తేదీ నిర్ణయిస్తారు. ఈ ప్రకారం గ్రామాల్లో పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అరిష్టాల నుంచి గట్టెక్కి..

ఆదివాసీ తండాల్లో పూర్వం అనేక రకాల ఇబ్బందులు ఎదురయ్యేవి. ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో రైతులు పంటలు వేసుకునే సమయంలో దుక్కిటెద్దులు, పెంపుడు జంతువులు, అందరికీ ఆరోగ్య సమస్యలు ఎదురయ్యేవి. ఈ మాసంలో అరిష్టాలు ఎక్కువై ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు సంభవించేవి. వీటి నుంచి బయటపడేందుకు ఆషాఢ మాసంలో ఊరి పొలిమేర వద్ద మేక, కోడిని బలిదానం చేసి ప్రత్యేక పూజలు చేసేవారు. అప్పటి నుంచి అన్నీ నష్టాలు తొలగిపోతూ రావడంతో సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తున్నారు. తరాలు మారినా పూర్వీకుల ఆచార వ్యవహారాలను ఆచరిస్తున్నారు. ఏటా ఈ పండగ చేయడం వల్లే తమకు ఎంతో మేలు జరుగుతోందని ఆదివాసీలు చెబుతున్నారు.



పందిరి ఎదుట ఏర్పాటు చేసిన దుక్కిటెద్దుల బండికి పూజలు

గ్రామ పొలిమేరలో..

గిరిజన గ్రామాల్లో పొలిమేరలోని రహదారి పక్కన ఆవు పేడతో అలికి శుద్ధి చేస్తారు. నాలుగు కర్ర పుల్లలతో పందిరి ఏర్పాటు చేసి శంకుదేవుడిని ప్రతిష్టిస్తారు. మామిడి ఆకులతో తోరణాలు కట్టి పందిరి కింద అరటి మొక్కను పాతుతారు. సాగుకు ఉపయోగించే కొత్త విత్తనాలను పందిరిపై చల్లుతారు. అలాగే మట్టితో కుండలు, ప్రమిదలు తయారు చేసి వాటిలో వత్తులు పెట్టి దీపం వెలిగిస్తారు. మట్టితో తయారుచేసి రెండు ఎద్దుల విగ్రహాలకు చెక్క, కర్రతో సిద్ధం చేసిన రెండు చక్రాల బండిని అమర్చుతారు. దీనిని పందిరి ఉత్తర దిక్కుకు పెడతారు. ఇళ్ల వద్ద పనికిరాని పాత తట్టలు, బుట్టలు, చేటలు, చీపుళ్లను తీసుకు వచ్చి దిష్టి తీస్తారు. ధూపదీప నైవేద్యాలతో పూజలు చేస్తారు. అనంతరం కోడి లేక మేకను బలి ఇస్తారు. మాంసాన్ని గ్రామంలో ప్రతి ఇంటికి కొద్ది కొద్దిగా పంచుతారు. ఇలా చేయడం వల్ల గ్రామంలో ఎటువంటి అరిష్టాలు ఎదురు కావని, పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా జరుగుతాయని ఆదివాసీ గిరిజనుల నమ్మకం. ప్రస్తుతం గ్రామాల్లో పండగ ప్రారంభం కావడంతో సందడి నెలకొంది.



గ్రామ పొలిమేరలో దిష్టి తీసిన పాత చాపలు, చేటలు, చీపుర్లు

దోషాలు పోతాయని మా నమ్మకం



గ్రామాల్లో ఎటువంటి అరిష్టాలు కలగకుండా ఉండేందుకు ఆషాఢ మాస పండుగను ఏటా జరుపుకుంటున్నాం. జగన్నాథుని రథయాత్ర మొదలైన వారంలో ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. గ్రామ పొలిమేర వద్ద శంకుదేవుడికి పూజలు చేయడం వల్ల అన్ని దోషాలు పోయి మంచి జరుగుతుంది.

– బొరిబొరి లచ్చన్న, గిరిజన రైతు, బొడిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

పూర్వీకుల నుంచి నిర్వహిస్తున్నాం



పూర్వీకులు ఆచరించిన సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూ వారి అడుగుజాడల్లో నడుస్తున్నాం. నాటి తరం నుంచి నేటి తరం వరకు ఈ ఆషాఢమాస పండగను జరుపుకుంటున్నాం. వ్యవసాయానికి, ఆరోగ్యానికి, గ్రామానికి ఎటువంటి నష్టం జరగకుండా ఈ పండగ నిర్వహిస్తున్నాం.

– రెయ్యల మత్స్యరావు, గిరిజన రైతు, బొడిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

వాళ్లే దాడి చేసి.. వాళ్లే కేసు పెట్టారు

- వైఎస్సార్ సీపీ దళిత కౌన్సిలర్‌పై తప్పుడు కేసు
- స్టేషన్ ముందు ధర్నాకు దిగడంతో కౌంటర్ కేసు



టూటౌన్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన కౌన్సిలర్ ప్రసాద్‌బాబుతో మాట్లాడుతున్న సీఐ రామచంద్ర

మదనపల్లె రూరల్: టీడీపీ నేతల ఒత్తిడితో దాడికి గురైన వైఎస్సార్‌సీపీ దళిత కౌన్సిలర్‌పైనే తప్పుడు కేసు నమోదుచేసి, ఆపై స్టేషన్ వద్ద ధర్నా తర్వాత దాడి చేసిన వ్యక్తిపై కౌంటర్ కేసు నమోదు చేసిన ఘటన ఇది. అన్నమయ్య జిల్లా, మదనపల్లె రూరల్ మండలం, గొల్లపల్లెలోని ఆర్.కే. పార్కింగ్ వద్ద చోటుచేసుకున్న ఈ ఘటనపై 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం, రెండు రోజుల క్రితం ఆర్.కే.పార్కింగ్‌లో నిలిపిన కారును తీసుకుని ప్రసాద్‌బాబు వెలుపలికి వస్తుండగా, సుధాకరనాయుడు తన వోక్స్ వ్యాగన్ కారును అడ్డంగా నిలిపాడు. కారును వెనక్కు తీసుకోవలసిందని కోరిన ప్రసాద్‌బాబును నోటికి వచ్చినట్లు దుర్భాషలాడటమే కాకుండా ఒకానొక దశలో ఆయనపై దాడిచేసేందుకు పెద్ద బండరాయిని తీసుకుని తరిమాడు. దీంతో ప్రసాద్‌బాబు, తన అనుచరులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆయనకు మద్దతుగా అక్కడకు చేరుకున్నారు. తర్వాత ఇరువురిని చుట్టుపక్కల వారు శాంతింపజేసి అక్కడ నుంచి పంపేశారు. అయితే జరిగిన ఘటనను రాజకీయంగా వాడుకోవాలనే దురుద్దేశంతో టీడీపీ మహిళా నాయకురాలు నాగమణి, తన పరపతిని ఉపయోగించి ప్రసాద్‌బాబుపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించింది. దీంతో పోలీసులు కౌన్సిలర్ ప్రసాద్‌బాబుకు విషయం తెలపడంతో ఆయన సుధాకరనాయుడు తనపై రాయితో దాడికి పాల్పడిన ఈ ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలను తీసుకుని స్టేషన్‌కు వెళ్లాడు. దీనితో పోలీసులు రాజకీయ ఒత్తిళ్లతో కేసు పెట్టాల్సి వచ్చిందని, లోక్‌అదాలత్‌లో రాజీ చేయిస్తామని నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన ప్రసాద్‌బాబు తనపై జరిగిన దాడికి సుధాకరనాయుడు, తనను ఫోన్‌లో దుర్భాషలాడిన నాగమణిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశాడు. దీనికి పోలీసులు నీళ్లు నమలడంతో, తన అనుచరులతో కలిసి స్టేషన్ ఎదుట ధర్నాకు దిగాడు. ఎట్టకేలకు పోలీసులు సుధాకరనాయుడుపై కేసు కట్టడంతో ధర్నా విరమించారు.

కేరళ పోలీస్ బాస్‌గా వీరవాసరం వాసి

- రావాడ చంద్రశేఖర్‌ను డీజీపీగా నియమించిన ఆ రాష్ట్ర ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



వీరవాసరం: కేరళ పోలీస్ బాస్‌గా పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరానికి చెందిన రావాడ ఆజాద్ చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 1991లో ఐపీఎస్‌కు ఎంపికైన చంద్రశేఖర్ కేరళలో పలు కీలక బాధ్యతల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు. భారత రాష్ట్రపతి నుంచి అవార్డును కూడా అందుకున్నారు. కొన్నాళ్లకు డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుకు వెళ్లారు. సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో స్పెషల్ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఇటీవలే సెంట్రల్ కేబినెట్ సెక్రటేరియట్ కార్యదర్శిగా కేంద్రం నియమించింది. అదే సమయంలో ఆయన్ని నూతన డీజీపీగా కేరళ ప్రభుత్వం నియమించింది. ఈ విషయం తెలుసుకున్న వీరవాసరం గ్రామస్తులు జీవీవీ ప్రసాద్, నేతల జ్ఞాన సుందరరాజు, పీతల సుబ్రమణ్యం, బాజింకి కృష్ణారావు తదితరులు మాట్లాడుతూ.. ఆజాద్ చంద్రశేఖర్‌ను కేరళ డీజీపీగా నియమించడం తమ ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. చంద్రశేఖర్.. నలుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లలో చిన్నవారని చెప్పారు.


పాత బంగారం కొనుగోలు పేరిట మోసం

పెదకాకాని: పాత బంగారం ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తామని నమ్మించి మోసాలు చేస్తున్న దొంగల ముఠాను గుంటూరు జిల్లా పెదకాకాని బాజీబాబా దర్గాలో శ్రీకాళహస్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ప్రాంతంలో ఐదుగురు నార్త్ ఇండియన్‌లు ముఠాగా ఏర్పడి ప్రజలను నమ్మించి మోసాలు చేసి అక్కడ నుంచి దర్గాలో నిద్రల పేరుతో మంగళవారం పెదకాకాని బాజీబాబా దర్గాకు చేరుకున్నారు. నిందితుల్లో ముగ్గురు మగ, ఇద్దరు మహిళలున్నారు. పాత బంగారం ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తామని ప్రజలకు మాయమాటలు చెప్పి నమ్మించి వారి వద్ద నుంచి బంగారం కొనుగోలు చేస్తారు. వారి ఇచ్చే డబ్బుల కట్టల్లో పైన, కింద బాగంలో మంచి నోట్లు పెట్టి మధ్యలో తెల్లపేపర్లు పెట్టి ఇస్తారు. ఇక్కడ చూస్తే పోలీసులు పట్టుకుంటారు, ఇంటికి వెళ్ళి లెక్కించుకోవాలని చెప్పి అక్కడి నుంచి పరారవుతూ ఉంటారు. వీరిపై శ్రీకాళహస్తి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా సాంకేతికత ఆధారంగా నిందితులను అరెస్ట్ చేశారు.

విశాఖలో టూరిజం ప్రాజెక్టులకు రూపకల్పన

స్పెషల్ సీఎస్ అజయ్ జైన్

మహారాణిపేట: అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖలో టూరిజం ప్రాజెక్టుల రూపకల్పన జరగాలని, భవిష్యత్తులో నిర్వహించబోయే ప్రతిష్టాత్మక కార్యక్రమాల నిమిత్తం స్టార్ రేటింగ్ కలిగిన 10 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాల్సి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. బుధవారం విశాఖలో ఆయన విజయనగరం, విశాఖ జిల్లాల అధికారులతో సమావేశమయ్యారు. విజయనగరం జిల్లా భోగాపురం మండల పరిధిలో నిర్మించబోయే ఒబెరాయ్ హోటల్, విశాఖ జిల్లా భీమిలి మండల పరిధిలోని అన్నవరంలో నిర్మించే మై ఫెయిర్స్ హోటల్ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని, నిర్ణీత సమయంలోగా ఆయా కంపెనీలకు భూమిని అందజేయాలని ఉమ్మడి జిల్లాల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కనెక్టింగ్ రోడ్లను వేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియ, ఇతర సాంకేతిక అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇతర అంశాల్లో ఆయా కంపెనీల యాజమాన్యాలకు నిబంధనలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాల అధికారులు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని సూచించారు.



ఆధ్యాత్మిక సమాచారం

సర్వ దర్శనానికి 10 గంటలు


తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వ దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో నాలుగు కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,126 మంది స్వామివారిని దర్శించుకోగా 24,720 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి భక్తులు హుండీలో రూ.3.97కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది.

పరశురామావతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల: పరశురామావతారంలో జగన్నాథుడు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథస్వామి ఆలయంలో రథోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో ఒక చేత్తో గండ్ర గొడ్డలి, మరో చేత్తో పాత్రను పట్టుకుని ఉన్న పరశురాముని అవతారం భక్తులకు కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పుష్పయాగం.. భక్తి పారవశ్యం

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పలు రకాల పుష్పాలతో పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. ఈ పుష్పాలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దాతలు విరాళంగా అందజేశారు. పుష్పయాగం అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి తదితరులు పాల్గొన్నారు.



విద్యా సమాచారం

నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

ఏర్పేడు: ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్‌పై గురువారం నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఐఐటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలోని ఐఐటీలోని లెక్చర్‌హాల్ కాంప్లెక్స్‌లో ఈ సదస్సు జరగనుంది. నిర్మాణరంగం మెటీరియల్, టెక్నాలజీ, హెల్త్ మానిటరింగ్, రెట్రోఫిట్టింగ్, స్మార్ట్ టెక్నాలజీలపై ఈ సదస్సులో చర్చించనున్నారు.

'వైద్య విద్య వికాసానికి కృషి చేయాలి'

సాక్షి, అమరావతి: వైద్య విద్య వికాసానికి కృషి చేయాలని హెల్త్ యూనివర్సిటీ అధికారులను వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. విజయవాడలోని వర్సిటీలో మంత్రి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్య ప్రమాణాల పెంపు దిశగా కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, బోధన తీరులు, ఇతర అంశాలపై నిఘా విధానాన్ని రూపొందించాలన్నారు. వర్సిటీ సామర్థ్యం, భవిష్యత్ ప్రణాళికలపై సూచనల కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు మరో ఏడాది ఉచిత నివాస వసతి

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన నేపథ్యంలో హైదరాబాద్ నుంచి అమరావతికి తరలి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత నివాస వసతి సౌకర్యాన్ని ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చింది. హైదరాబాద్ నుంచి అమరావతికి తరలి వచ్చిన సచివాలయ, అసెంబ్లీ, హైకోర్టు, రాజ్‌భవన్, శాఖాధిపతుల కార్యాలయాల ఉద్యోగులకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉచిత నివాస వసతిని ప్రభుత్వం కల్పించింది. ఈ సౌకర్యం జూన్ 26న ముగిసింది. తిరిగి జూన్ 27 నుంచి వచ్చే ఏడాది జూన్ 26 వరకు ఉచిత నివాస వసతి సౌకర్యాన్ని పొడిగించింది.



పిల్లల మర్రి

ఆ గ్రామం మూడు సుప్రసిద్ధ శైవ ఆలయాలకు నెలవు... ఒక్క ముక్కంటికే కాదు బ్రహ్మ, విష్ణువులకు సైతం ఆలయాలు ఉండటం మరో ప్రత్యేకత. త్రిమూర్తులలోని లయకారకుడైన శివుడు ఎరుకేశ్వరుడు, నామేశ్వరునిగా అవతరించగా స్థితికారకుడైన విష్ణువు చెన్నకేశ్వరునిగా వెలిశారు. ధరిత్రిపై పూజలు ఉండని శాపగ్రస్తుడైన బ్రహ్మదేవుడికి సైతం ఇక్కడ ఆలయం ఉండటం విశేషం. సృష్టికారకుడైన బ్రహ్మదేవుడు సరస్వతీదేవితో కలిసి హంస వాహనారూఢుడై దర్శనమిస్తాడిక్కడ.

ఇక్కడ త్రిమూర్తులకూ ఆలయాలు













కాకతీయ కాలం నాటి ఆధ్యాత్మిక శోభకు, శిల్పకళా వైభవానికి తార్కాణం 800 ఏళ్లనాటి 'పిల్లల మర్రి' దేవాలయాలు. తెలుగు వారిని ఒకే తాటిమీదికి తీసుకు వచ్చి సువిశాల కాకతీయ సామ్రాజ్యాన్ని నిర్మించిన కాకతీయ రాజుల ఏలుబడిలో ఒక ఆధ్యాత్మిక, కళా క్షేత్రంగా వెలసిన కమనీయ సీమ సూర్యాపేట దగ్గర గల పిల్లలమర్రి.

ముక్కంటికి మూడు ఆలయాలు..

పిల్లలమర్రిలో మూడు ప్రసిద్ధ శైవక్షేత్రాలున్నాయి. 13వ శతాబ్దంలో వీటిని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతారు. 13వ శతాబ్దం ఆరంభంలో కట్టిన గుడులు దాదాపు 150 సంవత్సరాలు వైభవోపేతంగా వెలిగాయి. ఆ తర్వాత పరదేశీ పాలనలో దోపిడీలకు గురయినా, మధ్య మధ్య పునః ప్రతిష్ఠలు పొందాయి. బేతిరెడ్డి భార్య ఎరుకసానమ్మ క్రీ.శ. 1208లో ఎరుకేశ్వర ఆలయాన్ని కట్టించారు. కాకతీయ శిల్పకళావైభవాన్ని చాటిచెప్పేలా చాలా ఎత్తుగా ఆలయం నిర్మించారు. దీని ముఖమండప స్తంభాలు నల్లరాయితో చెక్కారు. స్తంభాలు చాలా నునుపుగా అద్దం మాదిరిగా కనిస్తాయి. ముఖమండపంలోని స్తంభాలను తాకితే సప్త స్వరాలు వినపడతాయి. ఆలయంలో కొలువైన స్వామివారిని కొలిస్తే కోరిన కోర్కెలు తీరుస్తారని ప్రతీతి. బేతిరెడ్డి సోదరుడైన నామిరెడ్డి పిల్లలమర్రిలో రెండు శివాలయాలు కట్టించారు. తన పేరిట నామేశ్వర ఆలయం నిర్మించగా తన తల్లిదండ్రుల పేరిట త్రికూటాలయం నిర్మించారు నామేశ్వరాలయంలో నల్లరాతిపై చెక్కబడిన శిల్పాలు అద్భుతంగా ఉంటాయి. ద్వారాలు, ముఖ మండపాలపై లతలు, పుష్పాలు, వివిధ భంగిమలలో నృత్యాలు కళాకారులు, గాయకులు, వాద్యకారులు, దేవతావిగ్రహాలు తదితర శిల్పాలు చూపరులను కళ్లు తిప్పుకోనివ్వవు. కొన్ని చోట్ల స్తంభాలపై సూక్ష్మాతిసూక్ష్మంగా అందమైన నగిషీలతో శిల్పాలను మలిచారు. కఠినమైన నల్లరాయి శిల్పుల చేతిలో మైనం లా కరిగిపోయిందా అని ఆశ్చర్యం కలుగుతుంది. నామేశ్వరాలయంలో రాతితో స్తంభాలపై కొట్టినప్పుడు సప్తస్వరాలు వినిపించడం ప్రత్యేకత. కాకతీయులకు రాజముద్రికైన ఏనుగు బొమ్మలు ఆలయాలపై దర్శనమిస్తాయి. ఇటుకలతో నిర్మించిన ఆలయంలో రాతి దూలాలపై భారత రామాయణ గాథలు, సముద్ర మథనం వర్ణచిత్రాలు చెక్కబడ్డాయి. నామేశ్వర ఆలయం పక్కనే త్రికూటేశ్వర ఆలయం ఉంది. ఒకేమండపంలో శివునికి మూడు వేర్వేరు ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. మూడు ఆలయాలకు కలిపి ఒకే నంది ఉండటం ఇక్కడ విశేషం. ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో కళ్యాణోత్సవాలు నిర్వహిస్తారు. స్వామివారి సేవలో వీరంగాలు వేయటం, అగ్నిగుండాలు కాల్చటం మొదలైన వేడుకలు నిర్వహిస్తున్నారు.

చెన్నకేశ్వర... బ్రహ్మదేవాలయాలు...

పిల్లలమర్రి శైవం, వైష్ణవం కలిసి పుణ్యక్షేత్రంగా చెప్పవచ్చు. శివకేశవులకు భేదాలు లేవని చాటిచెప్పేలా మూడు ప్రసిద్ధ శివాలయాలు ఉన్న పిల్లలమర్రి గ్రామంలోనే ప్రసిద్ధ చెన్నకేశవ ఆలయం ఉంది. 13వ శతాబ్దంలోనే ఈ ఆలయం నిర్మించినట్లు చెబుతారు. గర్భాలయంలో మకర తోరణంలో చెన్నకేశవస్వామివారి రూపలావణ్యం నయన మనోహరం. గర్భాలయం వెలుపల పన్నిద్దరు ఆళ్వారులు కొలువై ఉన్నారు. క్రీ.శ.1260లో చెన్నకేశ్వర ఆలయం ధ్వంసం అయ్యింది. 1899 ప్రాంతంలో గ్రామానికి చెందిన వుమ్మెత్తల చక్రయ్య గ్రామస్థుల సహకారంతో ఆలయాన్ని తిరిగి నిర్మించినట్లు చెబుతారు. చెన్నకేశ్వర ఆలయంతోపాటు నామేశ్వర ఆలయం ఎడమవైపు బ్రహ్మదేవుని ఆలయం ఉంది. బ్రహ్మ హంసవాహనారూఢుడై సరస్వతీమాతతో కలిసి దర్శనమిస్తారు. మహాదేవుని సేవ కోసం బ్రహ్మసరస్వతులు హంసవాహనంపై ఇక్కడికి వస్తుంటారని స్థలపురాణం చెబుతోంది.

ఎలా చేరుకోవాలంటే?

ప్రసిద్ధ పురాతన ఆలయాలకు నెలవైన పిల్లల మర్రికి చేరుకోవడం చాలా సులువు. సూర్యాపేట జిల్లాలోని పిల్లల మర్రి గ్రామం హైదరాబాద్ నుంచి 134 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ నుంచి విరివిగా సూర్యాపేటకు బస్సులు ఉంటాయి. సూర్యాపేటలో దిగితే అక్కడినుంచి వాహనాల్లో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పిల్లలమర్రి గ్రామానికి చేరుకోవచ్చు.

● నిర్మల వాణి

సహస్రారంతో సంపూర్ణం



మీరు మీ ప్రేమను ఇతరులలో స్థిరపరచడమే విశుద్ధి సమస్యను అధిగమించగల మార్గం. కేవలం సాక్షీ తత్వం ద్వారానే మీరు నేర్చుకోగలుగుతారు. మీ ప్రవర్తనలోను, ముఖ కవళికల్లోనూ ఎంతో మృదుత్వం ప్రస్ఫుటమవుతుంది. సహజయోగ సాధనతో మీరు దీనిని పొందగలరు.

ఆజ్ఞా చక్రం

త్యాగం మోక్షం కోసమే. మీలోని ప్రకాశాన్ని సజీవంగా నిలబెట్టుకోవడం కోసమే. కానీ ఇది మీకు మీలో ఆత్మప్రకాశం వచ్చినప్పుడే తెలుస్తుంది. ప్రకాశం మొదలయినపుడు అది శాశ్వతమౌతుంది. అలాగే ఈ శాశ్వత జీవనం ప్రపంచాన్నంతటినీ ఆక్రమిస్తుంది. మీలోనే మీరు ప్రపంచాన్నంతా చూస్తారు.



శ్రీ మాతాజీ నిర్మలాదేవి

సహస్రార చక్రం

ఇక మన శరీరంలోని సూక్ష్మ నాడీవ్యవస్థలో ఆఖరిచక్రం సహస్రారం. ఇది చాలా ముఖ్యమైన చక్రం. మొత్త ఏడు చక్రాలు వాటి పీఠాలను ఇక్కడ (సహ స్రారంలో) కలిగి ఉన్నాయి. ఈ పీఠాలు ఆనందాన్ని స్వీకరించి హృదయానికి అందిస్తాయి. మీరు ధ్యానం ద్వారా సహస్రార చక్రాన్ని చేరుకోగలగాలి. లలితా సహస్ర నామాలలో చెప్పినట్లు దేవి ఇక్కడే మహామాయగా నెలకొని వుంటుంది. ఆత్మ సాక్షాత్కారం పొందిన తరువాత ఈ చక్రం జాగృతమవుతుంది.

డా. పి. రాకేష్

(మన అంతర్గత సూక్ష్మ శరీర నాడీ వ్యవస్థ గురించి శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనం ఆధారంగా)

● ధర్మ సందేహం

తొలి ఏకాదశికి ఆ పేరెందుకు వచ్చింది?



ఆషాఢమాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. ఈ ఏకాదశి నుంచే పండుగలన్నీ మొదలవుతాయి కాబట్టి దీన్ని తొలి పండుగ అని, తొలి ఏకాదశి అనీ పిలుస్తారు. తొలి ఏకాదశిని శయన ఏకాదశిగా కూడా పిలుచుకుంటారు. ఈ రోజు నుంచి నాలుగు నెలలపాటు విష్ణుమూర్తి పాలకడలి మీద నిద్రిస్తాడట. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశులలోనూ ఈ రోజు మొదటిది. అందుకే ఈ రోజు ఉపవాసం ఉంటే ఆ విష్ణుమూర్తి అనుగ్రహం తప్పక లభిస్తుంది. ఇందుకోసం దశమి రాత్రి నుంచే నిరాహారంగా ఉండాలి. ఏకాదశి రోజు ఉదయాన్నే నిద్రలేచి విష్ణుమూర్తిని తులసీదళాలతో పూజించాలి. ఆ రోజు పాలు, పళ్లలాంటి వండని పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. రాత్రి అంతా జాగరణ చేస్తూ భాగవతం లేదా విష్ణుసహస్రనామ పారాయణ చేయాలి. మర్నాడు... అంటే ద్వాదశి రోజు దగ్గరలోని ఆలయానికి వెళ్లి ఉపవాస దీక్షను విరమించాలి. దీనినే తొలి ఏకాదశి వ్రతం అంటారు. ఈ వ్రతం చేసినందుకే కుచేలుడికి దరిద్రం వదిలి సకల సంపదలూ కలిగాయని పురాణోక్తి.

(6, ఆదివారం తొలి ఏకాదశి)

● సువార్త

దేవునియందు భయభక్తులు కలిగి ఉండుటే జ్ఞానం



గత విద్యా సంవత్సరంలో అనగా 2024–25లో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో నుండి ఉన్నత పాఠశాలలోకి, ఉన్నత పాఠశాలలో చదివిన వారు పైతరగతులకు వెళ్తుంటారు. అలాగే ఉన్నత విద్య నుండి కృతార్థులైన వారు కాలేజీలకు ఇలా.. ఇది నిరంతర ప్రక్రియగా జరుగుతున్నది.

పై విద్యాతరగతుల్లో ప్రవేశించేవారు పై తరగతుల్లోకి వెళ్ళే సందర్భంగా ఆ విద్యాసంవత్సరంలో పాఠాల (లెసన్స్)లో తగిన జ్ఞానం (నాలెడ్జ్, వివేకం, తెలివి) కలిగి చదవగలమా? అని సందేహిస్తుంటారు. కావున దేవుని యందు భయం, భక్తి కలిగి వుండటమే, లేక చూపటమే విజ్ఞానానికి మొదటి మెట్టు. పవిత్రుడైన దేవుని తెలుసుకోవటమే విజ్ఞానం. జ్ఞానం, వివేకం, తెలివి ఇవన్నీ దేవునియందు గుప్తమై వున్నవి. అందుచేత సెల్ఫోన్ యాప్లలో దేవునియందు భయభక్తులున్న యాప్ ఉండటమే మంచిది.

మరి జ్ఞానం, తెలివి, వివేకం, గ్రంథాలయాల్లో అభ్యసించేది కాదు. పూర్వం అబ్రహామనే దేవునియందు విశ్వాసం గల ప్రవక్త నీటికోసం బావులు త్రవ్వించాడు. తన కుమారుడైన ఇస్సాకు తిరిగి తవ్వించి నూరంతల ఫలం పొందాడు. (ఆదికాండం 26వ అధ్యాయం). అంటే బావులు తవ్వగా నీరు ఉబికినట్లుగా జ్ఞానాన్ని బయటకు చేది, వెలుపలికి తీయటం. ఆ విధంగా జ్ఞానాన్ని, తెలివిని, వివేచనను శోధించాలి.

దేవుని యందు భయభక్తులు కలిగి వుండుట అనగా క్రీస్తు ప్రభువును కలిగి వుండుటయే. ఎందుకనగా ఆయన మన మధ్య శరీరధారిగా నివసించారు. (యోహాను 1 :14వ చరణం)

దావీదు మహారాజు మరణానంతరం ఆయన కుమారుడైన సలోమాను రాజయ్యాడు. సలోమాను రాజుతో దేవుడు నిద్రలో/స్వప్నంలో కనపడి నీ తండ్రి అయిన దావీదు నా మార్గంలో నడిచి నా కట్టలను, శాసనములను అనుసరించి నా ధర్మమంతా గైకొన్నాడు. నీవు కూడా ఆ విధంగా నా ఆజ్ఞలను అనుసరించినట్లయితే నిన్ను దీర్ఘాయుష్మంతునిగా చేస్తానన్నారు. (1 రాజు 3: 14) గిబియోనులో బలులు అర్పించటానికి బలిపీఠం మీద వెయ్యి దహన బలులు అర్పించాడు. మరి ప్రస్తుత కాలంలో దేవుని పెదవులతో స్తుతి యాగము చేయటమే యాగం (కీర్తన 50 : 11). ఆ స్తుతియాగం ఎప్పుడు ఎలా గళం విప్పాలనగా ఆత్మతోను, సత్యంతో ఆరాధించాలి. ప్రభువు ఆరోహణుడై దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడై పరిశుద్ధాత్మ అనే ఆదరణ కర్తను పంపినందున పరిశుద్ధాత్మ ద్వారా జ్ఞానం సంపాదించుకోవాలి.

కావున తల్లిదండ్రులు రేయి మొదటి జామున లేచి నీళ్ళు క్రుమ్మరించునట్లు బిడ్డల కొరకు హృదయాన్ని దేవుని సన్నిధిలో కుమ్మరించాలి. నిర్లక్ష్యం వహిస్తే బిడ్డలు హీరోలు కాస్తా జీరోలు అవుతారు.

మీలో ఎవరికైనా జ్ఞానం కొదువగా వున్నట్లయితే దేవుని అడగాలని, అప్పుడది అతనికి అనుగ్రహింపబడుతుందని బైబిల్ వాక్యం ప్రబోధిస్తుంది (యాకోబు పత్రిక 1:5). అటువంటి జ్ఞానం మన దైనందిన జీవితంలోనూ పొరుగువారితో ఏ విధంగా ప్రవర్తించాలో ప్రబోధిస్తుంది.

– కోట బిపిన్ చంద్రపాల్

● ఆధ్యాత్మికకథ

హనుమకు ఆకు పూజ ఎందుకు ఇష్టం?



తమిళనాడు రాష్ట్రం, కరూర్కి చెందిన ఒక బ్యాంకు ఉద్యోగి వేంకటేశ్వర స్వామి దర్శనార్థం కారులో తిరుమల బయలుదేరాడు.

ఆంధ్ర రాష్ట్ర సరిహద్దుల్లోకి వచ్చేసరికి కొంచెం సేద తీర్చుకోవాలనుకున్నాడు. ఓ ఆంజనేయస్వామి గుడి వద్ద కారు ఆపాడు. ఆ పక్కనే ఓ భార్యాభర్తల జంట కొబ్బరికాయల కొట్టు పెట్టుకుని ఉన్నారు. భార్య అంగడిలో కూర్చుని ఉంది. భర్త అంగడి ముందర ఉన్న పూల మొక్కలకు నీళ్ళు పోస్తూ ఉన్నాడు. అతడి దగ్గరికి వెళ్ళాడు బ్యాంకు ఉద్యోగి. ఇక్కడ స్వామికి తమలపాకులతో పూజ చేస్తారా?'' అని ప్రశ్నించాడు.

''అవును'' అని బదులిచ్చాడు వ్యాపారి.

''నేనెప్పుడూ చూడలేదు. దీని విశేషం ఏమిటి?'' అని ఆసక్తిగా అడిగాడు బ్యాంకు ఉద్యోగి.

''నేను పెద్దగా చదువుకున్న వాణ్ని కాదు. పెద్దలెవరైనా రామాయణం, మహాభారతం లాంటివి చెబుతూ ఉంటే కనీసం వినను కూడా వినలేదు. అయితే మా ఊరిలో ఈ ఆకు పూజ గురించి చెప్పుకునే కథ గురించి మాత్రం మీకు చెప్పగలను'' అన్నాడు.

''నువ్వు విన్నదే చెప్పు. నాకెందుకో కుతూహలంగా ఉంది'' అన్నాడు బ్యాంకు ఉద్యోగి.భక్తి భావంతో ఆ వ్యాపారి తను వేసుకున్న చెప్పులు తీసివేశాడు. తలకి చుట్టిన తువ్వాలును తీసి భుజాన వేసుకున్నాడు. చక్కగా నిలబడి ఆంజనేయ స్వామిని మనసులోనే ప్రార్థించి ఇలా చెప్పసాగాడు.

''అది లంకానగరంలో అశోక వనం. ఎక్కడ చూసినా కురూపులైన రాక్షస స్త్రీలు. వారి మధ్యలో సీతమ్మ.ఆమె ముఖం కళ తప్పి ఉంది. పది తలల రాక్షసుడు పెట్టే బాధలు సహించలేకపోతోంది. సరిగ్గా ఆ సమయంలో పిల్లగాలి వీచింది. చెట్టు మీది పక్షుల రెక్కలు రెపరెపలాడాయి. 'ఏమిటా' అని సీతమ్మ చుట్టూ కలయచూసింది. ఎదురుగా ఒక కాంతి పుంజం. కళ్ళు వెడల్పు చేసి చూస్తే ఎదురుగా వినయ విధేయతలతో చేతులు జోడించిన ఆకారం. అది మానవాకారం కాదు, వానరాకారం. సీతమ్మ జడుసుకుంది. 'ఇది రావణ మాయ ఏమో...' అని అనుమానపడింది.

అయితే ఆ వానరాకారం గౌరవంగా 'అమ్మా' అని సంబోధిస్తే ఉలిక్కిపడింది.

''అనుమానం వలదు, నేను రామదూతను'' అని హనుమంతుడు వినమ్రంగా విషయమంతా వివరించాడు. అంతా ఆసక్తిగా విన్నది సీతమ్మ. హనుమంతుడు చెప్పటం ఆపాక సుగుణాభిరాముని క్షేమ సమాచారాలు అడిగింది. వాలి సుగ్రీవుల గురించి వాకబు చేసింది. శ్రీ రాముడు కపి సైన్యంతో రానున్నాడనే చల్లని కబురు తెలుసుకుని ఆనంద పడింది. శ్రీరాముల వారు ఆనవాలుగా పంపిన ఉంగరం చూసి పరవశించిపోయింది.

ఆ సంతోషంలో హనుమంతుడిని గౌరవించాలని అనుకుంది సీతమ్మ. చుట్టూ చూసింది. పూల చెట్లు ఏవీ కనిపించలేదు. కనీసం తులసీ బృందావనమైనా అక్కడ లేదు. పరిసరాలను మరింత సూక్ష్మంగా చూసింది. కంచెను అల్లుకుని ఉన్న తమలపాకు తీగలను చూసింది. వాటిని చిన్నగా గిల్లి దండగా మార్చింది. చిరునవ్వుల మోముతో హనుమ మెడలో వేసింది.

ఈ హఠాత్పరిణామానికి హనుమ ఆశ్చర్యచకితుడయ్యాడు. హనుమ కంట ఆనందాశ్రువులు.

''అంజన తనయా.. లోకంలో ఎవరు ఏ శుభ వార్త అందించినా బహుమతులివ్వడం మా ఆనవాయితీ. నువ్వు శ్రీ రాములవారి ఉంగరాన్ని నాకు చేరవేశావు. శ్రీరాముడు వస్తున్నాడన్న మంచి విషయం తెలియ జేశావు. ఈ దేశం కాని దేశంలో నీకు ఈ తమల పాకుల దండ తప్ప మరేమీ ఇవ్వలేను'' అని చెప్పింది.

ఊహించని సత్కారానికి హనుమంతుని ఒళ్లంతా పులకరించింది. ''లోకమాత అయిన నీవు నా మెడలో తమలపాకుల మాల వేశావు, నా జన్మ చరితార్థమయ్యింది తల్లీ'' అని రెండు చేతులూ జోడించి తల వంచాడు.

ఇదే రానురాను ఆకు పూజకు నాంది పలికిందని ఇక్కడ చెప్పుకుంటారు. శివునికి బిల్వ పత్రం, విష్ణువుకు తులసి లాగా హనుమంతునికి తమలపాకు ప్రియమయిందని భావిస్తారు. హనుమంతునికి ఆకుపూజ చేసి ఆయన్ని ప్రసన్నం చేసుకోవచ్చని ఇక్కడి వారి నమ్మకం'' అని వివరించాడు. అప్పటికే ఆ బ్యాంకు ఉద్యోగి తమలపాకుల మాల, ఇతర పూజా సామగ్రి కొనుక్కుని గుడిలోకి వడివడిగా వెళ్తూ ఉన్నాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

● ఇస్లాం వెలుగు

మోసం చేస్తే మోసమే!



పూర్వం బాగ్దాద్ నగరంలో బహెలూల్ అనే పేరుగల ఒక దైవభక్తుడు ఉండేవాడు. ఒకసారి ఆయన బాగ్దాద్ వీధుల్లో నడుస్తూ వెళుతున్నారు. అలా వెళుతూ వెళుతూ ఒకచోట విశ్రాంతి కోసం ఆగాడు. అంతలో అక్కడికి ఒక వ్యక్తి వచ్చాడు. అతను చాలా బాధగా, ఆందోళనగా ఉన్నాడు. అది గమనించిన బహెలూల్ , 'ఏమిటి చాలా ఆందోళనగా కనిపిస్తున్నావు, విషయం ఏమిటి?' అని ఆరా తీశారు.

'అయ్యా.. ఏం చెప్పమంటారు? కొన్నిరోజుల క్రితం ఒక వ్యక్తి దగ్గర కొంత పైకం అమానతుగా ఉంచాను. ఇప్పుడు వెళ్ళి అడిగితే, అసలు నువ్వెవరివి..? నాకు పైకం ఎప్పుడిచ్చావు?' అని బుకాయిస్తున్నాడు. ఎంత ప్రాధేయపడినా కనికరించకుండా, ఇష్టమొచ్చినట్లు తిట్టిపోశాడు. కాని నా అమానత్తును మాత్రం తిరిగి ఇవ్వలేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి..? రిక్తహస్తాలతో మిగిలాను. ఏ మార్గమూ కానరావడం లేదు.' అంటూ భోరుమన్నాడు. బహెలూల్ అతణ్ణి ఊరడిస్తూ.., 'నువ్వేమీ బాధపడకు..దైవ చిత్తమైతే ఆ పైకం నేను ఇప్పిస్తాను.' అన్నారు ప్రశాంతంగా..

'అవునా..! నా పైకం ఇప్పిస్తారా..?' అంటూ ఆశగా చూశాడా వ్యక్తి.. ''కాని ఎలా సాధ్యం? ఆవ్యక్తి పరమ దుర్మార్గుడు... నాకైతే ఏమాత్రం నమ్మకం కుదరడంలేదు.' అన్నాడు నిరాశతో.. ''అలా అనకు.. నిరాశ తిరస్కారం (కుఫ్ర్)తో సమానం.. దైవచిత్తమైతే నీ పైకం నీకు తప్పకుండా లభిస్తుంది.' అన్నారు బహెలూల్. 'నిజమే.. ఆశ లేకపోతే మనిషి బ్రతకలేడు. కాని.. ఎలా సాధ్యమో కూడా అర్థం కావడంలేదు.'

'నువ్వు ఆందోళన చెందకు. నేను చెప్పినట్లు చెయ్ . నీ పైకం ఇప్పించే పూచీనాది.' అన్నారు బహెలూల్ ధీమాగా..

'సరే ఏం చేయమంటారో చెప్పండి. 'అన్నాడతను. ఆశగా.. 'రేపు ఉదయం ఫలానా సమయానికి నువ్వు ఆ వ్యక్తి దుకాణం దగ్గరికిరా.. నేనూ ఆ సమయానికి అక్కడికి వస్తాను. నేను ఆ వ్యక్తితో మాట్లాడుతున్న క్రమంలో నువ్వొచ్చి నీ అమానత్తును అడుగు.' అన్నారు బహెలూల్ . సరేనంటూ ఆ వ్యక్తి బహెలూల్ దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

తెల్లవారి ఉదయం బహెలూల్ ఆ వ్యక్తి దగ్గరికెళ్ళి తనను తాను పరిచయం చేసుకున్నారు. కాసేపు అవీ ఇవీ మాట్లాడిన తరువాత, తాను కొన్నాళ్ళపాటు పని మీద ఎటో వెళుతున్నానని, కాస్త ఈ సంచి మీదగ్గర ఉంచితే తిరిగొచ్చిన తరువాత తీసుకుంటానన్నారు. ఇందులో వంద బంగారునాణాలు, కొంతనగదు ఉందని చెప్పారు. ఆ వ్యక్తి లోలోన సంతోషపడుతూ, సరేనని సంచీ అందుకున్నాడు. సరిగ్గా అదే సమయానికి మోసపోయిన వ్యక్తి వచ్చి తను అమానతుగా ఉంచిన పైకం ఇమ్మని అడిగాడు.

ఆ వ్యాపారి ఒక్కక్షణం ఆలోచించి, ఇప్పుడు గనక ఇతనితో పేచీ పెట్టుకుంటే, విలువైన బంగారు నాణాల సంచి చేజారే అవకాశముందని గ్రహించాడు. వెంటనే అతని పైకం అతనికిచ్చేశాడు. అతను సంతోషంగా పైకం తీసుకొని కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు. బహెలూల్ కూడా తన సంచిని వ్యాపారి దగ్గర అమానత్తుగా ఉంచి తనదారిన తను వెళ్ళిపోయారు.

కొంతసేపటి తరువాత, అతడు సంబరపడుతూ, బహెలూల్ దాచిన నాణాల సంచి విప్పి చూసి, నోరెళ్ళబెట్టాడు. అందులో గాజు పెంకులు, గులక రాళ్ళు తప్ప మరేమీ లేవు. తను చేసిన మోసానికి తగిన శాస్తే జరిగిందని భావించాడు. ఇకనుండి ఎవరినీ మోసం చేయకూడదని నిర్ణయించుకొని ధర్మబద్ధమైన జీవనం ప్రారంభించాడు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

బిజినెస్ రీల్

మైక్రోసాఫ్ట్‌లో మరిన్ని ఉద్యోగాలు కట్..



రెడ్‌మండ్ (అమెరికా): టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగాల కోతల పర్వం కొనసాగుతోంది. తాజాగా మరిన్ని వేల మంది ఉద్యోగులను తీసివేసేందుకు కంపెనీ ఉపక్రమించింది. ఇందులో భాగంగా ఉద్వాసనకు గురయ్యే ఉద్యోగులకు లేఆఫ్ నోటీసులను పంపించే ప్రక్రియ ప్రారంభించింది. ఎంత మందిని తీసివేస్తున్నదీ కంపెనీ నిర్దిష్టంగా వెల్లడించనప్పటికీ, దాదాపు 9000 మందికి నోటీసులు అందినట్లు ప్రచారం జరుగుతోంది. ఉద్వాసనల తర్వాత గతేడాదితో పోలిస్తే సిబ్బంది సంఖ్య సుమారు 4 శాతం తగ్గుతుందని అంచనా.

విన్‌ఫాస్ట్ కార్ల కస్టమర్లకు మైటీవీఎస్ సర్వీసులు



న్యూఢిల్లీ: భారత్‌లో తమ తొలి వాహనాన్ని ప్రవేశపెట్టే సన్నాహాల్లో ఉన్న వియత్నాం ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం విన్‌ఫాస్ట్ ఆటో ఇండియా, విక్రయానంతర సర్వీసులపైనా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా మైటీవీఎస్‌తో జట్టు కట్టింది. దేశవ్యాప్తంగా 120 సర్వీస్ వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు కంపెనీ ఏషియా సీఈవో ఫామ్ సాన్ చౌ తెలిపారు. మైటీవీఎస్‌తో వ్యూహాత్మక ఒప్పందంతో దేశవ్యాప్తంగా తమ కస్టమర్లకు నాణ్యమైన, సమగ్రమైన సర్వీసులు అందుతాయని వివరించారు. అలాగే చార్జింగ్ నెట్‌వర్క్ కూడా పటిష్టమవుతుందన్నారు.

కరూర్ వైశ్యా బ్యాంక్, క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ జట్టు



హైదరాబాద్: కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ), క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ బ్యాంకష్యూరెన్స్ ఒప్పందానికి వచ్చాయి. రెండు రకాల ప్రయోజనాలతో కూడిన 'క్షేమ కిసాన్ సాతి' అనే బీమా ప్లాన్‌ను గ్రామీణ ప్రజలు, వ్యవసాయ వర్గాల వారికి ఆఫర్ చేసేందుకు ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని ఇరు సంస్థలు ప్రకటించాయి. కరూర్ వైశ్యా బ్యాంక్‌కు గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో బలమైన నెట్‌వర్క్ ఉండడంతో టెక్నాలజీ ఆధారిత క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ బీమా పరిష్కారాలు లక్షలాది మంది కస్టమర్లకు చేరువ అవుతాయని పేర్కొన్నాయి. వ్యక్తిగత ప్రమాద బీమా ప్రయోజనంతో ఈ ఉత్పత్తి ఉంటుందని క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ చైర్మన్ నటరాజ్ నూకల తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-7-2025	
విశాఖ	585-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	570-00
విజయవాడ	590-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	575-00
వరంగల్	577-00
రిటైల్ ధర	6.35

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	165.95	3.68
JSWSTEEL	1,058.20	2.78
ASIANPAINT	2,426.30	2.4
ULTRACEMCO	12,410.00	1.64
MARUTI	12,615.00	1.39

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	676.6	-2.85
HDFCLIFE	789.1	-2.57
INDUSINDBK	856.75	-2.54
BAJAJFINSV	2,009.10	-2.18
LT	3,593.80	-1.99

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,996
ఎన్‌ఎస్‌ఈ	1,05,117
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,52,217
ఎఫ్‌ఐఐ	- 1,562
డీఐఐ	+ 3,037

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	67.46	$	65.45
బ్రెంట్	69.11	$	67.11

ఆఫీస్ స్పేస్ లీజింగ్.. జీసీసీలు టాప్‌గేర్

- 2024–25లో 24 శాతం వృద్ధి
- 31.8 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ లీజింగ్
- వెస్టియన్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఆఫీస్ స్పేస్ లీజింగ్ (కార్యాలయ వసతులు) వృద్ధిలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీలు) బలమైన పాత్ర పోషిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో జీసీసీలకు ఆఫీస్ స్పేస్ లీజింగ్ 24 శాతం శాతం పెరిగింది. 31.8 మిలియన్ చదరపు అడుగుల (ఎస్‌ఎఫ్‌టీ) కార్యాలయ వసతులను జీసీసీలు గత ఆర్థిక సంవత్సరంలో లీజుకు తీసుకున్నాయి. 2023–24లో జీసీసీలు తీసుకున్న ఆఫీస్ స్పేస్ లీజింగ్ 25.6 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో 31.8 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ లీజింగ్‌లో 13.5 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణాన్ని ఫార్చ్యూన్ 500 కంపెనీలు తీసుకున్నాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఫార్చ్యూన్ 500 కంపెనీల లీజింగ్ 10.9 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ కంటే 25 శాతం అధికం. "గత కొన్ని సంవత్సరాలుగా భారత ఆఫీస్ మార్కెట్‌కు జీసీసీలు ముఖ్య వృద్ధి చోదకంగా నిలుస్తున్నాయి. వ్యయ నియంత్రణ వ్యూహాలు, నైపుణ్య మానవ వనరుల లభ్యత, శరవేగంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, సానుకూల ప్రభుత్వ విధానాలు, వ్యాపార సులభతర నిర్వహణ పరిస్థితులు, సానుకూల వ్యాపార వాతావరణం ఇందుకు మద్దతుగా నిలుస్తున్నాయి"అని వెస్టియన్ నివేదిక వెల్లడించింది.

42 శాతం జీసీసీల నుంచే

2024–25 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతంగా ఉందని, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇది 41 శాతంగా ఉన్నట్టు వెస్టియన్ తెలిపింది. రానున్న రోజుల్లో జీసీసీల వాటా మరింత పెరుగుతుందని వెస్టియన్ సీఈవో శ్రీనివాసరావు అంచనా వేశారు. ఐటీ–ఐటీఈఎస్, బీఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్‌కేర్ అండ్ లైఫ్ సైన్సెస్, ఇంజనీరింగ్, తయారీ, కన్సల్టింగ్ సేవల రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీలు విస్తరణపై దృష్టి సారించినట్టు చెప్పారు. నిపుణుల లభ్యతకు తోడు బలమైన ఎకోసిస్టమ్ అండతో భారత్ ఆశావహంగా మారినట్టు పేర్కొన్నారు.

బెంగళూరులో అధిక వృద్ధి..

అత్యధికంగా బెంగళూరులో గత ఆర్థిక సంవత్సరంలో 12.43 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీని జీసీసీలు లీజింగ్‌కు తీసుకున్నాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో బెంగళూరులో జీసీసీల లీజింగ్ పరిమాణం 8.34 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉంది. ముంబైలో జీసీసీల ఆఫీస్ స్పేస్ లీజింగ్ 3.68 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో లీజింగ్ 1.36 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీతో పోల్చి చూస్తే 170 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. డీఎల్‌ఎఫ్, ఎంబసీ గ్రూప్, సత్వ గ్రూప్, ప్రెస్టీజ్ గ్రూప్, ఆర్‌ఎంజెడ్ గ్రూప్, టాటా రియల్టీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర సంస్థలు ఆఫీస్ స్పేస్ మార్కెట్లో ప్రముఖంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్ కూడా కార్యాలయ వసతుల లీజింగ్ మార్కెట్లోనే పనిచేస్తున్నాయి.

యస్ బ్యాంక్‌లో వాటాపై సీసీఐకి సుమితోమో మిత్సుయి



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ యస్ బ్యాంక్‌లో 20 శాతం వాటా కొనుగోలుకి క్లియరెన్స్‌ను కోరుతూ కాంపిటీషన్ కమిషన్(సీసీఐ)కు జపనీస్ దిగ్గజం సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్(ఎస్ఎంబీసీ) దరఖాస్తు చేసింది. యస్ బ్యాంక్‌లో 20 శాతం వాటా విక్రయించేందుకు గత నెలలో పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ)తో పాటు ఇతర 7 బ్యాంకింగ్ సంస్థలు నిర్ణయించాయి. రూ. 13,483 కోట్ల విలువలో వాటా విక్రయానికి ప్రతిపాదించాయి. దీని ప్రకారం యస్ బ్యాంక్‌లో వాటా మూలధనంతోపాటు.. ఓటింగ్ హక్కులను సైతం ఎస్ఎంబీసీ సొంతం చేసుకోనుంది. వెరసి దేశీ బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా ఈ డీల్ రికార్డ్ సృష్టించనుంది. జపాన్‌లో రెండో పెద్ద బ్యాంకింగ్ గ్రూప్ అయిన సుమితోమో మిత్సుయి ఫైనాన్షియల్ గ్రూప్(ఎస్ఎంఎఫ్‌జీ)నకు సొంత అనుబంధ సంస్థగా ఎస్ఎంబీసీ వ్యవహరిస్తోంది.

బీమా పథకాల మిస్–సెల్లింగ్ వద్దు..

బ్యాంకులకు డీఎఫ్‌ఎస్ కార్యదర్శి నాగరాజు సూచన



న్యూఢిల్లీ: కస్టమర్లకు ఒక పాలసీ గురించి చెప్పి మరో పాలసీని అంటగట్టే (మిస్–సెల్లింగ్) ధోరణులను నివారించడంపై బ్యాంకులు మరింతగా దృష్టి పెట్టాలని కేంద్ర ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్‌ఎస్) కార్యదర్శి ఎ నాగరాజు సూచించారు. ఇన్సూరెన్స్ అనేది చాలా సున్నితమైన ఆర్థిక సాధనమని, కస్టమర్లకు విక్రయించే ముందు, దాని గురించి క్షుణ్నంగా వివరించాలని పేర్కొన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇటలీకి చెందిన జనరాలి గ్రూప్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్న కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నాగరాజు ఈ విషయాలు తెలిపారు. మిస్–సెల్లింగ్ వల్ల కస్టమర్లకు ప్రీమియంల భారం పెరిగిపోతుందని, ఫలితంగా పాలసీదారులు తమ పాలసీని మళ్లీ పునరుద్ధరించుకోరని ఆయన పేర్కొన్నారు. ప్రీమియంలు అధికంగా ఉన్నా కూడా బీమా కొనుగోలు చేయడానికి ప్రజలు ఇష్టపడరు కాబట్టి ప్రీమియంలు సహేతుకంగా ఉండేలా కంపెనీలు చూసుకోవాలని నాగరాజు సూచించారు. కస్టమర్ల క్లెయిమ్‌లు సకాలంలో, సముచితంగా ప్రాసెస్ అయ్యేలా బీమా సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మరోవైపు, ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో 24.91 శాతం, ఫ్యూచర్ జనరాలీ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో 25.18 శాతం వాటాల కొనుగోలు పూర్తి చేసినట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది.

ఐపీవో స్ట్రీట్...

ట్రావెల్ ఫుడ్ @ రూ. 1,045-1,100

- జులై 7–9 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 2,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: క్విక్ సర్వీస్ రెస్టారెంట్ల(క్యూఎస్ఆర్)తోపాటు విమానాశ్రయాల్లో లాంజ్ బిజినెస్ నిర్వహించే ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 1,045–1,100 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 7న ప్రారంభమై 9న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఈ నెల 4న షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ ప్రమోటర్ కపూర్ ఫ్యామిలీ ట్రస్ట్ రూ. 2,000 కోట్ల విలువైన ఈక్విటీని విక్రయానికి ఉంచనుంది. తద్వారా ఐపీవో నిధులు మొత్తం ప్రమోటర్లకు అందనున్నాయి. ప్రమోటర్ సంస్థ కే హాస్పిటాలిటీ బ్రాండుతో ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్‌సహా విదేశాలలోనూ పలు ఆతిథ్య సేవలు, ఫుడ్ సర్వీసుల బిజినెస్‌లను నిర్వహిస్తోంది. ఈ ముంబై కంపెనీ తొలుత 2009లో తొలి ట్రావెల్ క్యూఎస్ఆర్‌ను ప్రవేశపెట్టింది. కపూర్ ఫ్యామిలీ ట్రస్ట్‌తోపాటు ఎస్ఎస్‌పీ గ్రూప్ పీఎల్‌సీ కంపెనీని ప్రమోట్ చేశాయి. కంపెనీ ప్రధానంగా ఎంపిక చేసిన ఆహారం, పానీయాల(ఎఫ్అండ్‌బీ)ను ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా విమానాశ్రయాలు, కొన్ని జాతీయ రహదారి ప్రాంతాలలో సమకూర్చుతోంది. దేశీయంగా 14 విమానాశ్రయాలలో సర్వీసులు అందిస్తోంది. మలేసియాలో 3 ఎయిర్‌పోర్టులలో లాంజ్ సేవలు కల్పిస్తోంది. 2024 జూన్‌కల్లా దేశ, విదేశాలలో 117 పార్ట్‌నర్, సొంత బ్రాండ్లతో కలిపి 397 ట్రావెల్ క్యూఎస్ఆర్ ఔట్‌లెట్లను నిర్వహిస్తోంది. వీటిలో సుప్రసిద్ధ కేఎఫ్‌సీ, పిజ్జా హట్, కాఫీ బీన్, టీ లీఫ్, సబ్‌వే, బికనీర్‌వాలా, అడయార్ ఆనంద్ భవన్, వా మోమో తదితర బ్రాండ్స్ ఉన్నాయి.

ఐపీవోకు స్టీమ్‌హౌస్ ఇండియా

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 700 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ఇండస్ట్రియల్ స్టీమ్ అండ్ గ్యాస్ సరఫరా కంపెనీ స్టీమ్‌హౌస్ ఇండియా పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి గోప్యతా విధానంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఐపీవో ద్వారా కంపెనీ రూ. 500–700 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసింది. మెయిన్‌బోర్డులో లిస్టింగ్‌పై కన్నేసిన కంపెనీ స్టాక్ ఎక్స్చేంజీలకు సైతం ప్రాథమిక పత్రాలను దాఖలు చేసినట్లు వెల్లడించింది. 2014లో ఏర్పాటైన సంజూ గ్రూప్ కంపెనీ సూరత్ ప్రధాన కార్యాలయంగా కార్యకలాపాలు విస్తరించింది. 167 క్లయింట్లకు సర్వీసులు అందిస్తోంది. పిరానా, దహేజ్ సెజ్‌సహా.. వపీ, అంకలేశ్వర్, నందెశారీ, పనోలీ ఫేజ్–2, 3లలో విస్తరణ చేపట్టింది. ఈ బాటలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, యూపీ, హర్యానా, రాజస్తాన్‌లలోనూ కార్యకలాపాల విస్తరణపై దృష్టి పెట్టింది. 2023–24లో రూ. 292 కోట్ల ఆదాయం, రూ. 26 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇటీవల రహస్య పద్ధతిలో ఫైలింగ్‌కు పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టాటా క్యాపిటల్, ఫిజిక్స్‌వాలా, ఇమేజిన్ మార్కెటింగ్(బోట్)తోపాటు.. షాడోఫ్యాక్స్ టెక్నాలజీస్, గాజా ఆల్టర్నేటివ్ ఏఎంసీ, షిప్‌రాకెట్ ఇదే బాటలో సాగిన సంగతి తెలిసిందే. 2024 చివర్లో స్విగ్గీ, విశాల్ మెగామార్ట్ ఇదే విధంగా స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టయ్యాయి.

తెలంగాణలో పీవీఆర్ ఐనాక్స్ విస్తరణ

ఈ వారంలో హైదరాబాద్‌లో ఫోర్ స్క్రీన్ ప్రాపర్టీ ప్రారంభం



న్యూఢిల్లీ: సినిమా ఎగ్జిబిటర్ పీవీఆర్ ఐనాక్స్ తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఈ వారంలో హైదరాబాద్‌లో కొత్తగా నాలుగు స్క్రీన్‌ల ప్రాపర్టీని ప్రారంభించనుంది. దీనితో రాష్ట్రంలో మొత్తం స్క్రీన్‌ల సంఖ్య 110కి చేరుతుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ కుమార్ బిజ్లీ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 26 స్క్రీన్లను జోడించనున్నట్లు వివరించారు. గణనీయంగా వృద్ధి చెందుతున్న తెలంగాణ మార్కెట్ తమకు అత్యంత ప్రాధాన్య మార్కెట్లలో ఒకటని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, దేశవ్యాప్తంగా వచ్చే రెండేళ్లలో కొత్తగా 200 స్క్రీన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సంజీవ్ కుమార్ చెప్పారు. ఇందుకోసం రూ. 400 కోట్ల వరకు వెచ్చించనున్నట్లు ఆయన వివరించారు.

ప్రధానంగా దక్షిణాదిపై, చిన్న నగరాలు, పట్టణాలపై ఫోకస్ పెట్టనున్నట్లు వివరించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 100 వరకు స్క్రీన్స్ ఏర్పాటు చేసే ప్రణాళికలు ఉండగా, ఇప్పటికే 20 ప్రారంభించామన్నారు. 100 స్క్రీన్‌ల లక్ష్యంలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు, హుబ్లి సహా దక్షిణాదిలోని వివిధ నగరాల్లో 40 స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తామని సంజీవ్ కుమార్ వివరించారు. అలాగే సిలిగురి, జబల్‌పూర్, లేహ్, గ్యాంగ్‌టక్ వంటి చిన్న పట్టణాల్లో కూడా విస్తరిస్తున్నామని చెప్పారు. కొత్తగా 200 స్క్రీన్ల రాకతో రెండేళ్లలో మొత్తం స్క్రీన్ల సంఖ్య దాదాపు 2,000కు చేరుతుందని సంజీవ్ కుమార్ తెలిపారు.

టీవీఎస్ ఐక్యూబ్ కొత్త వేరియంట్

ధర రూ.1.03 లక్షలు



చెన్నై: టీవీఎస్ మోటార్ తన ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఐక్యూబ్ కొత్త వేరియంట్‌ను లాంచ్ చేసింది. ఎక్స్–షోరూం ధర రూ.1.03 లక్షలుగా ప్రకటించింది. ఇందులో అమర్చిన 3.1 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ వల్ల సింగిల్ ఛార్జింగ్‌తో 123 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని కంపెనీ వెల్లడించింది. హిల్ హోల్డ్ అసిస్ట్ ఫీచర్, బ్యాక్‌రెస్ట్ ఈ స్కూటర్ ప్రత్యేకతలు. "ఇప్పటికే ఆరు లక్షలకు పైగా ఐక్యూబ్ యూనిట్లు విక్రయించాము. డ్యూయల్ టోన్ కలర్స్‌తో రోజువారీ అనువైన ప్రయాణాలకు అనుగుణంగా తాజా ఐక్యూబ్‌ను తీర్చిదిద్దాము. కొత్త వేరియంట్ విడుదల ద్వారా విద్యుత్ వాహన విభాగాన్ని బలోపేతం చేయాలనుకుంటున్నాము" అని టీవీఎస్ కంపెనీ తెలిపింది.

టఫే, ఏజీసీవో వివాదం సెటిల్మెంట్

న్యూఢిల్లీ: మాసే ఫెర్గూసన్ బ్రాండ్ వివాదాన్ని టఫే, ఏజీసీవో కార్పొరేషన్ సంస్థలు కోర్టు వెలుపల పరిష్కరించుకున్నాయి. సెటిల్మెంట్ ప్రకారం ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ (టఫే) సంస్థ రూ. 2,225 కోట్లు చెల్లించి మాసే ఫెర్గూసన్‌లో ఏజీసీవో వాటాలను కొనుగోలు చేయనుంది. భారత్, నేపాల్, భూటాన్‌లో ఈ బ్రాండు పూర్తి యాజమాన్య హక్కులు టఫేకు దక్కుతాయి. ఏజీసీవో కార్పొరేషన్ గత సెప్టెంబర్‌లో మాసే ఫెర్గూసన్ బ్రాండ్ లైసెన్స్ సహా టఫేతో ఉన్న పలు ఒప్పందాలను రద్దు చేసుకుంది.

వొడాఫోన్‌ను పీఎస్‌యూగా

మార్చే ప్రసక్తే లేదు

- ప్రభుత్వ వాటా 49 శాతానికి మించరాదు
- టెలికం సేవలలో కనీసం 4 కంపెనీలు
- బకాయిలను ఈక్విటీ మార్పుగా కోరవచ్చు
- టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా



న్యూఢిల్లీ: దేశీ మొబైల్ టెలికం రంగంలో కనీసం 4 కంపెనీలు సేవలందించేలా చూడాల్సి ఉందని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. ఒక ఆంగ్ల చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన దేశీ టెలికం రంగంలోని పలు అంశాలపై మాట్లాడారు. రుణ భారంతో సవాళ్లు ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియా(వీఐ)లో ప్రభుత్వం మరింత ఈక్విటీ వాటాను తీసుకోదని తేల్చి చెప్పారు. వీఐను ప్రభుత్వ రంగ కంపెనీ(పీఎస్‌యూ)గా మార్చబోమని స్పష్టతనిచ్చారు. టెలికం కంపెనీలలో ప్రభుత్వ వాటా 49 శాతానికి మించడానికి అనుమతించబోమని తెలియజేశారు. ఇటీవల వీఐ ఈక్విటీ మార్పిడి అవకాశాలను అన్వేషిస్తున్న నేపథ్యంలో సింధియా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా.. ప్రతీ టెలికం కంపెనీకి బకాయిలను ఈక్విటీ మార్పు చేయాలని కోరే హక్కు ఉన్నట్లు వెల్లడించారు. అయితే అన్ని కంపెనీలకూ ఒకే నిబంధనలు వర్తించవని, ఆయా కంపెనీల పరిస్థితులకు అనుగుణంగా టెలికం శాఖ(డాట్)తోపాటు.. ఆర్థిక శాఖ సాధ్యాసాధ్యాల పరిశీలన తదుపరి నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుందని వివరించారు. భారతీ టెలికం ఈ హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై డాట్ పరిశీలన, విశ్లేషణ పూర్తయితే ఒక నిర్ణయాన్ని తీసుకోగలమని తెలియజేశారు.

పోటీ ఉండాలి

టెలికంలోనే కాకుండా ఏ రంగంలో అయినా రెండే కంపెనీలు ఆధిపత్యం వహించడం మంచి పరిణామం కాదని సింధియా పేర్కొన్నారు. దేశీయంగా మొబైల్ టెలికం విభాగంలో పోటీ పరిస్థితులు కొనసాగాలని తెలియజేశారు. పోటీ నివారణ ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. మొబైల్ టెలికం రంగంలో 4 కంపెనీలు సర్వీసులందిస్తున్న దేశాలు తక్కువగానే ఉన్నట్లు వెల్లడించారు. టెలికం పెట్టుబడి వ్యయాలలో దేశీ కంపెనీలు ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్క భారత్‌లో మాత్రమే పెట్టుబడులపై మంచి రిటర్నులు లభిస్తున్నట్లు తెలియజేశారు. ఇది లాభదాయకతపై ఆయా కంపెనీలు, యాజమాన్యాల నిర్ణయాలను బట్టి ఉంటుందని వివరించారు.

శాటిలైట్ సేవలు

శాటిలైట్ కమ్యూనికేషన్ కోసం స్పెక్ట్రమ్ ధరల నిర్ణయంపై టెలికం నియంత్రణ ప్రాధికార సంస్థ(ట్రాయ్) సన్నాహాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇందుకు వీలుగా పలు సంస్థలు, వాటాదారులతో చర్చలు, సూచనలు తదితరాలకు తెరతీసినట్లు వెల్లడించారు. వీటి ఆధారంగా తగిన సిఫారసులతోకూడిన నివేదికను దాఖలు చేయనున్నట్లు తెలియజేశారు. ట్రాయ్ సలహాలు అమలు చేసేందుకు రెండు నెలలు పట్టవచ్చని పేర్కొన్నారు.

భీమ జ్యువెల్స్ 'సీజన్ ఆఫ్ స్ప్రింకిల్'



హైదరాబాద్: భీమ జ్యువెల్స్ 'సీజన్ ఆఫ్ స్ప్రింకిల్' పేరుతో డైమండ్ ఫెస్టివల్ క్యాంపెయిన్ ప్రారంభించింది. జులై 27 వరకు జరిగే ఈ ఫెస్ట్‌లో భాగంగా డైమండ్ క్యారెట్ విలువపై 30% తగ్గింపు ఇస్తుంది. బంగారు రత్నాభరణాలు, అన్‌కట్ డైమండ్ ఆభరణాల తయారీ చార్జీలపై 50% డిస్కౌంటు పొందవచ్చు. సాలిటైర్‌లపై క్యారెట్‌కు 10% వరకు తగ్గింపు అందిస్తుంది. పాత ఆభరణాల మార్పిడిపై గ్రాముకు రూ.100 అదనంగా పొందవచ్చు. లక్షకు పైగా బంగారు ఆభరణాల కొనుగోలుపై క్యారెట్‌కు రూ.2,500 విలువైన ప్రత్యేక డైమండ్ కూపన్ పొందవచ్చు. తదుపరి డైమండ్ జ్యువెలరీ కొనుగోలుపై ఈ కూపన్ రీడమ్ చేసుకోవచ్చు. లక్కీ డ్రా ద్వారా ఆకర్షణీయమైన డైమండ్ పెండెంట్‌లు, బంగారు నాణేలు గెలుచుకోవచ్చు. చెవిపోగులు, ఉంగరం, పెండెంట్‌లతో తీర్చిదిద్దిన రూ.60,000 విలువైన డైమండ్ సెట్‌ను రూ.49,999 కే అందిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోని భీమా స్టోర్లలో జరిగే ఈ డైమండ్ ఫెస్ట్ ఆఫర్లు వినియోగించుకోవాలని కంపెనీ ఎండీ అభిషేక్ బిందు మాధవ్ కోరారు.

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ ఫండ్స్‌కు డిమాండ్

- రూ.48,000 కోట్లకు చేరిన ఏయూఎం
- ఏడాది కాలంలో 37 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే మ్యూచువల్ ఫండ్స్ పథకాలకు మంచి డిమాండ్ నెలకొంది. ఈ విభాగంలో సుమారు 22 మ్యూచువల్ ఫండ్స్ పథకాలు సేవలు అందిస్తున్నాయి. వీటి నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) ఏడాది కాలంలో 37 శాతం వృద్ధితో రూ.48,000 కోట్లకు చేరుకున్నాయి. 2024 మే చివరికి వీటి నిర్వహణ ఆస్తులు రూ.34,971 కోట్లుగా ఉండడం గమనార్హం. ఈ విభాగంలోని పథకాలు మంచి పనితీరు చూపించడం ఏయూఎంలో బలమైన వృద్ధికి కారణమైనట్టు తెలుస్తోంది. ఈ పథకాలు గత ఏడాది కాలంలో పెట్టుబడులపై 22 శాతం నుంచి 30 శాతం వరకు రాబడులను అందించడం గమనార్హం. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగం పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న దీర్ఘకాల విశ్వాసానికి నిదర్శనంగా దీన్ని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బీఎస్‌ఈ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ 14 శాతం పెరగ్గా.. ఇదే కాలంలో ప్రధాన సూచీ సెన్సెక్స్ పెరుగుదల 10 శాతంగానే ఉంది. అలాగే బీఎఫ్‌ఎస్‌ఐ రంగంలో బీమా, ఫిన్‌టెక్, వెల్త్ మేనేజ్‌మెంట్, డిజిటల్‌గా రుణాలు అందించే అన్‌లిస్టెడ్ కంపెనీల్లోనూ ఈ తరహా ఫండ్స్ పెట్టుబడులు పెడుతుండడం ఇన్వెస్టర్లు ఆకర్షిస్తోంది. "ఆర్థిక వ్యవస్థ సంఘటితంగా మారుతుండడం, రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం విస్తరిస్తుండడంతో ఈ విభాగంలో బలమైన కంపెనీల సంఖ్య పెరుగుతోంది. దీంతో దీర్ఘకాలంలో మంచి పెట్టుబడుల అవకాశాలను ఈ రంగం ఆఫర్ చేస్తోంది"అని వెల్త్ మేనేజర్ అల్ఫాషా పేర్కొన్నారు.

కోకో గాఫ్‌కు షాక్

వింబుల్డన్‌లో సంచలనాల పర్వం

- క్విటోవా కూడా...
- సినెర్, జొకోవిచ్ ముందంజ
- అల్‌కరాజ్, సబలెంక మూడో రౌండ్లోకి...


దయానా

వింబుల్డన్‌లో సంచలనాల మోత! ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ గెలుచుకొచ్చిన కోకో గాఫ్, గత వారం జర్మనీలో ఇగా స్వియాటెక్‌ను ఓడించి టైటిల్‌తో ఈ గ్రాస్‌కోర్టులోకి దిగిన పెగూలా, రెండుసార్లు వింబుల్డన్ చాంపియన్ క్విటోవా, ఈ ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనలిస్ట్ లోరెంజో ముసెట్టి, మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీల రన్నరప్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మెద్వెదెవ్, రూనె, ఐదోసీడ్ జెంగ్ క్విన్‌వెన్, 15వ సీడ్ కరోలినా ముకొవా... ఇలా టాప్ స్టార్లకు ఈ వింబుల్డన్ చేదు ఫలితాలనిచ్చింది. పెద్ద సంఖ్యలో సీడెడ్ ప్లేయర్లు మోయలేని భారంతో తొలి రౌండ్లోనే నిష్క్రమించేలా చేసింది.

లండన్: గ్రాస్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ టోర్నీ వింబుల్డన్ ఈ సారి మూడు రోజులకే వెలవెలబోతోంది. పలువురు మేటి స్టార్లంతా ఈ కోర్టులో తొలి రౌండ్‌లోనే ఆఖరి మ్యాచ్ ఆడేసి వెళ్లిపోయారు. మిగిలిన కొద్దిమందిలో ఇంకెంత మంది కనీసం ప్రిక్వార్టర్స్ వరకైనా చేరతారో తెలియని పరిస్థితి. సంచలన ఫలితాలతో పురుషులు, మహిళల సింగిల్స్‌లో ఒకరో ఇద్దరో కాదు... ఏకంగా 23 మంది సీడెడ్ స్టార్లు తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టారు. మహిళల సింగిల్స్‌లో 10 మంది, పురుషుల సింగిల్స్‌లో 13 మంది స్టార్లు... 2001 నుంచి టాప్-32 సీడింగ్స్‌ను గుర్తించాక ఇంత మంది సీడెడ్లు తొలి రౌండ్‌లోనే కంగుతినడం మొత్తం గ్రాండ్‌స్లామ్‌ల చరిత్రలోనే మొదటిసారి! ఫ్రెంచ్ ఓపెన్ తాజా చాంపియన్, అమెరికన్ స్టార్ కోకో గాఫ్ కథ తొలిరౌండ్లోనే అది కూడా క్వాలిఫయర్ చేతిలో ముగిసింది. రెండు వింబుల్డన్ టైటిళ్ల విజేత పెట్రా క్విటోవా మొదటి రౌండ్లోనే ఇంటిదారి పట్టింది. పురుషుల సింగిల్స్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం విక్రమార్క పోరాటం చేస్తున్న సెర్బియన్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌తో పాటు ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ శుభారంభం చేశారు.

మూడో రౌండ్లో సబలెంక, అల్‌కరాజ్


అల్‌కరాజ్

మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో బెలారస్ స్టార్, టాప్ సీడ్ సబలెంక 7-6 (7/4), 6-4తో మేరి బౌజ్‌కొవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. ఈ సీజన్‌లో రెండు గ్రాండ్‌స్లామ్ (ఆస్ట్రేలియా, ఫ్రెంచ్) టోర్నీల్లోనూ రన్నరప్‌గా నిలిచిన సబలెంకకు తొలిసెట్‌లో అన్‌సీడెడ్ ప్లేయర్ గట్టి పోటీ ఇచ్చినా టైబ్రేకర్‌తో గెలుపుబాట పట్టింది. మరో పోరులో ఆరో సీడ్ మాడిసన్ కీస్ 6-4, 6-2తో ఓల్గా డానిలోవిచ్ (సెర్బియా)పై వరుస సెట్లలో విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో వింబుల్డన్ (2023, 2024) 'హ్యాట్రిక్'పై కన్నేసిన కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) సునాయాస విజయంతో మూడో రౌండ్లోకి దూసుకెళ్లాడు. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన రెండో సీడ్ స్పెయిన్ స్టార్ 6-1, 6-4, 6-4తో బ్రిటన్ ప్లేయర్ టార్వెట్‌ను ఓడించాడు. రెండోరౌండ్లో 12వ సీడ్ ఫ్రాన్సిస్ టియాఫె (అమెరికా)కు చుక్కెదురైంది. గత యూఎస్ ఓపెన్ సెమీఫైనలిస్ట్ టియాఫె 6-4, 4-6, 3-6, 5-7తో కామెరూన్ నోరి (బ్రిటన్) చేతిలో కంగుతిన్నాడు. 14వ సీడ్ రుబ్లెవ్ 6-7 (1/7), 6-4, 7-6 (7/5), 6-3తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)పై గెలుపొందాడు.


కోకో గాఫ్

దయానా సంచలనం

ఉక్రెయిన్ ప్లేయర్ దయానా యస్త్రెంస్కా లండన్‌లో టైటిల్ గెలవకుండానే పతాక శీర్షికల్లో నిలిచింది. 2018 నుంచి గ్రాండ్‌స్లామ్ బరిలో దిగుతున్నప్పటికీ ఏనాడూ సాధ్యమవని విజయాన్ని ఈ వింబుల్డన్ తొలి రౌండ్లోనే సాకారం చేసుకుంది. పారిస్ మట్టికోర్టులో (ఫ్రెంచ్ ఓపెన్)లో మహారాణిగా నిలిచిన అమెరికన్ స్టార్, రెండో సీడ్ కోకో గాఫ్‌కు కనీవినీ ఎరుగని షాక్ ఇచ్చింది. ఉక్రెయిన్ అనామక ప్లేయర్‌ను సులువుగానే ఓడిస్తుందనుకున్న ప్రపంచ రెండో ర్యాంకర్ గాఫ్ 6-7 (3/7), 1-6తో 42వ ర్యాంకర్ దయానా యస్త్రెంస్కా చేతిలో ఘోర పరాభవానికి గురైంది. ప్రపంచ నాలుగో ర్యాంకర్ పోలండ్ స్టార్ ఇగా స్వియాటెక్ తొలి రౌండ్‌ను వరుస సెట్లలోనే గెలిచింది. రష్యన్ ప్రత్యర్థి నుంచి తొలిసెట్లో ప్రతిఘటన ఎదురైనప్పటికీ ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల చాంపియన్ అయిన స్వియాటెక్ 7-5, 6-1తో పొలినా కుడెర్మటోవాపై గెలుపొందింది. 17వ సీడ్ బార్బర క్రెజ్సికొవా (చెక్ రిపబ్లిక్) 3-6, 6-2, 6-1తో అలెగ్జాండ్రా ఎలా (ఫిలిప్పీన్స్)పై నెగ్గింది.

ఇంతేనా... మిగిలింది!

చెప్పుకోదగ్గ స్టార్లు, కనీసం సెమీఫైనల్ గ్యారంటీ అనుకున్న ప్లేయర్లు సైతం ఆదిలోనే కంగు తినడంతో ఇక మిగిలింది కొందరే! నంబర్‌వన్ సబలెంక, మూడో టైటిల్‌పై కన్నేసిన డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్, 2023 వింబుల్డన్ చాంపియన్ మార్కెటా వొంద్రుసొవా, 2021 యూఎస్ ఓపెన్ చాంపియన్ ఎమ్మా రాడుకాను, పదో సీడ్ ఎమ్మా నవారో, యానిక్ సినెర్, రజతోత్సవ టైటిల్‌పై కన్నేసిన జొకోవిచ్ తదితర స్టార్లే మిగిలారు. అయితే ఇంతటి సంచలనాల పర్వంలో ఇక వీరిలో ఎవరెవరు క్వార్టర్స్ దాటుతారనేది ఇప్పుడు మరింత ఆసక్తికరంగా మారింది.

రెండో రౌండ్లోకి యూకీ జోడీ

పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ తన అమెరికన్ భాగస్వామితో కలిసి శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్లో 16వ సీడ్ యూకీ-రాబర్ట్ గాలొవే ద్వయం 7-6 (10/8), 6-4తో అర్నియోడో (మొనాకో)-గినార్డ్ (ఫ్రాన్స్) జంటపై గెలిచింది. రిత్విక్ బొల్లిపల్లి-బారియెంటోస్ (కొలంబియా) జోడీ 4-6, 6-4, 7-6 (13/11)తో గాఫిన్ (బెల్జియం)-ముల్లర్ (ఫ్రాన్స్) జంటపై గెలిచింది. వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ద్వయంకు తొలిరౌండ్లోనే చుక్కెదురైంది. బోపన్న-సాండర్ గిల్లీ (బెల్జియం) జోడీ 3-6, 4-6తో మూడో సీడ్ క్రావిట్జ్ (జర్మనీ)-ప్యూట్జ్ (జర్మనీ) జంట చేతిలో ఓడింది.

జొకోవిచ్ కష్టపడి...

బిగ్-3లో కెరీర్‌ను కొనసాగిస్తున్న సెర్బియన్ దిగ్గజం జొకోవిచ్ రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి సవాళ్లు ఎదురైనా అనుభవంతో అధిగమించాడు. ఆరో సీడ్ జొకో 6-1, 6-7 (7/9), 6-2, 6-2తో ముల్లర్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. తొలిరౌండ్లో మూడు గంటలకు పైగానే కోర్టులో శ్రమించి టోర్నీలో శుభారంభం చేశాడు. ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) మాత్రం అలవోక విజయంతో ముందంజ వేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ఫ్రెంచ్ రన్నరప్ సినెర్ 6-4, 6-3, 6-0తో తన దేశ సహచరుడు ల్యూకా నార్డిని ఓడించగా... నాలుగో సీడ్ డ్రాపర్ (బ్రిటన్) 6-2, 6-2, 2-1తో ఆధిక్యంలో ఉండగా ప్రత్యర్థి బేజ్ (అర్జెంటీనా) రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. గత యూఎస్ ఓపెన్ రన్నరప్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-7 (6/8), 6-7 (8/10), 6-4, 7-6 (8/6), 6-4తో పెరికార్డ్ (ఫ్రాన్స్)పై ఐదు సెట్ల పోరాటం చేసి గట్టెక్కాడు.



జ్యోతి యర్రాజికి గాయం

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు దూరం!



న్యూఢిల్లీ: ఆసియా చాంపియన్, ఆంధ్రప్రదేశ్ యువ అథ్లెట్ జ్యోతి యర్రాజి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు దూరం కానుంది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు (12.78 సెకన్లు) కలిగిన జ్యోతి ప్రస్తుతం మోకాలి గాయంతో ఇబ్బంది పడుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో టోక్యో వేదికగా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరగనుండగా... దానికి జ్యోతి అర్హత సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే గాయంతో ఇబ్బంది పడుతున్న జ్యోతి ఆ పోటీల్లో పాల్గొనడం సందేహంగా మారింది. 'ఇటీవల సాధన సందర్భంగా గాయపడ్డా. దీంతో సీజన్‌కు బ్రేక్ ఇచ్చాను' అని 25 ఏళ్ల జ్యోతి బుధవారం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది. ఆసియా క్రీడల్లో రజత పతకం నెగ్గిన జ్యోతి... వైద్య బృందంతో సంప్రదింపులు సాగుతున్నాయని... పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే తిరిగి బరిలోకి దిగుతానని పేర్కొంది. గతేడాది పారిస్ ఒలింపిక్స్ అనంతరం జ్యోతి గాయపడింది. 'ప్రాక్టీస్ సమయంలో అనుకోకుండా జ్యోతి మోకాలికి గాయమైంది. దీంతో భవిష్యత్తు ప్రణాళికలన్నీ తారుమారు అయ్యాయి' అని ఆమె కోచ్ జేమ్స్ హిల్లెర్ అన్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మహిళల 100 మీటర్ల హర్డిల్స్ అర్హత ప్రమాణం 12.73 సెకన్లు కాగా... జ్యోతి ఆ మార్కు ఇప్పటి వరకు అందుకోలేకపోయింది. అయితే ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలవడంతో ఆమె ర్యాంకింగ్స్ మెరుగు పరుచుకుంది. ర్యాంకుల ఆధారంగా 16 మంది అథ్లెట్లకు వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం దక్కనుండగా... ప్రస్తుతం 12వ ర్యాంక్‌లో ఉన్న జ్యోతి అర్హత సాధించడం దాదాపు ఖాయమే. గతంలోనూ గాయాల బారినపడి తిరిగి కోలుకొని ట్రాక్‌పై అడుగుపెట్టి సత్తా చాటిన జ్యోతి ఈ సారి కూడా అదే చేస్తానని నమ్మకంగా చెబుతోంది. 'గాయాలు అథ్లెట్ల జీవితంలో భాగమే. దీన్ని కూడా మరో హర్డిల్‌లానే భావిస్తున్నా. కోలుకొని మరింత బలంగా పునరాగమనం చేస్తా' అని జ్యోతి వెల్లడించింది. ఈ ఏడాది జాతీయ క్రీడల్లో జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌తో పాటు 200 మీటర్ల పరుగులో పసిడి పతకాలు గెలుచుకుంది.

అసలంక సెంచరీ

- తొలి వన్డేలో శ్రీలంక ఘనవిజయం
- 77 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి



కొలంబో: సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ నెగ్గిన శ్రీలంక జట్టు... వన్డేల్లోనూ శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి వన్డేలో శ్రీలంక 77 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.2 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ చరిత అసలంక (123 బంతుల్లో 106; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (43 బంతుల్లో 45; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. టెస్టు సిరీస్‌లో దంచికొట్టిన పాథుమ్ నిసాంక (0), నిశాన్ మధుషనక (6), కమిందు మెండిస్ (0) విఫలమయ్యారు. జనిత్ లియాంగె (29), మిలాన్ రత్ననాయకె (22), వణిందు హసరంగ (22) తలా కొన్ని పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తస్కీన్ అహ్మద్ 4, తన్జీమ్ హసన్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 35.5 ఓవర్లలో 167 పరుగులకు ఆలౌటైంది. తన్జీద్ హసన్ (61 బంతుల్లో 62; 9 ఫోర్లు, 1 సిక్స్), జాకీర్ అలీ (64 బంతుల్లో 51; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధశతకాలతో పోరాడగా... తక్కినవాళ్లంతా విఫలమయ్యారు. లంక బౌలర్ల ధాటికి కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ (0), లిటన్ దాస్ (0), పర్వేజ్ (13), నజ్ముల్ షంటో (23), తౌహిద్ హృదయ్ (1) పెవిలియన్‌కు వరుస కట్టారు. లంక బౌలర్లలో హసరంగ 4, కమిందు మెండిస్ 3 వికెట్లు పడగొట్టారు. అసలంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శనివారం రెండో వన్డే జరగనుంది.

మీనాక్షి, పూజకు పతకాలు ఖాయం

ప్రపంచ బాక్సింగ్ కప్

అస్తానా (కజకిస్తాన్): ప్రపంచ బాక్సింగ్ కప్‌లో భారత స్టార్ బాక్సర్లు మీనాక్షి (48 కేజీలు), పూజా రాణి (80 కేజీలు) పతకాలు ఖాయం చేసుకున్నారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ బౌట్లలో విజయాలు సాధించిన వీరిద్దరూ సెమీస్‌కు చేరడం ద్వారా మెడల్స్ ఖరారు చేసుకున్నారు. 48 కేజీల క్వార్టర్స్‌లో మీనాక్షి 5-0 పాయింట్ల తేడాతో గో యీ జియాన్ (చైనీస్ తైపీ)పై ఏకపక్ష విజయం నమోదు చేసుకుంది. 80 కేజీల క్వార్టర్ ఫైనల్లో పూజా రాణి 4-1 పాయింట్ల తేడాతో గుస్లాయా యెర్జాన్ (కజకిస్తాన్)పై నెగ్గింది. 51 కేజీల విభాగంలో అనామికా క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. పురుషుల విభాగంలో జాదుమణి సింగ్ ఓటమి పాలయ్యాడు. ఫిలిప్పీన్స్‌కు చెందిన బ్రియాన్ బారికుట్రో చేతిలో అతను పోరాడి ఓడాడు.

వైభవ్ విజృంభణ

- 9 సిక్స్‌లు, 6 ఫోర్లతో 31 బంతుల్లోనే 86 పరుగులు
- ఇంగ్లండ్‌పై భారత అండర్-19 జట్టు జయభేరి
- 2-1తో సిరీస్‌లో ముందంజ



నార్తంప్టన్: భారత టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ (31 బంతుల్లో 86; 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో ఇంగ్లండ్ అండర్-19 జట్టుతో జరిగిన మూడో యూత్ వన్డేలో భారత్ 4 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌ను వర్షం వల్ల 40 ఓవర్లకు కుదించగా ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. ఓపెనర్లు డాకిన్స్ (61 బంతుల్లో 62; 8 ఫోర్లు, 1 సిక్స్), ఇసాక్ మొహమ్మద్ (43 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 78 పరుగులు జోడించి చక్కని ఆరంభమిచ్చారు. తర్వాత వన్‌డౌన్ బ్యాటర్ బెన్ మయెస్ (31) ఫర్వాలేదనిపించాడు. మిడిలార్డర్‌లో కెప్టెన్ థామస్ ర్యూ (44 బంతుల్లో 76 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో ఆఖర్లో స్కోరు వేగంగా దూసుకెళ్లింది. భారత బౌలర్లలో కనిష్క్ చౌహాన్ 3 వికెట్లు పడగొట్టగా, దీపేశ్, విహాన్, నమన్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ కెప్టెన్ అభిజ్ఞాన్ (12) వికెట్‌ను కోల్పోయింది. అయితే మరో ఓపెనర్ వైభవ్, వన్‌డౌన్‌లో వచ్చిన విహాన్ మల్హోత్రా (34 బంతుల్లో 46; 7 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా వైభవ్ భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో టి20ను తలపించేలా 7.3 ఓవర్లలోనే జట్టు స్కోరు వంద దాటింది. సూర్యవంశీ అవుటయ్యాక విహాన్, ఆ తర్వాత కనిష్క్ చౌహాన్ (42 బంతుల్లో 43 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో 34.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 274 పరుగులు చేసి గెలిచింది. అలెగ్జాండర్ వేడ్‌కు 2 వికెట్లు దక్కాయి.

శ్రీకాంత్ శుభారంభం

న్యూఢిల్లీ: భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ సూపర్-300 టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో బుధవారం శ్రీకాంత్ 18-21, 21-19, 21-14తో భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్‌పై విజయం సాధించాడు. 53 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్ కోల్పోయిన శ్రీకాంత్... ఆ తర్వాత పుంజుకుని వరుసగా రెండు గేమ్‌లు నెగ్గి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది మలేసియా మాస్టర్స్‌లో రన్నరప్‌గా నిలిచిన శ్రీకాంత్ తాజా మ్యాచ్‌లో చక్కటి షాట్లతో అలరించాడు. ఈ ఇద్దరి మధ్య గతంలో జరిగిన రెండు మ్యాచ్‌ల్లో ప్రియాన్షు గెలుపొందగా... ఈసారి శ్రీకాంత్ పైచేయి సాధించాడు. రెండో రౌండ్‌లో వాంగ్ పొ వెయి (చైనీస్ తైపీ)తో శ్రీకాంత్ తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో భారత షట్లర్ శంకర్ ముత్తుస్వామి 23-21, 21-12తో మన దేశానికే చెందిన ఐదో సీడ్ ఆయుష్ శెట్టిపై గెలుపొందాడు.

భారత్ జైత్రయాత్ర

వరుసగా మూడో విజయం

- 5-0తో గోల్స్ తేడాతో ఇరాక్‌పై గెలుపు
- ఆసియా కప్-2026 మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నీ



చియాంగ్ మాయ్ (థాయ్‌లాండ్): ఆసియా కప్-2026 మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. గత రెండు మ్యాచ్‌ల్లో అద్వితీయ విజయాలు సాధించిన భారత్... బుధవారం మూడో మ్యాచ్‌లో 5-0 గోల్స్ తేడాతో ఇరాక్‌ను చిత్తుచేసింది. మ్యాచ్ ఆరంభం నుంచే సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన టీమిండియా... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగింది. భారత్ తరఫున సంగీత (14వ నిమిషంలో), మనీషా (44వ నిమిషంలో), కార్తీక అంగముత్తు (48వ నిమిషంలో), నిర్మలా దేవి (64వ నిమిషంలో), రతన్‌బాలా దేవి (80వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో మూడు మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు... 22 గోల్స్ సాధించి ప్రత్యర్థికి ఒక్కటి కూడా ఇవ్వకపోవడం విశేషం. తొలి మ్యాచ్‌లో 13-0 గోల్స్ తేడాతో మంగోలియాను చిత్తుచేసిన టీమిండియా... తిమోర్ లెస్టెపై 4-0 గోల్స్ తేడాతో నెగ్గింది. తాజా పోరులో సంగీత గోల్‌తో ఖాతా తెరిచిన భారత్... మనీషా గోల్‌తో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురుకాకపోవడంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 2-0తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ అదే జోరు కొనసాగిస్తూ మరో మూడు గోల్స్ కొట్టి మ్యాచ్‌ను ఏకపక్షం చేసింది. గాయం కారణంగా తెలంగాణ అమ్మాయి గుగులోత్ సౌమ్య ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోగా... మరింత ఆధిక్యం సాధించే పలు అవకాశాలను మన ప్లేయర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. గ్రూప్ 'బి'లో భాగంగా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ 9 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో ఉండగా... బుధవారమే జరిగిన మరో మ్యాచ్‌లో 11-0 గోల్స్ తేడాతో మంగోలియాపై గెలిచిన థాయ్‌లాండ్ కూడా 9 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. థాయ్‌లాండ్ కూడా టోర్నీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలవగా... ఓవరాల్‌గా 22 గోల్సే చేసిన థాయ్‌లాండ్ అచ్చం టీమిండియా లాగే ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా ఇవ్వలేదు. గ్రూప్ నుంచి ఒక్క జట్టే ముందంజ వేసే అవకాశం ఉండటంతో... ఇరు జట్ల మధ్య శనివారం జరిగే ఆఖరి గ్రూప్ మ్యాచ్‌కు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. చివరిసారి భారత జట్టు 2003లో ఆసియా కప్ ప్రధాన టోర్నీలో ఆడింది. ఆ తర్వాత భారత జట్టు ఈ టోర్నీకి అర్హత సాధించలేకపోయింది.



అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఎస్పార్టో సిటీలోని బాణసంచా తయారీ కర్మాగారంలో భారీ పేలుడు ధాటికి ఎగసిపడుతున్న అగ్నికీలలు, దట్టంగా కమ్ముకున్న పొగ. మంగళవారం రాత్రి ఈ అగ్నిప్రమాదం జరిగింది



పట్నాలో ఒక షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం జరగడంతో భవంతి నుంచి వెలువడుతున్న పొగ



జర్మనీలోని బెర్లిన్ నగరంలో బుధవారం ఒక అపార్ట్‌మెంట్‌కు మంటలంటుకోవడంతో ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఫస్ట్‌టైమర్లే విన్నర్లు!

బిహార్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేల పట్ల ఓటర్ల విముఖత

2020లో 127 మంది తొలిసారి ఎమ్మెల్యేలు

బిహార్‌లో త్వరలో జరుగనున్న 18వ శాసన సభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై దృష్టి పెట్టాయి. గెలుపు గుర్రాల కోసం అన్వేషణ కొనసాగుతోంది. సిట్టింగ్‌లతో పోలిస్తే ఓటర్లు కొత్త అభ్యర్థులకే పట్టం కట్టడం బిహార్‌లో ఆనవాయితీగా వస్తోంది. 2010, 2015, 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గమనిస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది. గత మూడు పర్యాయాలు అసెంబ్లీలో అడుగు పెట్టినవారిలో సగానికి పైగా ఎమ్మెల్యేలు మొదటిసారి పోటీ చేసి గెలిచినవారే కావడం విశేషం. విజేతల్లో ఫస్ట్‌టైమ్ ఎమ్మెల్యేలే ఎక్కువగా ఉండడం బిహార్ ప్రత్యేకత అని చెప్పొచ్చు. అభ్యర్థులను వరుసగా రెండోసారి గెలిపించడానికి ఓటర్లు ఇష్టపడడం లేదు.

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	మొదటిసారి	రెండోసారి	మూడోసారి
2010	150	36	33
2015	131	62	18
2020	127	56	25

సంవత్సరం	పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు	విజేతలు
2005	224	160 (71.4 శాతం)
2010	118	65 (55.1 శాతం)
2015	162	86 (53.1 శాతం)
2020	179	87 (48.6 శాతం)

కొత్త ముఖాలు 50 శాతానికి పైగానే..

బిహార్‌లో శాసనసభ స్థానాల సంఖ్య 243. 2010 ఎన్నికల్లో ఏకంగా 150 మంది మొదటిసారి విజయం సాధించారు. అంటే 61.7 శాతం మంది తొలిసారి అసెంబ్లీలో ప్రవేశించారు. 2015లో వీరి సంఖ్య కొంత తగ్గింది. 243 మందికి గాను 131 మంది తొలిసారి గెలిచారు. 53.9 శాతం మంది మొదటిసారి ఎమ్మెల్యేలు అయినవారు ఉన్నారు. 2020 ఎన్నికల్లో 127 మంది ఫస్ట్‌టైమ్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అసెంబ్లీ వీరి వాటా 52.3 శాతం. మొత్తానికి కొత్త ముఖాల సంఖ్య 50 శాతానికిపైగానే ఉండడం గమనార్హం. రెండోసారి కంటే మూడోసారి గెలిచిన వారి సంఖ్య చాలా స్వల్పంగా ఉంది. ఈసారి ఎన్నికల్లోనూ ఇదే ధోరణి కొనసాగుతుందా? లేక ఓటర్లు మనసు మార్చుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది.

సిట్టింగ్‌లకు కష్టకాలమే

రాష్ట్రంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు మరోసారి పోటీచేసి నెగ్గడం గగనకుసుమంగా మారుతోంది. గత 20 ఏళ్లుగా వారి సక్సెస్ రేటు క్రమంగా పడిపోతోంది. 2005లో పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 71.4 శాతం మంది మళ్లీ గెలిచారు. 2010లో పోటీచేసిన వారిలో కేవలం 55 శాతం మంది రెండోసారి ఎన్నికయ్యారు. 2015లో వీరి సంఖ్య 53.1 శాతానికి పడిపోయింది. 2020 ఎన్నికల్లో 48.6 శాతం మంది మరోసారి గెలిచారు. పాత ఎమ్మెల్యేలను పక్కనపెట్టి కొత్త నేతలకు ఓటర్లు పట్టం కడుతుండడం ఆశావహులకు వరం లాంటిదేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

థాయిలాండ్‌లో ఒకేఒక్కడు !

- ఒక్కరోజు ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సూర్య జుగ్రూంగ్‌రియాంగ్‌కిట్
- థాయిలాండ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం



బ్యాంకాక్: 1999వ సంవత్సరంలో విడుదలై సంచలన విజయం సాధించిన హీరో అర్జున్ సినిమా 'ఒకే ఒక్కడు' గుర్తుండే ఉంటుంది. ముఖ్యమంత్రి పాత్రధారి రఘువరన్ దమ్ముంటే ఒక్కరోజు సీఎంగా పరిపాలించి చూడు ఆ కష్టమేంటో తెలుస్తుంది అంటూ కథానాయకుడికి సవాల్ విసరడం, సవాల్‌ను అంతేవేగంగా స్వీకరించి అర్జున్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొని మెరుపువేగంతో పరిపాలనను చక్కదిద్దడం సినిమాలో చూశాం. సినిమాలో మాత్రమే సాధ్యమయ్యే ఈ అనూహ్య ఘటనకు ఇప్పుడు థాయిలాండ్ రాజకీయం వేదికైంది. కాంబోడియా ప్రధాని హున్‌సేన్‌తో ఫోన్ సంభాషణలో అతివినయం ప్రదర్శిస్తూ సొంత దేశ సైన్యాన్నే కించపరిచారంటూ ఆరోపణలు రావడంతో థాయిలాండ్ యువ మహిళా ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రను మంగళవారం దేశ రాజ్యాంగ న్యాయస్థానం సస్పెండ్‌చేసింది. దీంతో ప్రధాని పీఠం ఖాళీ అయింది. రాజకీయ సంక్షోభం తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో అధికార పార్టీ వెంటనే రవాణా మంత్రి సూర్య జుగ్రూంగ్‌రియాంగ్‌కిట్‌ను ప్రధానిగా ప్రకటించింది. అయితే ఆయన కేవలం 24 గంటలపాటు మాత్రమే ప్రధానమంత్రి హోదా లో కొనసాగుతారని స్పష్టంచేసింది. దీంతో ఒక్కరోజు ప్రధాని అంశం మంగళవారం యావత్ థాయిలాండ్‌లో చర్చనీయాంశమైంది. ఒక్కరోజు లో కొత్త ప్రధాని ఏమేం బాధ్యతలు నెరవేర్చుతారు?. ఎలాంటి విధానపర నిర్ణయాలు తీసుకుంటారనే చర్చ మొదలైంది. ఈ విస్తృత చర్చల నడుమే సూర్య బుధవారం ఉదయం ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. ఇప్పటికే ఉప ప్రధాని బాధ్యతలు నిర్వహిస్తున్న సూర్యకు ఇప్పుడీ ప్రధాని బాధ్యతలు అదనం. బుధవారం బ్యాంకాక్ నగరంలో ప్రధాని కార్యాలయ 93వ వార్షికోత్సవంలో సూర్య పాల్గొని తొలి అధికార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కనీసం 93 గంటలుకూడా ప్రధాని కార్యాలయంలో గడిపే అవకాశంలేని నేత ఏకంగా ప్రధాని కార్యాలయ 93వ వార్షికోత్సవాన్ని ప్రారంభించారని విపక్ష పార్టీలు ఎద్దేవాచేశాయి. 24 గంటల్లో వ్యవస్థలోని అవినీతినంతా ఈయన ప్రక్షాళన చేస్తాడా అంటూ విమర్శలు గుప్పించారు.

గదిలో బంధించాడు వివస్త్రను చేశాడు!

మోనోజిత్‌పై మరో విద్యార్థిని ఆరోపణలు

కోల్‌కతా: లా కాలేజీ గ్యాంగ్‌రేప్ కేసులో ప్రధాన నిందితుడు, తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు మోనోజిత్ మిశ్రాపై మరిన్ని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అతను తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని మరో విద్యార్థిని వెల్లడించింది. ఓ వేడుక సందర్భంగా గదిలో బంధించి, వివస్త్రను చేసి లైంగికంగా వేధించాడని ఆరోపించింది. ''2023 అక్టోబర్‌లో కాలేజీ వేడుకలో ఓ పక్క విద్యార్థులు డ్యాన్స్ చేస్తుండగా మా నాన్న ఫోన్ చేశారు. గోలగోలగా ఉండటంతో మాట్లాడటానికి పక్కనున్న ఖాళీ గదిలోకి వెళ్లాను. మాట్లాడి బయటికి రాబోతుండగా మోనోజిత్ లోపలికొచ్చి తలుపు లాక్ చేశాడు. మద్యం, గంజాయి తాగి ఉన్నాడు. నా మీదికొస్తుంటే నెట్టేశా. దాంతో తన జేబులోని రిమోట్‌తో వేదిక వద్ద మ్యూజిక్ సౌండు పెంచాడు. తర్వాత నా జుట్టు పట్టుకుని గదిలోని బాల్కనీలోకి ఈడ్చుకెళ్లాడు. నా బట్టలు విప్పడం ప్రారంభించాడు. వదిలెయ్యమని వేడుకున్నా. బిగ్గరగా అరిచా. అదృష్టవశాత్తూ ఒక సీనియర్ విద్యార్థి తలుపు తట్టడంతో మోనోజిత్ పారిపోయాడు'' అని వెల్లడించింది.

ఇష్టపూర్వక లైంగిక కలయికే: లాయర్

గ్యాంగ్ రేప్ కేసులో మోనోజిత్‌తో పాటు జైబ్ అహ్మద్, ప్రమిత్ ముఖర్జీ కస్టడీని కోర్టు మరో ఎనిమిది రోజులు పొడిగించింది. వారి తర్వాత అరెస్టయిన నాలుగో నిందితుడు, కాలేజీ సెక్యూరిటీ గార్డు పినాకీ బెనర్జీ కస్టడీనీ జూలై 4 వరకు పొడిగించారు. మోనోజిత్ ఆరోగ్య పరీక్షల సమయంలో సమయంలో అతని శరీరంపై రక్కిన గీతలను పోలీసులు గుర్తించారు. లైంగిక దాడిని బాధితురాలు ప్రతిఘటించిందనేందుకు అవి నిదర్శమని పోలీసు వర్గాలు తెలిపాయి. మోనోజిత్ కాల్ రికార్డులను సిట్ బృందం పరిశీలించింది. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నయనా చటర్జీతో అతనికి జరిగిన ఫోన్ సంభాషణల ఆధారాలను గుర్తించింది. కానీ మోనోజిత్ తరఫు లాయర్ రాజూ గంగూలీ మాత్రం బాధితురాలి ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని ఆరోపించారు. ''ఆమె ఇష్టపూర్వకంగానే అతనితో లైంగికంగా కలిసింది. మోనోజిత్ మెడపై ఆమె గోటి గుర్తులే దానికి నిదర్శనం. ఈ విషయాన్ని ప్రాసిక్యూషన్ కావాలనే దాస్తోంది'' అని ఆక్షేపించారు.

గాల్లో ఉండగా ఊడిన కిటికీ ఫ్రేమ్

ముంబై: గోవా నుంచి పుణెకు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ క్యూ400 విమానం కిటికీ ఫ్రేమ్ హఠాత్తుగా ఊడిపోయింది. అయితే ప్రయాణికుల భద్రతకు ఎలాంటి భంగం వాటిల్లలేదని తెలుస్తోంది. పుణెలో విమానం ల్యాండవగానే ఊడిన కాస్మెటిక్ ఇంటీరియర్ కిటికీ ఫ్రేమ్‌ను బిగించామని స్పైస్‌జెట్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే ఈ ఘటనను ఆ విమాన ప్రయాణికులు తీవ్రంగా తప్పుబట్టారు. సరైన ముందస్తు తనిఖీలు చేయకుండా విమానాలను నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. '' కిటికీ అసెంబ్లీ యూనిట్ మొత్తం ఊడిపోయింది. అయినాసరే విమానాన్ని అలాగే పోనిచ్చారు. అసలీ విమానాన్ని ఎగిరే అర్హత ఉందా?'' అంటూ ఒక ప్రయాణికుడు సంబంధిత కిటికీ ఫొటోను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)కు ట్యాగ్‌చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

కోవిడ్ టీకాలకు హఠాన్మరణాలతో సంబంధం లేదు

- జీవనశైలి, వంశపారంపర్యం, పాత అనారోగ్య సమస్యల వల్లే ఆకస్మిక మరణాలు
- స్పష్టంచేసిన ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీ, ఎయిమ్స్ అధ్యయనం

సాక్షి, న్యూఢిల్లీ: కోవిడ్ మహమ్మారి విజృంభణ కారణంగా హడావిడిగా వేయించుకున్న కోవిడ్-19 వ్యాక్సిన్ల కారణంగానే దేశవ్యాప్తంగా 18-45 ఏళ్ల యుక్త వయసు వారిలో ఆకస్మిక మరణాలు ఎక్కువవుతున్న వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం స్పష్టం చేసింది. ఆరోపణలు నేపథ్యంలో విస్తృతస్థాయిలో చేపట్టిన అధ్యయనం ద్వారా ఈ విషయం స్పష్టమైందని కేంద్రం పేర్కొంది. తమ రాష్ట్రంలోని హసన్ జిల్లాలో కోవిడ్ టీకాలు వేసుకున్న వారిలో నెలరోజుల వ్యవధిలో 20 మంది గుండెపోటుతో చనిపోతున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించిన వేళ ఈ అధ్యయనం బహిర్గతంకావడం గమనార్హం. అయితే దేశవ్యాప్తంగా 18-45 ఏళ్ల యుక్త వయసు వారిలో ఆకస్మిక మరణాల పెరుగుదల కారణాలు, నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీ, ఎయిమ్స్‌లు రంగంలోకి దిగాయి. విస్తృతంగా పరిశోధన చేపట్టాయి. భారతదేశంలో కోవిడ్ వ్యాక్సిన్లు సురక్షితమైనవని అధ్యయనంలో తేలింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 47 పెద్ద ఆస్పత్రుల్లో ఈ అధ్యయనం చేపట్టింది. 2021 అక్టోబర్ నుంచి 2023 మార్చి వరకు 18-45 ఏళ్ల యుక్త వయసు వారిలో ఆకస్మికంగా చనిపోయిన వారి వివరాలను క్రోడీకరించారు. ఆ వయసు వారి మరణాలకు, కోవిడ్ టీకాలకు సంబంధం లేదని అధ్యయనం స్పష్టంచేసింది. జీవనశైలి, వంశపారంపర్య లక్షణాలు, పాత వ్యాధుల కారణంగానే ఆయా యుక్తవయసు వాళ్ల ప్రాణాలు కోల్పోయారని అధ్యయనం తేల్చింది.

విమాన ప్రమాదం వెనుక కుట్రకోణం?

జీపీఎస్ స్పూఫింగ్ జరిగినట్లు అనుమానాలు

- ఆ దిశగా సాగుతున్న దర్యాప్తు

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనకు అసలు కారణం ఏమిటన్నది ఇంకా నిర్ధారించలేదు. దర్యాప్తు కొనసాగుతూనే ఉంది. దీని వెనుక కుట్రకోణం లేకపోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా దర్యాప్తు సాగుతున్నట్లు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్‌మ మొహోల్ సైతం చెప్పారు. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్) సంకేతాలను తారుమారు చేసి ఎయిర్ ఇండియా విమానం కూలిపోయేలా ఎవరైనా కుట్రలు సాగించారా? అనేది చర్చనీయాంశంగా మారుతోంది. ఎందుకంటే 2023 నవంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు దేశ సరిహద్దుల్లో 465 జీపీఎస్ స్పూఫింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. అమృత్‌సర్, జమ్మూ ప్రాంతాల్లో అధికంగా జరిగాయి. గత నెలలో ఢిల్లీ నుంచి జమ్మూకు బయలుదేరిన ఎయిర్ విమానం కొద్దిసేపటికే తిరిగివచ్చింది. జీపీఎస్ సంకేతాల్లో ఏదో తారుమారు జరుగుతున్నట్లు అనుమానాలు రావడంతో ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని వెంటనే వెనక్కి మళ్లించారు.

కల్లోలిత ప్రాంతాల్లో అధికం

యుద్ధాలు జరిగే కల్లోలిత ప్రాంతాల్లో జీపీఎస్ స్పూఫింగ్ సమస్య అధికంగా ఉంది. 2024లో ఆయా ప్రాంతాల్లో శాటిలైట్ సిగ్నల్ జామింగ్ లేదా స్పూఫింగ్ ఘటనలు 4.3 లక్షలు నమోదయ్యాయి. 2023లో 2.6 లక్షలు నమోదయ్యాయి. అంటే ఏడాది కాలంలో 62 శాతం పెరిగాయి. ఈజిప్టు, లెబనాన్, నల్ల సముద్రం, రష్యా-ఎస్తోనియా, రష్యా-లాత్వియా, రష్యా-బెలారస్ సరిహద్దుల్లో స్పూఫింగ్ బెడద ఎక్కువగా ఉందని ఎయిర్‌లైన్స్ సంస్థలు చెబుతున్నాయి. మయన్మార్‌తోపాటు భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అంతర్జాతీయ వైమానిక పరిశ్రమ ఎదుర్కొంటున్న సైబర్ దాడుల్లో జీపీఎస్ స్పూఫింగ్, జామింగ్ కూడా ఒకటి. ఇలాంటి ఘటనలు తెలియపర్చడానికి అమెరికాలో ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఒక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

పైలట్‌కు తప్పుడు సంకేతాలు

భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన సి-130జే విమానం ఏప్రిల్‌లో మయన్మార్ గగనతలంపై ప్రయాణిస్తుండగా జీపీఎస్ స్పూఫింగ్ జరిగింది. దాంతో అప్రమత్తమై సురక్షితంగా ల్యాండ్‌చేశారు. జీపీఎస్ సిగ్నళ్లలోకి అపరిచితులు, విద్రోహులు చొరబడుతున్న ఘటనలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. స్పూఫింగ్ లేదా జామింగ్ అనేది పెనువిపత్తుగా మారుతోంది. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 2023-2024 మధ్య జీపీఎస్‌లో ఇంటర్‌ఫియరెన్స్ రేటు 175 శాతం, జీపీఎస్ స్పూఫింగ్ ఘటనలు 500 శాతం పెరిగాయి. స్పూఫింగ్ లేదా జామింగ్ చేస్తే విమానం కాక్‌పిట్‌లోని పైలట్‌కు తప్పుడు మార్గం, తప్పుడు గమ్యస్థానం కన్పిస్తాయి. నిర్దేశిత మార్గంలో వెళ్లాల్సిన విమానం మరో మార్గంలో వెళుతుంది. విమానం ప్రయాణించాల్సిన ఎత్తులోనూ మార్పులు వస్తాయి. దాంతో గగతలంలో విమానాలు పరస్పరం ఢీకొనే ప్రమాదం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఎత్తయిన భవనాలు, కొండలను ఢీకొట్టొచ్చు. అలాగే రన్‌వే కిందికి దూసుకెళ్లడం కూడా జరగొచ్చు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పాము కారణంగా ఆలస్యంగా టేకాఫ్

మెల్‌బోర్న్: విమానాల్లో సాంకేతిక సమస్యలే కాదు సర్పాలూ బయటపడుతున్నాయి. తీరా టేకాఫ్ అయ్యే సమయంలో విమానంలో పాము దూరడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎలాగోలా పామును పట్టుకుని బయటకు తీయడంతో చివరకు రెండు గంటలు ఆలస్యంగా విమానం బయల్దేరింది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ ఘటన జరిగింది. మంగళవారం బ్రిస్బేన్‌కు బయల్దేరాల్సిన వర్జిన్ ఆస్ట్రేలియా వీఏ337 విమానంలోకి పాము దూరడం అక్కడి వాళ్లు చూశారు. వెంటనే పాములు పట్టే వ్యక్తిని రప్పించారు. అరగంటలో అక్కడికొచ్చిన ఆ స్నేక్‌క్యాచర్ వెంటనే సరకు నిల్వ విభాగం ప్యానల్‌లో దూరిన పామును పట్టేశాడు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ''వాస్తవానికి ఈ పాము బ్రిస్బేన్ నుంచే ప్రయాణికుల లగేజీతోపాటే వచ్చి ఉంటుంది. అప్పుడు ఎవరూ గమనించలేదు. తిరుగు ప్రయాణంలో చూశారు'' అని స్నేక్‌క్యాచర్ మార్క్ అభిప్రాయపడ్డారు. స్థానిక చట్టాల ప్రకారం ఈ పామును తిరిగి అడవిలో వదిలిపెట్టబోరు. లైసెన్స్ ఉన్న వన్యప్రాణి సంరక్షకులకు ఇస్తారు.

గాల్లో ప్రాణాలు.. ఫోన్లలో వీలునామాలు

- చనిపోతామనుకుని ఆకస్మిక నిర్ణయాలు తీసుకున్న ప్రయాణికులు
- హఠాత్తుగా వేల అడుగుల కిందకు దూసుకొచ్చిన విమానం

టోక్యో: తరుణ్, జెనీలియా జంటగా గతంలో వచ్చిన 'శశిరేఖా పరిణయం'సినిమాలో గాయాలపాలైన హీరోయిన్ చనిపోతానన్న భయంతో అప్పటికప్పుడు తన ప్రేమను హీరోకు చెప్తుంది. అచ్చం అలాగే తాము చనిపోవడం ఖాయమని భావించిన విమాన ప్రయాణికులు అప్పటికప్పుడు తమ ఆస్తులు ఎవరికి దక్కాలో స్మార్ట్‌ఫోన్లలో వీలునామాలు రాసి తమ వారికి సందేశాలుగా పంపించారు. ఇంకొందరేమో తమ బ్యాంక్ డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్‌ల పిన్ నంబర్లు, లాగిన్ పాస్‌వర్డ్‌లు పంపించారు. మరి కొందరు బీమా మొత్తాలు, ఇన్సూరెన్స్ కంపెనీల వివరాలను మెసేజ్‌లుగా పంపించారు. 36,000 అడుగుల ఎత్తు నుంచి విమానం 10,500 అడుగుల దిగువకు స్వేచ్ఛగా పడిపోతుండటంతో తాము చనిపోవడం ఖాయమని భావించిన చాలా మంది ప్రయాణికులు ఇలా తమ చివరి కోరికలు, వీలునామాలను స్మార్ట్‌ఫోన్‌లో తమ కుటుంబసభ్యులకు చేరవేశారు. జూన్ 30న చైనాలోని షాంఘై పుడోంగ్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరిన విమానం మార్గమధ్యంలో ఇలా సాంకేతిక లోపంతో హఠాత్తుగా కిందకు దిగొచ్చి ప్రయాణికులకు గాల్లోనే చుక్కలు చూపించింది. చివరకు పైలట్ చాకచక్యంగా వ్యవహరించి ఎలాగోలా విమానాన్ని సమీప ఒసాకా నగరంలోని కన్సాయ్ విమానాశ్రయంలో రాత్రి 8.50 గంటలకు సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులు, సిబ్బందిసహా విమానంలోని మొత్తం 191 మంది ఊపిరి పీల్చుకున్నారు. జపాన్‌లోని టోక్యో నరీటా ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరిన ఈ బోయింగ్ 737 విమానం స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 6.53 నిమిషాలకు ఈ అనూహ్య పరిస్థితులను ఎదుర్కొంది. విమానంలో తలెత్తిన ఈ సాంకేతిక సమస్యపై ఇప్పుడు సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. రాత్రివేళ హాయిగా నిద్రపోతున్న వేళ విమానం ఒక్కసారిగా కుదుపునకు లోనై కిందకు దూసుకురావడం, ప్రయాణికులు ఉన్నట్లుండి తమ సీట్లలోంచి ఎగిరి పైకప్పునకు ఢీకొనడం, ఆక్సీజన్‌లు మాస్కులు పెట్టుకోండని సహాయక సిబ్బంది ఏడుస్తూ చెప్పిన దృశ్యాలను కొందరు ప్రయాణికులు రికార్డ్‌చేశారు.

సిడ్నీపై తుపాను 'బాంబ్'

- విమాన, రైలు సేవలకు అంతరాయం
- వేలాది ఇళ్లకు నిలిచిన విద్యుత్ సరఫరా

సిడ్నీ: 'బాంబ్' తుపాను సిడ్నీని అతలాకుతలం చేస్తోంది. బుధవారం రెండో రోజు కూడా నగరాన్ని తుపాను ముంచెత్తింది. నెలరోజుల పాటు కురిసే వర్షం కేవలం 6 గంటల్లోనే పడింది. దాంతో పలు విమానాలు రద్దయ్యాయి. రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. చెట్లు కూలిపోయాయి. విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో ఆగ్నేయ ఆస్ట్రేలియాలో వేలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆస్ట్రేలియాలోని అతి పెద్ద విమానయాన సంస్థలు క్వాంటాస్ ఎయిర్‌వేస్, వర్జిన్ ఆస్ట్రేలియా 55 విమానాలను రద్దు చేశాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలకు దూరంగా ఉండాలని అధికారులు కోరారు. ఆస్ట్రేలియాలో అత్యధిక జనాభా కలిగిన న్యూ సౌత్‌వేల్స్ రాష్ట్రంలో 35,000 ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచింది. దక్షిణాది సిడ్నీని వరదలు ముంచెత్తాయి. భారీ గాలులతో చెట్లు కూలిపోయి రోడ్లను మూసివేశారు. సెంట్రల్ కోస్ట్ ప్రాంతంలో తీర ప్రాంత కోత కారణంగా తరలింపు ఆదేశాలు జారీ చేశారు. అల్పపీడన వ్యవస్థ కారణంగా గురువారంతో పాటు వారాంతంలో దేశంలోని నార్త్ ఐలాండ్‌లో భారీ వర్షాలు, బలమైన గాలులు వీస్తాయని న్యూజిలాండ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ అండ్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ తెలిపింది.

పహల్గాం ముష్కరులను కఠినంగా శిక్షించాల్సిందే

- సూత్రధారులను కూడా వదలొద్దు: క్వాడ్
- ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టీకరణ

వాషింగ్టన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని క్వాడ్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇందుకు కారణమైన వారిని వదిలిపెట్టేది లేదన్నాయి. అమెరికా విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం క్వాడ్ విదేశాంగ మంత్రుల భేటీ జరిగింది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, తకేషి ఇవాయా, పెన్నీ వాంగ్‌తో పాటు విదేశాంగ మంత్రి జైశంకర్ ఇందులో పాల్గొన్నారు. అనంతరం వారంతా ఉమ్మడి ప్రకటన చేశారు. ''ఉగ్రవాదాన్ని, తీవ్రవాద చర్యల్ని క్వాడ్ ముక్త కంఠంతో ఖండిస్తోంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా క్వాడ్ దేశాలు కలిసికట్టుగా పోరాడతాయి. పహల్గాంలో ఉగ్రదాడిని క్వాడ్ ఖండిస్తోంది. దాడికి వ్యూహ రచనలు చేసిన వారిని, ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న వారిని ఎలాంటి ఆలస్యం చేయకుండా ఐక్యరాజ్యసమితి శిక్షించాలి'' అని పేర్కొన్నారు. ''అంతర్జాతీయ చట్టం, భద్రతా మండలి తీర్మానాల ప్రకారం వారిపై విచారణ జరగాలలి. దాడిపై దర్యాప్తు చేస్తున్న అధికారులకు ఐరాస సభ్య దేశాలు చురుకుగా సహకరించాలి'' అని కోరారు. ఉగ్రవాదాన్ని నిరోధించడంలో దేశాల మధ్య సహకారంపై క్వాడ్ సమావేశం చర్చించింది. రూబియో ఆహ్వానం మేరకు జైశంకర్ జూన్ 30-జూలై 2 మధ్య అమెరికాలో పర్యటించారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఇరువురు చర్చించారు. జైశంకర్ మాట్లాడుతూ ''ఇటీవలి కాలంలో మా అనుభవాల దృష్ట్యా ఉగ్రవాదం గురించి ఒక మాట. ప్రపంచ దేశాలు ఉగ్రవాదాన్ని ఉపేక్షించరాదు. బాధితులను, నేరస్తులను సమానంగా చూడకూడదు. ఉగ్రవాదం నుంచి తన ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది. దానిని మేం ఉపయోగించుకుంటాం. క్వాడ్ భాగస్వాములు దానిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం''అని అన్నారు.

రాజ్యాంగ సవరణలు - ముఖ్యాంశాలు

1వ సవరణ
(అమల్లోకి వచ్చిన తేదీ: 1951, జూన్ 18)

- సవరించిన ప్రకరణలు: 15, 19, 85, 87, 174, 176, 341, 342, 372, 376.
- కొత్తగా చేర్చినవి: 31 ఎ, 31 బి ప్రకరణలు, షెడ్యూల్ 9.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:

1. స్వేచ్ఛ, సమానత్వ, ఆస్తి హక్కులపై ప్రజా ప్రయోజనం దృష్ట్యా నియంత్రణ విధించారు.
2. భూ సంస్కరణలకు సంబంధించిన అంశాలను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు. ఈ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావు. అసెంబ్లీల సమావేశ కాలాలు, న్యాయాధికారుల నియామకాలు.

2వ సవరణ (1953, మే1)

- సవరించిన ప్రకరణ- 81
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు:

1. ఇది పార్లమెంటులో రాష్ట్రాలకు కేటాయించిన సీట్ల (స్థానాలు) మార్పుకు సంబంధించిన సవరణ.

3వ సవరణ (1955, ఫిబ్రవరి 22)

- ఏడో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు:
- ముడిపత్తి, ఆహార ధాన్యాల ఉత్పత్తి, పశువులకు సంబంధించిన అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

4వ సవరణ (1955, ఏప్రిల్ 27)

- సవరించిన ప్రకరణలు: 31, 31 ఎ, 305. తొమ్మిదో షెడ్యూల్‌ని కూడా సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:

1. భారత ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్న ఆస్తులకు ఇచ్చే నష్ట పరిహారాన్ని కోర్టుల పరిధికి వెలుపల ఉంచారు.

5వ సవరణ (1955, డిసెంబర్ 24)

- ప్రకరణ 3ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
- రాష్ట్రపతి.. రాష్ట్రాల భౌగోళిక సరిహద్దులు, పేర్లను మార్చే బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రాల అభిప్రాయం కోసం పంపిస్తారు. వాటిపై సమాధానం చెప్పేందుకు రాష్ట్రాలకు నిర్ణీత సమయం ఇస్తారు.

6వ సవరణ (1956, సెప్టెంబర్ 11)

- సవరించిన ప్రకరణలు- 269, 286.
- ఏడో షెడ్యూల్‌లోని 1వ జాబితా, 2వ జాబితాకు సవరణలు చేశారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. అంతర్రాష్ట్ర వాణిజ్యంపై పన్నులు విధించే అధికారం పార్లమెంటుకు ఉంటుంది.

7వ సవరణ (1956, నవంబర్ 1)

- సవరించిన ప్రకరణలు: 1, 49, 80, 81, 82, 131, 153, 158, 168, 170, 171, 216, 217, 220, 222, 224, 230, 231,232,371. కొత్తగా చేర్చిన ప్రకరణలు: 258 ఎ, 290 ఎ, 350 ఎ, 350 బి, 372 ఎ , 378 ఎ. తొలగించిన ప్రకరణలు: 238, 242, 243, 259, 278, 306, 379, 391.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. రాష్ట్రాల పునర్విభజన ద్వారా 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలను ఏర్పాటు చేశారు.
2. లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభల స్థానాల మార్పు.
3. హైకోర్టులో తాత్కాలిక అదనపు న్యాయమూర్తుల నియామకానికి అవకాశం కల్పించారు.
4. కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన అంశాల్లో మార్పులు చేశారు.
5. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, బొంబాయి రాష్ట్రాలకు సంబంధించి కొన్ని ప్రత్యేక అంశాలు చేర్చారు.
6. ఒకే వ్యక్తిని ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమించే అవకాశం కల్పించారు.

8వ సవరణ (1960, జనవరి 5)

- సవరించిన ప్రకరణ: 334
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:
- షెడ్యూల్ కులాలు, తెగలు, ఆంగ్లో ఇండియన్లకు లోక్‌సభ, శాసనసభల్లో కేటాయించిన స్థానాలను 1970 వరకు పొడిగించారు.

9వ సవరణ (1960, డిసెంబర్ 28)

- మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- పశ్చిమబెంగాల్ ఆమోదించింది.
- ముఖ్యాంశాలు:
- బేరూబరీ ప్రాంతాన్ని పాకిస్తాన్‌కు బదిలీ చేయడానికి ఈ సవరణ చేశారు.

10వ సవరణ (1961, ఆగస్టు 11)

- ప్రకరణ 240తో పాటు మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
- దాద్రానగర్ హవేలీని కేంద్రపాలిత ప్రాంతంగా భారతదేశంలో విలీనం చేశారు.

11వ సవరణ (1961, డిసెంబర్ 19)

- సవరించిన ప్రకరణలు: 66 (1), 71 (3)
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
  ముఖ్యాంశాలు:
- రాష్ట్రపతి/ఉప రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీకి సంబంధించిన అంశాలను సవరించారు. రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీలో ఖాళీలు ఉన్నాయనే నెపంతో ఎన్నికలను వాయిదా వేయరాదు.

12వ సవరణ (1961, డిసెంబర్ 20)

- ప్రకరణ 240తోపాటు మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- గోవా, డామన్-డయ్యూలను భారత్‌లో విలీనం చేశారు.

13వ సవరణ (1963, డిసెంబర్ 1)

- కొత్తగా ప్రకరణ 371ఎ చేర్చారు.
- నాగాలాండ్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

14వ సవరణ (1962, డిసెంబర్ 28)

- 239 ఎ, 241 ప్రకరణలతోపాటు 1, 4 షెడ్యూళ్లలోని అంశాలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
  పాండిచ్చేరి (ప్రస్తుతం పుదుచ్చేరి)ని కేంద్ర పాలిత ప్రాంతంగా భారతదేశంలో చేర్చుకున్నారు. అలాగే ఈ కేంద్రపాలిత ప్రాంతానికి ప్రత్యేక శాసనసభను, మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, గోవాలకు శాసనసభలను, మంత్రివర్గాన్ని ఏర్పరిచారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

15వ సవరణ (1963, అక్టోబర్ 5)

- సవరించిన ప్రకరణలు: 124, 128, 217, 222, 224, 226, 297, 311, 316 . నూతనంగా ప్రకరణ 224 ఎ చేర్చారు. 7వ షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచారు.
2. హైకోర్టులో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను పునర్నియమించే అవకాశం కల్పించారు.
3. హైకోర్టు పరిధిని విస్తరించారు.
4. ఉద్యోగుల తొలగింపునకు సంబంధించి రాష్ట్రపతి, గవర్నర్ అధికారాలను సవరించారు.

16వ సవరణ (1963, అక్టోబర్ 5)

- 19, 84, 173 ప్రకరణలను, 3వ షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
  ప్రకరణ 19లోని స్వేచ్ఛా హక్కుపై పరిమితులు. ఎంపీ, ఎమ్మెల్యే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీ ప్రమాణ స్వీకార ప్రక్రియలో మార్పు.

17వ ప్రకరణ (1964, జూన్ 20)

- ప్రకరణ 31 ఎ, 9వ షెడ్యూల్‌ని సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఎస్టేట్ పద నిర్వచనాన్ని మార్చారు. వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకుంటే మార్కెట్ విలువ చెల్లించాలి.

18వ సవరణ (1966, ఆగస్టు 27)

- ప్రకరణ 3ని సవరించారు.
- ప్రకరణ 3లోని 'రాష్ట్రం' అనే మాటను పునర్నిర్వచించారు. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లను పునర్వ్యవస్థీకరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

19వ సవరణ (1966, డిసెంబర్ 11)

- సవరించిన ప్రకరణ-324
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
  ఎన్నికల వివాదాలకు సంబంధించి ఎన్నికల ట్రిబ్యునల్ ఏర్పాటు.

20వ సవరణ (1966, డిసెంబర్ 22)

- నూతనంగా ప్రకరణ 233 ఎ చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
  ముఖ్యాంశాలు:
- ఈ సవరణ ద్వారా జిల్లా జడ్జీల నియామక ప్రాతిపదికను రాజ్యాంగంలో చేర్చారు.

21వ సవరణ (1967, ఏప్రిల్ 10)

- ఎనిమిదో షెడ్యూల్‌ను సవరించారు.
- సింధీని 15వ అధికార భాషగా 8వ షెడ్యూల్‌లో చేర్చారు.

22వ సవరణ (1969, సెప్టెంబర్ 25)

- 244 ఎ, 371 బి, 275 (1ఎ) ప్రకరణ లను కొత్తగా చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- మేఘాలయను స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాంతంగా ఏర్పాటు చేశారు.
- అస్సాం రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక ప్రాధాన్యాలు కల్పించారు.

23వ సవరణ (1970, జనవరి 23)

- 330,332,333,334 ప్రకరణలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో షెడ్యూల్ కులాలు, తరగతులు, ఆంగ్లో ఇండియన్ల రిజర్వేషన్లను 1980 వరకు పొడిగించారు.

24వ సవరణ (1971, నవంబర్ 5)

- 13, 368 ప్రకరణలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నయినా సవరించే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించారు.

25వ సవరణ (1972, ఏప్రిల్ 20)

- సవరించిన ప్రకరణ-31.
- కొత్తగా చేర్చిన ప్రకరణ- 31 సి.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- 'నష్టపరిహారం' అనే పదం స్థానంలో 'కొంత మొత్తం' అనే పదాన్ని చేర్చారు. ఆదేశిక నియమాల్లోని 39 (బి), (సి) అమలుకు చట్టాలు చేస్తే వాటిని న్యాయస్థానాలు ప్రశ్నించరాదు.

26వ సవరణ (1971, డిసెంబర్ 28)

- సవరించిన ప్రకరణ-366; నూతనంగా చేర్చిన ప్రకరణ- 363 ఎ; తొలగించిన ప్రకరణలు- 291, 362.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- రాజవంశస్తులకు ఇచ్చే రాజభరణాలు, ప్రత్యేక సదుపాయాలను రద్దు చేశారు.

27వ ప్రకరణ (1972, ఫిబ్రవరి 15)

- 239 ఎ, 240 ప్రకరణలను సవరించారు; నూతనంగా ప్రకరణ 371 సి చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఈశాన్య రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించారు. ప్రకరణ 371 సి ప్రకారం మణిపూర్‌కు మంత్రిమండలి, అసెంబ్లీని ఏర్పాటు చేశారు.

28వ ప్రకరణ (1972, ఆగస్టు 29)

- నూతనంగా ప్రకరణ 312 ఎని చేర్చి.. ప్రకరణ 314ను తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఇండియన్ మాజీ సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు గల ప్రత్యేక హక్కులు, హోదాలను తొలగించారు.

29వ సవరణ (1972, జూన్ 9)

- తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- కేరళ రాష్ట్ర భూ సంస్కరణల చట్టాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు.

30వ సవరణ (1973, ఫిబ్రవరి 27)

- సవరించిన ప్రకరణ - 133
- సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లేందుకు గల రూ.20 వేల పరిమితిని తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

31వ సవరణ (1973, అక్టోబర్ 17)

- సవరించిన ప్రకరణలు - 81, 330, 332.
- లోక్‌సభ సీట్ల సంఖ్యను 525 నుంచి 545కు పెంచారు. కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 25 నుంచి 20కి తగ్గించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

32వ సవరణ (1974, జూలై 1)

- 371 ఎ ప్రకరణను సవరించి.. కొత్తగా 371 డి, 371 ఇ ప్రకరణలను చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఆరు సూత్రాల పథకాన్ని చేర్చారు.
- 371-ఇ ప్రకారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

33వ ప్రకరణ (1974, మే 19)

- సవరించిన ప్రకరణలు- 101, 190.
- పార్లమెంటు, శాసనసభ్యుల రాజీనామా పత్రాన్ని సభాధ్యక్షుడు తప్పనిసరిగా ఆమోదించాలనే నిబంధనను తొలగించారు. సభ్యుడు ఇష్టపూర్వకంగా/స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నాడని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే స్పీకర్ లేదా ఛైర్మన్ రాజీనామాను ఆమోదించాలి.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

34వ ప్రకరణ (1974, సెప్టెంబర్ 7)

- తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- తొమ్మిదో షెడ్యూల్ అధికార పరిధిని పెంచారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

35వ సవరణ (1975, మార్చి 1)

- 80, 81 ప్రకరణలను సవరించి.. కొత్తగా ప్రకరణ 2 ఎ చేర్చారు.
- సిక్కింకు సహ రాష్ట్ర హోదా కల్పిస్తూ పదో షెడ్యూల్‌ను కొత్తగా చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

36వ సవరణ (1975, ఏప్రిల్ 26)

- నూతనంగా ప్రకరణ 371 ఎఫ్ చేర్చి.. ప్రకరణ 2ఎను తొలగించారు.
- సిక్కింకు పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. సిక్కిం 22వ రాష్ట్రంగా ఏర్పడింది. పదో షెడ్యూల్‌ను తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

37వ సవరణ (1975, మే 3)

- నూతనంగా 239ఎ, 240 ప్రకరణలు చేర్చారు. కేంద్ర పాలిత ప్రాంత హోదా గల అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రదేశ్ కౌన్సిల్ స్థానంలో లెజిస్లేటివ్ అసెంబ్లీ, కౌన్సిలర్ల స్థానంలో మంత్రిమండలి ఏర్పాటు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

38వ సవరణ (1975, ఆగస్టు 1)

- సవరించిన ప్రకరణలు: 123, 213, 239 బి 352, 356, 359, 360.
  ముఖ్యాంశాలు:

1. రాష్ట్రపతి, గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్ జారీచేసే ఆర్డినెన్స్‌లు కోర్టుల అధికారాల పరిధిలోకి రావని తీర్మానించారు.
2. రాష్ట్రపతి విధించే అత్యవసర పరిస్థితిని కోర్టుల అధికార పరిధి నుంచి తప్పించారు. న్యాయ సమీక్షకు గురికాదు.

- రాష్ట్రాల ఆమోదం పొందింది.

39వ సవరణ (1975, ఆగస్టు 10)


- 71, 329 ప్రకరణలతో పాటు తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి , లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు సంబంధించిన అంశాలు న్యాయసమీక్ష పరిధిలోకి రావు.
- తొమ్మిదో షెడ్యూల్‌లో నూతన చట్టాలను చేర్చారు.రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

40వ ప్రకరణ (మే 27, 1976)

- 31 బి, 297 ప్రకరణలతో పాటు 9వ షెడ్యూల్‌ను సవరించారు. ➡ తన అధికార పరిధిలోని భౌగోళిక జలాలపై భారతదేశానికి పూర్తి హక్కు ఉంటుంది. దీనికి సంబంధించిన చట్టాలు చేసే అధికారాన్ని పార్లమెంటుకు కట్టబెట్టారు.
- తొమ్మిదో షెడ్యూల్‌లో నూతన చట్టాలను చేర్చారు.

కంఠ బిలంపై మూతలా పని చేసే నిర్మాణం?

ప్రాక్టీస్ టెస్ట్



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

1. రాజుకు రే చీకటి ఉందని డాక్టర్ నిర్ధారించాడు. మరి రాజు కిందివాటిలో దేనికి సంబంధించి ఉంటాడు?
   1) ఎక్కువ వెలుతురు, రాత్రుల్లో వస్తువు లను చూడలేడు.
   2) రంగు వస్తువులను, పగటిపూట వస్తువులను చూడలేడు.
   3) తక్కువ వెలుతురులో, రాత్రిపూట వస్తువులను చూడలేడు.
   4) రాత్రిపూట వస్తువులను చూస్తాడు, పగటిపూట వస్తువులను చూడలేడు.
2. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రానికి సంబంధించి సరైంది?
   1) లైంగిక చక్రం దోమలో జరుగుతుంది. అలైంగిక చక్రం మానవుడిలో జరుగుతుంది.
   2) లైంగిక, అలైంగిక చక్రాలు మానవుడి లో జరుగుతాయి.
   3) అలైంగిక చక్రం దోమలో జరుగుతుంది. లైంగిక చక్రం మానవుడిలో జరుగు తుంది.
   4) లైంగిక, అలైంగిక చక్రాలు అవకాశాన్ని బట్టి వేటిలోనైనా జరగవచ్చు.
3. అండకోశానికి సంబంధించిన కణాలే ఒక దానితో ఒకటి సంయోగం చెంది ఏర్పడే కణం?
   1) సంయుక్త బీజం
   2) ద్వితీయ కేంద్రకం
   3) అంకురచ్ఛదం
   4) ప్రతిపాద కణం
4. మొక్క ఆహార కర్మాగారంగా దేన్ని పేర్కొంటారు?
   1) విత్తనం 2) అండకోశం
   3) వేరు 4) పత్రం
5. ప్రొజెస్టిరాన్ హార్మోన్ పని?
   1) గ్లైకోజన్‌ను గ్లూకోజ్‌గా మార్చడం.
   2) గాయిటర్ రాకుండా కాపాడడం.
   3) గర్భాశయ పెరుగుదల, జరాయువు ఏర్పడడం.
   4) నపుంసకత్వం రాకుండా ఉండడం.
6. సహజ శత్రువులైన కీటకాలను ప్రవేశపెట్టి కలుపు మొక్కలను నాశనం చేసే పద్ధతి?
   1) బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతి
   2) జీవక్రియా విధాన పద్ధతి
   3) భౌతిక పద్ధతి
   4) రసాయన పద్ధతి
7. స్పర్శ గ్రాహకాలు ఏ భాగాలపై ఎక్కువగా ఉంటాయి?
   1) వేళ్ల కొనలపై
   2) నొసటి ప్రాంతంలో
   3) పెదవులపై 4) 1, 3
8. కిందివాటిలో ఏ రుచికి చెందిన గ్రాహకాలు నాలుక వెనుక భాగంలో ఉంటాయి?
   1) తీపి 2) ఉప్పు
   3) పులుపు 4) చేదు
9. పాములు వాటి శాస్త్రీయ నామాలకు సంబంధించి సరైన జత?
   ఎ) తాచుపాము - రస్సెల్స్ వైపర్
   బి) కట్లపాము - ఓఫియోఫెగస్ హెన్న
   సి) ఎకిస్ కారినేటా- సాస్కేల్ వైపర్
   డి) రక్తపింజర- బంగారస్ ఫాసియేటస్
   1) ఎ, సి 2) సి, డి
   3) బి, డి 4) ఎ, డి
10. చిన్న పిల్లల్లో అతి సామాన్యంగా కలిగే చర్మ వ్యాధి గజ్జిని కలిగించే క్రిమి ఏ వర్గానికి చెందింది?
    1) ప్లాటి హెల్మింథిస్ 2) ప్రోటోజోవా
    3) ఆర్థ్రోపొడా 4) నిమాటిహెల్మింథిస్
11. కిందివాటిలో వేటిని బయోఎరువులుగా ఉపయోగిస్తారు?
    1) ఆకుపచ్చ శైవలాలు
    2) నీలి ఆకుపచ్చ శైవలాలు
    3) గోధుమ వర్ణపు శైవలాలు 4) పైవన్నీ
12. 'రూబియోలా' అనే మరో పేరు కలిగిన వ్యాధి?
    1) ఆటలమ్మ 2) తట్టు (పొంగు)
    3) పోలియో (శిశు పక్షవాతం)
    4) గవద బిళ్లలు
13. అలిసిపోవడం, శ్లేష్మంతో కూడిన దగ్గు, బరువు తగ్గడం వంటి లక్షణాలను గుర్తించిన డాక్టర్ ఆ వ్యాధిగ్రస్తుడికి ఏ వ్యాధి ఉంది అని నిర్ధారిస్తాడు?
    1) కుష్టు 2) క్షయ
    3) మలేరియా 4) కోరింత దగ్గు
14. కిందివాటిలో ఏ రెండు ప్రవచనాలు సరైనవి?
    ఎ)చింతకాయ, మామిడి, నిమ్మ మొదలైన వాటిని పొగబెట్టడం ద్వారా నిల్వ చేస్తారు.
    బి) బ్యాక్టీరియా వేగంగా వృద్ధి చెందడానికి తగిన ఉష్ణోగ్రత 20°C- 40°C
    సి) ఈస్ట్‌లు ఆమ్ల ద్రావణంలో వృద్ధి చెందుతాయి.
    డి) ఎఫ్లోటాక్సిన్ కాలేయాన్ని పాడు చేస్తుంది.
    1) ఎ, బి 2) సి, డి
    3) బి, డి 4) ఎ, సి
15. మంచి కలపను ఇచ్చే ఇండియన్ రోజ్‌వుడ్ శాస్త్రీయ నామం?
    1) టిక్టోనియా గ్రాండిస్
    2) షొరియా రొబస్టా
    3) డాల్‌బర్జియా లాటిఫోలియా
    4) అజార్డికా ఇండికా
16. కేన్సర్‌కు సంబంధించి కిందివాటిలో ఏది సరైన జత?
    1) మాలిగ్నెంట్ - ఊపిరితిత్తులు ప్రమాదకరం కావు.
    2) కార్సినోమా-ఉపకళా కణాలకు వచ్చే కాన్సర్
    3) అపాయం చేయని ప్రణాలు - కార్సి నోమా
    4) ఇతర భాగాలకు సోకే గడ్డలు-బిలైన్ గడ్డలు.
17. గోళ్లు, రోమాలు, కొమ్ములు వంటి జంతు నిర్మాణాలు ఏ కణజాలం నుంచి తయారవుతాయి?
    1) సంయోజక కణజాలం
    2) కండర కణజాలం
    3) అస్థి కణజాలం
    4) ఉపకళా కణజాలం
18. ప్రౌఢ మానవుడిలో ఉండే కుంతకాల సంఖ్య?
    1) 4 2) 8
    3) 10 4) 12
19. మానవుడి జీర్ణ క్రియలో సెల్యులోజ్ తంతువుల ఉపయోగం కానిది?
    1) ఆహారానికి బరువును చేకూర్చడం.
    2) పేగులో ఆహారం సులువుగా జారేట్లు చేయడం.
    3) ప్రొటీన్‌ల జీర్ణ క్రియలో ఉపయోగపడడం.
    4) జీర్ణమైన పోషకాలను సమర్థవంతంగా పీల్చుకునేటట్లు చేయడం.
20. ఇతర జంతువులతో పోల్చినప్పుడు నెమరువేసే జంతువుల్లో గ్లూకోజ్ మట్టం ఏ విధంగా ఉంటుంది?
    1) అతి ఎక్కువగా 2) సమానంగా
    3) అతి తక్కువగా 4) కొలవలేం
21. ఈ కిందివాటిలో ఏది ఆంత్ర రసంలో మాత్రమే ఉంటుంది?
    1) ఎమిలాప్సిన్ 2) ట్రిప్సిన్
    3) ఎంటిరోకైనేస్ 4) కీమోట్రిప్సిన్
22. కిందివాటిలో ఏ జీవి నీలం రంగు రక్తాన్ని కలిగి ఉంటుంది?
    1) వానపాము 2) కప్ప
    3) నత్త 4) బొద్దింక
23. కిందివాటిలో కీటకాహారి మొక్క కానిది?
    1) డ్రాసిరా 2) నెపంథిస్
    3) డైమోనియా 4) కస్కుటా
24. పత్ర రంధ్రాలు తెరుచుకోవడం, మూసుకోవడం కిందివాటిలో ఏ చర్యపై ఆధారపడి ఉంటాయి?
    1) విసరణ 2) బాష్పోత్సేకం
    3) కిరణజన్యసంయోగక్రియ
    4) వేరు పీడనం
25. కిందివాటిలో ఏ జీవి ద్రవ రూపంలో ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకుంటుంది?
    1) నత్త 2) వానపాము
    3) ఈగ 4) చేప
26. సాధారణంగా శాఖాహార జంతువుల్లో ఏ దంతాలు లోపిస్తాయి?
    1) కుంతకాలు 2) రదనికలు
    3) చర్వణకాలు 4) అగ్రచర్వణకాలు
27. కిందివాటిలో ఏ జీవి విసర్జక పదార్థంగా యూరికామ్లాన్ని విసర్జిస్తుంది?
    1) కప్ప 2) చేప
    3) వానపాము 4) బొద్దింక
28. పట్టుపురుగులు-గొంగళి పురుగులు కిందివాటిలో ఏ రకం భక్షక విధానానికి ఉదాహరణ?
    1) ఏకరక భక్షణ 2) బహుళరక భక్షణ
    3) జాంతవ భక్షణ 4) సర్వ భక్షణ
29. చేప కాలేయ నూనెలో ఉండే విటమిన్‌లు?
    1) A, D 2) B, C
    3) E, K 4) C, D
30. కంఠ బిలంపై మూతలా పని చేసే నిర్మాణం?
    1) నాలుక 2) పటలిక
    3) కొండ నాలుక 4) ఉపరికుల

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 4	5) 3
6) 2	7) 4	8) 4	9) 2	10) 3
11) 2	12) 2	13) 2	14) 3	15) 3
16) 2	17) 4	18) 2	19) 3	20) 3
21) 3	22) 3	23) 4	24) 2	25) 3
26) 2	27) 4	28) 1	29) 1	30) 3

పులుల లెక్కింపునకు ఉపయోగించే పద్ధతి?

- 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా వన్య ప్రాణుల సంరక్షణను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి మార్చారు.
- మన దేశంలో అంతరించిపోతున్న జంతువుల సంరక్షణకు 'వన్య మృగ సంరక్షణ చట్టం ప్రకారం (1972)' అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. అవి..

1. ప్రాజెక్టు టైగర్ – 1973
2. ప్రాజెక్టు క్రోకడైల్ – 1975
3. ఆపరేషన్ సీ టర్టిల్ – 1975
4. ప్రాజెక్టు ఎలిఫెంట్ – 1992
5. ప్రాజెక్టు స్నో లెపర్డ్ – 2009

- దేశంలో అంతరించిపోతున్న పులులను సంరక్షించేందుకు 1973, ఏప్రిల్ 1న ప్రాజెక్టు టైగర్/ఆపరేషన్ టైగర్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.
- టైగర్ టాస్క్ ఫోర్స్ సిఫార్సుల మేరకు దేశంలో జాతీయ పులుల సంరక్షణ అధీకృత సంస్థ (ఎన్‌టీసీఏ) ఏర్పడింది. ఇది 'ప్రాజెక్టు టైగర్', టైగర్ రిజర్వ్‌ల నిర్వహణను పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా ఏర్పడింది.
  దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు ఉన్నాయి.
- దేశంలో తొలిసారిగా ఏర్పాటుచేసిన టైగర్ రిజర్వ్ బందీపూర్ టైగర్ రిజర్వ్ (కర్ణాటక).
- **దేశంలో అతి పెద్ద టైగర్ రిజర్వ్:** నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ (రాజీవ్‌గాంధీ టైగర్ రిజర్వ్).
- **దేశంలో అతి చిన్న టైగర్ రిజర్వ్:** ఒరంగ్ టైగర్ రిజర్వ్ (అసోం).
- **దేశంలో ఏర్పాటైన 48వ టైగర్ రిజర్వ్:** రాజాజీ టైగర్ రిజర్వ్ (ఉత్తరాఖండ్).
- **49వ టైగర్ రిజర్వ్:** ఒరంగ్ టైగర్ రిజర్వ్ (అసోం).
- **50వ టైగర్ రిజర్వ్:** కమ్లాంగ్ టైగర్ రిజర్వ్ (అరుణాచల్‌ప్రదేశ్).
- దేశంలో 2014–15లో పులుల సంఖ్య 2,226.
- ప్రస్తుతం దేశంలో పులుల లెక్కింపునకు ఉపయోగిస్తున్న పద్ధతి GIS (Global Imaging Satellite System). ప్రతి నాలుగేళ్లకోసారి పులులను లెక్కిస్తారు.
- పులులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం కర్ణాటక. తర్వాతి స్థానంలో ఉన్నది ఉత్తరాఖండ్.
- పులుల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతం కజిరంగ (అసోం).



2. **ప్రాజెక్టు క్రోకడైల్:** ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) సహకారంతో ఈ ప్రాజెక్టు భారతదేశంలో 1975లో ప్రారంభమైంది.

- దేశంలో అత్యంత వేగంగా అంతరిస్తున్న మొసళ్ల జాతి ఘరియల్. వీటిని చంబల్ వన్యప్రాణి కేంద్రం (National Chambal Gharial Wildlife Sanctuary)లో సంరక్షిస్తున్నారు. ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది.
- మొసళ్ల సంరక్షణకు తమిళనాడులో 'మద్రాస్ క్రోకడైల్ బ్యాంక్ ట్రస్ట్' ఉంది.

3. **ఆపరేషన్ సీ టర్టిల్:** దీన్ని మన దేశంలో 1975లో ప్రారంభించారు.

- దేశంలోని తాబేళ్ల సంరక్షణ ప్రాంతాలు..
  1. **గహిర్మాత బీచ్:** ఇది ఒడిశాలో ఉంది. ఇక్కడ సంరక్షిస్తున్న తాబేళ్ల జాతి ఆలివ్ రిడ్లే. వీటిని మన దేశంలో నక్షత్ర తాబేళ్లు అంటారు.
  2. **ట్యుటికోరిన్ బీచ్:** ఇది తమిళనాడులో ఉంది. ఇక్కడ సంరక్షిస్తున్న తాబేళ్ల జాతి హాక్స్‌బిల్.

3. **ప్రాజెక్టు ఎలిఫెంట్:** ఏనుగుల సంరక్షణకు 8వ పంచవర్ష ప్రణాళికా కాలం (1992–97)లో 'ప్రాజెక్టు ఎలిఫెంట్'ను ప్రారంభించారు.

- ప్రస్తుతం దేశంలో దాదాపు 30 ఎలిఫెంట్ రిజర్వ్‌లు ఉన్నాయి. ఎలిఫెంట్ సెన్సస్ (2017) ప్రకారం 23 రాష్ట్రాల్లో 27,312 ఏనుగులు ఉన్నాయి. అత్యధికంగా కర్ణాటకలో 6,049 ఏనుగులు ఉన్నాయి. తర్వాతి స్థానంలో అసోం (5,719), కేరళ (3,054) ఉన్నాయి. ప్రాంతాల వారీ చూస్తే దక్షిణ భారతంలో అత్యధికంగా 11,960 ఏనుగులు ఉన్నాయి.

4. **ప్రాజెక్ట్ స్నో లెపర్డ్ (మంచు చిరుత):** మన దేశంలో మంచు చిరుతల సంరక్షణకు 2009, జనవరి 20న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- ఇందులో భాగంగా ఐదు రాష్ట్రాల్లో మంచు చిరుతలను కాపాడుతున్నారు. అవి..
  1. జమ్ముకశ్మీర్ 2. హిమాచల్‌ప్రదేశ్
  3. ఉత్తరాఖండ్ 4. ఉత్తరప్రదేశ్
  5. అరుణాచల్‌ప్రదేశ్

దేశంలోని వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు

గతంలో అత్యధిక జీవ వైవిధ్యం గల భౌగోళిక ప్రాంతాలు ప్రస్తుతం మానవ కార్యకలాపాల వల్ల ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వాటిని ఎకలాజికల్ హాట్‌స్పాట్స్ అంటారు.

భారత్‌లోని ప్రధాన హాట్‌స్పాట్స్..
1. ఈశాన్య హిమాలయ ప్రాంతం.
2. పశ్చిమ కనుమలు.
3. ఇండో–బర్మా ప్రాంతం.

- జన్యుపరమైన తేడాలు, జాతుల్లో వైవిధ్యం, ఆవరణ వ్యవస్థలో భిన్న గుణాలన్నింటినీ కలిపి జీవవైవిధ్యం అంటారు.
  (లేదా)
  ఒక ప్రదేశంలోని వివిధ జీవజాతుల సంక్లిష్ట సహచరమే జీవవైవిధ్యం.
- జీవ వైవిధ్యం అనే పదాన్ని 1986లో అమెరికా శాస్త్రవేత్త వాల్టర్ రోసెన్ ప్రతిపాదించారు.
- ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం మే 22

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

- మన దేశంలో జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) చెన్నైలో ఉంది. బయలాజికల్ డైవర్సిటీ యాక్ట్ (2002) అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2003లో ఎన్‌బీఏను ఏర్పాటు చేసింది.
- జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం రెండు రకాల వ్యూహాలను రూపొందించింది. అవి..
  1. ఆవాసాంతర రక్షణ
  2. ఆవాసేతర రక్షణ

1. **ఆవాసాంతర రక్షణ:** ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే ప్రమాదం ఉన్న జీవజాతులను అవే సహజ సిద్ధ పరిసరాల్లో సంరక్షించడాన్ని ఆవాసాంతర రక్షణ అంటారు. ఇందులో భాగంగా చేపట్టే కార్యక్రమాలు..
   1. బయోస్ఫియర్ రిజర్వ్‌లు
   2. జాతీయ పార్కులు
   3. వన్య మృగ సంరక్షణ కేంద్రాలు
2. **ఆవాసేతర రక్షణ:** ఏదైన ఒక భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే స్థితిలో ఉన్న జీవ జాతులను వాటి సహజసిద్ధ పరిసరాలకు వెలుపల మానవ ప్రమేయంతో సంరక్షించే విధానాన్ని ఆవాసేతర రక్షణ అంటారు. ఇందులో భాగంగా చేపట్టే కార్యక్రమాలు..
   1. జంతు ప్రదర్శనశాలలు, బొటానికల్ గార్డెన్ల ఏర్పాటు.
   2. జన్యు బ్యాంకుల ఏర్పాటు.
   3. బీజద్రవ్య బ్యాంకుల ఏర్పాటు.

1. **బయోస్ఫియర్ రిజర్వ్‌లు(జీవావరణ మండలాలు):** జీవరాశుల మధ్య సమగ్రతను కాపాడటం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య అధ్యయనం, జీవవైవిధ్య పరిరక్షణ తదితర లక్ష్యాల సాధనకు ప్రభుత్వం బయోస్ఫియర్ రిజర్వ్‌లను ఏర్పాటు చేసింది.

బయోస్ఫియర్ రిజర్వ్‌లు	ఉన్న ప్రాంతం
1. నీలగిరి (1986)	తమిళనాడు/కేరళ/కర్ణాటక
2. నందాదేవి (1988)	ఉత్తరాఖండ్
3. నోక్రెక్ (1988)	మేఘాలయ
4. మానస్ (1989)	అసోం
5. సుందర్‌బన్స్ (1989)	పశ్చిమబెంగాల్
6. గల్ఫ్ ఆఫ్ మన్నార్ (1989)	తమిళనాడు
7. గ్రేట్ నికోబార్ (1989)	అండమాన్, నికోబార్
8. సిమ్లిపాల్ (1994)	ఒడిశా
9. దిబ్రూ-సైఖోవా(1997)	అసోం
10. దిహంగ్-దిబంగ్ (1998)	అరుణాచల్ ప్రదేశ్
11. పంచమర్హి(1999)	మధ్యప్రదేశ్
12. కాంచనగంగ (2000)	సిక్కిం
13. అగస్త్యమలై (2001)	కేరళ/తమిళనాడు
14. అచానక్‌మర్-	ఛత్తీస్‌గఢ్
అమర్ కంటక్ (2005)	మధ్యప్రదేశ్
15. గ్రేట్ రాణ్ ఆఫ్ కచ్(2008)	గుజరాత్
16. కోల్డ్ డెజర్ట్ (శీతల ఎడారి) (2009)	హిమాచల్ ప్రదేశ్
17. శేషాచలం కొండలు (2010)	ఆంధ్రప్రదేశ్
18. పన్నా (2011)	మధ్యప్రదేశ్

- బయోస్ఫియర్ రిజర్వ్‌ల సరిహద్దును పార్లమెంట్ నిర్ణయిస్తుంది. వీటిలో పర్యటనకు ఎలాంటి అనుమతులూ ఉండవు. కానీ పరిశోధనకు ప్రోత్సాహం ఉంటుంది.
- మన దేశంలో తొలి బయోస్ఫియర్ రిజర్వ్‌ను 1986లో నీలగిరి ప్రాంతంలో (తమిళనాడు) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మన దేశంలో 18 బయోస్ఫియర్ రిజర్వ్‌లు ఉన్నాయి.
- మన దేశంలో చివరిసారిగా (2011లో) పన్నా బయోస్ఫియర్ రిజర్వ్‌ను ప్రకటించారు. ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది.
- యునెస్కో జాబితాలో చేర్చిన భారత బయోస్ఫియర్‌ల సంఖ్య పది.

2. **జాతీయ పార్కులు:** వృక్ష, జంతు జాతులను; ప్రకృతి సముదాయాన్ని సంరక్షించి అభివృద్ధి చేసే ప్రాంతాలను జాతీయ పార్కులు అంటారు. ఉదా: కుద్రేముఖ్ (కర్ణాటక).

- మన దేశంలో 1936లో తొలి జాతీయ పార్క్ (Hailey National Park)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీన్ని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది ఉత్తరాఖండ్‌లో ఉంది.

They act just like human beings!



BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error if any, will be in one part of the sentence, mark the number of that part with that best fits as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. When we moved (1)/ we have to put (2)/ our furniture in storage (3)/ for a while. (4) No error (5)

2. She knows that (1)/ child (2)/ had been telling (3)/ stories again. (4) No error (5)

3. The only stipulation is (1)/ that the topic you choose (2)/ must be related (3)/ to yours studies. (4) No error (5)

4. We are learning to (1)/ step back from ourselves (2)/ and identity (3)/ our strengths and weaknesses. (4) No error (5)

5. Books provides (1)/ with ideas (2)/ and a stimulus (3)/ for play. (4) No error (5)

6. Children from (1)/ certain backgrounds tend for (2)/ stereotyped by (3)/ their teachers. (4) No error (5)

7. The team coach (1)/ forced to step into stop (2)/ the two athletes from (3)/ coming to blows. (4) No error (5)

8. She stationed (1)/ at the window (2)/ to await for (3)/ his return. (4) No error (5)

9. The procession (1)/ made it's stately progress (2)/ through the streets (3)/ of the city. (4) No error (5)

10. The remains (1)/ of the building (2)/ stand as a stark remainders (3)/ of the fire. (4) No error (5)

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. These _____ are intended to smooth the ___ to a peace treaty.
1) negotiations; path
2) talks; pavement
3) arbitration; road
4) dialogues; process
5) confrontations; dispute

12. We tried to contact all ___ students, but one or two ____ the net.
1) former; missed
2) passed; forgotten
3) failed; overlooked
4) previous; forgot
5) former; skip

13. The findings of the report _____ slanted in favour of the manufacturers.
1) are been 2) were been
3) had been 4) has been
5) is been

14. The rise in _____ is a clear _____ that the government's policies are not working.
1) popularity; signature
2) population; progress
3) prices; signal
4) people; symptom
5) places; pause

15. Chest pains can be a _____ of heart problems.
1) recurring tension
2) warning signal
3) mounting pressure
4) indicator 5) pulsation

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. As with people some monkeys are lazy, like those who sleep all day in the zoo, and some are industrious, like the little fellows who collect pennies for the organ-grinder.

B. If you invite them to dinner, they can sit quite comfortably in real chairs and use a knife and fork exactly as you.

C. As a matter of fact, Monkeys are like people, when certain kinds of monkeys are domesticated, they act just like human beings.

D. They smoke cigars, drink beer and look almost human when dressed.

E. Sometimes he even leads them in singing, first howling some weird notes, then signaling his companions to join in the chorus.

F. In speaking of monkeys which act like human beings, mention should be made of the Brazilian monkey which often balances himself on the top of a tree and makes a speech to the monkeys below him.

16. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) D

17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

18. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E

20. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F

Directions (Q. No. 21 - 25): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

21. When I arrived, I have the sensation that she had been expecting me.
1) has 2) will have
3) will be having 4) had
5) No correction required

22. We are concrete seeking new ways of expanding our membership.
1) evidently 2) firstly
3) vastly 4) currently
5) No correction required

23. You will perhaps discover, that practice does help, that success does come with effort and determination and a positive mind-set.
1) has come
2) will come
3) would come
4) will be coming
5) No correction required

24. The brightest persons in a class are not always the good students.
1) comparable 2) winner
3) best 4) active
5) No correction required

25. I hired a cleaning lady who comes in twice a month and is now in disposable.
1) indisposable 2) indisputable
3) indispensable 4) incorrigible
5) No correction required

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Delivering mail to small villages in India was once a difficult, **perilous** and exciting job. The postman traveled on foot, often wading through swamps or crawling through jungles in order to reach the many villages on his route.

The Indian mailman might sometimes encounter a fierce tiger or panther along the way, yet the only weapon he carried was a sharp spear. He never went to work without his bells, which he would shake in order to **ward off** evil spirits. Wild animals or evil spirits, nothing ever interrupted his work.

The Indian letter carrier was an honoured and respected person; he was treated with great courtesy. So wise he thought to be that he was frequently called upon to solve the village disputes.

It is certainly evident that only a very brave man would take a job that **compelled** him to fight off wild animals in order to get his work done. You can understand why everyone in India looked upon the man who delivered mail as a true national hero.

26. Which statement is true?
a. Mailmen in India were considered heroes.
b. Some people in India used to believe in evil spirits.
1) Only a 2) Only b
3) Both a and b
4) Neither a nor b
5) Either a or b

27. Which statement is false?
a. The letter carrier was often asked to settle disputes in the villages that he visited.
b. An Indian mailman used to carry modern weapons as protection against wild animals.
1) Only a 2) Only b
3) Both a and b
4) Neither a nor b
5) Either a or b

28. The synonym of **ward off** is
1) Encourage 2) Protest
3) Keep 4) Deflect
5) Depend

29. The synonym of **perilous**
1) Hazardous 2) Bounty
3) Terrifying 4) Harmless
5) Detrimental

30. The antonym of **compelled**
1) Obliged 2) Constrained
3) Bound 4) Chained
5) Liberated

Directions (Q. No. 31-40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A professor at an eastern college _____ (31) that the special sense the visually challenged people _____ (32) on is connected in some way with ___ (33) hearing. The professor _____ (34) described 1500 tests in which blind people and people with normal sight, but blindfolded, _____ (35) to avoid walking into walls. The visually challenged passed the tests with greater ____ (36) than those who could see. The blind would _____ (37) forward confidently, sensing the wall when they were as much as fifteen feet _____ (38) it. They claimed that their ears sent them a warning _____ (39) that the wall was near. This seems quite possible, for when their ears were covered so that they could not hear; they often ran right _____ (40) the wall. You can imagine how valuable this strange power must be to the blind. Do you think that it is nature's way of making up to them for their lost sight?

31. 1) believes 2) deem
3) judge 4) accept 5) doubt

32. 1) grasp 2) depend
3) relay 4) reel
5) realize

33. 1) there 2) they
3) their 4) them 5) that

34. 1) lately 2) newly 3) just
4) recently 5) freshly

35. 1) attempt 2) attempting
3) attempts 4) will attempt
5) attempted

36. 1) ease 2) difficulty
3) effort 4) relieve
5) alleviate

37. 1) stepping 2) stride
3) tramp 4) tumble
5) amble

38. 1) through 2) thorough
3) from 4) away 5) apart

39. 1) memo 2) letter
3) meaning 4) message 5) point

40. 1) inside 2) outside
3) inwards 4) in 5) into

Directions (Q. No. 41-42): choose the wrongly spelt word from the five options given.

41. 1) Cemetery 2) Scenary
3) Scenario 4) Composure
5) Predicament

42. 1) Stationery 2) Stationary
3) Impeccabal 4) Juggernaut
5) Delicious

Directions (Q. No. 43-45): In each of the following four sets of words a set is either synonymous or antonymous, identify that set and mark your answer.

43. 1) Luscious; Sacrilege
2) Prophecy; Luxurious
3) Somersault; Impediment
4) Obnoxious; Abhorrent
5) None of these

44. 1) Atrocious; Oblige
2) Entourage; Tourist
3) Ensemble; Entangle
4) Pilfer; Embezzle
5) None of these

45. 1) Ensconce; Shelve
2) Acrimonious; Corrigible
3) Sanctimonious; Succulent
4) Corrigendum; Adjudicate
5) None of these

Answers

1) 2;	2) 1;	3) 4;	4) 3;
5) 1;	6) 2;	7) 2;	8) 3;
9) 2;	10) 3;	11) 4;	12) 1;
13) 3;	14) 3;	15) 2;	16) 4;
17) 2;	18) 5;	19) 3;	20) 1;
21) 4;	22) 4;	23) 5;	24) 3;
25) 3;	26) 3;	27) 2;	28) 4;
29) 4;	30) 5;	31) 1;	32) 2;
33) 3;	34) 4;	35) 5;	36) 1;
37) 2;	38) 3;	39) 4;	40) 5;
41) 2;	42) 3;	43) 4;	44) 4;
45) 1.			